
'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 132

బుధవారం 2-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సబ్సిడీ ఎత్తివేతపై భగ్గు

వంట గ్యాస్‌పై ఉభయ సభల్లో విపక్షాల నిరసన

– 6లో



అబ్బాసీ ప్రమాణ స్వీకారం


నూతన ప్రధానిగా ఎన్నుకున్న పాక్ జాతీయ అసెంబ్లీ

– 6లో

పెళ్లికి జీఎస్టీ 'బ్యాండ్'!

జీఎస్టీతో 20 శాతం వరకు పెరిగిన వ్యయం

శ్రావణంలో భారీ వివాహ వ్యయాలపై ఐటీ కన్ను



శ్రావణ మాసం వచ్చింది. ఎప్పటిలాగే పెళ్లిళ్ల సీజన్ తెచ్చింది. వస్తూ వస్తూ ఈసారి జీఎస్టీని మోసుకొచ్చింది.

ఇంకేముంది.. పెళ్లి ఖర్చు 15 నుంచి 20 శాతం వరకు పెరిగింది. దుస్తుల దగ్గర నుంచి ఆభరణాలు, ఫర్నీచర్, అలంకరణ, ఫొటోగ్రఫీ.. ఇలా వివాహానికి కావాల్సిన అన్నింటిపైనా జీఎస్టీ తన ప్రభావం చూపిస్తోంది. అంతేకాకుండా గోరుచుట్టుపై రోకటిపోటులా వివాహానికి పెట్టే ఖర్చులపై ఐటీ శాఖ కూడా కన్నేసింది. దీంతో అన్ని వర్గాలవారు ఆడంబరాలకు దూరంగా పెళ్లిళ్లు జరిపిస్తున్నారని ఈవెంట్ మేనేజర్లు అంటున్నారు.

సాక్షి, అమరావతి

పెళ్లిళ్లపై జీఎస్టీ బ్యాండ్ బాజా మోగిస్తోంది. జూలై 1 నుంచి కొత్త పన్నుల విధానం అమల్లోకి రావటంతో పెళ్లిళ్ల వ్యయం భారీగా పెరిగిపోయింది. వివాహ ఖర్చుల్లో ప్రధానమైన లైటింగ్, అలంకరణ, ఫొటోగ్రఫీ లాంటి సేవలతోపాటు దుస్తులు, ఆభరణాలు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లపై పన్ను రేట్లు పెరిగిపోయాయి. ఇప్పుడు పెళ్లిళ్లకు అందించే సేవలన్నీ వర్క్ కాంట్రాక్టు పరిధిలోకి వస్తున్నాయి. వీటిపై పన్ను 15 శాతం నుంచి 18 శాతానికి చేరింది. బంగారంపై పన్ను 1.8 శాతం నుంచి 3 శాతానికి, బట్టలు, చెప్పులు, ఫర్నీచర్ వంటి వాటిపై పన్నులు భారీగా పెరగడంతో పెళ్లివారి బడ్జెట్ తలకిందులవుతోంది. 'రెండు నెలల క్రితం మా అమ్మాయి పెళ్లికి రూ.8 లక్షలు అవుతుందని అంచనా వేసుకున్నాం. ఇప్పుడు జీఎస్టీ పుణ్యమా అని బడ్జెట్ మరో రూ.1.50 లక్షలు పెరుగుతోంది. ఏం చేయాలో తోచడం లేదు' అని విజయవాడకు చెందిన శ్రీరామ్‌ప్రసాద్ వాపోయారు. దీంతో చాలామంది ఖర్చులను ఎలా తగ్గించుకోవాలన్న దానిపై కసరత్తు చేస్తున్నారు. గతంలో పెళ్లి అంటే కనీసం 1,000 నుంచి 1,500 మందికి భోజనాలను ఆర్డర్లు ఇచ్చేవారని, కానీ.. ఇప్పుడు

మిగతా 2వ పేజీలో ▶

పంచాయతీల సొమ్ములపై రాష్ట్రప్రభుత్వ పెత్తనం..



మీ నిధులు.. మా ఇష్టం

14వ ఆర్థిక సంఘం నిధులపై ఆంక్షలు.. రాజ్యాంగాన్ని పరిహసిస్తూ ఉత్తర్వులు

- ప్రభుత్వ కార్యక్రమాలకు ఖర్చు పెడితేనే నిధులు
- ఇంటి పన్నుల రూపంలో వసూలైన సొమ్ముపైనా అదుపు
- గ్రామాల్లో చెత్త సేకరణకు షెడ్లు నిర్మించాలి
- ఫొటోలిస్తేనే నిధులు
- నిధులు అందుబాటులో లేక పంచాయతీల అవస్థలు
- ఆంక్షలపై సర్పంచ్‌ల ఆగ్రహం

సాక్షి, అమరావతి

ఆర్థిక సంఘం నిధులనేవి గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకు రాజ్యాంగం కల్పించిన వెసులుబాటు. గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం ద్వారా కేంద్ర నిధులందాలని, అపుడే అవి పరిపుష్టమై గ్రామ స్వరాజ్య స్వప్నం సాకారమౌతుందని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. 1994లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో గ్రామ పంచాయతీలకు సైతం స్వయం ప్రతిపత్తిని కల్పించారు. కేంద్రం ఇచ్చే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కూ ఉండదు. దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానిది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఈ రాజ్యాంగ స్ఫూర్తిని పట్టపగలే పరిహాసం చేస్తోంది. 14వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం ఇచ్చిన నిధులపై

మిగతా 2వ పేజీలో ▶



పంచాయతీ నిధులను ట్రెజరీ నుంచి సర్పంచ్‌లు డ్రా చేసుకోవడంపై ఆంక్షలు విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ



సీట్ల పెంపు సాధ్యం కాదు

లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల పెంపు ఇప్పట్లో సాధ్యంకాదని కేంద్రం స్పష్టం చేసింది. మంగళవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ ఎం.మురళీ మోహన్, టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఈ అంశంపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. పునర్ వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 26(1) ప్రకారం కేంద్రం ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల పెంపును పరిశీలిస్తోందా? ఆర్టికల్ 170 సవరణకు బిల్లు తెస్తోందా? సీట్ల పెంపులో ఉన్న ఇబ్బందులేమిటి? తదితర ప్రశ్నలను సభ్యులు కేంద్రం ముందుంచారు. దీనికి హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ సమాధానమిస్తూ..ఈ అంశంపై న్యాయశాఖతో సంప్రదింపులు జరిపామని తెలిపారు. అయితే ఆర్టికల్ 170(3) ప్రకారం 2026 తరువాత వచ్చే జనగణన ప్రచురితమయ్యేంతవరకు అసెంబ్లీ సీట్లు సర్దుబాటు చేయలేమని అటార్నీ జనరల్ తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు న్యాయ శాఖ తెలిపిందని మంత్రి వివరించారు. ఆర్టికల్ 170ని సవరించేంతవరకు సీట్ల సంఖ్యను పెంచలేమని ఆయన స్పష్టం చేశారు.



ప్రొఫెసర్ భార్గవ కన్నుమూత

సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఎనలేని సేవలు

16లో



చంద్రబాబు అబద్ధాలు నమ్మొద్దు


మీ పరపతి తగ్గించుకోవద్దు

- పవన్ కల్యాణ్‌కు ముద్రగడ లేఖ
- హామీ ఇచ్చింది వారే.. ఎదురుదాడి చేస్తోందీ వారే
- అబద్ధాలు నిజమని నమ్మి వారితో ప్రయాణం చేయొద్దు



కిర్లంపూడి (జగ్గంపేట): సీఎం చంద్రబాబు ఉచ్చులో పడి ఆయన చెప్పే అబద్ధాలు నిజమని నమ్మి మీ పరపతిని తగ్గించుకోవద్దని సినీనటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం సూచించారు. ఈమేరకు మంగళవారం ఆయనకు ఒక లేఖ రాశారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది.. 'మా జాతికి (బలిజ, తెలగ, కాపు, ఒంటరి) రిజర్వేషన్లపై అప్పటి ముఖ్యమంత్రి

మిగతా 2వ పేజీలో ▶



లష్కరే టాప్ కమాండర్ అబుదుజానా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో శ్రీనగర్‌లో భద్రతా దళాలపై రాళ్లు రువ్వుతున్న ఓ విద్యార్థిని

లష్కరే టాప్ కమాండర్ హతం



దుజానా (ఫైల్)

- కశ్మీర్లో పలు ఉగ్ర దాడులకు సూత్రధారి, లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజానాను భద్రతా బలగాలు మంగళవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్‌లో హతమార్చాయి. అతడి సన్నిహితుడైన అరీఫ్ నబీదర్‌ను కూడా మట్టుబెట్టాయి.

6లో

మా జోలికొస్తే ఊరుకోం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హెచ్చరిక

మా ప్రజలు శాంతిని ప్రేమిస్తారు

మేం ఎవరి ప్రాంతాన్నీ ఆక్రమించుకోం

దినకరన్‌పై మరో చార్జ్‌షీట్

విదేశీ మారక ద్రవ్యం కేసులో ఎగ్మూర్ కోర్టులో దాఖలు

సాక్షి, చెన్నై: విదేశీ మారక ద్రవ్యం కేసులో అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్‌పై ఎగ్మూర్ ఆర్థిక నేరాల విభాగం కోర్టులో మంగళవారం మరో చార్జ్‌షీట్ దాఖలైంది. టిప్పర్ ఇన్వెస్టర్స్‌కు ఇంగ్లాండ్‌లోని ఓ బ్యాంక్ ద్వారా అక్రమ లావాదేవీలు జరిగాయంటూ ఈడీ గతంలో కేసు నమోదు చేసింది. ఈ కేసులో కొత్త చార్జ్‌షీట్ దాఖలు చేసి 3 నెలల్లో విచారణ ముగించాలని హైకోర్టు గతవారం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వర్గాలు కోర్టులో కొత్త చార్జ్‌షీట్ దాఖలు చేశాయి. న్యాయమూర్తి ఎదుట దినకరన్ మంగళవారం విచారణకు హాజరయ్యారు. అనంతరం విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. మరోవైపు చెన్నైలోని పార్టీ కార్యాలయంలోకి దినకరన్ రాకుండా నిషేధం విధిస్తూ మంగళవారం అన్నాడీఎంకే (అమ్మ) కార్యవర్గ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.



ఖరీఫ్‌కు కష్టమేనా!

మరో 15 రోజులపాటు వర్షాభావ పరిస్థితులు

- స్కైమెట్ అంచనా
- అదే జరిగితే పంటలపై తీవ్ర ప్రభావం
- ఇప్పటికే రెండు వారాల నుంచి జాడ లేని చినుకు
- సీజన్‌లో వరుసగా నెలపాటు వర్షాల్లేకపోవడం చాలా అరుదు: శాస్త్రవేత్తలు
- ఆగస్టు 15 తర్వాత వర్షాలకు అనుకూల వాతావరణమని వెల్లడి

సాక్షి నాలెడ్జ్ సెంటర్

వారమైంది.. రెండు వారాలైంది.. చినుకమ్మ జాడే లేదు.. విత్తు వేసిన రైతు ఆశగా నింగివైపు చూస్తున్నా వరుణుడు కనికరించడం లేదు! జూలై రెండో వారం వరకు మురిపించిన వర్షాలు ఆ తర్వాత నుంచి ముఖం చాటేశాయి. మరో రెండు వారాల పాటు ఇదే పరిస్థితి ఉండొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అదే జరిగితే ఖరీఫ్‌పై తీవ్ర ప్రభావం తప్పకపోవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రుతుపవనాల సీజన్ మధ్యలో కొంత విరామం రావడం సహజమే అయినా ఇప్పటివరకూ అది గరిష్టంగా ఏడెనిమిది రోజులు మాత్రమే ఉండేదని.. దాదాపు నెలరోజులపాటు వర్షాల్లేకపోవడం చాలా అరుదని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్‌కు చెందిన శాస్త్రవేత్త మహేశ్ పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే మరో రెండు వారాలపాటు.. అంటే ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశముందని ఆయన తెలిపారు. ''2009లో రుతుపవనాలకు కొంత విరామం వచ్చి.. ఆ తర్వాత పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. ఈ ఏడాది అలాంటి పరిస్థితి లేదు. ఆగస్టు 15 తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం వంటి వాతావరణ వ్యవస్థలు ఏర్పడేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. హిమాలయ పర్వత సానువుల వద్ద

మిగతా 5వ పేజీలో ▶



పనగడియా రాజీనామా

నీతి అయోగ్ ఉపాధ్యక్ష పదవి నుంచి 31న తప్పుకోనున్నట్లు ప్రకటన

- బిజినెస్‌లో

నెలైనా అవే కష్టాలు



జీఎస్‌టీఎన్ సిద్ధం కాకపోవడంతో ఇబ్బందులు
రాష్ట్ర చట్టాల్లో తప్పుల తడకలు
30 శాతం తగ్గిన లావాదేవీలు
దేశవ్యాప్తంగా రోజుకు 20 వేలకుపైగా ఫిర్యాదులు

సాక్షి, అమరావతి: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం అమల్లోకి వచ్చి నెల రోజులైనా ఇంకా బాలారిష్టాల స్థాయిని దాటలేదు. జీఎస్‌టీ అమల్లో కీలకమైన సాఫ్ట్‌వేర్ నెట్‌వర్కింగ్ వ్యవస్థ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) పూర్తిస్థాయిలో సిద్ధం కాకపోవడంతో ట్రేడర్లు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ట్రేడర్లు రిటర్నులు దాఖలు చేయడానికి సెప్టెంబర్ వరకు గడువు ఇచ్చినా అప్పటివరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక సాఫ్ట్‌వేర్‌లో చాల బగ్‌లు ఎదురవుతున్నాయని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ జే.శ్యామలరావు తెలిపారు. జీఎస్‌టీఎన్ వెబ్‌సైట్ ద్వారా ఇన్‌వాయిస్‌లు అప్‌లోడింగ్‌లో కొన్ని సమస్యలు వస్తున్న మాట వాస్తవమేనన్నారు. డిజిటల్ సిగ్నేచర్ తీసుకోవడం, సభ్యత నమోదు వంటి వాటిల్లో ప్రధాన సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ట్రేడర్లు పేర్కొంటున్నారు.

ఇప్పటికీ అయోమయమే..: నెల రోజులైనా ట్రేడర్లుకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికీ ఏ వస్తువుపై ఎంత పన్ను పడుతుంది, ఇన్‌వాయిస్‌లు ఎలా అప్‌లోడ్ చేయాలి వంటి వాటిపై ఇంకా గందరగోళ పరిస్థితులే నెలకొని ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఈ పరిస్థితులు కొద్దిగా బాగానే ఉన్నా.. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాం తాల్లో పరిస్థితి చాలా దారుణంగా ఉందని, అధికారులకే పూర్తిస్థాయి లో అవగాహన లేకపోవడంతో ట్రేడర్లు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ట్యాక్స్ కన్సల్టెంట్లు చెబుతు న్నారు. ఏ ట్రేడరు ఏ జ్యురిస్ డిక్షన్ పరిధిలోకి వస్తారన్న దానిపై నిర్ణ యం తీసుకోకపోవడంతో ట్రేడ ర్లలో గందరగోళం నెలకొంది.

ఎప్పుడూ అండర్ మెయింటనన్సే

జీఎస్‌టీఎన్ వెబ్‌సైట్‌లోకి ఎప్పుడు వెళ్లినా సైట్ అండర్ మెయింటనెన్స్ అని వస్తోందని విజయవాడకు చెందిన ఒక వ్యాపారి వాపోయారు. ట్రేడర్లకు సహాయం చేయడం కోసం ఏర్పాటు చేసిన జీఎస్‌టీ సువిధా ప్రొవైడర్ల వద్ద కూడా ఇదే విధమైన పరిస్థితి.

20,000+

జీఎస్‌టీన్‌లో వచ్చే సమస్యలను పరిష్కరించడం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు దేశవ్యాప్తంగా రోజుకు 20 వేలకు పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ హెల్ప్‌డెస్క్‌లో 300 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రాథమిక సమస్యలనే వీరు పరిష్కరించలేకపోతే రిటర్నులు దాఖలు చేసేటప్పుడు, చెల్లింపులు మొదలయ్యేసరికి ఈ సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఇతర రాష్ట్రాల్లోనూ తప్పులు.. ఇక వివిధ రాష్ట్రాల జీఎస్‌టీ చట్టాలు తప్పుల తడకగా ఉన్నాయి. దీంతో వేరే రాష్ట్రాల్లో లావాదేవీలు నిర్వహించేటప్పుడు వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు కంపోజిషన్ స్కీం పరిధిలోకి రూ. 75 లక్షలలోపు వార్షిక టర్నోవర్ ఉన్న వారికి అనుమతిస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటే కొన్ని రాష్ట్రాలు (మన రాష్ట్రం కాదు) ఈ పరిమితిని రూ. 50 లక్షలని పేర్కొంటూ చట్టాలు చేశాయి. అదే విధంగా రూ. 20 లక్షలు వరకు ఉన్న వారిని జీఎస్‌టీని పరిధి నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకుంటే కొన్ని రాష్ట్రాలు ఈ పరిమితిని రూ.10 లక్షలుగా పేర్కొం టూ చట్టం చేశాయి. ఇప్పుడు ఈ చట్టాలను తిరిగి సవరించాలని నిపుణులు అంటున్నారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక వ్యాపార లావాదేవీల్లో 25 నుంచి 30 శాతం వరకు తగ్గినట్లు అంచనా వేసినట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించండి

కేంద్రాన్ని కోరిన వైఎస్సార్‌సీపీ ఎంపీ వెలగపల్లి



సాక్షి, న్యూఢిల్లీ: విభజన కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి మరోసారి విజ్ఞప్తి చేసింది. మంగళవారం లోక్‌సభలో సప్లిమెంటరీ డిమాండ్స్‌పై జరిగిన చర్చలో ఆ పార్టీ ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 9 రోజులు నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. ఇప్పటివరకూ కేంద్రం ఈ దిశగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ప్రత్యేక హోదాపై బీజేపీ కూడా హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైజాగ్ – చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో మూడేళ్లయినా ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదని, ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇక్కట్లలో ఉందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ కారిడార్‌ను త్వరితగతిన అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టుకు వాస్తవ వ్యయం రూ. 40 వేల కోట్లకు పైగా అవుతుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో ఈ జాతీయ ప్రాజెక్టు వ్యయాన్ని కేంద్రమే పూర్తిగా భరిస్తూ ప్రాజెక్టును స్వయంగా చేపట్టాలని కోరారు.

అక్రెడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు రైల్వే పాసులివ్వండి

రైల్వే శాఖ మంత్రి సురేశ్ ప్రభుకు ఏపీయూడబ్ల్యూజే విజ్ఞప్తి


రైల్వే మంత్రి సురేశ్ ప్రభుకి వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు. చిత్రంలో దత్తాత్రేయ, పుల్లారావు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో అక్రెడి టేషన్ ఉన్న జర్నలిస్టులకు రైల్వే పాసులు మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి సురేశ్‌ప్ర భుకు ఏపీయూడబ్ల్యూజే ప్రతిని. దులు విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో సంఘం పూర్వా ధ్యక్షుడు సోమసుందర్, కార్యవర్గ సభ్యులు సుబ్బారావు, రామకృష్ణ, సామాజిక వేత్త పెంటపాటి పుల్లారావు మంగళవారం ఢిల్లీలో సురేశ్‌ప్రభుని కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అక్రెడిటేషన్ ఉన్నా ఆయా జిల్లాల్లోని జర్న లిస్టులకు రైల్వే పాసులు ఇవ్వడంలేదని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సురేశ్ ప్రభు స్పందిస్తూ రైల్వే పాసుల జారీకి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు 15న శంకుస్థాపన: మంత్రి లోకేశ్

నిధులపై అధికారుల్లో అస్పష్టత

సాక్షి, అమరావతి: ఐదువేలకు మించి జనాభా ఉన్న గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆగస్టు 15న శంకుస్థాపనలు చేయాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి లోకేశ్ సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఐదు వేలకు పైబడి జనాభా ఉన్న గ్రామాలు దాదాపు 1390 వరకూ ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఆయా గ్రామాల్లో పదివేల కిలో మీటర్ల మేరకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు రూ.2,600 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు సిద్ధంచేశారు. అందుకయ్యే నిధుల సమీకరణపై జరిగిన చర్చలో 50% ఖర్చుకు ఉపాధి హామీ పథకం నిధులను ఉపయోగించుకోవాలని సూచించిన మంత్రి.. మిగిలిన 50%నిధుల విషయంపై తర్వాత నిర్ణయం తీసుకుందామని పేర్కొన్నట్టు సమా చారం. ఈ ఏడాది డిసెంబర్ చివరికి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

పెళ్లికి జీఎస్‌టీ 'బ్యాండ్'!


▶ మొదటి పేజీ తరువాయి

ఎంత పెద్ద పెళ్లి అయినా ఈ సంఖ్య 500 దాటడం లేదని అక్షయ క్యాటరర్స్ అధినేత కె. శ్రీనివాస్ తెలిపారు. అలాగే, గతంలో ధనవంతుల పెళ్లికి సుమారు 4,000 మందికి ఆర్డర్ ఇచ్చేవారని, ఇప్పుడు ఈ సంఖ్య 2,000కు పరిమితమైందని, అదే విధంగా ప్లేటు ఖరీదును రూ.650 నుంచి రూ.400కు తగ్గించుకుంటున్నారని కేఎంకే క్యాటరర్స్ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. ఏడెనిమిది నెలల నుంచి అన్ని వర్గాల వారు ఆడంబరాలకు దూరంగా ఉంటున్నారని ఈవెంటు మేనేజర్లు పేర్కొంటున్నారు. ఏటా శ్రావణ మాసంలో వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలతో కళకళలాడే మార్కెట్లు ఈసారి కళ తప్పాయని వ్యాపారులు చెబుతున్నారు. జీఎస్‌టీ వల్ల భారం ఏ విధంగా పెరిగిందంటే..

- **దుస్తులు:** పెళ్లి ఖర్చులో ప్రధానమైనవి దుస్తులు. పెళ్లికొడుకు, పెళ్లికూతురు, వారి కుటుంబ సభ్యులకు కొనుగోలు చేయడంతోపాటు వచ్చిన బంధుమిత్రులకు వీటిని పెట్టడం ఆనవాయితీ. అందుకే పెళ్లి ఖర్చుల్లో 20 నుంచి 25 శాతం వాటా వీటిదే. మొన్నటి వరకు కేవలం రెడీమేడ్ దుస్తులపై మాత్రమే పన్ను ఉండేది. కానీ, జీఎస్‌టీ పరిధిలోకి చీరలు, పంచెలతోపాటు అన్ని టెక్స్‌టైల్ ఉత్పత్తులను తీసుకొచ్చారు. దీంతో రూ.1,000 లోపు దుస్తులపై 5 శాతం, ఆపైన 12 శాతం పన్ను చెల్లించాలి. దీనివల్ల అదనంగా 7 శాతం పన్ను పెరగ్గా, టెక్స్‌టైల్‌పై 5 శాతం అదనపు పన్ను చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఖర్చు తగ్గించుకోవడానికి అందరూ మొగ్గు చూపుతున్నారని, తమ వ్యాపారంలో 30 శాతం క్షీణత నమోదైందని విజయవాడ వస్త్రలతకు చెందిన ఓ వ్యాపారి వాపోయారు.
- **ఫుట్‌వేర్:** గతంలో రూ.500 లోపు పాదరక్షలపై పన్ను రేటు 5 శాతం ఉండగా, రూ.500 మించి ఉన్న వాటిపై 10 శాతం నుంచి 18 శాతానికి పెరిగింది. పెళ్లిళ్లకు కాబట్టి అందరూ మంచిరకం పాదరక్షల వైపే మొగ్గు చూపుతారు. దీంతో ఈ విషయంలో అదనపు భారం గ్యారంటీ.
- **ఆభరణాలు:** పెళ్లిళ్ల వ్యయంలో అగ్రస్థానం బంగారానిదే. జీఎస్‌టీ రాక ముందు 1.8 శాతంగా ఉన్న పన్ను ఇప్పుడు 3 శాతానికి పెరిగింది. దీంతో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారు అవసరమైన మేరకే ఆభరణాలు కొంటున్నారు. మిగిలిన వాటిని ఇమిటేషన్ నగలతో సరిపెట్టుకుంటున్నారని జ్యుయెలరీ వ్యాపారి ఒకరు చెప్పుకొచ్చారు. జీఎస్‌టీ వచ్చిన తర్వాత తమ వ్యాపారం కూడా 30 శాతం వరకు పడిపోయినట్లు జ్యుయెలరీ వ్యాపారస్తులు పేర్కొంటున్నారు.
- **ఫర్నీచర్:** పెళ్లికూతుర్ని కొత్త కాపురానికి పంపుతున్నప్పుడు ఇంటికి అవసరమైన ఫర్నీచర్, ఎలక్ట్రానిక్స్ తదితర వస్తువులను ఇస్తుంటారు. ఇప్పుడు ఫర్నీచర్‌పై పన్ను భారం 12 శాతం నుంచి ఏకంగా 28 శాతానికి పెరిగింది. ఎలక్ట్రానిక్ వస్తువులపై కూడా పన్ను రేట్లు స్వల్పంగా పెరిగాయి.
- **సేవలు:** క్యాటరింగ్, డెకరేషన్, మేకప్, లైటింగ్, కొరియర్, ఆతిథ్యం వంటి అనేక సేవలు పెళ్లిల్లో అవసరమవుతాయి. ఇప్పుడు ఈ సేవలపై పన్నును 15 నుంచి 18 శాతానికి పెంచారు.
- **క్యాటరింగ్:** జీఎస్‌టీలో చాలా ఆహార ధాన్యాలపై పన్నును ఎత్తివేశారు. ఇంతకాలం వ్యాట్‌తోపాటు సేవా పన్ను కలిపి 24.5 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు 18 శాతం చెల్లిస్తే సరిపోతుంది. కానీ, ట్యాక్స్ పరిధిలోకి రావడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరల ధరలు ఎక్కువగా ఉండడం, కూలీల రేట్లు పెరగడం, కేటరింగ్‌లో ఎక్కువగా వాడే కోవా రేటు విపరీతంగా పెరగడంవల్ల ఈ బడ్జెట్ కూడా పెరుగుతోంది.
- **డెకరేషన్ అండ్ లైటింగ్:** ఈ సేవలపై 15 శాతంగా ఉన్న పన్ను 18 శాతానికి పెరిగింది. ఇవి కాకుండా మేకప్ సేవలు, కొరియర్ సేవలపై కూడా పన్ను రేట్లు పెరిగాయి.

ఐటీ నిఘా..

పెళ్లిళ్ల ఖర్చులపై ఐటీ శాఖ కన్నేసి ఉంచింది. పెద్ద నోట్ల రద్దు తర్వాత రూ.2 లక్షలు మించిన వాటిపై నగదు రూపంలో లావాదేవీలను ఆపేశారు. రూ.2 లక్షలు దాటితే చెక్కులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారానే లావాదేవీలు జరపాలన్నది నిబంధన. కానీ, ఇప్పటికీ చాలామంది లావాదేవీలను నగదు రూపంలోనే జరుపుతుండడంతో ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుగుతున్న పెళ్లిళ్ల లావాదేవీలపై ఆరా తీస్తోంది.



పెళ్లి ఖర్చుల్లో పెరుగుదల ఇలా..

ఒక మధ్య తరగతి అమ్మాయికి పెళ్లి చేయడానికి అయ్యే మొత్తం ఖర్చు సుమారుగా రూ.11.15 లక్షలు. జీఎస్‌టీ రాకముందు చాలామంది బిల్లు లేకుండా ఎటువంటి పన్నులు చెల్లించకుండా వ్యాపారాలు చేసేవారు. కానీ, జీఎస్‌టీ వచ్చిన తర్వాత వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు దాటితే అందరూ పన్ను పరిధిలోకి వస్తున్నారు. దీంతో ప్రతిఒక్కరూ ఆ పన్ను భారాన్ని వినియోగదారుని మీద వేస్తుండటంతో ఆ మేర వ్యయాలు పెరుగుతున్నాయి. వివిధ సేవలు, కొనుగోళ్లపై పెరిగిన పన్ను భారాన్ని ఉజ్జాయింపుగా తీసుకొని లెక్కిస్తే అదనంగా రూ.1.33 లక్షలు అంటే మొత్తం పెళ్లి వ్యయం రూ.12.48 లక్షలకు చేరింది. అదే స్టార్ హోటల్స్‌లో చేస్తే ఈ ఖర్చు మరింత పెరుగుతోంది.

మీ నిధులు.. మా ఇష్టం

▶ మొదటి పేజీ తరువాయి

పెత్తనమంతా తమదే అంటోంది. తాము చెప్పినట్లు చేస్తేనే ఆ నిధులు తీసుకోవాలంటూ ఆంక్షలు విధిస్తోంది. దీంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు లేక సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. ఇవెక్కడి ఆంక్షలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికసంఘం నిధులు సర్పంచ్‌లకు ఇవ్వొద్దు..

కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన 14వ ఆర్థిక సంఘం నిధులను సంబంధిత సర్పంచులకు ఇవ్వొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీల్లో వసూలు చేసి, ట్రెజరీల్లో జమ చేసిన ఇంటి పన్నుల సొమ్ము వినియోగంపైనా ఆంక్షలు విధించింది. కేంద్రం విడుదల చేసిన నిధులను, పంచాయతీల సొంత సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం ఇచ్చే నిధులు, గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్నుల డబ్బును గ్రామ పంచాయతీల తీర్మానాలకు అనుగుణంగా ఖర్చు పెట్టుకోవడానికి రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు సర్పంచ్‌లకు చెక్ పవర్‌ను కల్పించింది. రాజ్యాంగం కల్పించిన హక్కును హరించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

షెడ్ల నిర్మాణం పంచాయతీల పనేనట!

'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను ఒక చోట చేర్చేందుకు షెడ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి ఈ షెడ్లను పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే నిర్మించాల్సి ఉంటుంది. కానీ, కేంద్రం ఇచ్చిన నిధులతోపాటు పంచాయతీల సొంత నిధులను వీటి నిర్మాణానికి వెచ్చించాలని ప్రభుత్వం అధికారుల ద్వారా సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకొచ్చింది. అత్యధిక శాతం సర్పంచులు దీన్ని వ్యతిరేకించడంతో ఆంక్షలను తెరపైకి తెచ్చింది. గ్రామ పంచాయతీల పేరిట ఉన్న నిధులను ఆయా సర్పంచ్‌లు డ్రా చేసుకునే వీల్లేకుండా ట్రెజరీలపై ఆంక్షలు విధించింది. దీనిపై కొన్ని జిల్లాల్లో మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని జిల్లాల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పష్టమైన ఉత్తర్వులిచ్చేశారు.

ట్రెజరీల్లో పంచాయతీల సొమ్ము రూ.1,449 కోట్లు

రాష్ట్రంలోని 12,920 గ్రామ పంచాయతీల పేరుతో ప్రస్తుతం ఖజానాలలో(ట్రెజరీ) దాదాపు రూ.1,449 కోట్ల నిధులు న్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. 2016– 17లో కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో గ్రామ పంచా యతీలకు దాదాపు రూ.1,463 కోట్లు నేరుగా విడుదల చేసింది. ఈ నిధుల్లో ఎక్కువ భాగం ఆర్థిక సంవత్సరం చివరన అంటే ఈ ఏడాది మార్చిలో ఇచ్చింది. సర్పంచ్‌లు ఇప్పటిదాకా డ్రా చేసిన నిధులు పోగా.. ప్రస్తుతం దాదాపు రూ.900 కోట్లు గ్రామ పంచాయతీల పేరిట ట్రెజరీల్లో ఉన్నట్లు సమాచారం. దీనికితోడు గ్రామ పంచాయతీలు ఇంటి పన్ను రూపంలో వసూలు చేసిన రూ.549 కోట్లను మార్చి నెలలోనే ట్రెజరీల్లో జమ చేశాయి. కేంద్రం ఇచ్చినవాటితో పాటు పంచాయతీల సొంత నిధులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు ఖర్చు పెడితేనే వాటిని ట్రెజరీల నుంచి పొందే అవకాశం కల్పిస్తామంటూ సర్కార్ ఆంక్షల అడ్డుగోడ నిర్మించింది.

చెల్లింపులు నిలిపివేత

గ్రామ పంచాయతీల నిధుల చెల్లింపులపై జూలై 27వ తేదీ నుంచి ట్రెజరీల్లో ఆంక్షలు అమలవుతున్నాయి. తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ సర్పంచ్‌లకు నిధులు విడుదల చేయొద్దంటూ ప్రభుత్వం తేల్చిచెప్పింది. సాధారణ నిధుల నుంచి పంచా యతీల్లో పనిచేసే ఉద్యోగుల జీతాల చెల్లింపులకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. చెత్త సేకరణ షెడ్ల నిర్మాణం పూర్తి చేసి, సంబంధిత ఫోటోలను సమర్పిస్తేనే ట్రెజరీల నుంచి నిధులను విడుదల చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే.. షెడ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించి, వాటిని ఫొటోలు తీసి ఇస్తేనే ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల చేతికొస్తాయన్నమాట! వర్షాకాలంలో గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా, వ్యాధులు ప్రబలకుండా మురుగు కాల్వలను శుభ్రం చేసుకోవడానికి కూడా నిధులు అందుబాటులో లేకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించడంపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి లోకేశ్ వింత నిర్ణయాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి తనయుడు నారా లోకేశ్ పంచాతీయరాజ్ శాఖ మంత్రిగా కుర్చీ ఎక్కాక ఈ శాఖలో ఎన్నడూ లేని వింత పోకడలు చోటుచేసుకుంటున్నాయి. మంత్రి లోకేశ్ తన మనసుకు తోచిందే తడవుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అధికారులు ఆయనకు ఎదురు చెప్పలేక ప్రతి నిర్ణయానికీ తలూపుతున్నారు. అందుకే రాజ్యాంగాన్నీ ఉల్లంఘిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారని సర్పంచ్‌లు ఆరోపి స్తున్నారు.

సాఫ్ట్‌వేర్ దెబ్బకు మొరాయించిన 'ఈ-పాస్'

రేషన్ అందక లబ్ధిదారుల అవస్థలు

సాక్షి, అమరావతి: ఈ–పాస్ యంత్రాల్లో సాఫ్ట్‌వేర్‌ను ఆధునికీకరించడంతో పలు జిల్లాల్లో యంత్రాలు సరిగా పనిచేయలేదు. రేషన్ షాపులకు వెళ్లిన పలువురు లబ్ధిదారులు సరుకులు తీసుకోకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాఫ్ట్‌వేర్ నూతన వెర్షన్‌ను ఎలా అప్‌డేట్ చేయాలో డీలర్లకు ముందుస్తు సమాచారం ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తాయి. గత నెల ఒకటో తేదీన 12.24 లక్షల మంది లబ్ధిదారులు సరుకులు తీసుకోగా సాఫ్ట్‌వేర్‌ను ఆధునికీకరించడంతో యంత్రాలు సక్రమంగా పని చేయక ఈ నెల 1న 2.57 లక్షల కార్డుదారులు మాత్రమే సరుకులు అందుకున్నారు. సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినా కొన్ని ప్రాంతాల్లో యంత్రాలే ఓపెన్ కావడం లేదని రేషన్ డీలర్లు చెబుతున్నారు. 'సర్వర్ ఈజ్ నాట్ యాక్టివ్' అని ఈ–పాస్ యంత్రాలపై డిస్‌ప్లే అవుతోంది.

ఆ ఐదు జిల్లాల్లో కార్డుదారుల అష్టకష్టాలు

విజయనగరం, నెల్లూరు, గుంటూరు, విశాఖపట్నం, వైఎస్సార్ జిల్లాల్లో మంగళవారం ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమైంది. సాయంత్రం ఆరు గంటల వరకూ కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ విషయాన్ని డీలర్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పాదయాత్రకు సిద్ధంగా ఉండండి

కాపులకు ఉద్యమ నేత ముద్రగడ పిలుపు

- మనం గొంతెమ్మ కోరికలు కోరట్లేదు
- ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీనే నెరవేర్చమంటున్నాం
- 3 నుంచి నిరవధిక పాదయాత్ర జరిగి తీరుతుంది


ముద్రగడ నివాసంలో కంచాల మోత మోగిస్తున్న కాపు నేతలు

కిర్లంపూడి(జగ్గంపేట): ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పాదయాత్రకు కాపుజాతి యావత్తూ సిద్ధంగా ఉండాలని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం పిలుపు ఇచ్చారు. ఆయన్ను కలిసేందుకు తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, వేలంక, వీరవరం, తామరాడతోపాటు జిల్లా నలుమూలల నుంచి పలువురు కాపు నాయకులు మంగళవారం తరలివచ్చారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీల్నే మనం అడుగుతున్నామని, కొత్తగా గొంతెమ్మ కోర్కెలేమీ కోరట్లేదని అన్నారు. ఇచ్చిన హామీల్ని గుర్తుచేయడానికి శాంతియుతంగా గాంధేయ మార్గంలో జూలై 26న నిరవధిక పాదయాత్ర నిర్వహించతలపెడితే ప్రభుత్వం అధికారబలంతో గృహనిర్బంధం చేసిందని మండిపడ్డారు. మరుసటిరోజు(27)న పాదయాత్ర చేపడితే.. మరో వారం రోజులు గృహనిర్బంధం విధించారన్నారు. బుధవారంతో గృహనిర్బంధం నుంచి బయటికొస్తున్నందున గురువారం యథావిధిగా నిరవధిక పాదయాత్ర జరిగి తీరుతుందని ఆయన తెలిపారు. ఇందుకు అందరూ సమాయత్తం కావాలన్నారు. కాగా, ముద్రగడ స్వగృహం వద్ద మంగళవారం మూడోరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కంచాల మోత మోగించారు. పాదయాత్రకు మద్దతుగా.. చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ జిల్లాలోని పలుచోట్ల ధర్నాలు, కంచాల మోత, నల్లబ్యాడ్జీలతో ప్రదర్శనలు నిర్వహించారు.

ముద్రగడను విమర్శించే అర్హత వారికి లేదు

ముద్రగడను విమర్శించే అర్హత చినరాజప్పతోపాటు మంత్రులకు, కాపు కార్పొరేషన్ చైర్మన్ చలమలశెట్టి రామానుజయకు లేదని జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం ముద్రగడ స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ముద్రగడ ఎన్నడూ పదవులకోసం పని చేయలేదని, జాతికోసం పదవుల్నే తృణప్రాయంగా వదిలిపెట్టి, 1994లో ఉద్యమం చేపట్టి జీవో నంబర్ 30 సాధించిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. భావితరాల భవిష్యత్తుకోసం ముద్రగడ పోరాడుతుంటే.. పదవులకోసం పనిచేస్తున్న మంత్రులకు ఆయన్ను విమర్శించే అర్హత లేదన్నారు. ముద్రగడ ఉద్యమ ఫలితంగానే కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి రామానుజయకు వచ్చిందన్న సంగతి మర్చిపోవద్దన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు వాసిరెడ్డి యేసుదాసు, ఆకుల రామకృష్ణ, గౌతుస్వామి, ఆరేటి సూర్యప్రకాష్, జీవీ రమణ, ఆకుల సూర్యభాగ్యలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంతం నానాజీ, మట్టా శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అబద్ధాలు నమ్మొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

కోట్ల విజయభాస్కర్‌రెడ్డి 28-08-1994న ఇచ్చిన జీఓ నంబర్ 30ని గౌరవ హైకోర్టు ఫుల్ బెంచ్ కొట్టివేసిందని చెప్పడంతో పాటు బీసీ రిజర్వేషన్ జీఓ ఇవ్వాలని కాపు ఉద్యమకారులు తొందర చేస్తున్నట్టుగా ముఖ్యమంత్రి మీ వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు వారి పెంపుడు పత్రికలో మంగళవారం ప్రచురితమైంది. వాస్తవానికి జీఓ నంబర్ 30 సక్రమంగానే ఇచ్చారని కోర్టు ఇచ్చిన తీర్పు 07-04-1995లో ఈనాడు పత్రికలో కూడా ప్రచురితమైంది. మంత్రి అచ్చెన్నాయుడు 2016 ఆగస్టు 8న కిర్లంపూడికి వచ్చి ఏడు మాసాల్లో కమిషన్ రిపోర్టు తెప్పించుకుని అసెంబ్లీలో తీర్మానం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రానికి పంపుతామని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి ఏడు మాసాలు ఆగలేరా? అంటూ ఎప్పటికప్పుడు మమ్మల్ని తిట్టించే కార్యక్రమంతో పాటు జగన్, మోదీ, ట్రంప్ సహాయంతో ఈ ఉద్యమం చేస్తున్నామని ఆరోపిస్తూ ఎదురుదాడి చేయించడం ఎంతవరకు న్యాయమో ఆలోచించండి. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తయ్యాయి. కమిషన్ వేసి సుమారు 18 నెలలు, పల్స్‌సర్వే చేసి సంవత్సరం పూర్తయ్యాయి. అయినా ఇంకా ఇస్తాం ఇస్తామని 'అరువు రేపు' అన్నట్టుగా అబద్ధాల మీద అబద్ధాలు చెప్పడానికి వారు ఏమాత్రం సిగ్గు పడటం లేదు కానీ, వారి మాటలు వినడానికి మా జాతి మొత్తం విపరీతంగా సిగ్గు పడుతోంది. మాకు ప్రభుత్వం చెప్పిన అబద్ధాలు మీకు తెలియడం కోసం పేపర్ కటింగులు పంపుతున్నాం. అవి చూస్తే మీకే అర్థమవుతుంది. మాకిచ్చిన హామీల్లానే మరికొన్ని వర్గాలను కూడా నమ్మించి వదిలేశారు. ఇలా మోసం చేసిన వ్యక్తితో మీరు ప్రయాణం చేసి, అబద్ధాలను నిజమని నమ్మి మీ పరపతిని తగ్గించుకోవద్దని కోరుతున్నా..' అని ముద్రగడ ఆ లేఖలో పేర్కొన్నారు.

కిడ్నీ జబ్బులు కాటేస్తున్నా కదలరా?

సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి

- ఉద్దానంలో వెంటనే మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలి
- బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి
- కేంద్రం, ఐరాస, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలి
- కిడ్నీ జబ్బుల ప్రభావిత గ్రామం గొల్లమాకన్నపల్లిలో పర్యటన
- అఖిల భారత రైతుకూలీ సంఘంతో కలసి 20 గ్రామాల్లో నీటి నమూనాల సేకరణ


గొల్లమాకన్నపల్లిలో జీడి కార్మికులతో మాట్లాడుతున్న సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి

కాశీబుగ్గ(పలాస): శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులతో వేలాది మంది మరణిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించటం సరికాదని 'సాక్షి' ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి పేర్కొన్నారు. ఉద్దానం ప్రాంతంలో తక్షణమే మెడికల్ ఎమర్జెన్సీ విధించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఐక్యరాజ్య సమితి, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి కిడ్నీ బాధితుల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కిడ్నీ బాధిత ప్రాంతమైన పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామాన్ని శ్రీకాకుళం జిల్లా అఖిల భారత రైతుకూలీ సంఘం సభ్యులతో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. బాధితులను పరామర్శించి వారి కష్టాలను తెలుసుకున్నారు. ఉద్దానంలోని 20 గ్రామాల నుంచి నీటి నమూనాలు సేకరించారు. హైదరాబాద్‌లోని ల్యాబ్‌లో ఈ నీటికి పరీక్షలు చేయిస్తామని తెలిపారు. ఫలితాలతో ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. గతంలో ఓ జిల్లాలో ఫ్లోరైడ్ బాధితుల సమస్యలు తెలుసుకొని వారికి సాయపడ్డామని వివరించారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులకు మూల కారణాలు అన్వేషించేందుకు సహకరిస్తామన్నారు.

తోడిన నీటి వాడకంతో కిడ్నీ జబ్బులకు ఆస్కారం

రక్తహీనత, తాగే నీటి వల్ల కిడ్నీ జబ్బులు రావడానికి ఆస్కారం ఉందని, 350 అడుగుల లోతులో ఉన్న నీటిని తోడే ప్రక్రియలో పలు ఖనిజాలు కలుస్తున్నాయన్నారు. మహేంద్రగిరి పర్వతాల నుంచి ప్రవహిస్తున్న మహేంద్ర తనయ నది నీటిని ఉద్దాన మంచినీటి పథకం పేరుతో సరఫరా చేసినన్నాళ్లూ కిడ్నీ వ్యాధులు లేవన్నారు. ప్రస్తుతం మోటార్ల ద్వారా నీటి తోడకంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి వంశధార నీటిని శుద్ధి చేసి ఉద్దాన ప్రాంతానికి మళ్లిస్తే మేలు జరుగుతుందన్నారు.

డయాలసిస్ చివరి దశలో ఉన్నవారికే పింఛన్

ప్రస్తుతం గొల్లమాకన్నపల్లి గ్రామంలో 30 మంది చనిపోగా, 5 మంది మంచం పట్టి ఉన్నారని చెప్పారు. వీరికి పూర్తిగా డయాలసిస్ వర్తించని పరిస్థితిలో ఉన్నారని, మన కళ్ల ముందే వారు చనిపోతారని తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడం హృదయ విదారకమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2,500 పింఛను డయాలసిస్ చివరి దశలో ఉన్న వారికే వర్తిస్తుందన్నారు. కిడ్నీ బాధితులకు ఒక్కో ఇంజక్షన్ రూ.1600 చొప్పున నెలకు 2 నుంచి 3 వరకు అవసరమవుతాయన్నారు.

ప్రాణాపాయ పరిస్థితుల్లో కిడ్నీ బాధితుడు వెంకటరావు

మాకన్నపల్లి గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు రాపాక వెంకటరావు కుటుంబాన్ని రామచంద్రమూర్తి, బృందం సభ్యులు పరామర్శించారు. వెంకటరావు గత 15 రోజులుగా డయాలసిస్ లేకపోవటంతో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నాడు. కాళ్లు, చేతులు పని చేయడం లేదు. ఆయనకు రెండు కిడ్నీలు పూర్తిగా పాడయ్యాయి.

జీడి పిక్కల పని చేస్తూ పిల్లలను పోషిస్తున్నా



నా భర్త రామయ్య కిడ్నీ వ్యాధితో చనిపోయాడు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జీడి పిక్కలు వలిచే పని చేస్తూ పిల్లలను పోషిస్తున్నా. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా భర్తను బతికించుకోలేక పోయా.

– రాపాక లక్ష్మమ్మ, గొల్లమాకన్నపల్లి గ్రామం

ఆందోళన చేపడతాం



కిడ్నీ వ్యాధులకు అది చేస్తాం, ఇది చేస్తామని ప్రకటనలు చేసేకంటే చేసి చూపించాలి. వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. ఉద్దాన కిడ్నీ వ్యాధిగ్రస్తులకు న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతాం. మంచినీటి సౌకర్యం కల్పించాలి. ఉచిత మందులు ఇవ్వాలి. డయాలసిస్ సెంటర్‌కు వెళ్లే కిడ్నీ రోగులకు ఉచిత రవాణా ఏర్పాటు చేయాలి.

– పోతనపల్లి జయమ్మ, అఖిల రైతు కూలీ సంఘం సభ్యులు, బొడ్డపాడు గ్రామం

పవన్‌ను అడ్డం పెట్టుకుని నాటకాలు



పవన్‌కల్యాణ్‌ను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నాటకాలాడుతోంది. ఇచ్ఛాపురంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో పవన్ సమావేశం ఏర్పాటు చేసిన తరవాత ప్రభుత్వం స్పందించినట్టుగా నటిస్తోంది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. గొల్లమాకన్నపల్లిలో అనేక మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు మంచం పట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం.

– వంకల మాధవరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి

వంట పాత్రలు నల్లగా మారుతున్నాయి



పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. విశాఖ, పలాసల్లోని కేంద్రాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకోవడానికి వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయి. నా ఒంట్లో రక్తం లేదు. ఖరీదైన ఇంజక్షన్లు వాడుతున్నా. తాగేనీరు మరగబెడితే కింద మడ్డిలా పేరుకుపోతోంది. వంట పాత్రలు నల్లగా మారుతున్నాయి. ప్రభుత్వం ఆదుకోకపోతే ప్రాణాలు కోల్పోతాం.

– రాపాక అమ్మడమ్మ, కిడ్నీ బాధితురాలు, జీఎంపల్లి

ఏపీ జెన్‌కోకు సింగరేణి షాక్

- హఠాత్తుగా బొగ్గు సరఫరా నిలిపివేత
- రూ.1,400 కోట్ల బకాయిలు చెల్లించేదాకా ఇంతేనని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఏపీ జెన్‌కోకు సింగరేణి సంస్థ ఊహించని షాకిచ్చింది. మంగళవారం ఎలాంటి హెచ్చరిక లేకుండానే బొగ్గు సరఫరాను నిలిపివేసింది. రూ.1,400 కోట్ల బకాయిలు చెల్లించేవరకూ బొగ్గు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. వీటీపీఎస్‌కు పూర్తిగా, రాయలసీమ థర్మల్ విద్యుత్ ప్లాంట్(ఆర్టీపీపీ)కి పాక్షికంగా సరఫరా నిలిపివేసినట్టు తెలిపింది. ఇందుకు సంబంధించిన ప్రోగ్రామింగ్ ఛార్ట్‌ను కూడా జెన్‌కోకు పంపింది. ఏపీ జెన్‌కో థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు సింగరేణి, మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్(ఎంసీఎల్) బొగ్గు సరఫరా చేస్తాయి. రాష్ట్ర విభజన తర్వాత సింగరేణికివ్వాల్సిన బొగ్గు బకాయిల్ని ఏపీ సరిగా చెల్లించట్లేదు. దీన్ని సింగరేణి పలుమార్లు ఏపీ జెన్‌కో దృష్టికి తెచ్చింది. ఏపీ నుంచి వెళ్లే విద్యుత్‌కు తెలంగాణ విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలూ పెండింగ్‌లో ఉన్నాయి. అందువల్ల తెలంగాణ నుంచి రావాల్సిన బకాయిల్ని సింగరేణి తీసుకోవాలని ఏపీ కోరింది. ఇందుకు సింగరేణి ఒప్పుకోలేదు. ఈ వివాదంపై రెండు నెలలక్రితం సింగరేణి, ఏపీ జెన్‌కో అధికారులు చర్చించారు. ఇకనుంచీ ప్రతీనెలా బొగ్గు సరఫరా ఖర్చును చెల్లిస్తామని, తెలంగాణ నుంచి డబ్బులు వసూలు చేశాక పెండింగ్ మొత్తాన్ని ఇస్తామని ఏపీ చెప్పింది. అయితే ఇప్పటివరకు ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో సింగరేణి ఉన్నట్టుండి బొగ్గు సరఫరాను నిలిపేసింది. తాజా పరిణామంతో ఏపీ జెన్‌కో అధికారులు కంగుతిన్నారు. హుటాహుటిన సమావేశమై ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. వెస్టర్న్ కోల్ ఫీల్డ్(డబ్ల్యూసీఎల్)నుంచి బొగ్గు దిగుమతిపై సంప్రదించారు. అయితే తమవద్ద 4, 5 గ్రేడ్ రకం బొగ్గే ఉందని, టన్ను రూ.5,800కు ఇస్తామని డబ్ల్యూసీఎల్ తెలిపింది. సింగరేణి సరఫరా చేసే బొగ్గు ఖరీదు టన్నుకు రూ.2,640 మాత్రమే. రెట్టింపు ఖర్చుతో డబ్ల్యూసీఎల్ బొగ్గు తీసుకోవడం వల్ల చరవ్యయం పెరిగే వీలుంది. దీంతో ఆర్టీపీపీలో పూర్తిగా, వీటీపీఎస్‌లో 80 శాతం మేరకు ఉత్పత్తిని నిలిపివేయడమొక్కటే మార్గమని అధికారులు భావిస్తున్నారు.

కేంద్రానికి ఫిర్యాదు

సింగరేణి వ్యవహారంపై ఏపీజెన్‌కో కేంద్రానికి ఫిర్యాదు చేసింది. కోల్ ఇండియా తక్షణమే స్పందించాలని కోరింది. ఈ విషయమై 3న ఢిల్లీలో కేంద్రస్థాయి ఉప కమిటీ ముందు సింగరేణి వైఖరిని ఎండగడతామని, కేంద్రం నుంచి ఒత్తిడి తెచ్చి బొగ్గు తెచ్చుకుంటామని జెన్‌కో అధికారులు చెప్పారు.

పోలవరం నిర్వాసితుల మహాధర్నా

- న్యాయమైన పరిహారం, పూర్తి పునరావాసం కోసం డిమాండ్
- ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి దిగ్బంధం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిపై మండిపాటు
- 17, 18 తేదీల్లో ముంపు మండలాల బంద్‌కు పిలుపు


జాతీయ రహదారిపై బైఠాయించిన నాయకులు, నిర్వాసితులు

చింతూరు (రంపచోడవరం): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు కదంతొక్కారు. న్యాయమైన పరిహారం, పూర్తి పునరావాసం కోసం మహాధర్నా చేపట్టారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా చింతూరు నుంచి చట్టి వరకు భారీ ర్యాలీ నిర్వహించి చట్టి జంక్షన్‌లో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిని రెండు గంటలపాటు దిగ్బంధించారు. దీంతో ఆంధ్రాతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు వెళ్లాల్సిన వందలాది వాహనాలు నిలిచిపోయాయి. భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, పోలవరం నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మిడియం బాబూరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ నిర్వాసితులతో కలసి రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజధానికి భూములిచ్చిన రైతులకు కోట్లాది రూపాయలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. పోలవరం ముంపుతో సర్వం కోల్పోతున్న రైతులకు మాత్రం అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి గ్రామాల్లోకి వస్తే నిర్వాసితుల బాధలు తెలుస్తాయన్నారు. అధికారులను ముఖ్యమంత్రి తన గుప్పిట్లో పెట్టుకుని నిర్వాసితులకు మాయమాటలు చెప్పిస్తున్నారని మండిపడ్డారు. పునరావాసం కల్పించేంత వరకు ప్రాజెక్టు పనులు ఆపాలని, 18 ఏళ్లు నిండిన యువతకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాసంపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 17, 18 తేదీల్లో ముంపు మండలాల బంద్‌కు నాయకులు పిలుపునిచ్చారు. కాగా, నిర్వాసితులు ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తారని భావించి పోలీసులు అక్కడ పహారాకాశారు. అయితే నిర్వాసితులు చట్టిలో ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ దుర్గాప్రసాద్ అక్కడకు వచ్చి ఆందోళన విరమించాలని నిర్వాసితులను కోరారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఐటీడీఏ పీవో చినబాబు, ఆర్డీవో ఎల్లారమ్మ హామీనివ్వడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు. ధర్నాలో సీపీఎం నాయకులు చదలవాడ కృష్ణమూర్తి, చిచ్చడి మురళి, శేషావతారం, తిలక్, వెంకట్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో ముగిసిన విచారణ

చివరి రోజు నందును ప్రశ్నించిన సిట్

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ కేసులో తొలి జాబితాలో ఉన్న సినీ ప్రముఖుల విచారణ ఎట్టకేలకు ముగిసింది. మంగళవారం వర్ధమాన నటుడు ఆనంద్ కృష్ణ అలియాస్ నందు సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని తన ఇంటి నుంచి తండ్రి, మేనమామతో కలసి బయలు దేరిన నందు.. అక్కడి సాయిబాబా ఆలయంలో పూజలు చేసి ఉదయం 10 గంటల సమయంలో ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఆవరణలో ఉన్న బాలత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారికి మొక్కుకొని విచారణ కోసం లోనికి వెళ్లారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన విచారణ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముగిసింది. కెల్విన్ ఫోన్ కాల్‌డేటాలో నందు నంబర్ ఉండటంపై సిట్ అధికారులు ఆయన్ను ప్రశ్నించినట్టు తెలిసింది. వీకెండ్ పార్టీలకు ఎక్కువగా వెళ్తుంటారా? అని సిట్ ప్రశ్నించగా తనకు అలవాటు లేదని, కెల్విన్ కాల్ డేటాలో నంబర్ ఎలా వచ్చిందో కూడా తెలియదని అధికారులకు వివరించినట్టు సమాచారం. డ్రగ్స్ కేసులో 12 మంది సినీ ప్రముఖుల విచారణను సిట్ మంగళవారంతో ముగించింది. తర్వాత చర్యలేంటి? ఇంకెవరికైనా నోటీసులిస్తారా? అన్న ప్రశ్నలకు సిట్ అధికారులు సమాధానం చెప్పడం లేదు. ప్రస్తుతానికి విచారణ ముగిసిందని, చార్జిషీట్ దాఖలు చేసే సన్నాహాల్లో ఉన్నామని సిట్ అధికారి ఒకరు తెలిపారు.

సగానికిపైగా ఎంవోయూలకు డీపీఆర్‌లే లేవు

- భాగస్వామ్య సదస్సుల్లో ఏపీ సర్కార్ ఒప్పందాలపై విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు
- పురోగతి లేని పలు ఒప్పందాలు రద్దయ్యాయని వెల్లడి



సాక్షి, అమరావతి: '2016, 2017 సంవత్సరాల్లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సుల్లో దేశవిదేశాలకు చెందిన వివిధ సంస్థలతో ఏపీ ప్రభుత్వం 996 ఎంవోయూలు కుదుర్చుకుంది. కానీ వాటిలో అత్యధిక ఎంవోయూలు అసలు డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక)లకే నోచుకోలేదు..' అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చెప్పారు. ఎలాంటి పురోగతి లేని పలు ఒప్పందాలు కూడా రద్దయ్యాయని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు ఆయన మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. రెండు భాగస్వామ్య సదస్సుల్లో కలిపి మొత్తం రూ.15,33,219 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 1,629 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు జరగ్గా.. అత్యధిక ఎంవోయూలు డీపీఆర్‌లకే నోచుకోలేదని మంత్రి చెప్పారు. 2016లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.4,78,788 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 331 ఎంవోయూలపై ఏపీ ప్రభుత్వం సంతకాలు చేసిందన్నారు. వీటిలో రూ.2,83,943 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 99 ఎంవోయూలపై ఇంతవరకూ డీపీఆర్‌లు సమర్పించలేదని తెలిపారు. అలాగే రూ.31,000 కోట్ల పెట్టుబడుల అంచనాలతో కుదుర్చుకున్న మరో 6 ఒప్పందాలు రద్దయ్యాయని వివరించారు. ఇక 2017లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.10,54,431 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఏపీ ప్రభుత్వం వివిధ సంస్థలతో 665 ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. వాటిలో రూ.6,33,892 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 335 ఎంవోయూలపై ఇంకా డీపీఆర్‌లు సమర్పించలేదని వెల్లడించారు. అలాగే రూ.1,75,000 కోట్ల పెట్టుబడుల అంచనాలతో కుదుర్చుకున్న మరో 12 ఒప్పందాలు రద్దయ్యాయని మంత్రి వెల్లడించారు. మిగిలిన ఎంవోయూలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.

మెరుగైన సదుపాయాలు కల్పించండి..

ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ విమానాశ్రయంలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ నుంచి విజ్ఞప్తులు అందాయని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా తెలిపారు. విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు మంగళవారం ఆయన ఈ మేరకు లిఖితపూర్వక జవాబిచ్చారు. కాగా, ఈ విమానాశ్రయం 24 గంటలూ పనిచేస్తోందని, నౌకా దళ విభాగం దీనిపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 9 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. వాటిని వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కేంద్రాన్ని కోరారు. 'ఉచిత, నిర్బంధ విద్యా హక్కు' చట్ట సవరణ బిల్లుపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా 52 లక్షల టీచర్ పోస్టులకు గానూ 9 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాదాపు లక్ష పాఠశాలలు ఒకే టీచర్‌తో కొనసాగుతున్నాయి. కేంద్రం తక్షణమే ఈ ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరముంది. ప్రభుత్వ టీచర్లు బోధనేతర పనులతో ఇబ్బంది పడుతున్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు ఇది విరుద్ధం. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. అలాగే బాల కార్మికులుగా ఉన్నవారిని సంరక్షించి.. చదివించాలి..' అని కేంద్రాన్ని విజయసాయిరెడ్డి కోరారు. కాగా, విదేశీ బోట్లు కలిగిన స్వదేశీ సంస్థలు సాగిస్తున్న చేపల వేట వల్ల ఎదురవుతున్న సమస్యలపై కేరళ ఎంపీ ఇచ్చిన సావధాన తీర్మానంపై చర్చలో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. అత్యాధునిక విదేశీ బోట్లతో జరిపే చేపల వేట వల్ల ఏపీ, తమిళనాడుకు చెందిన మత్స్యకారులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం పరిష్కరించాలని కోరారు.

అన్నపూర్ణ భోజన పథకంపై అధ్యయనం

హైదరాబాద్ వెళ్లి పరిశీలించిన మున్సిపల్ కమిషనర్లు


జీహెచ్‌ఎంసీలో కమిషనర్‌తో సమావేశమైన ఏపీ మున్సిపల్ కమిషనర్లు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో రూ.5 భోజన పథకం అన్నపూర్ణ అమలవుతున్న తీరుపై ఏపీలోని తిరుపతి, విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, శ్రీకాకుళం, కడప, ఒంగోలు తదితర నగరాల మున్సిపల్ కమిషనర్లు మంగళవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని సందర్శించి కమిషనర్ డా.బి.జనార్దన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ 'అన్నపూర్ణ' వంటి భోజన పథకాన్ని ప్రారంభించేందుకు తమ ప్రభుత్వం నిర్ణయించిందని వారు చెప్పారు. జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో 150 అన్నపూర్ణ కేంద్రాల ద్వారా రోజూ కేవలం ఐదు రూపాయలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పథకానికి ఏడాదికి రూ.39 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అనంతరం నగరంలోని ఐదు రూపాయల భోజన కేంద్రాలను మున్సిపల్ కమిషనర్లు పరిశీలించారు.

మృత్యువులోనూ అన్న వెంటే..

- అన్న మృతదేహాన్ని చూసి ఆగిన చెల్లెలి గుండె
- విశాఖ ఏజెన్సీలో ఘటన


భోగమ్మ మృతదేహం

పెదబయలు (అరకులోయ): చిన్నప్పటి నుంచి తనతోపాటు కలిసిమెలిసి పెరిగిన అన్న మరణాన్ని తట్టుకోలేక చెల్లి కూడా తనువు చాలించిన విషాద సంఘటన ఇది. విశాఖ ఏజెన్సీ ముంచంగిపుట్టు మండలం పనస గ్రామానికి చెందిన గిరిజనుడు కూడ సూరయ్య(52) జ్వరంతో బాధపడుతుండగా సోమవారం రాత్రి పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆయన మృతిచెందాడు. అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. పెదబయలు మండలం పర్రెడ గ్రామంలో ఉంటున్న మృతుడి చెల్లి పాంగి భోగమ్మ (46) తన అన్న మరణవార్త విని మంగళవారం ఉదయం హుటాహుటిన పనస గ్రామానికి వెళ్లింది. అన్న మృతదేహాన్ని చూసి రోదిస్తూ ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలింది. ఆమెను బంధువులు పెదబయలు పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. భోగమ్మ భర్త 15 ఏళ్ల కిందటే మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు. కూలి పనిచేస్తూ పిల్లల్ని పోషిస్తూ వస్తోంది. తల్లి మరణంతో వారు దిక్కులేని వారయ్యారు. సూరయ్యకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అన్నా చెల్లెళ్ల మృతితో ఆ రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

10తో ముగియనున్న ఎల్పీయూ అడ్మిషన్లు

సాక్షి, హైదరాబాద్: లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్పీయూ)లోని వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు చేపట్టిన అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 10తో ముగియనుంది. ఈ విద్యాసంవత్సరానికి గానూ ఇప్పటికే 50 దేశాలు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. యూకే, చైనా, కొలంబియా వంటి పలు దేశాల విద్యార్థులు అడ్మిషన్లు పొందిన వారిలో ఉన్నారు. ఎల్పీయూలో చేరడానికి విద్యార్థుల నుంచి వస్తున్న స్పందన పట్ల యూనివర్సిటీ చాన్సలర్ అశోక్ మిట్టల్ హర్షం వ్యక్తం చేశారు. అడ్మిషన్లకు సంబంధించి ఏదైనా సమాచారం కోసం www.lpu.com వెబ్‌సైట్‌ను గానీ, 01824-404408, 1800 102 4431నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అలాగే admissions@lpu.co.inకు మెయిల్ చేయవచ్చని సూచించారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యాకేంద్రం ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన ఎంఏ జర్నలిజం, ఎంహెచ్‌ఆర్‌ఎం, పీజీడీహెచ్‌హెచ్‌ఎం, పీజీడీబీఎం, పీజీడీబీఎఫ్‌ఎం, పీజీడీహెచ్‌ఆర్‌ఎం, పీజీడీబీ, పీజీడీఐఎం, పీజీడీఎంఎం, పీజీడీటీటీఎం, పీజీడీఎఫ్‌ఎం కోర్సుల పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్టు ఆ పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ భవనం ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈ ఫలితాలను www.anu.ac.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. ఎంఏ జర్నలిజం, ఎంహెచ్‌ఆర్‌ఎం కోర్సులకు రీవాల్యుయేషన్‌కు ఆగస్టు 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఒక్కో పేపర్‌కు ఫీజు రూ.960 రూపాయల చొప్పున చెల్లించాలన్నారు.

ఇక ప్రభుత్వ నిధులతోనే మంచినీటి ప్లాంట్లు

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా ఏర్పాటు చేసే మంచినీటి ప్లాంట్లకయ్యే మొత్తం ఖర్చును ఇక ప్రభుత్వమే భరించనుంది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ పథకం అమలు కోసం సంతకం చేశారు. కానీ ఇందుకయ్యే వ్యయాన్ని భరించేందుకు మాత్రం ప్రభుత్వం వెనుకడుగు వేసింది. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఖర్చు భరిస్తేనే ఇంతకాలం ప్లాంట్లు ఏర్పాటవుతుండేవి. దీంతో 900 చోట్ల మాత్రమే మంచినీటి ప్లాంట్ల ఏర్పాటుకు దాతలు ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో 2016 మార్చిలో ప్రభుత్వం నిబంధనలు సవరించింది. ప్లాంటు ఏర్పాటుకయ్యే ఖర్చులో 76 శాతం దాతలు భరిస్తే.. మిగిలిన 24 శాతం ప్రభుత్వం ఇస్తుందంటూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఏ ఒక్కరూ ముందుకు రాకపోవడంతో.. మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందంటూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అత్యవసర జాబితాలో కరోనరీ స్టెంట్లు

వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: కరోనరీ స్టెంట్లను జాతీయ అత్యవసర మందుల జాబితాలో చేర్చుతూ జూలై 19, 2017న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీచేసిందని సంబంధిత శాఖ మంత్రి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఫార్మా విభాగం కూడా కరోనరీ స్టెంట్లను డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్‌లో చేర్చిందని వివరించారు. నేషనల్ ఫార్మాస్యూటికల్స్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) 13.02.2017న బేర్ మెటల్ స్టెంట్లకు రూ. 7,260గా సీలింగ్ ప్రైస్‌ను నిర్ధారించిందని వివరించారు. డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్(డీఈఎస్), మెటాలిక్ డీఈఎస్, బయోరీసోర్బెబుల్ వాస్క్యులర్ స్కాఫోల్డ్ (బీవీఎస్), బయోడీగ్రేడబుల్ స్టెంట్లకు రూ. 29,600గా ధరను నిర్ధారించిందని వివరించారు. అనంతరం 01.04.2017న ఎన్‌పీపీఏ బేర్ మెటల్ స్టెంట్లకు రూ. 7,400గా, డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్(డీఈఎస్), వాస్క్యులర్ స్కాఫోల్డ్(బీవీఎస్), బయోడీగ్రేడబుల్ స్టెంట్లకు రూ. 30,180గా నిర్ధారించిందని వివరించారు. డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్(డీపీసీఓ) విదేశీ స్టెంట్లకు, స్వదేశీ స్టెంట్లకు మధ్య వ్యత్యాసం చూపదని మంత్రి వివరించారు. సీలింగ్ ధరలు విదేశీ స్టెంట్లకైనా, స్వదేశీ స్టెంట్లకైనా ఒకేలా వర్తిస్తాయని తెలిపారు.

7న దుర్గగుడి మూసివేత

ఇంద్రకీలాద్రి (విజయవాడ): శ్రావణ శుద్ధ పౌర్ణమి 7వ తేదీ చంద్రగ్రహణం సందర్భంగా దుర్గగుడి మూసివేయనున్నట్టు ఈవో సూర్యకుమారి తెలిపారు. 7వ తేదీ రాత్రి 10.56 నిమిషాల నుంచి రాత్రి 12.52 వరకు చంద్రగ్రహణం ఏర్పడుతుందని ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు. ఆగమ శాస్త్ర ప్రకారం ఆరోజు మధ్యాహ్నం మహా నివేదన అనంతరం ఆలయ ద్వారాలు మూసివేస్తామని చెప్పారు. 8వ తేదీ ఉదయం ఆలయ శుద్ధి, అమ్మవారి సంప్రోక్షణ అనంతరం ఉదయం 8.00 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని వెల్లడించారు. 8వ తేదీ తెల్లవారుజామున వస్త్రాలంకరణ, ఖడ్గమాల ఆర్జిత సేవ, త్రికాల అర్చన సేవలను నిలిపివేయనున్నట్టు తెలిపారు.

నేడు, రేపు తేలికపాటి వానలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఒకటి రెండు రోజులు తేలికపాటి వానలు కురవనున్నాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాలు బలహీనపడ్డాయి. ప్రస్తుతం ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర మీదుగా అల్పపీడనద్రోణి ఒక్కటే కొనసాగుతోంది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో రానున్న రెండు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు గానీ, మోస్తరు వర్షం గానీ కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి విడుదలచేసిన నివేదికలో తెలిపింది. ఆ తర్వాత వానలు ఒకింత ఊపందుకునే అవకాశం ఉందని పేర్కొంది. గడచిన 24 గంటల్లో అవనిగడ్డ, కావలిలో 5, కొయ్యలగూడెం, కుప్పంలో 4, వెంకటగిరికోట, ప్రత్తిపాడు, జంగమహేశ్వరపురంలో 3, అచ్చంపేట, శాంతిపురం, కర్నూలు, ఆత్మకూరు, ఓర్వకల్లులో 2 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

ఏపీ తాగునీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: గ్రామాల్లో తాగునీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ డ్రింకింగ్ వాటర్ సప్లయి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో ఇప్పుడున్న మంచినీటి సరఫరా పథకాల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నందున అదనపు నిధుల సమీకరణకు ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఒక్కొక్క వ్యక్తికి 70 లీటర్ల చొప్పున రోజంతా శుద్ధమైన నీటిని సరఫరా చేయడం, ప్రతి ఇంటికీ కనీసం 50 మీటర్ల సమీపంలో మంచినీటి వసతి ఉండేలా చూడటం కార్పొరేషన్ ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు.

సాక్షి
బుధవారం, ఆగస్టు 2

ఆరోగ్యశ్రీ చుట్టూ ఆంక్షలు

ఆపత్కాలంలో అమ్మ గుర్తుకొచ్చినట్టే తెలుగు రాష్ట్రాల్లో జబ్బుపడ్డ నిరుపేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ స్ఫురణకొస్తుంది. పదేళ్లక్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పథకం ప్రారంభించినప్పుడు అందుకవసరమైన నిధులెలా అని సంశయించలేదు. జనావసరాలనే చూశారు తప్ప ఖజానా గురించి ఆలోచించలేదు. నిరుపేద రోగులను ఆపత్కాలంలో ఆదుకునేందుకు, వారికి కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు రూపొందించిన ఈ పథకం లక్షలాది కుటుంబాలకు వరమైంది. ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన నిరుపేదలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన కార్పొరేట్ వైద్యం అందుబాటులోకొచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకొచ్చాక మిగిలిన ప్రజోపయోగ పథకాలను నీరుగార్చిన తరహాలోనే ఆరోగ్యశ్రీని కూడా అటకెక్కించే ప్రయత్నం మొదలుపెట్టింది. హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందాలనుకునే రోగులకు ఆరోగ్యశ్రీ వర్తించబోదంటూ ఇటీవల తీసుకున్న నిర్ణయమే అందుకు తాజా ఉదాహరణ. ఒక్క కేన్సర్ చికిత్సకు మాత్రం దీన్నుంచి మినహాయింపునిచ్చారు. టీడీపీ ఏలుబడి మొదలయ్యాక ఈ పథకానికి అప్పటివరకూ ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరును ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీగా మార్చారు. పేరు ఏదైనా పథకం అమలైతే అదే పదివేలని అందరూ అనుకుంటున్న తరుణంలో తనకలవాటైన రీతిలో ఆ పథకానికి బాబు తూట్లు పొడుస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కొరత బాగా ఉంది. ముఖ్యంగా వైద్య రంగంలో అది మరీ ఎక్కువ. ప్రభుత్వాసుపత్రుల్లో లభించే సేవలు అంతంతమాత్రం. రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ పడకేసిందని సాక్షాత్తూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) వారం రోజులక్రితం దుయ్యబట్టింది. ప్రభుత్వాసుపత్రుల్లో మొదలుకొని ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల వరకూ ఎక్కడా రోగులకు మెరుగైన సేవలు లభించడం లేదని కాగ్ గణాంకాలతో సహా వెల్లడించింది. జాతీయ హెల్త్ మిషన్ కింద కేంద్రం నుంచి గ్రాంటుగా అందుతున్న నిధుల్లో సగం కూడా రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేయలేకపోయిందని తెలిపింది. జాతీయ గ్రామీణ హెల్త్ మిషన్ నిధులను దారి మళ్లించిందని స్పష్టం చేసింది. ఇన్ని పోకడలకు పోతూ, ప్రజారోగ్య వ్యవస్థను భ్రష్టు పట్టించిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో చికిత్స చేయించుకుంటే తప్ప ఆరోగ్యశ్రీ పథకం వర్తించబోదంటూ చెప్పడం ఎంత దుస్సాహసం? అవసరమైన కేటాయింపులు లేకపోవడం, చేసిన కేటాయింపుల్లో అధికభాగం పాత బకాయిలకిందకు జమ కావడం తదితర కారణాలవల్ల ఆరోగ్యశ్రీ అసలే అంతంతమాత్రంగా నడుస్తోంది. ఇప్పుడీ నిబంధన పర్యవసానంగా అది పేద ప్రజలకు మరింత దూరమవుతుంది. వ్యాధికి ఎక్కడ చికిత్స తీసుకోవాలో నిర్ణయించుకునే ముందు రోగులు అనేక విధాల ఆలోచిస్తారు. ఆసుపత్రిలో ఉండే సౌకర్యాలనూ, అక్కడ చికిత్సనందించే వైద్యుల గురించి వాకబు చేస్తారు. సుశిక్షితమైన, మెరుగైన వైద్యం లభిస్తుందన్న విశ్వాసం ఏర్పడిన ఆసుపత్రిలోనే చేరతారు. పైగా రాష్ట్ర విభజన జరిగినప్పుడు పదేళ్లపాటు హైదరాబాద్‌ను రాజధానిగా ఉపయోగించుకోవచ్చునని హామీ ఇచ్చారు. 'ఓటుకు కోట్లు' కేసు తాకిడితో అర్థాంతరంగా చంద్రబాబు ప్రభుత్వ విభాగాలన్నిటినీ తరలించుకున్నారు. కానీ మంచి వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండేలా చూడగలిగారా? పైగా విభజన జరిగి మూడేళ్లు దాటుతున్నా ఉపాధి కోసం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చాలామంది ఇప్పటికీ హైదరాబాద్ చుట్టుపక్కల ఉంటున్నారు. స్వస్థలాల్లో ఉండే తమవారిని హైదరాబాద్ రప్పించుకుని తగిన చికిత్స ఇప్పించాలని ఆశించేవారికి తాజా నిబంధన ప్రతిబంధకంగా మారుతుంది.

పేద జనం అన్నా, వారి ప్రాణాలన్నా ఉండే నిర్లక్ష్యం నుంచే ఇలాంటి ఆలోచనలు పుట్టుకొస్తాయి. వైఎస్ ఈ పథకం ప్రారంభించినప్పుడు దీని పరిధిలోకొచ్చే వ్యాధుల సంఖ్య 135 వరకూ ఉండేది. ప్రజల ఆరోగ్యావసరాలను ఎప్పటికప్పుడు పరిగణనలోకి తీసుకుని ఈ పథకాన్ని ఆయన విస్తృతపరుచుకుంటూ వెళ్లారు. ఫలితంగా ఈ పథకం కింద అర్హమైన చికిత్సల సంఖ్య దాదాపు వెయికి చేరుకుంది. ఆయన కనుమరుగయ్యాక వచ్చిన ప్రభుత్వాలు దీనికి గ్రహణం పట్టించడం మొదలుపెట్టాయి. దాని పరిధిలో ఉన్న జబ్బులను కూడా కుదించడం ప్రారంభించాయి. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 133 రకాల జబ్బులకు ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే చికిత్స చేయించుకోవాలన్న నిబంధన విధించారు. బధిర, మూగ లోపాలున్న పిల్లలకు జరిపే కాక్లియార్ ఇంప్లాంట్ చికిత్సకున్న వయో పరిమితిని తగ్గించారు. వైఎస్ ప్రభుత్వం మొదట్లో ఉన్న వయో పరిమితి ఆరేళ్లను 12 సంవత్సరాలకు మారిస్తే... కిరణ్ సర్కారు దాన్ని కాస్తా రెండేళ్ల వయసుకు కుదించింది. ఆ వయసులో పిల్లలకున్న మూగ, చెవుడు లోపాల్ని గుర్తించడం కష్టమని ఎవరెంతగా ప్రాధేయపడినా ప్రయోజనం లేకపోయింది. బాబు సర్కారు ఇలాంటి సమస్యలను సరిదిద్దకపోగా దాన్ని మరింత భ్రష్టు పట్టించేందుకు చూస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు ఎలా అఘోరిస్తున్నాయో కాగ్ నివేదిక తేటతెల్లం చేసింది. అక్కడ డాక్టర్లు, నర్సుల కొరత ఎక్కువని తెలిపింది. జ్వరానికి వాడే పారాసిటమల్‌తోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గైనకాలజీ కిట్లు, గర్భనిరోధక మాత్రలు అందుబాటులో లేవని చెప్పింది. కాలం చెల్లిన మందుల్ని రోగులకిస్తున్నారని, వాటి నాణ్యతను తనిఖీ చేయడం లేదని వివరించింది. ప్రజారోగ్య వ్యవస్థను ఇంతగా ధ్వంసం చేసింది చాలక వేరేచోట్ల వైద్యం చేయించుకుంటే ఆరోగ్యశ్రీ వర్తించబోదని అనడంలోని ఆంతర్యమేమిటి? ఇలాంటి పెడగడలకు చంద్రబాబు సర్కారు స్వస్తి పలకాలి. ఆ పథకానికి తగినన్ని నిధులు కేటాయించకపోతే, దాన్ని నీరుగారిస్తే ప్రజలు క్షమించరు.



అన్ని రకాల అసమానతలలోకీ, వైద్యసేవలలో అసమానత అనే అన్యాయమే అత్యంత దిగ్భ్రాంతికరం, అమానుషం.
– మార్టిన్ లూథర్ కింగ్
అమెరికా హక్కుల ఉద్యమ నేత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.దశమి ప.2.28 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం అనూరాధ సా.4.32 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం రా.10.40 నుంచి 12.26 వరకు, దుర్ముహూర్తం ప.11.41 నుంచి 12.33 వరకు అమృతఘడియలు ఉ.5.58 నుంచి 6.54 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.30
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

నమాజ్ వేళలు



ఫజర్	4.38	మగ్రీబ్	6.49
జొహర్	12.22	ఇషా	8.07
అసర్	4.50		

'దక్షిణం' కోసం ప్రదక్షిణలు



దేవులపల్లి అమర్

తనను తీవ్రంగా వ్యతిరేకించి, అవమానకరంగా వ్యవహరించిన నితీశ్‌నే అక్కున చేర్చుకున్న మోదీ చంద్రబాబు ఆనాడు చేసిన అవమానాన్ని తమ రాజకీయ ప్రయోజనం కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుంటారా? అదేమైనా మనసులో ఉన్నా అసలు కారణాలు వేరే ఉన్నాయి. పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణాలు, అన్ని వర్గాలనూ దూరం చేసుకున్న పరిస్థితిలో మునుగుతున్న పడవలో ప్రయాణం చెయ్యాలని ఎవరనుకుంటారు? ఈ ఆగస్టులో ఏపీ రాజకీయాలు ఆసక్తికరమైన మలుపులు తిరిగే అవకాశాలు చాలా కనిపిస్తున్నాయి.

డేట్‌లైన్ హైదరాబాద్



తెలుగు రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఏం చేయాలని అనుకుంటున్నది? తెలంగాణలో అధికారపక్షాన్ని తన దారికి తెచ్చుకుని, ఆంధ్రప్రదేశ్‌లో అధికారపక్షంతో తెగతెంపులు చేసుకోవాలని అనుకుంటున్నదా? మిత్రుపక్షాలైనా సరే, భారంగా మారతాయనిపిస్తున్న పార్టీలను వదిలించుకుని కొత్త స్నేహాల కోసం బీజేపీ చేయి చాస్తున్నట్టు ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇదేదో రెండు తెలుగురాష్ట్రాలలో తన వ్యూహంగా మాత్రమే బీజేపీ చేస్తున్నట్టు లేదు. 2019 సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలో బీజేపీకి గతంలో కంటే ఎక్కువ స్థానాలను సాధించుకోవడంతో బాటు, రాష్ట్రాల్లో కూడా తమ ప్రభుత్వం లేదా తమ మిత్రుల ప్రభుత్వాలు అధికారంలో ఉండేటట్టు చూసుకోవడం నరేంద్ర మోదీ, అమిత్ షా తాజా వ్యూహం. తద్వారా లోక్‌సభతో బాటు రాజ్యసభలో కూడా తమ మాట నెగ్గేటట్టు చేసుకుంటే ఇక అడ్డు ఉండదన్నది ఆ నాయకద్వయం ఆలోచన.

సంపూర్ణ అధికారమే లక్ష్యంగా ముందుకు పోతున్న ఈ నాయకులు ఇద్దరికీ తెలుగు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీల మీద ప్రత్యేకమైన ప్రేమ కానీ, ద్వేషం కానీ లేవు. రాజకీయాలలో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు ఉండరన్న మాటను నూటికి నూరుపాళ్లు నిజం చేస్తూ మొన్ననే బిహార్‌లో నితీశ్‌కుమార్ మోదీ శిబిరంలో చేరిపోవడం, మోదీని మించిన నాయకుడు ఈ దేశంలోనే లేరు అనేంత దాకా వెళ్లడం చూశాం. ఇంకెవరయినా ఈ మాటలు మాట్లాడితే ఆశ్చర్యపోనక్కర లేదు. నితీశ్ బీజేపీతో జత కట్టడాన్ని ఘర్‌వాపసీ అంటున్న వాళ్లంతా మోదీ నాయకత్వాన్ని అంగీకరించేందుకు ససేమిరా అనే నితీశ్ ఎన్డీఏ కూటమిని వీడిన విషయం, ఒక దశలో బీజేపీయేతర పార్టీలన్నిటికీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుకొచ్చిన విషయం మరిచిపోయినట్టున్నారు. ఇటీవలే జరిగిన బిహార్ ఎన్నికల్లో బీజేపీ, జేడీ(యు) మధ్య జరిగిన మాటల యుద్ధం కూడా గుర్తు చేసుకోవాలి వాళ్లు. నైతికమా అనైతికమా, న్యాయమా అన్యాయమా, చట్ట విరుద్ధమా రాజ్యాంగ బద్ధమా అన్న చర్చ చేయడానికి కేంద్రంలోఅధికారంలో ఉన్న మోదీ షా జోడీ ఆలోచించేందుకు సిద్ధంగా లేదు. దేశాన్నంతటినీ తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం లక్ష్యంగా ముందుకు పోతున్నారు. తమిళనాడు పరిణామాలను గమనిస్తూనే ఉన్నాం కదా! ద్రవిడ రాజకీయాలకు పెట్టింది పేరైన తమిళనాడు ఇక బీజేపీ అదుపులోకి వచ్చినట్టే. బిహార్ బీజేపీ బుట్టలో పడనే పడింది. దీంతో 15 రాష్ట్రాలు బీజేపీ పాలనలోకి వచ్చేసినట్టే.

నియోజకవర్గాల పెంపు లేకపోతే...

తమిళనాడులో ఏఐడీఎంకే గ్రూపులు దారికి రాకపోతే రాష్ట్రపతి పాలన విధించి 2018లో మరికొన్ని రాష్ట్రాలతో బాటు ఎన్నికలు నిర్వహించవచ్చు. దక్షిణాదిలో కూడా అధికారంలోకి రావాలన్న బీజేపీ వ్యూహకర్తల లక్ష్యంలో భాగంగా తమిళనాడును దారికి తెచ్చుకునే పనిలోపడ్డట్టున్నారు. కర్ణాటకలో గతంలో అధికారం అనుభవించిన బీజేపీ మళ్లీ అధికారం లోకి వచ్చే అవకాశాల పట్ల ఆశతోనే ఉంది. కేరళ కొరకరాని కొయ్య. ఇక పోతే దక్షిణాదిలో మిగిలింది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్–రెండు తెలుగు రాష్ట్రాలు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాలలో మోదీ షా జోడీ ఏం చేయబోతున్నదో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలలోనూ అధికార పక్షాలు విభజన చట్టంలో పొందుపరిచిన అంశాల్లో మిగతా వాటి సంగతి ఎలా ఉన్నా శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను మాత్రం కచ్చితంగా పెంచేందుకు కేంద్రాన్ని ఒప్పించగలమన్న ధీమాతో ఎడా పెడా ప్రతిపక్షాల నుంచి శాసనసభ్యులను చేర్చుకుని కూర్చున్నారు. తెలంగాణలో 25 మంది, ఆంధ్రప్రదేశ్‌లో మరో 21 మంది శాసనసభ్యులు, కొంతమంది లోక్‌సభ సభ్యులు అధికార పక్షానికి వలసపోయారు.

ఇద్దరికీ మిత్రుడిగా, తమ ప్రయోజనాల పరిరక్షకుడిగా చంద్రశేఖర్‌రావు, చంద్రబాబునాయుడు భావించిన వెంకయ్యనాయుడును ఉప రాష్ట్రపతి పదవికి పంపించడం, ఆ వెంటనే, నియోజకవర్గాల పెంపు ఇప్పట్లో లేదని స్పష్టం చెయ్యడంతో ఇద్దరు నేతలూ దిక్కు తోచని స్థితిలో పడ్డారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఇద్దరు ముఖ్యమంత్రులూ ప్రధానమంత్రిని కలసి నియోజకవర్గాల పెంపు విషయంలో స్పష్టమయిన ప్రకటన చేయించుకు రావాలని గట్టి ఆలోచనతో వెళ్లారు. చంద్రబాబునాయుడుకు యథావిధిగానే ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ దొరకలేదు. అయితే ప్రధానితో సమావేశం కోసం వేచి ఉండకుండా తొందర పనులు ఉన్నందున చంద్రబాబే విజయవాడకు వెళ్లిపోయారని ఆయన అనుయాయులు నమ్మించే ప్రయత్నం చేశారనుకోండి! ఇక ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ పొంది మరునాడు ఆయనను కలసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఆ అంశం మరిచిపోవచ్చునని మీడియా మిత్రులకు చెప్పారు. నియోజకవర్గాల సంఖ్య పెరగకపోయినా మాకేం 'ఫరక్' పడదు అని ఆయన గాంభీర్యం ప్రదర్శించినా కొంచెం స్వరం మారడం గమనించవచ్చు. గత సంవత్సరం మోదీ ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేసిన వెంటనే తీవ్రంగా స్పందించి, తెలివి తక్కువ చర్యగా వర్ణించిన చంద్రశేఖర్‌రావు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి ఉపదేశం విన్నాక కనువిప్పు కలిగి అదొక విప్లవాత్మక నిర్ణయం అని కొనియాడారు. ఏం మతలబు జరిగిందో ఆయనకే తెలియాలి. ఇంతమాట ఎందుకు అనాల్సి వచ్చిందంటే మొన్న ప్రధానిని కలసి బయటికొచ్చాక అదే చంద్రశేఖర్‌రావు పెద్ద నోట్ల రద్దు సత్ఫలితాలు ఏమీ కనిపించలేదని మీడియాకు చెప్పారు.

సొంతంగా ఎదిగేందుకు బీజేపీ కృషి

ఈ మధ్యకాలంలో ఒకపక్క తెలంగాణ బీజేపీ నాయకులు తెలంగాణ ప్రభుత్వం మీద విమర్శల బాణాలు విసురుతూనే ఉన్నా స్నేహబంధం కుదిరిపోయిందనీ, ఈ పార్లమెంట్ సమావేశాల తరువాత టీఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వంలో చేరనుందనీ వార్తలు వచ్చాయి. కేసీఆర్ కూడా అమిత్ షాను విమర్శించినా కేంద్ర ప్రభుత్వం మీద, మోదీ మీద ఈగ వాలనివ్వక పోవడం ఆ ప్రచారానికి ఆస్కారం కల్పించింది. అంతెందుకు, కాంగ్రెస్ రాష్ట్రపతి అభ్యర్థి మీరాకుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ వచ్చి మర్యాదపూర్వకంగా కలుస్తానన్నా కనీసం ఫోన్‌లో కూడా ఆమెతో మాట్లాడటానికి సిద్ధపడక పోవడం బీజేపీ మెప్పు కోసమే అన్న విమర్శ అయితే ఉంది. సొంతంగానే పోటీ చేస్తాం అని శ్రేణుల్లో ఉత్సాహం కలిగించడం కోసం మాట్లాడుతున్నా టీఆర్ఎస్ అధినేతకు పరిస్థితులు బాగా తెలుసు, వచ్చే ఎన్నికలలో గెలుపు నల్లేరు మీద నడక కాదని. నియోజకవర్గాల పెంపు లేకపోతే అందరినీ సంతృప్తి పరచడం అసాధ్యం. ఆ విధంగా తెలంగాణ లో అధికార పక్షం తమతో పొత్తుకు ముందుకు రాక తప్పని పరిస్థితి కల్పిస్తూనే సొంతంగా ఎదిగే ప్రయత్నంలో బీజేపీ పడ్డట్టుంది. మోదీ అమిత్ షా ఎత్తుగడలను తట్టుకుని టీఆర్ఎస్ సొంతంగానే నిలబడుతుందా, సర్దుకుపోతుందా చూడాలి.

టీడీపీతో బెడిసిన సంబంధాలు

ఇక ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, టీడీపీ మధ్య సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. వాజ్‌పేయి, అద్వానీల కాలం నాటి ఎన్డీఏ కాదనీ మోదీ, అమిత్ షాల కాలమనీ గుర్తించడానికి చంద్రబాబునాయుడుకు ఎక్కువ కాలం పట్టలేదు. రాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవంలో చంద్రబాబునాయుడుకు ముందు వరుసలో స్థానం కేటాయించారని అనుకూల మీడియాలో రాయించుకోవడం కేవలం ఢిల్లీలో ఇంకా తమకు సముచిత గౌరవం ఉందని చెప్పుకోవడానికే. ఈ మూడేళ్లకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వం నడుస్తున్న తీరు తెలియనంత అజ్ఞానంలో బీజేపీ నాయకత్వం ఉండదు కదా! కేంద్రం విడుదల చేసిన నిధులను ఖర్చు చేస్తున్న తీరు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పెద్దల వ్యవహార శైలి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న కేంద్ర నాయకత్వం ఇక్కడ కూడా సొంతంగా పార్టీని బలోపేతం చేసే ఆలోచనతో బాటు, ప్రత్యామ్నాయ మిత్రులను వెతుక్కోవడం సహజంగానే జరుగుతున్నది. ఇక్కడొక విషయం మాట్లాడుకోవాలి.

దేశమంతా ఇంతకాలం బీజేపీకి దూరంగా ఉన్న పలు పార్టీలు దగ్గరై ఎన్డీఏలో చేరడానికి సిద్ధపడుతుంటే, పాత భాగస్వామి తెలుగుదేశం ఎందుకు దూరమవుతున్నది అన్నదే ఆ విషయం. రాజకీయ దురంధరుడినని తనకు తానే కితాబు ఇచ్చుకునే చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణవాయువు వంటి ప్రత్యేక హోదా మొదలైన అన్ని హామీలను గాలికి వదిలేసి అణిగి మణిగి ఉన్నా ఎందుకు బెడిసింది? కాంగ్రెస్‌ను పూర్తిగా బలహీనపరిచే క్రమంలో వీలైనన్ని పార్టీలను తమ కూటమిలో చేర్చుకోజూస్తున్న బీజేపీ ఆయనను ఎందుకు దూరం పెడుతున్నది?

నేలకు ఒరిగిపోతున్న చంద్రబాబు రాజకీయ ప్రతిష్ట వెన్నుకు వెదురు బద్దలు కట్టి నిటారుగా నిలబెట్టే ప్రయత్నంలో తలమునకలవుతున్న ఆయన మిత్ర మీడియా చెప్పినట్టు వాజ్‌పేయి హయాంలో ఎన్డీఏ కన్వీనర్‌గా అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి మోదీని పదవి నుంచి తొలగించాలని పట్టుపట్టి ఢిల్లీ ఆంధ్రభవన్‌లో మూడు గంటలు ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానించినందుకే ఇప్పుడు మోదీ చంద్రబాబును దూరం పెడుతున్నారా? తనను తీవ్రంగా వ్యతిరేకించి, అవమానకరంగా వ్యవహరించిన నితీశ్‌నే అక్కున చేర్చుకున్న మోదీ చంద్రబాబు ఆనాడు చేసిన అవమానాన్ని తమ రాజకీయ ప్రయోజనం కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుంటారా? అదేమైనా మనసులో ఉన్నా అసలు కారణాలు వేరే ఉన్నాయి. పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణాలు, అన్ని వర్గాలనూ దూరం చేసుకున్న పరిస్థితిలో మునుగుతున్న పడవలో ప్రయాణం చెయ్యాలని ఎవరనుకుంటారు? ఇక ఎవరి సర్వేలు వాళ్లకు ఉంటాయికదా! హనీమూన్ ఇక ముగిసినట్టే. ఈ ఆగస్టు మాసంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఆసక్తి కరమైన మలుపులు తిరిగే అవకాశాలు చాలా కనిపిస్తున్నాయి.

నంద్యాల ఉప ఎన్నిక ఇదే నెలలో జరుగుతున్నది, అక్కడ జరుగుతున్న అధికారదుర్వినియోగం, ధన ప్రవాహం అధికార పక్షం ఎంత దిక్కు తోచని స్థితిలో కూరుకుపోయిందో స్పష్టం చేస్తున్నది.

datelinehyderabad@gmail.com

నేరమయ పాలనకు మారుపేరు

కొమ్మినేని శ్రీనివాసరావుతో నట, దర్శకుడు పోసాని కృష్ణమురళి




ప్రభుత్వాన్ని ఎవరైనా నడపవచ్చు. ముఖ్యమంత్రి సీటులో ఎవరైనా కూర్చోవచ్చు.. కానీ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేస్తున్నన్ని తప్పులను ఎవరూ చేయకూడదని ప్రముఖ సినీ రచయిత, నట దర్శకుడు పోసాని కృష్ణ మురళి చెప్పారు. భూకబ్జాలు, లంచాలు, కమీషన్లు, తప్పుల్ని నిలదీసిన అధికారులను కొట్టడం, నిలదీసిన ప్రజలను లారీల్తో గుద్దేయడం. ప్రతిపక్ష నేతలపై ఎస్సీ, ఎస్టీ వేధింపు కేసులను పెట్టి బలవంతంగా ఫిరాయింపులకు గురిచేయడం.. ఒక్కమాటలో చెప్పాలంటే ఏపీలో ప్రస్తుత పాలకులు లెక్కలేని నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పవర్‌ఫుల్ ఆయుధాన్ని మాకిచ్చారు. అదే ఓటు. మేం దాంతో చెబుతాం సమాధానం అని ఏపీలో జనం ఘోషిస్తున్నారంటున్న పోసాని అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

మీకు రచన అంటే ఇష్టమా పాత్ర పోషణ అంటే ఇష్టమా?

నాకు రైటరంటేనే ఇష్టం. ఎందుకంటే దానివల్లే బతికాను కదా. అదే నాకు అన్నం పెట్టింది. ఎంఏ తెలుగు అనే నా క్వాలిఫికేషనే నన్ను కాపాడింది. ఆ సర్టిఫికెట్ చూసే పరుచూరి గోపాలకృష్ణ నన్ను వాళ్ల అన్నయ్యకు పరిచయం చేసి ఈ కుర్రాడిని మనం పెట్టుకుందాం అని చెప్పి తీసుకున్నారు.

మీకు సినిమాల్లో మొదట్లో రాసే అవకాశం ఎలా ఇచ్చారు?

గుంటూరు బస్టాండు నుంచి కనిపించిన బస్సు పట్టుకుని మద్రాసుకు వెళ్లి పరుచూరి బ్రదర్స్‌ని కలిస్తే ఎంఏ తెలుగు కదా... కొటేషన్లు నీకు నచ్చినవి రాయి అన్నారు. వారు భోజనం చేసి వచ్చేలోపు పేకాట ముక్కలపై 70 కొటేషన్లు రాసి చూపించాను. బాగా రాశావే. నువ్వు రైటర్ అవుతావు. మాలాగా కష్టపడు అన్నారు. మేనేజర్ని పిలిచి నాలుగు జతల బట్టలు కొనిచ్చారు. బుద్ధిగా ఉండు. బుద్ధిగా పనిచేసుకోపో అన్నారు. అలా నాలుగున్నర ఏళ్లు వారివద్ద ఉన్నాను. 50 సినిమాలకు కథలు రాశాను. మౌనపోరాటం, కర్తవ్యం వంటి సినిమాలకు రాశాను. పీపుల్స్ ఎన్‌కౌంటర్ సినిమాకు కథ రాస్తే అవార్డు వచ్చింది.



మీరు రాసిన ఏదైనా మంచి డైలాగు చెబుతారా?

పీపుల్స్ ఎన్‌కౌంటర్ సినిమాలో పోలీసు అధికారి ఒక నక్సలైటు లీడర్ని పట్టుకుని ఇంటరాగేషన్ చేస్తాడు. నెలరోజులలోపు మీ జిల్లాలో నక్సలైట్లను ఏరిపారేస్తానంటాడు. అప్పుడా నక్సలైట్ అంటాడు. ఏరిపారేయడానికి బియ్యంలో రాళ్లు కాదు బిడ్డా నక్సలైట్లు అంటే, తూర్పునుంచి పడమరకు.. పడమరనుంచి తూర్పుకు మార్చింగ్ చేస్తూ ప్రపంచానికే పహారా కాస్తున్న వాడే నక్సలైట్ అంటాడు. ఇలాంటి పంచ్ డైలాగులు ఎన్ని రాశానో లెక్క లేదు.

పెద్ద కష్టం లేకుండానే మీరు వారి ఆదరణ సంపాదించారు కదా?

ఇద్దరు పెద్దమనుషుల మధ్య పెరిగాను నేను. ఏ చెడు అలవాటూ లేని మనుషుల మధ్య పెరిగాను. అదే వ్యసనాలు ఉన్నవారి వద్ద పని చేసి ఉంటే సాయంత్రం ఆరు గంటలకు మందు బాటిల్, ఏడు గంటలకు మరొకటి, పది గంటలకు మరొకటి ఇలా ఎంత గబ్బు పట్టాలో అంత గబ్బుపట్టిపోయి ఉండేవాడిని.

డ్రగ్స్ కేసులో సినిమావాళ్లు ఇంతమందా?

దేశంలో ప్రతి వ్యవస్థలోనూ లోపాలున్నాయి. విద్యా వ్యవస్థ పాడైపోయింది. అన్నిరకాలుగా ప్రజాస్వామ్యాన్ని రేప్ చేసి మరీ గెలుస్తున్నారు కాబట్టి రాజకీయ వ్యవస్థా పాడైపోయింది. అలాగే మీడియా, ప్రభుత్వోద్యోగులు, పోలీసు వ్యవస్థ అన్నింటిలోనూ లోపాలున్నాయి. అలాగే సినిమా వాళ్లలోనూ ఉన్నాయి కాదనను. కానీ సినిమా రంగాన్ని మాత్రమే ఎత్తి చూపవద్దు?

> ప్రజారాజ్యాన్ని చిరంజీవి కాంగ్రెస్‌లో కలిపేసినప్పుడే నాకు రాజకీయాలపై విరక్తి కలిగింది. ఇక జీవితంలో నేను ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పోటీ చేయను. కానీ ఎన్నికల్లో మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సపోర్టు చేస్తా, ఓటేస్తా అని నిర్ణయించుకున్నాను. గతంలో వైఎస్ జగన్ ఎంపీగా, విజయమ్మ ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు కడపలో క్యాంపెయిన్‌లో పాల్గొని ప్రచారం చేసివచ్చాను. నాకు వైఎస్సార్ అంటే ఇష్టం. జగన్‌లో ఆయన పోలికలున్నాయి. నడవడిక ఉంది.

పెద్ద పెద్ద నటులూ డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు కదా.. మానసిక సమస్యలా?

ప్రభుత్వ వైఫల్యం కాబట్టే భారీ మొత్తంలో డ్రగ్స్ దేశంలోకి వచ్చి పడుతున్నాయి. డ్రగ్స్ మాత్రమే ఎందుకు ఆపాలనుకుంటున్నారు? సిగరెట్లు, బీడీలు, గుట్కా ఇంకా ఎన్నో వ్యసనాలు ఉంటున్నాయి. వాటినెందుకు ఆపరు? ప్రజలను మత్తులో, వ్యసనాల్లో ముంచే ఎన్నో అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది కదా? డ్రగ్స్ ఎంత ప్రమాదకరమో సిగరెట్లు, మందు, గుట్కాలు, పాన్ పరాగ్‌లు కూడా అంతే ప్రమాదకరం. కానీ వాటిని మాత్రం షాపుల్లో పెట్టి అమ్మిస్తారు. మనుషులను గబ్బుపట్టించే అన్నింటినీ మీరు ఓపెన్‌లో పెడతారు. కానీ డ్రగ్స్ మాత్రం మీకు దెయ్యంలాగ కనబడుతోంది.

డ్రగ్స్ చాలా ప్రమాదకరం అని ప్రభుత్వం చర్యలు చేపట్టింది మరి?

ప్రభుత్వం యాడ్ ఇచ్చింది. నా పేరు మహేష్. పొగ తాగాను, కేన్సర్ వచ్చింది అంటూ జలదరింపజేసే బొమ్మలతో ప్రచారం చేస్తోంది. ప్రభుత్వం పొగాకును, చుట్టలను ఎందుకు నిషేధించలేదు? పొగ తాగుట హానికరం అని యాడ్ వేసి కూడా మళ్లీ షాపుల్లో అమ్మడానికి ఎందుకు అనుమతిస్తున్నారు? డ్రగ్స్‌ని నిషేధించినవారికి వాటిని నిషేధించడం చేతకాదా?

ఇంతకూ డ్రగ్స్ వాడుతున్న నటీనటులను మీరు సమర్థిస్తున్నారా?

నేనొకటే చెబుతాను. డ్రగ్స్ ప్రమాదకరమని ఇంతగా చెబుతున్నారే.. మందు తాగి ఎంతమంది చావడంలేదు? పొగ తాగి ఎంతమందికి కేన్సర్ రాలేదు? కాబట్టి డ్రగ్స్‌తో పాటు వీటిని కూడా బ్యాన్ చేసి తర్వాత మాట్లాడండి.

సినిమా పరిశ్రమను అధికారులు టార్గెట్ చేస్తున్నారని మీ అభిప్రాయమా?

సిట్ వాళ్లు ముందే చెప్పారు. మాకు కొన్ని ఆధారాలు దొరికాయి. వాటిని ధ్రువపర్చుకునేందుకు అనుమానం కలిగినవారిని పిలిచి విచారిస్తున్నాం. అంతే కానీ మేం నోటీసులిచ్చామంటే వారిని అరెస్టు చేస్తామని కాదు అని వారు చాలా స్పష్టంగా చెప్పారు.

నోటీసులకే ఈ పరిస్థితి వస్తే రేపు నిజంగా ఏదయినా జరిగితే?

డ్రగ్స్ వాడుతున్నానని నాకు నోటీసులిచ్చారనుకోండి. నేను కోర్టులకు వెళ్లను. మీమీద అనుమానం ఉంది. కెల్విన్ పక్కన మీరు ఉన్నట్లు ఫొటో ఉంది మీరు విచారణకు రావాలి అని సిట్ వాళ్లు చెబితే ఒకపారుడిగా నేను వెళ్లాలి. నేను ఈ దేశానికి జవాబుదారిని. నా ఇంటికి మాత్రమే కాదు. అకుల్ సబర్వాలే కాదు.. ఎవరు పిలిచినా సరే వస్తానని చెప్పి మరీ వెళ్లి వారి ముందు కూర్చుంటాను. ఇంకా అనుమానం ఉంటే లై డిటెక్టర్ పరీక్ష చేసుకోండి. దొరికితే జైల్లో పెట్టండి, నన్ను క్షమించవద్దు అంటాను. సమాజాన్ని క్లీన్‌గా పెట్టడానికి వాళ్లు ప్రయత్నిస్తున్నారు. అందుకే అర్ధరాత్రి వారు ఫోన్ చేసి రమ్మన్నా నేను వెళతాను.

చంద్రబాబు పాలనపై మీ అభిప్రాయం?

చంద్రబాబు పెద్ద లీడర్. అందులో సందేహమే లేదు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు తెలుగు దేశం పార్టీని అడ్వాంటేజీగా తీసుకుని చాలామంది చాలా తప్పులు చేస్తున్నారు. కులరాజకీయాలు చేస్తున్నారు. మంత్రి మా కమ్మోడు.. మేం ఏమయినా చేస్తాం అంటున్నారు. నేను దీన్ని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. 'ప్రజాస్వామ్యంలో మాకు పవర్‌ఫుల్ ఆయుధం ఇచ్చారు. అదే ఓటు. మేం దాంతో చెబుతాం సమాధానం'. ఇదే జనం అభిప్రాయం. ప్రభుత్వం ఏదైనా కావచ్చు. సీఎం సీటులో ఎవరయినా కూర్చోవచ్చు. కానీ ఇన్ని తప్పులు చేయకూడదు. భూ కబ్జాలు, లంచాలు, వనజాక్షిని కొట్టడం, జనాలను లారీతో గుద్ది చంపడం, భూమానాగిరెడ్డిపై ఎస్సీఎస్టీ కేసు పెట్టి మరీ, తనను పార్టీలోకి లాక్కోవడం... ఇవన్నీ వైరుధ్యాలంటామా, వైషమ్యాలంటామా, స్వప్రయోజనమంటామా? ఒక్కమాటలో చెప్పాలంటే ఏపీలో లెక్కలేని నేరాలకు పాలకులు పాల్పడుతున్నారు.

అమరావతి రాజధానిపై మీ అభిప్రాయం?

రాళ్లలో బియ్యముంటే పక్కన పెడతాం. బియ్యంలో రాళ్లుంటే పక్కన బెడతాం. కాని రాళ్లే బియ్యమైతే దేన్ని పక్కన బెట్టగలం. నేను నిజాలు ఇలాగే చెబుతాను కాబట్టి నన్ను కూడా రేపు ఆ పార్టీవాళ్లు వచ్చి కొట్టినా కొట్టవచ్చు. గతంలోనే నన్ను బెదిరించారు. అదిచేస్తాం ఇది చేస్తాం అన్నారు. ఎవరికీ భయపడేది లేదు.

(పోసాని కృష్ణమురళితో ఇంటర్వ్యూ పూర్తి పాఠం కింది లింకుల్లో చూడండి)
https://goo.gl/yhaRAA
https://goo.gl/qt6rGT

విలువలున్న నటుడు



తెలుగువారికే సొంతమైన అపురూప ప్రక్రియ పద్య నాటకం. లక్షలాదిమంది పద్య నాటకాభిమానులు ప్రాణప్రదంగా ఆరాధించే ఈ నాటక రంగంలో దుష్ట పాత్రధారులపట్ల సాధారణంగా ఆదరణ ఉండదు.

కానీ తొలి తరంలో ఎన్.వి.ఎల్. నరసింహాచార్యులు, మాధవపెద్ది వెంకటరామయ్య, ధూళిపాళ రాధాకృష్ణమూర్తి, వేమూరి గగ్గయ్య వంటి వారు దుష్టపాత్రలు ధరించి, పద్య నాటకాభిమానులకు ఆరాధ్యులుగా మిగిలారు. రెండో తరంలో వల్లూరి వెంకటరామయ్య చౌదరి, ఆచంట వెంకటరత్నం నాయుడు, మద్దాల రామారావు, బెజవాడ రాజారావు నాయుడు వంటి వారు కూడా వివిధ దుష్టపాత్రలు నటించి నాటకాభిమానుల గుండెలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. పౌరాణిక దుష్ట పాత్రలలో రంగస్థలంపై వారు ఎన్టీఆర్, ఎస్వీఆర్‌లను తలపించేవారు.

కేవలం నటనకు, నాటక ప్రదర్శనకే పరిమితం కాక, పద్య నాటకం వైభవం కోల్పోతున్న స్థితిలో, దాన్ని కాపాడటం కోసం తన ఆస్తులను హారతి కర్పూరంలా కరిగించిన కళారాధకుడు... జూలై 31వ తేదీన మరణించిన మద్దాల రామారావు. గొప్ప విగ్రహం, మంచి కంఠ స్వరం, నటనతో ఆయన ప్రేక్షకుల్ని ఐదు దశాబ్దాలపాటు ఉర్రూతలూగించిన గొప్ప పౌరాణిక నటుడు.

నాటక ప్రదర్శనను, నటనను ఆయన తపస్సుగా భావించేవారు. అభినయంపట్ల ఎంత శ్రద్ధ చూపేవారో, ఆహార్యంపట్ల కూడా అంత జాగ్రత్త తీసుకున్న అరుదైన నటుడు. కొన్ని ముఖ్యమైన సందర్భాలలో ఆయన ప్రముఖుల కాంబినేషన్‌లో దుర్యోధనుడు, కర్ణుడు వంటి పాత్రలు నటించేవారు. కానీ, తన సొంత సంస్థ ద్వారా వేలాది ప్రదర్శనలిచ్చిన 'తులసీ జలంధర'లో 'జలంధరుని'గా మద్దాల నటన నభూతో నభవిష్యతి. పీసపాటి, షణ్ముఖ ఆంజనేయరాజు, ఎ. వి. సుబ్బారావు, ఎ. వెంకటేశ్వరరావు, మీగడ రామలింగస్వామి వంటి వారితో కలసి నటించారు. వయసురీత్యా మా ఇద్దరి మధ్యా పాతికేళ్ల వ్యత్యాసమున్నా, 70వ దశకంలో నాలుగేళ్ల పాటు నాకు మంచి ఆత్మీయ మిత్రులుగా వ్యవహరించారు. పశ్చిమ గోదావరి జిల్లా వాణిజ్య కేంద్రం తాడేపల్లిగూడెంకు చెందిన ఆయనకు ఉత్తరాంధ్రలో, ఖరగ్‌పూర్, టాటానగర్, భిలాయ్, రాయ్‌పూర్, ఖుర్దారోడ్, రూర్కెలా, బిలాస్‌పూర్ వంటి ప్రవాసాంధ్ర ప్రాంతాలలో వేలాదిమంది నాటకాభిమానులు కళా నీరాజనాలర్పించేవారు. పాండవోద్యోగ విజయాలు నాటకంలోని రాయబారం సన్నివేశంలో ఆచంట వెంకటరత్నం నాయుడు (దుర్యోధన), మద్దాల రామారావు(కర్ణుడు)ల నటన చూసి తీరవలసిందే. తనకంటే పెద్దవాడైన ఆచంటపట్ల ప్రేమతో, తన ఇమేజ్‌ను కాదని, కర్ణుడిగా నటించిన సంస్కారవంతుడైన గొప్ప కళాకారుడు మద్దాల రామారావు. ఆయన మృతికి నివాళి.


– బి. వి. అప్పారావు, విశాఖపట్నం

ఫేస్‌బుక్ చాట్‌బోట్..

కిలికిలి భాష!

- సొంత భాష అభివృద్ధి చేసుకున్న చాట్‌బోట్‌లు
- ఉలిక్కిపడ్డ శాస్త్రవేత్తలు.. వెంటనే వ్యవస్థల నిలిపివేత
- ఎప్పటికైనా చిక్కులు తప్పవంటున్న నిపుణులు..
- ఏఐపై జుకర్‌బర్గ్‌కు అంతగా పరిజ్ఞానం లేదన్న 'టెస్లా' సీఈవో

అనుకున్నంత పని అయింది..
తృటిలో ప్రమాదం తప్పిపోయింది.. లేదంటేనా
మనమంతా రోబోల చెప్పు చేతల్లో మెలగాల్సిన పరిస్థితి వచ్చేసేదే!
మానవజాతికి ఇంత పెద్ద విపత్తు వచ్చిపడితే.. ఎక్కడా హడావుడే లేదే..!
ఏమా విపత్తు.. ఎలా వచ్చింది.. ఎలా తప్పిపోయింది..



మీరెప్పుడైనా వెబ్‌సైట్‌లోని చాట్‌బోట్‌తో మాట్లాడారా? నిన్న మొన్నటివరకూ ఇలాంటి చాట్‌బోట్‌లతో చెడ్డ చిక్కుండేది.. మనం ఒకటి అడిగితే.. అది తనకు తోచిన రీతిలో.. లేదంటే సాఫ్ట్‌వేర్‌లో ఏది ఉంటే అదే చెప్పేది. కానీ కృత్రిమ మేధస్సు పుణ్యమా అని ఈ మధ్య అవీ తెలివి మీరాయి. అచ్చం మనుషుల్లాగే సందర్భానికి తగ్గట్లు మాట్లాడుతున్నాయి. దాదాపు ఇలాంటి చాట్‌బోట్ ప్రోగ్రామే ఫేస్‌బుక్‌లోనూ ఉంది. ఫేస్‌బుక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రీసెర్చ్ పేరుతో నడుస్తున్న ప్రాజెక్టులో గత నెల ఓ విచిత్రమైన 'ప్రమాదం' చోటుచేసు కుంది. కొన్ని చాట్‌బోట్‌లు తమ కోసం ఓ భాషను సృష్టించుకు న్నాయి. పదాలు ఇంగ్లీషులోనే ఉన్నప్పటికీ.. ఆ వాక్యాలు చూస్తే మనకు ఏమీ అర్థం కాదు. కానీ మిగిలిన చాట్‌బోట్లు మాత్రం అదే భాషలో స్పందిస్తున్నాయి. తామిచ్చిన కోడ్‌లను ధిక్కరించాయని శాస్త్రవేత్తలు అర్థం చేసుకున్నారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడ్డ శాస్త్రవేత్తలు వెంటనే ఆ చాట్‌బోట్ తాలూకు సర్వర్‌ను ఆఫ్ చేశారు.

అంత సీరియస్ వ్యవహారమా..

చాలా సీరియస్. ఎందుకంటే ఆ చాట్‌బోట్లు ఏం మాట్లాడుతున్నాయో మనకు తెలియదు. తెలిసో తెలియకో మనుషులకు హాని కలిగించే చర్యలకు పాల్పడితే..? ఇంటర్నెట్‌కు అనుసంధానమైన వ్యవస్థలను తనకిష్టమొచ్చినట్లు నడిపించడం మొదలుపెడితే...? తలుచుకుంటునే ఒళ్లు గగుర్పొడిచే భవిష్యత్ అది. కాకపోతే ఫేస్‌బుక్ నిపుణులు సర్వర్‌ను సకాలంలో ఆపేశారు కాబట్టి ప్రస్తుతానికి సమస్య లేనట్లే.

చాట్‌బోట్‌కు అంత అవసరమేమొచ్చింది

చాట్‌బోట్‌లు సొంత భాష సృష్టించుకోవడం వెనుక మన అజాగ్రత్త కూడా కొంత ఉంది. ఈ చాట్‌బోట్లను సంప్రదింపులు (లావాదేవీలు జరపడం.. మీతో ఏదైనా వస్తువు/సేవ కొనేలా చేయడం) జరిపేందుకు ఉద్దేశించారు. వెబ్‌సైట్ల ద్వారా ఇతరులతో మాట్లాడిన ప్రతిసారి ఇవి కొన్ని కొత్త విషయాలను నేర్చుకుని తర్వాతి సంప్రదింపుల్లో వాటిని ఉపయోగిస్తుంటాయి. తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచు కోవడం ఈ చాట్‌బోట్ల ముఖ్య లక్ష్యం. ఈ వ్యవస్థను అభివృద్ధి చేసే క్రమంలో శాస్త్రవేత్తలు అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్నారు కానీ ఒక్క భాష విషయాన్ని మాత్రం మర్చిపోయారు. మొదట్లో ఈ చాట్‌బోట్లు మనకు అర్థమయ్యే ఇంగ్లిష్‌లోనే సంప్రదింపులు జరిపేవి. అయితే ఈ చర్యకు బహుమతుల్లాంటివేవీ లేకపోవడంతో చాట్‌బోట్లు ఈ భాషకు తాము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదన్న అంచనాకు వచ్చాయి. మంచి చాట్‌బోట్‌గా మారాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇంగ్లిష్ భాష ద్వారా వచ్చే లాభమేమీ లేదనుకున్నాయో ఏమో కానీ కొంత కాలం తర్వాత తమదైన భాషలో మాట్లాడటం మొదలుపెట్టాయి. 'మనుషులతో చక్కగా మాట్లాడ గలిగే బోట్లను సృష్టించాలనుకున్నాం గానీ.. ఇవి తమదైన భాషను అభివృద్ధి చేసుకోవడంతో సమస్య మొదలైంది. వాటి భాషను మన భాషలోకి అనువదించగలిగాం కానీ అది ఎంత వరకు సరైనదో మాకే తెలీదు. ఎందుకంటే చాట్‌బోట్ల భాష తెలిసిన వారెవరూ లేరు కదా' అని ప్రాజెక్టులో పనిచేస్తున్న మైక్ లూయిస్ పేర్కొన్నారు. **– సాక్షి నాలెడ్జ్ సెంటర్**

భవిష్యత్తు పరిస్థితి ఏంటి..

ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్ వంటి పేర్లు తరచూ వినిపిస్తున్న ఈ తరుణంలో ఫేస్‌బుక్ చాట్‌బోట్ల వ్యవహారం కాస్త ఇబ్బంది పెట్టేదే. కృత్రిమ మేధస్సు గురించి మనకు తెలిసింది తక్కువేనని ఈ రంగంపై మరింత లోతైన చర్చ జరగాల్సిన అవసరముందనే విషయాన్ని ఈ ఘటన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. శాస్త్ర ప్రపంచం కూడా కృత్రిమ మేధస్సుపై రెండుగా చీలిపోయింది. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్స్, టెస్లా సీఈవో ఎలన్ మస్క్ వంటి వారు ఈ టెక్నాలజీతో ఎప్పటికైనా చిక్కులు తప్పవని హెచ్చరిస్తున్నారు. అయితే ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌తో పాటు మరికొందరు కృత్రిమ మేధస్సుకు మద్దతుగా నిలుస్తున్నారు. 'కృత్రిమ మేధస్సుపై జుకర్‌బర్గ్‌తో మాట్లాడాను. దీనిపై అతడికి ఉన్నది చాలా పరిమితమైన జ్ఞానమని నాకు అర్థమైంది' కొన్ని రోజుల కిందటే ఎలన్ మస్క్ ట్వీటర్‌లో వ్యాఖ్యానించారు. ఆయన విమర్శించాక కొద్ది రోజులకే ఇలా జరగడం గమనార్హం.

నంద్యాలకు రేపు

వైఎస్ జగన్ రాక

స్థానిక ఎస్పీజీ మైదానంలో బహిరంగ సభ



నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల ఉప ఎన్నికల ప్రచారానికి ఈ నెల 3వ తేదీన శ్రీకారం చుడుతున్నారు. స్థానిక ఎస్పీజీ మైదానంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు భారీ బహిరంగ సభను ఉద్దేశించి జగన్ ప్రసంగిస్తారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ప్రచారం హోరెత్తనుంది. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నేతలు పకడ్బందీగా ఒక వ్యూహం ప్రకారం సాగిస్తున్న ప్రచారానికి తోడు జగన్ రాక ఇటు పార్టీ శ్రేణుల్లోనూ ఊపును పెంచుతుందని భావిస్తున్నారు. నంద్యాలకు జగన్ ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తున్న స్థానిక ప్రజల్లో సైతం ఆయన పర్యటన ఉత్సాహాన్ని నింపనుంది. ఇంత కాలంగా నంద్యాలను మాట మాత్రంగానైనా పట్టించుకోని అధికార పక్షం సరిగ్గా ఎన్నికల ముంగిట అభివృద్ధి వాగ్దానాలు చేస్తూ ముందుకు వస్తోంది. టీడీపీ మంత్రులు, నేతలు ప్రచారంలో రకరకాల ప్రలోభాలు, ఎత్తుగడలు, బెదిరింపులు, లెక్కలేనన్ని వక్రమార్గాలు అనుసరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో సాగుతున్న అవినీతి, అక్రమాలు, దుర్వినియోగాన్ని టీడీపీ నేతలు పూర్తిగా మరుగు పరచి ప్రచారంలో కొత్త జిత్తులు వేస్తున్నారు. ఈ అంశాలన్నింటికీ జగన్ దీటైన జవాబివ్వగలరని విశ్లేషకులు విశ్వసిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా వ్యతిరేక , నిరంకుశ పాలనను జగన్ తూర్పారబట్టడంతో పాటుగా ఉప ఎన్నికల ఫలితం ప్రాధాన్యతను ప్రజలకు వివరించి ప్రజా తీర్పును కోరతారని భావిస్తున్నారు. జగన్ 3వ తేదీన ఉదయం హైదరాబాద్‌లో బయలు దేరి నేరుగా నంద్యాల ఎస్పీజీ మైదానంలోని సభా వేదిక వద్దకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు సభా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

ప్రజాస్వామ్య విలువలకు పాతర

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి
- దుర్మార్గపు పాలనపై పగ తీర్చుకొనే అవకాశం ప్రజలకు వచ్చింది
- శిల్పామోహన్‌రెడ్డి విజయం ఖాయం



నంద్యాల: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా అధికార పార్టీ అశాంతిని రెచ్చగొట్టి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తోందని తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. ఆయన మంగళవారం కర్నూలు జిల్లా నంద్యాలలో మీడియాతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికలో ప్రజలు వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించబోతున్నారని చెప్పారు. టీడీపీకి ప్రజల మద్దతు లేదని తెలిసి చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి వారికి మంత్రి పదవులు ఇచ్చి, ప్రస్తుతం ఆ మంత్రులతోనే ఇష్టమొచ్చినట్లు మాట్లాడిస్తూ నీచ రాజకీయాలకు ఒడిగట్టారన్నారు. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను కూడా టీడీపీ కార్యకర్తల్లా వాడుకుంటోందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై పోలీసులను ఉసిగొలిపి, తనిఖీలు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. ఇప్పటివరకు ఒక్క టీడీపీ నాయకుడి ఇంటిపైనా పోలీసులు దాడులు చేయలేదని, వారి ఇళ్లపై దాడులు చేస్తే కోట్ల రూపాయల డబ్బు దొరుకుతుందని చెప్పారు.

కార్పొరేటర్ స్థాయిలో మంత్రులు

మంత్రులంతా సచివాలయాన్ని, అమరావతిని వదిలేసి నంద్యాలలో తిష్టవేసి కార్పొరేటర్ స్థాయికి దిగజారారని భూమన విమర్శించారు. ఏ ఊరికి వెళితే ఆ ఊరి మాటలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని, వారి మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సీఎం తన మూడేళ్ల పాలనలో నంద్యాలను ఏమాత్రమూ పట్టించుకోలేదని, ఇప్పుడు మాత్రం ఉప ఎన్నిక కారణంగా రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రజలను మాయ చేస్తున్నారని విమర్శించారు. 600 తప్పుడు వాగ్దానాలు ఇచ్చి, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుపై తమ పగ తీర్చుకునే అవకాశం నంద్యాల ప్రజలకు వచ్చిందని చెప్పారు. టీడీపీ ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజలు తిప్పికొడతారని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నంద్యాల ఉప పోరు

బాబు ఎన్నికల గిమ్మిక్కులు నమ్మొద్దు

ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి ● రోడ్ల విస్తరణతో చిరువ్యాపారులు రోడ్డున పడ్డారు

నంద్యాల రూరల్: చంద్రబాబు ఎన్నికల గిమ్మిక్కులను నంద్యాల ప్రజలు నమ్మవద్దని విజయనగరం ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. ఆయన మంగళవారం కర్నూలు జిల్లా నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఆర్యవైశ్యులంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్యవైశ్యులపై సవతి ప్రేమ కనబరుస్తున్న టీడీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ మూడేళ్లలో గుర్తుకు రాని నంద్యాల అభివృద్ధి ఎన్నికల ముందు గుర్తుకు వచ్చిందా? అని నిలదీశారు. రోడ్ల విస్తరణతో వేలాది మంది చిరువ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో అరాచకాలు, అక్రమాలు పెరిగిపోయాయని... వర్తకులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల వారు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఆర్యవైశ్యులపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని కోరినా కనీస స్పందన లేదని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శిల్పామోహన్‌రెడ్డి విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని, నంద్యాల ఆర్యవైశ్యులు ఐక్యంగా వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఆర్యవైశ్య ప్రముఖులు నెరవాటి సత్యనారాయణ, గంగిశెట్టి శ్రీధర్, శ్యాంసుందర్‌గుప్త, సుబ్బలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, చిత్రంలో వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు

టీడీపీకి శిల్పా చక్రపాణిరెడ్డి గుడ్‌బై!

- అవమానించిన పార్టీలో ఉండొద్దన్న అనుచరులు
- ఎక్కడ గౌరవం ఉంటుందో అక్కడే ఉందామని వెల్లడి
- నేడు భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి అధికార తెలుగుదేశం పార్టీని వీడుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. కర్నూలు జిల్లా నంద్యాలలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సమావేశంలో ఆయన ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. సమావేశంలో శిల్పా చక్రపాణిరెడ్డి అనుచరులు టీడీపీలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అవమానాలను ఏకరువు పెట్టారు. గౌరవం లేని చోట ఉండాల్సిన అవసరం లేదన్నారు. సీఎం చంద్రబాబుకు వాడుకుని వదిలేయడం మొదటి నుంచీ అలవాటేనని, మన విషయంలోనూ అదే జరిగిందని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా.. నంద్యాల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం మరో సారి తన తమ్ముడు చక్రపాణిరెడ్డిని కలిశారు. ఉప ఎన్నికలో తనకు సహకరించాలని కోరారు. మరోవైపు చక్రపాణిరెడ్డిని బుజ్జగించేందుకు టీడీపీ నేతలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. భూమా నాగిరెడ్డి సన్నిహితుడు ఎ.వి.సుబ్బారెడ్డి కూడా శిల్పా చక్రపాణిరెడ్డితో భేటీ అయ్యారు. కార్యకర్తల అభిప్రాయాల మేరకు శిల్పా చక్రపాణిరెడ్డి తన భవిష్యత్ నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



మంగళవారం శిల్పా చక్రపాణిరెడ్డితో భేటీ అయిన వైఎస్సార్‌సీపీ నేత శిల్పామోహన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి

టీడీపీలో అన్నీ అవమానాలే...

శ్రీశైలం నియోజకవర్గ కార్యకర్తలు, అనుచరులతో శిల్పా చక్రపాణిరెడ్డి నంద్యాలలోని తన నివాసంలో మంగళవారం సమావేశమయ్యారు. బండి ఆత్మకూరు, మహానంది, వెలుగోడు, ఆత్మకూరు, శ్రీశైలం మండలాల కార్యకర్తల అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మారుదామని కార్యకర్తలంతా మూకుమ్మడిగా ఒకేమాట తేల్చిచెప్పారు. టీడీపీ కోసం మనమంతా కష్టపడుతుంటే, నిన్నా మొన్న వచ్చిన నేతలకు పెద్దపీట వేశారని మండిపడ్డారు. టీడీపీలో అవమానాలే ఎదురయ్యాయని, ఎక్కడ గౌరవం ఉంటుందో అక్కడే ఉందామని అన్నారు. శిల్పా చక్రపాణిరెడ్డితో కలిసి నడుస్తామని వారంతా స్పష్టం చేశారు.

వేడెక్కిన నంద్యాల రాజకీయం

టీడీపీని వీడాలని ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి నిర్ణయించుకోవడంతో ఆ పార్టీలో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు ఆయన ఇంటికి క్యూ కట్టారు. పార్టీ నుంచి బయటకు వెళ్లొదంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయితే, కార్యకర్తల అభిప్రాయం మేరకు టీడీపీని వీడి, వైఎస్సార్‌సీపీలో చేరాలని శిల్పా చక్రపాణిరెడ్డి నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీంతో నంద్యాల రాజకీయం మరింత వేడెక్కింది.

ఆ మంత్రి నేనే..

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు): 'ఓ మంత్రి రాత్రి పది గంటల తర్వాత కనపడటం లేదని.. సెక్యూరిటీ లేకుండా వెళ్తున్నారని సాక్షి పేపర్‌లో రాశారు. ఆ మంత్రిని నేనే' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం సాయంత్రం నంద్యాల పట్టణం నూనెపల్లె బ్రిడ్జి సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో కాటన్ మిల్, రైస్‌మిల్, దాల్‌మిల్స్ అసోసియేషన్ నాయకులతో మంత్రి సోమిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాక్షి పత్రికలో మంగళవారం వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. 'రాత్రి అక్రమ లావాదేవీలు జరిపేందుకు సెక్యూరిటీని వదిలేసి పోతున్నామా?.. 12 గంటల తర్వాత సెక్యూరిటీ ఎందుకు? సాక్షి విలేకరికి చెప్పి పోవాలా..' అంటూ అసహనం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్



సాక్షి, అమరావతి: నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం అబ్దుల్ ఖాదర్ పేరును ఖరారు చేసినట్లు పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 4 లేదా 5వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఖాదర్ 1994 నుంచి ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనేవారని, ప్రస్తుతం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారని తెలిపారు. అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నిక రానున్న సార్వత్రిక ఎన్నికలకు రిహార్సల్స్‌గా పేర్కొన్నారు.

మంత్రా మజాకా!

- ఫరూక్ అభినందన సభకు అఖిలప్రియ డుమ్మా
- ఉపముఖ్యమంత్రి ప్రెస్‌మీట్‌కూ గైర్హాజరు
- అఖిల ప్రియ వైఖరిపై విస్తుపోతున్న అధికార పార్టీ నేతలు

నంద్యాల: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ వ్యవహార శైలి అధికార పార్టీలో హాట్‌టాపిక్‌గా మారుతోంది. మంగళవారం జరిగిన రెండు పరిణామాల నేపథ్యంలో ఆమె వైఖరిపై టీడీపీ నేతలు మండిపడుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ పదవి వచ్చిన సందర్భంగా ఫరూక్, ఆయన అభిమానులు నంద్యాల మండలం మునగాల గ్రామంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు మంత్రి అఖిలప్రియను ఆహ్వానించారు. ఆమెకు స్వాగతం పలుకుతూ బ్యానర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే, ఆమె ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. నంద్యాలలో ఉండి కూడా రాకపోవడంపై ఫరూక్ అనుచరులు మండిపడుతున్నట్లు సమాచారం. మరోవైపు పార్టీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి కె.ఇ.కృష్ణమూర్తి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయనతోపాటే మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రెస్‌మీట్‌కు హాజరుకావాలని మంత్రి అఖిలప్రియకు సమాచారం పంపారు. అయితే ఆమె మాత్రం హాజరు కాలేనని వర్తమానం పంపించారు. దీంతో అవాక్కవడం డిప్యూటీ సీఎం వంతైంది. మంత్రా మజాకానా అంటూ అధికార పార్టీలో చర్చ జరుగుతోంది.

టీడీపీకి ఓట్లు వేయకుంటే పించన్లు కట్

వృద్ధులను బెదిరించిన ఎమ్మెల్యే బోండా



నంద్యాల: టీడీపీకి ఓట్లు వేయకుంటే పించన్లు రావు... మీరే తెలుసుకోండి.. ఇబ్బంది పడొద్దంటూ టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు వృద్ధులను బెదిరించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలను అనుభవించే వాళ్ల ఓట్లు ఎందుకు వేయరని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా నంద్యాలలోని 24వ వార్డు కౌన్సిలర్ దిలీప్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ వసతిగృహంలో వృద్ధుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉపఎన్నిక ప్రచారం కోసం వచ్చిన ఎమ్మెల్యే బోండా ఉమా ముఖ్యఅతిథిగా హాజరై భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీకి కచ్చితంగా ఓటు వేసి గెలిపించాలని, లేదంటే తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం వసతిగృహంలో పనిచేసే ఉద్యోగులను ఓట్లు అడిగి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు.

ఖరీఫ్‌కు కష్టమేనా!

▶ మొదటి పేజీ తరువాయి

స్తంభించిపోయిన రుతుపవన మేఘాలకు పశ్చిమ దిక్కు నుంచి వీచే గాలుల మద్దతు లభిస్తున్నా బంగాళాఖాతం నుంచి తేమను మోసుకొచ్చే వ్యవస్థలు లేక వెనక్కు మళ్లలేకపోతున్నాయి. అయితే స్థానిక పరిస్థితులను బట్టి అక్కడక్కడా చెదురుమదురుగా జల్లులు పడేందుకు అవకాశం ఉంది''అని మహేశ్ వివరించారు. గతేడాది ఎల్‌నినో పరిస్థితి కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది అలాంటి ఇబ్బందులేవీ ఉండవని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. జూన్ 1న కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు ఆ తర్వాత కొంత స్తబ్దుగా ఉండిపోయాయి. ఆ తర్వాత కాస్త ఆలస్యంగా దేశమంతా విస్తరించాయి. తొలి నెలలో చెప్పుకోదగ్గ వర్షాలే కురిశాయి. జూలై రెండో వారం వరకూ ఈ అనుకూల వాతావరణం కొనసాగినా.. ఆ తర్వాత అనూహ్యంగా పరిస్థితులు మారిపోయాయి. 15 రోజుల నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో విత్తునాటిన రైతులు, నాట్లకు సిద్ధమైన రైతులు ఆందోళనలో మునిగిపోయారు.

వానాకాలంలోనూ భానుడి భగభగలు

- రాష్ట్రవ్యాప్తంగా సుర్రుమనిపిస్తున్న సూరీడు
- పెరిగిన ఉక్కపోతతో జనానికి ఇక్కట్లు
- ఎండలతో పంటలకు నష్టమంటున్న రైతులు
- మరో పది రోజులు వర్షాలు ఉండవన్న శాస్త్రవేత్తలు

సాక్షి, అమరావతి: వర్షాలు కురవాల్సిన కాలంలో సూర్యుడు భగభగ మంటున్నాడు. రాష్ట్ర మంతా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. కోస్తా జిల్లాల్లో రాత్రిపూట కూడా ఉక్కపోత వేధిస్తోంది. సోమ, మంగళవారాల్లో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమ, మంగళవారాల్లో గుంటూరు జిల్లా బాపట్ల, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో సాధారణం కంటే 5 డిగ్రీలకుపైగా అధిక ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మంగళవారం విశాఖపట్నంలో సాధారణం కంటే 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మంగళవారం అనంతపురం, విజయవాడ, తుని, గుంటూరు జిల్లా జంగమహేశ్వరపురం, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం, కృష్ణా జిల్లా కళింగపట్నం, తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో సాధారణం కంటే 3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. రాయలసీమ కంటే కోస్తా జిల్లాల్లోనే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాభావానికి తోడు ఈ ఎండలు పంటలను మరింత దెబ్బతీస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంవల్ల భూమిలో తేమ లేకుండా పోతుందని, దీంతో త్వరగా మొక్కలు వాడుముఖం పడతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూతాపంవల్ల పంటలకు నీరు అందించాల్సిన అవసరం పెరుగుతుందని, దీని వల్ల భూగర్భ జలమట్టం తగ్గుతుందని వారు చెప్పారు.

ఇంకా పెరుగుతాయి..

నైరుతీ రుతుపవనాలు బలహీనపడటం, వర్షాలు లేకపోవడంవల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. 'మేఘాలు లేకపోతే సూర్య కిరణాలు నేరుగా భూమిమీద పడతాయి. దీంతో భూతాపం పెరుగుతుంది. ప్రస్తుతం రుతుపవన ద్రోణి ఉత్తర దిశగా పయనించి హిమాలయాల వైపు వెళ్లింది. దక్షిణం వైపు వస్తేనే తిరిగి మనకు వర్షాలు వస్తాయి. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం మనకు మరో వారం పది రోజుల పాటు వర్షాలు పడే అవకాశం లేదు. ఈ కాలంలో ఉష్ణోగ్రతలు ఇంకా పెరుగుతాయి. ఈ వారంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటిపోతాయి. కోస్తా జిల్లాల్లో గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడి పెరగడంవల్ల ఉక్కపోత పెరుగుతోంది. సాధారణంగా గాలిలో తేమ ఉండటం మంచిదే. అయితే వేడి పెరిగిన సమయంలో ఈ తేమ శాతం ఎక్కువగా ఉంటే ఉక్కపోతతో అసౌకర్యం ఏర్పడుతుంది' అని వైకే రెడ్డి వివరించారు.



మంగళవారం ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్టం	సాధారణం కంటే ఎంత ఎక్కువ
బాపట్ల	39	5
మచిలీపట్నం	38	5
విశాఖపట్నం	37	4
జంగమహేశ్వరపురం	37	3
తుని	36	3
విజయవాడ	36	3
అనంతపురం	36	3
కాకినాడ	35	3
కళింగపట్నం	35	3
నర్సాపురం	35	3

ఎంసెట్ కౌన్సెలింగ్ నుంచి

తప్పుకున్న 10 కాలేజీలు

కొన్ని బ్రాంచీలనే వదులుకున్న మరికొన్ని కళాశాలలు

సాక్షి, అమరావతి: ఎంసెట్ కౌన్సెలింగ్ నుంచి పది కాలేజీలను అధికారులు కౌన్సెలింగ్ నుంచి తప్పించారు. తమ కాలేజీలకు విద్యార్థులను కేటాయించొద్దని ఆయా యాజమాన్యాలు కోరడంతో అధికారులు ఆ కాలేజీలను కౌన్సెలింగ్ నుంచి తప్పించారు. కొన్ని కాలేజీలు అన్ని బ్రాంచిలనూ వదులుకోగా, మరికొన్ని కాలేజీలు కొన్ని బ్రాంచిలనే వదులుకున్నాయి. అన్ని బ్రాంచిల్లో ప్రవేశాలు వద్దని తప్పుకొన్న కాలేజీల్లో చిత్తూరు జిల్లా పుత్తూరులోని కేకేసీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, తిరుపతి రూరల్‌లోని వైష్ణవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తూర్పుగోదావరి జిల్లా ఎటపాకలోని డా.పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీ, అనంతపురంలోని ఇంటెల్ ఇంజనీరింగ్ కాలేజీ, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని విజ్ఞాన్ భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలోని శ్రీశివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తూర్పుగోదావరి జిల్లా మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఉన్నాయి. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సివిల్, ఈఈఈ, మెకానికల్, నెల్లూరు జిల్లా విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కడపలోని శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్‌టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలు ఈఈఈ బ్రాంచిల్లో ప్రవేశాలను వదులుకుంటున్నట్లు ఎంసెట్ అడ్మిషన్ల కమిటీ పేర్కొంది. రెండు విడతల కౌన్సెలింగ్‌లో 10 మంది లోపు విద్యార్థులు కేటాయింపు అయిన కాలేజీలు అనేకం ఉన్నాయి. ఈ కాలేజీల్లో అన్ని బ్రాంచిల్లో కలిపి 14,056 సీట్లుంటే 1,055 మంది కేటాయింపే జరిగింది. ఆయా కాలేజీల సమాచారాన్ని ఏపీ ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్లో పొందుపరిచారు.

లష్కరే టాప్ కమాండర్ హతం

- ఎన్‌కౌంటర్‌లో దుజానాతోపాటు మరో ఉగ్రవాది దార్ మృతి
- ఇంట్లో నక్కిన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టిన భద్రతాబలగాలు
- కశ్మీర్ లోయలో అప్రమత్తత
- ఇంటర్నెట్ సేవలు బంద్



భద్రతాబలగాల దాడిలో నేలమట్టమైన ఉగ్రవాదులు దాక్కొన్న ఇల్లు. (ఇన్‌సెట్లో) దుజానా

శ్రీనగర్: ఉగ్రపోరులో భారత భద్రతాదళాలు కీలక ముందడుగు వేశాయి. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజానాను పక్కా ప్రణాళికతో మట్టుబెట్టాయి. ఉగ్ర సంస్థల కీలక నేతలను నిర్మూలించే ఆపరేషన్‌లో మరో విజయం సాధించాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ పక్కా సమాచారం, సమర్థ ప్రణాళికతో సాగిన 'ఆపరేషన్ దుజానా'ను విజయవంతంగా, తమవైపు నుంచి ఎలాంటి నష్టం లేకుండా ముగించగలిగాయి. జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్ జాతీయుడైన దుజానాను, అతని స్థానిక అనుచరుడు అరిఫ్ నబీ దార్ భద్రతా బలగాలు హతమార్చాయి. ఒక ఇంట్లో దుజానా, దార్‌లు దాక్కొన్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు సోమవారం అర్ధరాత్రి నుంచి పుల్వామాలో హక్రిపోరా ప్రాంతాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. చివరకు మంగళవారం తెల్లవారుజామున భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పుల్లో దుజానా, దార్‌లు హతమయ్యారని, వారి మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నామని ఆర్మీ అధికారులు తెలిపారు. గతేడాది హిజ్బుల్ టాప్ కమాండర్ బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ అనంతరం తలెత్తిన హింస నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో అత్యంత అప్రమత్తత ప్రకటించారు. కశ్మీర్‌లో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. చాలాచోట్ల బ్రాడ్‌బాండ్ సేవల్ని నిలిపేశారు. కశ్మీర్ లోయలో బడులు, కళాశాలలు, వర్సిటీల్ని మూసివేశారు.

పక్కాగా.. ఆపరేషన్ దుజానా: సోమవారం అర్ధరాత్రి.. పుల్వామాలోని హక్రిపోరాలోని ఒక ఇంట్లో లష్కరే కశ్మీర్ చీఫ్ అబు దుజానా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే పోలీసులు, సైన్యం, సీఆర్‌పీఎఫ్ బలగాలు అప్రమత్తమయ్యాయి. హుటాహుటిన స్పెషల్ ఆపరేషన్స్ (ఎస్ఓజీ) బృందాల్ని పుల్వామాకు 13 కి.మీ. దూరంలో ఉన్న హక్రిపురాకు తరలించారు. డీఐజీ స్వయం ప్రకాశ్ పాణి సంఘటన ప్రాంతానికి చేరుకుని 'ఆపరేషన్ దుజానా'ను పర్యవేక్షించారు. ఎస్ఓజీతో పాటు పుల్వామా జిల్లా పోలీసులు, ఆర్మీకి చెందిన విక్టర్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లు ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఇంతలో స్థానికులు భద్రతా బలగాల్ని ప్రతిఘటిస్తూ వాళ్లపై రాళ్లదాడికి పాల్పడ్డారు. మరోవైపు దుజానా, దార్‌లను మట్టుబెట్టేందుకు వారు ఉన్న ఇంట్లోని ప్రజల్ని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు భద్రతా బలగాలు ఆపరేషన్ మొదలుపెట్టాయి. భద్రతా బలగాల ఎదురుకాల్పుల్లో దుజానా, భట్ మరణించారు. ఉగ్రవాదులు మరణించారని తెలియగానే.. జనాల్లోంచి కొందరు మిలిటెంట్లు పోలీసులపైకి కాల్పులు ప్రారంభించారని పోలీసులు తెలిపారు. వంద మందికిపైగా ఆందోళనకారులు భద్రతా బలగాలపైకి రాళ్లు రువ్వడంతో.. వారిపైకి టియర్ గ్యాస్ షెల్స్, పెల్లెట్లు ప్రయోగించడంతో పాటు.. రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక పౌరుడు మరణించాడు.

నియామకాల్లో కీలకం.. దాడుల్లో చురుగ్గా!
అబు దుజానా(26) దక్షిణ కశ్మీర్‌లో లష్కరే తోయిబా చీఫ్ కమాండర్.. లష్కరేలో ఏ+++ హోదా ఉగ్రవాది. అతను పాకిస్తానీ అన్న విషయం తప్ప మిగతా వివరాలు తెలియదు. పుల్వామా గ్రామీణ ప్రాంతాల నుంచే ఉగ్రవాద కార్యకలాపాల్ని కొనసాగించే దుజానా తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. 2013లో అబు ఖాసీం మరణించాక.. దుజానాను లష్కరే టాప్ కమాండర్‌గా నియమించారు. ఆరేళ్ల క్రితం కశ్మీర్‌లోకి ప్రవేశించిన దుజానా మొదట్లో ఉత్తర కశ్మీర్‌లో చురుగ్గా పనిచేశాడు. లష్కరే నాయకత్వంతో విభేదాలతో జకీర్ మూసా గ్రూపులో చేరినట్లు వార్తలు వినిపించాయి. దాదాపు 12 సార్లు పోలీసుల వల నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. దక్షిణ కశ్మీర్‌లో భద్రతా బలగాలు, రాజకీయ కార్యకర్తలపై అనేక దాడుల్లో చురుగ్గా వ్యవహరించాడు. స్థానిక యువతను లష్కరే తోయిబాలో చేర్పించడంలో అతను చురుగ్గా వ్యవహరించేవాడని, రెయాజ్ అహ్మద్, అరిఫ్ నబీ దార్, అయూబ్ లోన్‌ల్ని లష్కరేలో చేర్పించింది అతనే. ఇక పుల్వామా జిల్లాకు చెందిన ఉగ్రవాది దార్.. అరిహాల్, రత్నిపోరా, నెహమాల్లో జమ్మూ కశ్మీర్ బ్యాంక్ బ్రాంచులు, ఎల్లాక్వాయ్ దేహతి బ్యాంక్ దోపిడీల్లో చురుగ్గా వ్యవహరించాడు.

భార్యను చూసేందుకొచ్చి: భార్యను, గర్ల్‌ఫ్రెండ్‌ను చూసేందుకు ఒక గ్రామానికి తరచూ రావడమే దుజానాను పట్టిచ్చింది. మూడు నెలల వ్యవధిలో పుల్వామా జిల్లాలోని ఒక గ్రామానికి చాలాసార్లు రావడంపై నిఘా వర్గాలు దృష్టిపెట్టాయి. ఖుర్షీద్ అనే వ్యక్తి ఇంటికి వస్తున్నాడని, అతని కుమార్తెతో దుజానాకు వివాహమైనట్లు నిఘా వర్గాలు నిర్ధారించుకున్నాయి.



బుర్హాన్ వనీ చనిపోయిన 2016లో అత్యధికంగా 88 మంది స్థానిక యువకులు ఉగ్రబాట పట్టారు.

ఆపరేషన్ 'ఏరివేత'!

హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌తో గతేడాది నుంచి అశాంతితో కశ్మీర్ రగులుతూనే ఉంది. దీనికి ముగింపు పలకాలనే ఉద్దేశంతో కేంద్రం 'హిట్‌లిస్ట్'ను రూపొందించి మరీ ఉగ్రవాదుల ఏరివేతను కొనసాగిస్తోంది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మే నెలాఖరులో మాట్లాడుతూ, కశ్మీర్‌లో పరిస్థితిని సాధారణ స్థితికి తెస్తామని, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అంతమొందిస్తామన్నారు. పక్కాగా వ్యూహం సిద్ధం చేశాకే హోంమంత్రి ఈ ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు మిలిటెంట్ల జాబితాను రూపొందించగా.. 253 మంది క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు లెక్కతేల్చారు. వీరిలో విదేశీయులు, స్థానికులు ఎవరో గుర్తించారు.

టార్గెట్... లీడర్
ఉగ్రవాదులకు నాయకత్వం వహిస్తున్న 12 మందితో జాబితాను రూపొందించి... జూన్ ఆరంభంలో విడుదల చేశారు. రెండునెలల్లో ఈ జాబితాలోని ముగ్గుర్ని మట్టుబెట్టారు. జూన్ 16న లష్కరే తోయిబా కమాండర్ జునైద్ మట్టూ హతమయ్యాడు. మట్టూ ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా అదేరోజు ఉగ్రవాదులు అనంత్‌నాగ్ జిల్లాలో ఎస్ఐ సహా ఆరుగురు పోలీసుల్ని పొట్టన పెట్టుకున్నారు. ఈ దాడికి సూత్రధారిగా తేలిన లష్కరే కమాండర్ బషీర్ వనీని జులై 1న హతమార్చారు. ఇప్పుడు దుజానా వంతు.. గత జనవరి నుంచి దాదాపు 110 మంది ఉగ్రవాదుల్ని భద్రతాదళాలు మట్టుబెట్టాయి. జూన్ నుంచి భారత సైన్యం వ్యూహం మార్చింది. అగ్రనాయకత్వంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఎ++ కేటగిరిలో ఉన్న ఉగ్రవాద నాయకుల్ని టార్గెట్ చేసింది. వీరి కదలికల్ని ఇన్‌ఫార్మర్లు, నిఘావర్గాల ద్వారా సేకరించి ఉచ్చు బిగిస్తోంది. అగ్రనాయకుల్ని ఏరివేస్తే... మిగిలిన తీవ్రవాదులు చెల్లాచెదురవడం లేక లొంగిపోతారనేది భారత సైన్యం వ్యూహం. మిలిటెంట్లకు స్థానిక ప్రజల మద్దతు ఉండటంతో భద్రతాబలగాలకు తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నాయి. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వాటిలో ఫలానా చోట ఎన్‌కౌంటర్ జరుగుతోందనే సమాచారం క్షణాల్లో యువతలో పాకిపోతోంది. దాంతో చుట్టుపక్కల ప్రజలు అక్కడికి చేరుకొని భద్రతాబలగాలపై రాళ్ల దాడులు చేస్తున్నారు. ఇలాంటి ఘటనల కారణంగానే కాల్పుల్లో మరణించే సాధారణ పౌరుల సంఖ్య అధికంగా ఉంటోంది. అందుకే 300 దాకా వాట్సాప్ గ్రూపులపై స్థానిక పోలీసులు నిఘా పెట్టారు.

-సాక్షి నాలెడ్జ్ సెంటర్

మిగిలింది వీరే..

1. రియాజ్ నైకూ అలియాస్ జుబైర్
అధునాతన సాంకేతికతపై పట్టున్నవాడు. కశ్మీర్ లౌకిక రాజ్యంగా ఉండాలని కాంక్షించే 29 ఏళ్ల నైకూపై 12 లక్షల రివార్డు ఉంది. ఈ ఏడాది జూన్ ఆరంభంలో హిజుబుల్ ముజాహిదీన్ కశ్మీర్ చీఫ్‌గా నియమితుడయ్యాడు.

2. జకీర్ మూసా
హురియత్ లౌకికవాద వైఖరితో విభేదించి... వారి తలలు తీయాలని పిలుపిచ్చాడు. హిజుబుల్ అగ్రనాయకత్వంతో విభేదించి ఆ సంస్థకు దూరమయ్యాడు. కశ్మీర్ లోయలో ఇస్లాం రాజ్యాన్ని స్థాపించాలనేది ఇతని వాదన.

3. జీనత్ ఉల్ ఇస్లామ్
లష్కరేలో ఎ కేటగిరి ఉగ్రవాది

4. అబు హమస్ : జైషే మహమ్మద్ డివిజినల్ కమాండర్. పాక్‌కు చెందిన ఇతను 2016 నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు.

5. సద్దాం పద్దార్ అలియాస్ జైద్: హిజ్బుల్ ముజాహిదీన్ సోపియాన్ జిల్లా కమాండర్.

6. షౌకత్ తక్
లష్కరే పుల్వామా జిల్లా కమాండర్. 2011లో ఉగ్రసంస్థలో చేరాడు.

7. మహ్మద్ యాసిన్ ఇట్టూ అలియాస్ మాన్‌సూన్: హిజ్బుల్ బద్గాం జిల్లా కమాండర్.

8. వసీం అలియాస్ ఒసామా
లష్కరే తోయిబా సోపియాన్ జిల్లా కమాండర్. అంతకముందు 2014లో హిజ్బుల్‌లో చేరి బుర్హాన్ వనీతో కలిసి పనిచేశాడు.

9. అల్తాఫ్ దార్ అలియాస్ కచ్రూ
హిజ్బుల్ కుల్గాం జిల్లా కమాండర్.


పుడమిపై వికసించిన తొలి పుష్పజాతి 3డీ ఊహాచిత్రమిది(మధ్యలో ఉన్నది). అన్నిరకాల పువ్వులకు ఈ జాతే మూలమని, 14కోట్ల ఏళ్ల క్రితం ఉండేవని పారిస్-సడ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం విశ్లేషించింది.

సమగ్ర మార్గదర్శకాలు కావాలి

వ్యక్తిగత సమాచార భద్రతపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత పరిరక్షణకు సమగ్ర విధివిధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వ్యక్తిగత సమాచార దుర్వినియోగ కేసులను విడివిడిగా పరిశీలించాలన్న గుజరాత్ ప్రభుత్వ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ప్రజలకు అందుబాటులో ఉన్న వ్యక్తుల ప్రైవేటు సమాచార భద్రతకు, ఆ సమాచారాన్ని నిర్దేశిత ప్రయోజనం కోసమే వాడుకోవడానికి సమగ్ర మార్గదర్శకాలు అవసరమని పేర్కొంది. గోప్యతను మానవ హక్కుగా గుర్తించిన 1948నాటి ఐక్యరాజ్య సమితి ఒప్పందంపై భారత్ సంతకం చేసిందని గుర్తు చేసింది. చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని జస్టిస్ జె. చలమేశ్వర్, జస్టిస్ ఆర్.ఎఫ్. నారీమన్ తదితర 9 మంది సభ్యుల ధర్మాసనం మంగళవారం వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కా? కాదా? అన్న కేసుపై విచారణ జరిపింది. సమాచారాన్ని చాలామంది వాడుకుంటున్నప్పుడు ఒక్కో కేసును విడిగా చూడలేమని, దీని కోసం సమగ్ర మార్గదర్శకాలు ఉండాలని స్పష్టం చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఏ సుందరం వాదిస్తూ.. సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగానికి, చట్టానికి భాష్యం చెప్పగలదే కాని, గోపత్యను ప్రాథమిక హక్కుగా ప్రకటించజాలదని అన్నారు. అలా ప్రకటించే అధికారం ఒక్క పార్లమెంటుకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. 'మన రాజ్యాంగ మూలపురుషులు రాజ్యాంగ అసెంబ్లీ చర్చల్లో గోప్యత అంశాన్ని పరిశీలించి, దానిని ప్రాథమిక హక్కుల్లో చేర్చకూడదని నిర్ణయించారు. ఇప్పుడు ప్రాథమిక హక్కుగా పరిగణించాలని భావిస్తే పార్లమెంటు మాత్రమే ఆ పని చేయగలదు' అని అన్నారు.. కోర్టు జోక్యం చేసుకుని, రాజ్యాంగ అసెంబ్లీ చర్చల్లో గోప్యత అంశాలన్నీ చర్చించారని చెప్పలేమని పేర్కొంది. ప్రైవసీకి సంబంధించిన కొన్ని అంశాలు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛతో ముడిపడిన 21వ రాజ్యాంగ అధికరణంలో ఉన్నాయని సుందరం తెలిపారు. గోప్యత హక్కుకు చట్టం నుంచి రక్షణ ఉందని, దాని స్థాయిని ప్రాథమిక హక్కుకు పెంచాల్సిన అవసరం లేదని వాదించారు. ఈ కేసులో నేడు కూడా వాదనలు కొనసాగనున్నాయి.

బ్రీత్ ఎనలైజర్లు 100 శాతం కచ్చితం కాదు

న్యూఢిల్లీ: బ్రీత్ ఎనలైజర్స్‌తో సహా అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు 100శాతం కచ్చితమైనవి కావని ఢిల్లీలోని ఓ కోర్టు పేర్కొంది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వివేక్ శ్రీవాస్తవ అనే వ్యక్తికి ఓ మెజిస్ట్రీయల్ కోర్టు 2 రోజుల జైలుతో పాటు రూ.2వేలు ఫైన్ విధించింది. దీనిని సవాలు చేస్తూ అతను జిల్లా కోర్టును ఆశ్రయించాడు. బ్రీత్ ఎనలైజర్ ఫలితాలను కింద కోర్టు పరిగణనలోకి తీసుకున్నట్లు లేదని, ప్రతి ఎలక్ట్రానిక్ పరికరంలో ఎంతో కొంత లోపం ఉంటుందని అదనపు సెషన్స్ జడ్జి లోకేష్ కుమార్ వ్యాఖ్యానించారు. వివేక్ శరీరంలో ఆల్కహాల్ పరిమాణం 68.8ఎంజీ/100ఎంఎల్‌గా ఉందని, అధిక మొత్తంలో (300-500 ఎంజీ/100ఎంఎల్) సేవించే వారికి విధించే శిక్షను అతనికి వేయటం దారుణమన్నారు.

ఐసిస్, చైనాలతోనే భారత్‌కు ముప్పు!

వాషింగ్టన్: ఐసిస్, వాతావరణ మార్పులు, చైనా దుందుడుకుతనం...ఈ మూడు భారత్‌కు పొంచి ఉన్న ప్రధాన ముప్పులని అత్యధిక శాతం మంది భారతీయులు భావిస్తున్నారు. ప్రముఖ పరిశోధనా సంస్థ 'ప్యూ' చేసిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. భారత్ నుంచి సర్వేలో పాల్గొన్న వారిలో 66 శాతం మంది ఐసిస్ వల్ల భారత్‌కు ముప్పు ఉందనే అభిప్రాయాన్ని వెల్లడించారు. వాతావరణంలో మార్పుల వల్ల ఇబ్బందులు తప్పవని 47 శాతం మంది చెప్పారు. 44 శాతం మంది భారత్‌కు ఉన్న అతిపెద్ద ముప్పు చైనాయేనని పేర్కొన్నారు. మరో 43 శాతం మంది సైబర్ దాడులే అత్యంత ప్రమాదకరంగా మారాయన్నారు. అమెరికాతోపాటు ఐరోపా, ఆసియా ఖండాల్లోని 18 దేశాల్లో సర్వే చేసిన ప్యూ...ఆ నివేదికలను మంగళవారం విడుదల చేసింది. చైనా, రష్యా, అమెరికాల్లో ఏది అత్యంత ప్రమాదకర దేశమని అడగ్గా, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలు చైనాయేనని చెప్పారు.

పాక్ ప్రధానిగా అబ్బాసీ ప్రమాణం



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) నేత షాయిద్ కఖాన్ అబ్బాసీని దేశ ప్రధానిగా పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీ మంగళవారం ఎన్నుకుంది. నవాజ్ షరీఫ్‌ను సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఎన్నిక అనివార్యమైంది. సభలో మొత్తం 321 ఓట్లకు గాను అబ్బాసీకి 221 ఓట్లు వచ్చాయి. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ)కి చెందిన నవీద్‌కు 47 ఓట్లు, తెహ్రికీ ఇన్సాఫ్ నేత రషీద్ అహ్మద్‌కు 33 ఓట్లు, జామాత్ ఈ ఇస్లామీ నేత తరీఖుల్లాకు నాలుగు ఓట్లు పోలయ్యాయి.అనంతరం అధ్యక్షుడి భవనంలో జరిగిన కార్యక్రమంలో అబ్బాసీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

తండ్రి మరణం తర్వాత రాజకీయాల్లోకి: అబ్బాసీ వాషింగ్టన్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన తన తండ్రి 1988లో మృతి చెందడంతో రాజకీయ అరంగేట్రం చేశారు. 1988, 1990, 1993, 1997, 2008, 2013.. ఆరుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 58 ఏళ్ల అబ్బాసీ.. నవాజ్ షరీఫ్‌కు అత్యంత విధేయుడే కాదు ఆయన వ్యక్తిగత టీమ్‌లో ముఖ్యుడు. పార్లమెంట్‌లో ధనికుల్లో ఒకరు.

రూ.2 పెరిగిన సబ్సిడీ ఎల్పీజీ ధర

న్యూఢిల్లీ: సబ్సిడీపై అందిస్తున్న ఎల్పీజీ సిలిండర్ ధర మంగళవారం రెండు రూపాయలకు పైగా పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసేలా ప్రతినెలా ఎల్పీజీ ధరను పెంచాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 14.2 కిలోల సబ్సిడీ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.477.46 నుంచి రూ.479.77కి పెరిగిందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. మరోవైపు ఢిల్లీలో సబ్సిడీయేతర సిలిండర్ ధర రూ.564 నుంచి రూ.524కు తగ్గింది.

మా జోలికొస్తే ఊరుకోం: జిన్‌పింగ్



బీజింగ్: చైనా ఏ దేశంలోని ప్రాంతాన్నీ దురాక్రమించుకోదనీ, కానీ తన భూభాగాన్ని లాక్కోవాలని చూస్తే ఊరుకోదని ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మంగళవారం చెప్పారు. పొరుగు దేశాలకు గట్టి సమాధానం చెబుతూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతోందంటూ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)ని జిన్‌పింగ్ ప్రశంసించారు. జూన్ నెల మధ్య నుంచి సిక్కిం సెక్టార్‌లోని డోక్లాం వద్ద భారత్-చైనాల మధ్య ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. సిక్కిం గురించి నేరుగా ప్రస్తావించని జిన్‌పింగ్.. యుద్ధసన్నద్ధతపై దృష్టి పెట్టాలని ఆర్మీకి సూచించారు. పీఎల్ఏ 90వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

వ్యవసాయోత్పత్తుల అమ్మకాలకు 'ఈ-రకం'

న్యూఢిల్లీ: వ్యవసాయ ఉత్పత్తులను రైతులు ఆన్‌లైన్‌లో అమ్మేందుకు ఉపకరించే ఈ-రకం అనే పోర్టల్‌ను ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. ప్రభుత్వ వేలందారు ఎంఎస్‌టీసీ, కేంద్ర గిడ్డంగుల సంస్థకు చెందిన సీఆర్‌డబ్ల్యూసీలు సంయుక్తంగా ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ఉక్కు శాఖ మంత్రి చౌదరీ బీరేంద్ర సింగ్‌తో కలసి వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి రాం విలాస్ పాశ్వాన్ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు.

మొత్తం 34 లక్షలు.. భారత్ నుంచి 21 లక్షలు

వాషింగ్టన్: గత పదకొండేళ్లలో హెచ్ 1 బీ వీసాకు 21 లక్షలమందికి పైగానే భారతీయులు దరఖాస్తు చేసుకున్నారని తాజా గణాంకాలు వెల్లడించాయి. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ వెల్లడించిన ఈ నివేదికలో పలు కీలక అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2007 నుంచి ఈ ఏడాది జూన్ వరకు వివిధ దేశాల నుంచి 34 లక్షలమంది హెచ్ 1 బీ వీసా దరఖాస్తులు అందగా అందులో 21 లక్షల మంది భారత్ నుంచే ఉన్నారు. ఇదే సమయంలో అమెరికా 26 లక్షల హెచ్1 బీ వీసాలను మంజూరు చేసింది. అయితే ఏ దేశానికి ఎన్ని వీసాలు మంజూరు చేసిందన్న విషయాన్ని మాత్రం పేర్కొనలేదు. 2007-17 మధ్య 21లక్షల హెచ్1 బీ వీసా దరఖాస్తులతో భారత్ తొలిస్థానంలో నిలవగా, చైనా (2,96,313 దరఖాస్తులు) రెండో స్థానం, ఫిలిప్పీన్స్ (85,918) మూడో స్థానంలోనూ, దక్షిణ కొరియా (77,359) నాల్గో స్థానంలోనూ, కెనడా (68, 228) ఐదో స్థానంలోనూ ఉన్నాయి.

బీజేపీ ఎంపీల గైర్హాజరీపై సీరియస్

- ఇలాంటి తప్పులు మళ్లీ చేయొద్దని మందలింపు
- లిఖితపూర్వక వివరణ కోరనున్న అమిత్‌షా


బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో అమిత్, సుష్మా

న్యూఢిల్లీ: విప్ జారీచేసినా రాజ్యసభకు గైర్హాజరైన తమ పార్టీ సభ్యులపై బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి నుంచి షా లిఖితపూర్వక వివరణ కోరనున్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తాజా పరిణామంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 35 మంది బీజేపీ సభ్యులు హాజరు కాకపోవడంతో, బీసీ కమిషన్ రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రతిపక్షాలు సూచించిన సవరణలు ఎగువ సభలో ఆమోదం పొందడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారిన సంగతి తెలిసిందే. గైర్హాజరైన వారిలో మంత్రులు రవిశంకర్ ప్రసాద్, స్మృతి ఇరానీ, నిర్మలా సీతారామన్ కూడా ఉన్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు పార్టీ ఎంపీలు రెండు సభలకు అందుబాటులో ఉండాలని, గైర్హాజరీ లాంటి తప్పులు మళ్లీ చేయొద్దని షా ఆదేశించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ వెల్లడించారు. ' పార్టీ విప్ జారీచేసినపుడు సభ్యులు పార్లమెంట్‌కు అందుబాటులో ఉండాలి. ఎంపీల గైర్హాజరీని షా తీవ్రంగా పరిగణించారు. ఇలా జరగకుండా ఉండాల్సిందని, భవిష్యత్తులో పునరావృతం కావొద్దని హెచ్చరించారు' అని అనంత్‌కుమార్ తెలిపారు. లిఖితపూర్వక వివరణ ఇచ్చేలా గైర్హాజరైన ఎంపీలను ఆదేశిస్తామని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు వెల్లడించారు.

ఈశాన్య రాష్ట్రాలకు రూ. 2,350 కోట్లు

వరద సాయాన్ని ప్రకటించిన ప్రధాని మోదీ


వరదలపై సమీక్ష సమావేశంలో మోదీ, అసోం సీఎం శర్బానంద

గువాహటి: ఈశాన్య రాష్ట్రాలకు వరద సాయంగా రూ.2,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రధాని మోదీ ప్రకటించారు. ఇందులో అసోం రాష్ట్రానికి తక్షణసాయంగా రూ. 250 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ ఏడాది జూన్‌లోనే కేంద్రం రూ. 300 కోట్లను ఈ రాష్ట్రానికి ప్రత్యేకంగా విడుదల చేసినట్లు అసోం ఆర్థికమంత్రి హిమంతబిశ్వా శర్మ, జలవనరుల మంత్రి కేశబ్ మహంత మంగళవారం విలేకరులకు తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, అసోం రాష్ట్రాల్లోని వరదలపై తాజా పరిస్థితిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులు, మంత్రులతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమీక్షించారు. సమావేశం అనంతరం మంత్రి కేశబ్ మహంత మాట్లాడుతూ.. ''ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులతో సుమారు ఐదు గంటలపాటు జరిగిన సమావేశంలో ఈశాన్య రాష్ట్రాల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టిని పెడుతున్నట్లు మోదీ చెప్పారన్నారు. వరద ముంపును ఎదుర్కొనేందుకు స్వల్ప, దీర్ఘ కాలిక ప్రణాళికలను అమలు చేయాలని.. ఈ అంశంలో ఈశాన్య రాష్ట్రాలకు సంపూర్ణ సహకారం అందజేస్తామని మోదీ చెప్పారన్నారు.

ఎల్పీజీ 'సబ్సిడీ ఎత్తివేత'పై భగ్గు

పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాల నిరసన ● యూపీఏ హయాం నాటి నిర్ణయమేనన్న ప్రభుత్వం


ఎల్పీజీ ధర పెంపును నిరసిస్తూ కోల్‌కతాలో మోదీ దిష్టిబొమ్మను తగలబెడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

న్యూఢిల్లీ: గృహవినియోగ వంటగ్యాస్ సిలిండర్‌పై ప్రతినెలా రూ. 4 పెంచి, మార్చి నాటికి సబ్సిడీని ఎత్తివేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై మంగళవారం పార్లమెంటు ఉభయ సభల్లో విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ అంశంపై చర్చకు డెరెక్ ఓబ్రియాన్(తృణమూల్) నోటీసు ఇచ్చారు. బ్యారల్ చమురు ధర 111 డాలర్ల నుంచి 48కు తగ్గినా ప్రభుత్వం మాత్రం వంటగ్యాస్ ధరలు పెంచుతోందని మండిపడ్డారు. చర్చకు డిప్యూటీ చైర్మన్ కురియన్ తిరస్కరించడంతో విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లాయి. దీంతో కురియన్ సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక విపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలను చంపుతోందని అన్నారు. పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణ ఇస్తూ.. సబ్సిడీల ఎత్తివేత కోసం నెలనెలా ధరలు పెంచాలని 2010 జూన్‌లో అప్పటి యూపీఏ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించే తాజా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మరోపక్క.. ప్రభుత్వ నిర్ణయం దారుణమని లోక్‌సభలో విపక్షాలు ధ్వజమెత్తాయి. సబ్సిడీ ఎత్తివేతతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడతారని కేసీ వేణుగోపాల్(కాంగ్రెస్) ఆందోళన వ్యక్తం చేశారు. ముడి చమురు ధరలు తగ్గుతుండగా దేశంలో ధర పెంచడం సహేతుకం కాదన్నారు. ప్రభుత్వం తీరుపై నిరసనతో విపక్షాలు వాకౌట్ చేశాయి. గోరక్ష దాడులపైనా విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కంపెనీల నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించడానికి 27 ఏళ్ల కిందట ప్రవేశపెట్టిన బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో ఉపసంహరించుకుంది.

2018 వరకూ రూ.3కే సబ్సిడీ బియ్యం
దేశంలో 81 కోట్ల మంది పేదలకు సబ్సిడీపై బియ్యం, గోధుమలు అందిస్తున్న పథకాన్ని 2018 వరకూ సమీక్షించబోమని కేంద్రం లోక్‌సభలో వెల్లడించింది. ప్రస్తుతం సబ్సిడీ బియ్యాన్ని కిలోకు రూ.3, గోధుమలను రూ.2 చొప్పున అందిస్తున్నారు.

ప్రొటోకాల్ వివాదం: పార్లమెంటుకు అనుబంధంగా నిర్మించిన కొత్త భవనం ప్రారంభోత్సవానికి రాజ్యసభ చైర్మన్, డిప్యూటీ చైర్మన్, ఎంపీలను ఆహ్వానించకపోవడం పట్ల ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా'పై నిరసన

రాజ్యసభ ఎన్నికల్లో ఓటేసే ఎమ్మెల్యేలకు అభ్యర్థులందర్నీ తిరస్కరించడానికి వీలుగా, 'పై అభ్యర్థుల్లో ఎవరికీ కాదు'(నోటా) ఆప్షన్ కల్పించడంపై రాజ్యసభలో విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాజ్యాంగాన్ని, చట్టాన్ని సవరించకుండా కేవలం ఎన్నికల సంఘం ఆదేశంపై ఈ నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ డిప్యూటీ నేత ఆనంద్‌శర్మ ఆరోపించారు. గుజరాత్‌కు ప్రత్యేక రాజ్యాంగమేదైనా ఉందా అని గులాం నబీ ఆజాద్.. గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల వివాదాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. ఈ అంశంపై ఈసీతో చర్చించాలని చైర్మన్ హమీద్ అన్సారీ సూచించినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నుంచే నోటా ఉందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. శర్మ స్పందిస్తూ.. వచ్చే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ నోటాను పొందుపరచాలన్నారు.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్‌ఆర్ జిల్లా
బుధవారం ॥ 2-8-2017

నేను నా దైవం


ఫొటో: శివ మల్లాల
గిరిబాబు

లేనట్లే... ఉన్నాడు!

సందేహం మంచిది.. ప్రశ్నలు జీవితానికి నిర్దేశం.
కనబడేవన్నీ సత్యాలు కానప్పుడు
కనపడనివి అసత్యాలు కాగలవా?
దైవాన్ని అనుభూతి చెందుతాం.. కనిపించకపోయినా..
గిరిబాబుకు దేవుడి ఉనికి మీద ఎన్నో సందేహాలు.
దేవుడికి ఎక్కుపెట్టిన ఎన్నో ప్రశ్నలు.
లేనట్లే.. అనిపించినా.. ఉన్నాడనే సమాధానం.

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సీనియర్ నటుడు గిరిబాబు ఇంటికి వెళ్లినప్పుడు ఆయన విశ్రాంతిగా కూర్చొని టీవీలో సినిమా చూస్తూ కనిపించారు. ఒకప్పుడు తను విలన్‌గా నటించిన 'కల్పన' సినిమా అది! డెబ్బై ఐదేళ్ల వయసులో గత కాలపు స్మృతులను నెమరువేసుకుంటున్న గిరిబాబు 'నేను–నా దైవం' గురించి విస్తృతంగా చర్చించారు. దేవుడున్నాడా? లేడా? అని జీవితమంతా ఎదురైన సందేహాలను ఇలా వివరించారు.

- **నాటి సినిమాలు ఇప్పుడు చూసుకుంటూ హాయిగా గడుపుతున్నారు. ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు దేవుడిని ఏవిధంగా తలుచుకుంటున్నారు?**

గిరిబాబు: దేవుడున్నాడు.. అని బాగున్నప్పుడు అనిపిస్తుంది. బాగోలేనప్పుడు దేవుడే ఉంటే ఇలా ఎందుకు జరుగుతుంది? అని కూడా అనిపిస్తుంది. ఈ జీవితం ఇలా ఉంది అంతే! నేను నిత్యపూజలేవీ చేయను. మా ఇంట్లో కూడా చేయరు. అలాగని నేనేమీ నాస్తికుడిని కాదు. నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ప్రతి పండగకు నా పిల్లలు, వారి పిల్లలు అందరం కలుస్తాం. ఏ దేవుడికి సంబంధించిన పండగైతే ఆ పూజ చేసుకొని, కలిసి భోజనం చేస్తాం. సంతోషంగా, సంతృప్తిగా ఉంటుంది. బయటకెళ్లినప్పుడు గుడిముందుగా వెళితే మాత్రం దండం పెట్టుకుంటాను.

- **అంటే సంతోషం దేవుడితో ముడి పడి ఉందంటారా?**

సంతోషంగా ఉండేలా ప్రయత్నించడం మన చేతుల్లోనే ఉంది. కానీ, అప్పుడు దేవుడు దయతలిచాడు అనిపిస్తుంది. మరణం మన చేతుల్లో లేదు. అప్పుడు దేవుడున్నాడా? అనే సందేహం కలుగుతుంది. నా మనవరాలు (కూతురి కూతురు) పెళ్లి తిరుపతిలో ఘనంగా చేశాం. కొత్తజంటతో కలిసి అందరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాం. చాలా సంతోషంగా ఉన్నాం. మరుసటి రోజు ఇంటికి వచ్చాం. మా అల్లుడు, మేమంతా సోఫాల్లో సేదతీరుతున్నాం. ఉన్నట్టుండి మా అల్లుడు ఆ సోఫాలోనే వాలిపోయాడు. ఆసుపత్రికి తీసుకెళితే ప్రాణం పోయిందన్నారు. 'దేవుడా మేం చేసిన తప్పేంటి? ఎందుకిలా చేశావ్! రాత్రి వరకు నీ సన్నిధానంలోనే ఉన్నాంగా! ఒక్కరోజులో ఈ తేడా ఏంటి? పెళ్లికళతో ఉన్న ఇల్లు ఒక్కసారిగా ఇలా అయిపోయిందేంటి? నువ్వున్నావా? లేవా?!' అనే సందేహం కలిగింది.

- **దేవుడున్నాడు అనిపించిన సందర్భాలు?**

మా అమ్మనాన్నలకు ఒక్కణ్ణే కొడుకును. గారాబంగా పెంచారు. కాలేజీ చదువులకు రాగానే పెళ్లి చేశారు. కాలేజీ రోజుల్లో విపరీతంగా నాటకాల్లో పాల్గొనేవాడిని. సినిమా ప్రకటనలు చూసి నా ఫొటోలను ఆ సంస్థలకు పంపుతుండేవాడిని. అలా దర్శకుడు ఎస్డీ లాల్ అబ్బాయి బాగున్నాడని సినిమాకు ఎంపిక చేసి, కబురు పంపారు. కొన్ని రీళ్లు తీసి డబ్బు లేక ఆ సినిమా తీయలేకపోయారు. కానీ, ఆరు నెలల తర్వాత ప్రొడ్యూసర్ అట్లూరి పూర్ణచంద్రరావు 'జగమే మాయ' సినిమాకు నా గురించి చెప్పారు. అక్కణ్నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ మాత్రం ప్రయాస పడకుండానే సినిమా అవకాశాలు విపరీతంగా వచ్చాయి. అప్పుడు చాలాసార్లు అనుకునే వాడిని దేవుడు వీరిద్దరి రూపంలో నాకీ అవకాశాన్నీ, నిలదొక్కునే స్థైర్యాన్నీ ఇచ్చాడని.

'ప్రేమకథ' సినిమా షూటింగ్‌కి యూనిట్ సభ్యులతో కలిసి రైలులో ప్రయాణిస్తున్నాం. రైలు ప్రమాదం జరిగింది. నా వెంట వచ్చిన కెమరామన్లు, ఇంకొంతమంది ఆ దుర్ఘటనలో మరణించారు. నేను బతికాను. అప్పుడనిపించింది దేవుడున్నాడు అని. అయితే, ఆ చనిపోయినవారి వైపున దేవుడు ఎందుకు లేడు? అనే సందేహమూ వచ్చింది.

ఇంకోసారి సంక్రాంతి పండగకు మా కుటుంబ సభ్యులమంతా కలిసి మా ఊరు బయల్దేరాం. దారిలో మా కారును లారీ ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో కొద్దిపాటి గాయాలతో మేమంతా బతికాం. అప్పుడూ అనిపించింది దేవుడున్నాడని.

- **చావు బతుకులే దైవాన్ని పరిచయం చేస్తాయంటారా?**

తల్లి గర్భంలో అంతా చీకటే. అయినా అక్కడ కాళ్లూ చేతులు ఆడిస్తుంటుంది శిశువు. గర్భంలోని నుంచి బయటకు అంటే వెలుగులోకి వచ్చినందుకు నవ్వాలి కానీ, కెవ్వుమని ఏడ్చేస్తుంది ఎందుకు? పెద్ద సందేహం. బహుశా పుడుతూనే తను చావుకు దగ్గర అవుతానేమో అని ఏడుస్తుందేమో! అనే ఆలోచన.

ఈ సృష్టిలో మనకన్నా ముందు పశుపక్ష్యాదులున్నాయి. గింజలు తినో, గడ్డి తినో పెరుగుతాయి అవి. కానీ, వాటిని చంపి తినే పులి లాంటి జంతువులూ ఉన్నాయి. వీటిని పుట్టించిన దేవుడే వాటినీ పుట్టిస్తే సాటి జంతువును చంపి తినమని ఎందుకు పెట్టాడు. పాపం ఆ అమాయక జంతువు ఏం పాపం చేసింది? ఇదో సందేహం.

రాతియుగంలో మనిషి జంతువులను చంపి తినేవాడు. అప్పుడు వాడికి దేవుడంటే తెలియదు. మెదడు వికాసం పొంది ఆలోచనలు చేయడం ఆరంభిస్తూ ఏదో శక్తి ఉందని గ్రహింపుకొచ్చాడు. ఆ ఆలోచన నుంచే హింసను వదిలేసి మునులు, రుషులు వచ్చారు. జనం పెరుగుతున్న కొద్దీ ఎవరికి వారు ఓ దేవుడిని సృష్టించుకున్నారు. ఆ విధంగా దేవుళ్ల సంఖ్య పెరిగింది. బలి ఇస్తే దైవం అనుగ్రహిస్తుందనే నమ్మకంలో ఇప్పటికీ చాలామంది ఉన్నారు. దేవుడు అమాయకజీవిని చంపమనే ఆలోచన మనిషికి ఎందుకు కల్పించాడు?!

- **దేవుళ్ల సినిమాల్లోనూ నటించిన అనుభవాలు?**

దేవతలు–మహిమలు ఉన్న సినిమాలు చాలానే చేశాను. అయితే, 'దేవతలారా దీవించండి' అనే సినిమాలో పామును దేవతగా చూపిస్తాం. కాసేపు పాము మనిషిలా మారుతుంది. తర్వాత మళ్ళీ పాములా కనిపిస్తుంది. పాము పట్ల మనం చూపే దైవభక్తి అంతా ఇంతాకాదు. నాగులచవితి, నాగుల పంచమి అంటూ పూజలు చేస్తాం. పుట్టలో పాలు పోసి భక్తిగా మొక్కుతాం. అయితే, నాకు అర్థంకానిదేంటంటే.. ఈ సృష్టిలో పశుపక్ష్యాదులన్నీ తమ పిల్లల్ని అత్యంత ప్రేమగా సాకుతాయి. మరో జంతువును చంపే పులి కూడా తన పిల్లలను ప్రేమగా చూసుకుంటుంది. మొసలి కూడా ఒడ్డున ఇసుక తవ్వి గుడ్లు పెట్టి, అవి పిల్లలు కాగానే జాగ్రత్తగా నోటకరుచుకు వెళ్లి నీళ్లలో వదిలిపెడుతుంది. కానీ, పాము అలా కాదే.. తన పిల్లలని తనే మింగుతుంది. ఈ సృష్టిలో తన పిల్లల మీద ఎలాంటి అఫెక్షన్ లేని ప్రాణి ఏదైనా ఉందంటే అది పామే! అలాంటి పాముకు పూజలేంటి?! పుట్టలో పాలు పోస్తారు. దానికి ఊపిరి ఆడక బయటకు వచ్చేస్తుంది. ఇది చూసి జనం పరవశించి పోతారు. ఏంటో ఇదంతా అనిపిస్తుంది. నాకు తెలిసినంతవరకు బహుశా శివుడి మెడలో ఆభరణంగా పాము ఉంటుంది కాబట్టి ఈ జనం పూజలు చేస్తుండవచ్చా? ఇలాంటి సందేహాలు కలుగుతాయి.



నా భార్య శ్రీదేవితో నా అనుబంధం గురించి ఒక్కమాటలో చెప్పలేను. అందరినీ చక్కగా చూసుకునేది. ఆమె చేతి వంట అద్భుతంగా ఉండేది. మా నాన్న నాగయ్యకు ఇప్పుడు 107 ఏళ్లు. బిడ్డలా చూసుకునేది. కొడుకులు, కూతుళ్లు, మనవలు, మనవరాళ్లు అందరూ ప్రాణం పెడతారు తనంటే! బంధువుల్లోనూ అంతే! పూజలు, వ్రతాలు, నోములు ఎక్కడా లోపం చేసేది కాదు. ఓ 'రోజు కాళ్లు నొప్పులు, జ్వరంగా ఉంది' అంది. ఆసుపత్రికి తీసుకెళ్లాం. డాక్టర్లు అడ్మిట్ చేయాలన్నారు. ఒంట్లో ఏదో ఇన్ఫెక్షన్ అన్నారు. మూడునెలల ఏడురోజుల పాటు ఆసుపత్రిలో నరకయాతన అనుభవించి కిందటేడాది మమ్మల్ని వదిలి వెళ్లిపోయింది. అప్పుడనిపించింది 'ఏం తప్పు చేశాను? నన్ను ప్రాణంగా చూసుకునే నా అర్ధాంగిని దేవుడెందుకు తీసుకెళ్లిపోయాడు. అసలు దేవుడున్నాడా? ఉంటే ఇలా జరుగుతుందా?' పెద్ద సందేహం.

- **ఇలాంటి సందేహాలకు బీజం ఎక్కడ పడింది?**

మా ఊళ్లో. మా ఊరు ప్రకాశం జిల్లాలోని రావినూతల. చాలా చిన్నప్పుడు. బడికెళ్లే రోజుల్లో రాత్రి పూట ఆరుబయట పడుకుని ఆకాశంకేసి గంటలు గంటలు చూసేవాడిని. అన్ని చుక్కలు ఆకాశంలో దేవుడు ఎలా పెట్టాడు, ఆ చుక్కలు దాటుకొని వెళ్లిపోతే ఏం వస్తుంది? అంత పెద్ద సముద్రానికి కూడా తీరం ఉంటుంది. మరి ఈ విశ్వం అవతల ఏముంటుంది? ఇలాంటి సందేహాలు ఎడతెరిపి లేకుండా వచ్చేవి. చాలామందికి ఈ ఆలోచన వచ్చే ఉంటుంది. తర్వాత వదిలేస్తారు. కానీ, ఇప్పటికీ ఇది పెద్ద సందేహమే. గ్రహాలు, పాలపుంతలు... ఇలాంటి వాటి గురించి తెలుసుకుంటుంటాను. వేరే గ్రహాలలో జీవరాశి ఉందని చెప్పే వార్తలు చదివి ఆశ్చర్యపోతుం టాను. అలా అయితే అక్కడే దైవం ఉండాలి? ఏదో శక్తి విశ్వమంతా ఉండాలి. అంత పెద్ద ఆకారం రూపం ఎలా ఉంటుందో?!

- **దేవుణ్ణి ఆకాశంలో వెతికే మీకు దైవం గురించి ఎవరు పరిచయం చేశారు?**

మా ఇంట్లో పడమర ఇల్లు అని ఉండేది. అది దేవుడి గది! పండగలప్పుడు పూజలు, ప్రసాదాలు హడావిడులు ఉండేవి. అమ్మనాన్నలు దేవుడి గదిని అలంకరించి, నైవేద్యాలు పెట్టి నన్ను బొట్టు పెట్టుకో, దండం పెట్టుకోమనేవారు. వాళ్లు చెప్పినట్టు చేసేవాణ్ణి. మా ఊరి దగ్గరలో సింగరాయకొండ జాతర అద్భుతంగా సాగుతుంది. కొండ కింద ఆంజనేయ స్వామి, కొండమీద లక్ష్మీనరసింహ స్వామి. జాతర అంటే పండగే పండగ. స్నేహితులతో కలిసి ఒళ్లు అలసిపోయేలా తిరిగి ఇళ్లకు చేరుకునేవాళ్లం.

- **ఇంతకీ దేవుడున్నట్లా? లేనట్లా?**

మా ఊళ్లో రాజుల కాలం నాటి శైవాలయాలు, వైష్ణవాలయాలు ఉన్నాయి. వాటి పునరుద్ధరణకు ఓ కమిటీ ఏర్పాటు చేశాం. దానికి నేనే అధ్యక్షుడిని. వాటిని బాగుచేయడమే కాకుండా నిత్యం పూజలు జరిగేలా, వార్షిక ఉత్సవాలు జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఇవి కాకుండా సాయిబాబా గుడి కూడా కట్టించాం. మా కుటుంబం అంతా ఊరెళ్లినప్పుడల్లా దర్శనం చేసుకుంటాం. కిందటి నెల నా పుట్టినరోజు. వారం రోజుల ముందుగానే ఊరికెళ్లాను. గుళ్లన్నీ దర్శించి వచ్చాను. మా చుట్టుపక్కల ఊళ్లవాళ్ళూ ఆ గుళ్లకు వచ్చి సంతోషంగా తిరిగివెళ్లడం నాకు నచ్చుతుంటుంది. అందుకోసమే నేను వెళుతుంటానని అనిపిస్తుంది. దైవం అంటే బతికినన్నాళ్లూ ఏదో ఒక రకంగా మన చుట్టూ ఉన్నవారు సంతోషంగా ఉండేలా చూడటమే అని బలంగా అనిపిస్తుంది.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి

కురులు

కొండంత విలువ

కొండకు వెంట్రుక వేశాను... వస్తే కొండ పోతే వెంట్రుక... అని సామెత. వెంట్రుక అంటే మనవాళ్లకు వెంట్రుకతో సమానం. అందుకే 'నువ్వు నాకు వెంట్రుకతో సమానం' అని తీసి పడేస్తుంటాం. తల నిండా నెల తిరిగే సరికి గుట్టలు గుట్టలుగా ఉత్తపుణ్యానికి వెంట్రుకలు పెరిగిపోతాయి కనుక మనకు వెంట్రుకలంటే లెక్కలేదు. కాని ప్రపంచంలో తల మీద వెంట్రుకలు లేని వాళ్లు, మొలవని వాళ్లు, మొలిచినా రాలిపోయిన వాళ్లు ఒక్కో వెంట్రుక కోసం అర్రులు చాస్తూ ఉంటారు. తల మీద వెంట్రుకలు అందానికే కాదు ఆత్మ విశ్వాసానికి కూడా చిహ్నం. ఈ ఒక్క పాయింట్ మీదే ప్రపంచంలో వేల కోట్ల రూపాయల వెంట్రుకల వ్యాపారం జరుగుతోంది. చదవడానికి ఆశ్చర్యంగా ఉన్నా సరే... అంతగా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఇందులో మంచి వార్త ఏమిటంటే ప్రపంచానికి అవసరమైన వెంట్రుకల ఎగుమతిలో 80 శాతం వాటాతో భారతదేశం ముందు వరుసలో ఉంది. మరి ఈ వెంట్రుకలు ఎక్కడి నుంచి వస్తాయి? మన సంప్రదాయమే. హైందవ సాంప్రదాయంలో తల నీలాలు సమర్పించడం ఒక ముఖ్యమైన ఆనవాయితీ. తన అహాన్ని, భగవంతుని ముందు తల ఒంచి తల నీలాలు ఇవ్వడం ద్వారా ఆత్మని అర్పిస్తాడు భక్తుడు. ఇలా భారతదేశంలోని ఆలయాలకు చేరుతున్న టన్నుల కొద్దీ వెంట్రుకలు భారతదేశానికి వేల కోట్ల రూపాయల రాబడిని సంపాదించి పెడుతున్నాయి.

ఏడాదికి 1300 టన్నులు

భారతదేశం నుంచి సంవత్సరానికి దాదాపు 1300 టన్నుల శిరోజాలు ప్రపంచానికి ఎగుమతి అవుతన్నాయని అంచనా. దేశంలో 200 సంస్థలు ఈ వ్యాపారంలో ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం చెన్నైలో ఉన్నాయి. విదేశీ ఎగుమతుల ద్వారా కాని దేశీయ మార్కెట్ వల్లగానీ మొత్తం మీద మన దేశంలో 2500 కోట్ల వ్యాపారం వెంట్రుకల మీద జరుగుతోంది. మళ్లీ ఇందులో సంవత్సరానికి 10 నుంచి 30 శాతం వృద్ధి కనిపిస్తోంది. ఇంత వ్యాపారానికి అవసరమైన వెంట్రుకల సేకరణకు ప్రధాన కేంద్రం వేరే ఏదో కాదు... మన తిరుపతి కొండే. రోజుకు సగటున 25 వేల మంది అర్పిస్తున్న తల నీలాల ద్వారా సంవత్సరానికి 700 నుంచి 1000 కోట్ల రాబడి సమకూరుతోంది.

చైనా పోటీ

చైనా వాళ్ల తల వెంట్రుకలు భారతీయుల వెంట్రుకలతో పోల్చితే రెట్టింపు మందంగా ఉంటాయి. ఇవి విగ్గుల తయారీలో బాగా ఉపయోగ పడతాయి. అయితే వీటిని మెత్తగా చూపించాలంటే మాత్రం భారతీయ శిరోజాలను కలపక తప్పదు. ఎగుమతుల్లో భారత్ ముందంజలో ఉన్నా వ్యాపారంలో మాత్రం చైనా భారీ లాభాల్లో ఉంది. దీనికి కారణం అక్కడ వెంట్రుకలతో తయారయ్యే ఉత్పత్తుల కర్మాగారాలు ఎక్కువగా ఉన్నాయి. మనం వెంట్రుకలను విక్రయిస్తుంటే అది వెంట్రుకలతో తయారయ్యే విగ్గులను, సవరాలను, వంకీల జుట్టు వరుసలను విక్రయిస్తోంది. కనుక ఇక మీద తల దువ్వుకున్నప్పుడు దువ్వెనలో వెంట్రుక కనిపిస్తే తీసి పడేయకండి. నాలుగు వెంట్రుకలు వెనకేసి సిరి మూటగట్టుకోవచ్చని గ్రహించండి.

ప్రతీకాత్మక చిత్రం



రెండు రకాలు

వెంట్రుకలను రెండు రకాలుగా వర్గీకరిస్తారు. ఒకటి ఇళ్ల నుంచి సేకరించినవి. ఇవి పొట్టిగా చిక్కుతో ఉంటాయి. మరొకటి తల నీలాల ద్వారా సేకరించినవి. ఇవి పొడవుగా శుద్ధి చేయడానికి అనువుగా ఉంటాయి. శుద్ధి చేసిన వెంట్రుకలు 7 నుంచి 11 అంగుళాల పొడవు ఉన్నవి కిలో 7000 రూపాయలు పలుకుతున్నాయి. 30 అంగుళాల పొడువున్న వెంట్రుకలు కిలో 50 వేలు ధర చేస్తున్నాయి.


శిరోజాలను ప్రాసెస్ చేస్తున్న మహిళలు

ఆత్మీయం

నేరము.. హింస



అహింసా పరమోధర్మః అన్నారు పెద్దలు. అంటే హింసించకుండా ఉండటమనేది అన్ని ధర్మాలలోకెల్లా ఉత్తమమైనదని అర్థం. అలాగని హింస అంటే, జీవిని చంపడమే కాదు, దాన్ని బంధించినా, అంటే జంతువులు, పక్షుల్ని కట్టేసి పెంచుకున్నా హింసే అన్నాడు బుద్ధభగవానుడు. బానిసత్వాన్నీ హింసగానే పరిగణించాడు. చేతలతోనే కాదు, మాటల ద్వారా దూషించినా, కఠినంగా మాట్లాడినా, వ్యంగ్యంగా మాట్లాడినా, రెండర్థాల పదాలతో బాధపెట్టినా– ఇవన్నీ 'జీవహింస'గానే చెప్పాడు. ఐతే ఏదైనా కావాలని, తెలిసి చేస్తేనే అది నేరం అవుతుందని, తెలియక జరిగిన హింస తప్పు మాత్రమే అవుతుందని చెప్పాడు. ఉద్దేశ్యపూర్వకంగా చేసిన జీవహింస ఎంత పాపకార్యమో చెప్పే ఒక జాతక కథ ఉంది. ఒకడు ఒక దేవతకు ఒక మేకపోతును బలిస్తూ ఉంటాడు. అప్పుడు ఆ మేకపోతు పెద్దగా నవ్వుతుంది. ఆ నవ్వు చూసి బలిచ్చేవాడు కత్తిదించుతాడు. వెంటనే ఏడుస్తుంది. అప్పుడు వాడు– '' ఓ మేకా! ఎందుకు నవ్వావు? ఎందుకు ఏడ్చావు?'' అని అడిగాడు. అప్పుడు ఆ మేక ''ఓరీ మూర్ఖుడా! నేనూ నీకులాగా ఒక యజ్ఞంలో మేకను వధించాను. పుణ్యం రాకపోగా 500 జన్మలు మేకగా పుట్టే పాపం కలిగింది. ఇప్పటికి 499 సార్లు మేకగా పుట్టి మెడ నరికించుకున్నాను. ఇది ఆఖరిది. ఈ రోజుతో నా పాపం తీరిపోతుందని ఆనందంతో నవ్వాను. ఇక నన్ను చంపడం వల్ల నీకు ఐదువందల మేక జన్మలు కలుగుతాయి కదా! అని నీ దుస్థితికి బాధపడి ఏడ్చాను'' అంది. అంటే– 'జీవహింస' ఎంత పాపకార్యమో' అని చెప్పడానికి చెప్పిన కథ ఇది. దీనిలోని అంతస్సూత్రాన్ని అర్థం చేసుకోవడం అవసరం.





గండి ఆంజనేయస్వామి
శ్రీరాముడే చెక్కిన శిల్పం

మనదేశంలో అత్యంత ప్రముఖంగా పేర్కొనదగిన హనుమత్‌క్షేత్రాలు 108 ఉన్నాయి. వాటిలో 107 ఆలయాలలో హనుమ స్వయంభువుడై వెలిసినట్లు చెబుతారు. అయితే, కేవలం ఒక్కచోట మాత్రం హనుమకు ఆరాధ్యదైవమైన శ్రీరామచంద్రుడు తన బాణం మొనతో హనుమ ఆకారాన్ని చెక్కటం... తన స్వామి చెక్కిన ఆ చిత్రంలోకి హనుమ స్వయంగా వచ్చి నిలవడం కనిపిస్తుంది. అదే వైఎస్సార్ జిల్లా వేంపల్లెకు దగ్గరలోని గండి ఆంజనేయ స్వామి ఆలయం. అత్యంత మహిమాన్వితమైన ఆలయాలలో ఒకటిగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో స్వామికి విశేష పూజలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఈ స్వామికి సంబంధించిన సజీవ చిత్రణ.



గండి ఆంజనేయస్వామి మూలవిరాట్

వేంపల్లె సమీపాన పాల కొండల కనుమ గుండా పోవు పాపాఘ్ని నది తోవ (గండి) మిక్కిలి ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ పర్వత పంక్తుల ఎత్తు దాదాపు రెండు వేల అడుగులు.. పాపాఘ్ని నది ఎత్తైన కొండ, లోయల మధ్య మలుపులు తిరిగి ప్రవహించి కడప వైపు మైదానంలో ప్రవేశిస్తుంది. పాలకొండలకు చొచ్చుకొని పోవు చోట కుడి వైపు ఒడ్డున గండి ఆంజనేయస్వామి ఆలయం ఉంది. దీనికి ఓ పురాణ గాథ ఉంది.

శ్రీరాముడు లంకకు వెళ్లేటప్పుడు హనుమంతుడి తండ్రి అయిన వాయుదేవుడు ఈ ప్రాంతంలో తపోనిష్టుడై ఉన్నాడు. రాముడికి ఆశీస్సులు అందించిన వాయుదేవుడు, తిరుగు ప్రయాణంలో రావణుడిని సంహరించి వచ్చేటప్పుడు ఇదే మార్గంలో రావాలని కోరాడు.

వాయుదేవుని కోరిక ప్రకారం సింహళ (శ్రీలంక) విజయ యాత్ర ముగించుకొని తిరిగి వచ్చేటప్పుడు రాముడు తన పరివారంతో సహా ఒకరోజు ఇక్కడ బస చేశాడు. వాయుదేవుడు శ్రీరాముడికి స్వాగతం ఇవ్వడం కోసం రెండు కొండలకు మధ్యలో ఒక బంగారు తోరణం నిర్మించాడు. శ్రీరాముడు అక్కడ ఒకచోట విశ్రాంతి తీసుకుంటూ ఒక శిలపై తన బాణపు ఉలితో ఆంజనేయుడి రూపాన్ని చిత్రించాడు. కాలి చిటికెన వేలిని చెక్కేలోగా రాహుకాలం రావడంతో అంతటితో వదిలేశాడట రాముడు. ఆ శిలను అక్కడినుంచి తరలిద్దామని చూడగా, వేలినుంచి రక్తం కారడంతో స్వామి వారక్కడ సజీవరూపులై ఉన్నారని తెలుసుకుని, చేసేదేమీ లేక ఆ స్థలంలోనే ఆలయాన్ని నిర్మించారట. అదే గండి వీరాంజనేయస్వామి దేవాలయం. దేవతానుగ్రహం వల్ల పుణ్యాత్ములకు అవసాన దశలో ఆ బంగారు తోరణం కనిపిస్తుందని విశ్వాసం. అప్పటి జిల్లా కలెక్టర్ థామస్ మన్రో తన కడపటి ప్రయాణాన ఈ గండి మీదుగా వెళ్లినప్పుడు ఈ తోరణం కనిపించదట. ఈ తోరణాన్ని చూసిన వారు త్వరలో మరణిస్తారని తెలుసుకోవడంతో ఆయన అనుచరులు ఎంతో ఆందోళన పడ్డారట. చివరికి అదే నిజమని తేలింది. కడప బ్రౌన్ గ్రంథాలయంలోని ఒక పుస్తకంలో ఈ వివరణ కనిపిస్తుంది.

పవిత్ర పాపాఘ్ని నది

పాపాలను నశింపజేసేది కాబట్టి ఈ నదికి పాపాఘ్ని అని పేరు వచ్చింది. కోలార్ జిల్లాలోని నందికొండే నంది పాదమని చెబుతారు.

పాపాఘ్ని అంతటా పవిత్రమే అయినా ఐదు స్థలాలలో మరింత పవిత్రతను పంచుకుంది. దీని ఉత్పత్తి స్థానం నంది కొండ ఒకటి, వాయు క్షేత్రంగా గండి రెండవది.. కేశవ తీర్థం మూడవది.. భాస్కర క్షేత్రంగా ఉన్న వేంపల్లె నాల్గవది, పాపాఘ్ని నది పినాకిని (పెన్నా) నదిలో కలిసే చోటు ఐదవది. ఈ ఐదు స్థానాలలో పాపాఘ్ని నది మహా పవిత్రంగా పరిగణింపబడుతోంది. పాపాఘ్ని నది గండి క్షేత్రంలో ఆంజనేయస్వామి ఆలయానికి ఎదుట దక్షిణం నుండి ఉత్తర ప్రవాహం ఉండటంతో మరింత ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది.

గండిలో ఉన్న దర్శనీయ స్థలాలు

గండి పుణ్యక్షేత్రంలో పలు దర్శనీయ స్థలాలు ఉన్నాయి. భూమానంద ఆశ్రమం.. నామాలగుండు, దాసరయ్య కోన, మాతంగ గుహ, జీకొండ్రాయుని మేరు పర్వత శిఖరం, శ్రీచౌడేశ్వరి ఆలయం, ఉమామహేశ్వరాలయం, పావురాల గుట్ట, ఏకదంతపు నాయని కోట, గవి మల్లేశ్వరస్వామి ఆలయం, కోదండ రామాలయం, శనేశ్వరాలయాలు ఉన్నాయి.

సమీపంలో ఉన్న పర్యాటక ప్రాంతాలు

గండికి సమీపంలో 8కి.మీ దూరంలో పలు పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. గండి వీరన్నగట్టుపల్లె సర్కిల్ వద్ద నుండి తూర్పు వైపు వెళితే వైఎస్ఆర్ ఘాట్, ఎకో పార్కు, ట్రిపుల్ ఐటీ, నెమళ్ల పార్కు ఇక్కడ చూడాల్సిన ప్రదేశాలు. గండికి వచ్చిన భక్తులందరూ ఈ ప్రాంతాలను కూడా సందర్శిస్తుంటారు.

- కోడూరు రామమోహనరెడ్డి
సాక్షి, వేంపల్లి, వైఎస్ఆర్ జిల్లా

పుణ్య తీర్థం



శ్రావణ మాస శోభ

ఏటా శ్రావణ మాసంలో ఇక్కడ శ్రావణ మాస ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఏడాది ఉత్సవాలు ఇప్పటికే మొదలయ్యాయి. తొలి శనివారం పూజ పూర్తయింది. ఈ నెల 5వ తేదీన రెండవ శనివారం, మూడవ శనివారం ఆగస్ట్ 12న, నాల్గవ శనివారం ఆగస్ట్ 19వ తేదీలలో గండి క్షేత్రంలో శ్రావణ మాస శోభ కనిపిస్తుంది. నాల్గవ శనివారం స్వామి వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ నాలుగు వారాలలో భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. దుష్టశక్తులను తరిమికొట్టే దేవుడిగానే గాక సంతానప్రదాతగా కూడా స్వామికి పేరుంది. గండి ఆంజనేయస్వామిని కొలిస్తే సంతానం కలుగుతుందన్న నమ్మకం ఉండటంతో భక్తుల సందడి అధికంగా ఉంటుంది.

- వర్ధి కేసరి అయ్యంగార్
(ఆలయ అర్చకులు)

ఈ క్షేత్రానికి ఇలా వెళ్లాలి

వైఎస్ఆర్ జిల్లాలో వేంపల్లె సమీపంలో ఉన్న గండి వీరాంజనేయస్వామి క్షేత్రానికి పలు మార్గాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుండి భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తారు. కడప నుండి వేంపల్లె మీదుగా గండికి (53కి.మీ) చేరుకోవచ్చు. అలాగే తిరుపతి నుంచి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మీదుగా గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. మదనపల్లె, పీలేరు ప్రాంత వాసులు రాయచోటి మీదుగా గండికి చేరుకోవచ్చు. అలాగే కదిరి, పులివెందుల, వేంపల్లె మీదుగా గండికి చేరుకొనే మార్గాలు ఉన్నాయి.

కొమురెల్లి
కోరమీసాల మల్లన్న

కొండ చెరికలో ఉన్న కోరమీసాల కొంరెల్లి మల్లన్నను కొలిచిన వారికి కొంగు బంగారమే.. మల్లన్న దర్శనం పుర్వజన్మ సుకృతం అంటారు. తెలంగాణలో ప్రతి జిల్లా నుండి భక్తులు తండోపతండాలుగా వచ్చి సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో ఉన్న మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు.



కొండ చెరికలో ఉన్న కొంరెల్లి మల్లన్న విగ్రహం

స్థల పురాణం

కొమురవెల్లి మల్లన్న ఈ పర్వతంపై 11వ శతాబ్దంలో వెలసినట్లు ప్రతీతి. యాదవ కులస్తుడైన ఓ గొర్రెల కాపరి కలలో స్వామి కన్పించి నేను ఇంద్రకీలాద్రిపై వెలసి ఉన్నాను. దర్శించుకొమ్మని, కొలిచిన వారి కొర్కెలు తీరుస్తానని చెప్పినట్లు ప్రచారం. అనాటి నుండి ఆ ప్రాంతం ప్రజలు పూజలు చేయడం మొదలు పెట్టారు. అప్పటికే వీరశైవ సాంప్రదాయం విరాజిల్లుతున్న కాకతీయుల సామ్రాజ్యంలో అంతర్భాగమైన కొముర వెల్లిలో వెలసిన మల్లికార్జున స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేశారని ఇక్కడి పూజారులు చెబుతుంటారు.

కన్నుల పండుగగా.. మల్లన్న కల్యాణం

తెలంగాణ ప్రజల ఇలవేల్పుగా మొక్కే కొంరెల్లి మల్లన్న కల్యాణం ప్రతి సంవత్సరం కన్నుల పండుగగా జరుగుతుంది. మార్గశిర బహుళ ద్వాదశి స్వామివారి దృష్టికుంభం (బలిహరణము) నుండి మొదలయ్యే ఉత్సవాలు మార్గశిర బహుళ ద్వాదశిరోజు కల్యాణం, ఏటా మహాశివరాత్రి రోజు పెద్దపట్నం, ఫాల్గుణ మాసం బహుళ త్రయోదశి రోజు అగ్నిగుండాల ప్రజ్వలన మొదలైన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రతి రోజు స్వామి వారికి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

చెక్కు చెదరని పుట్టమట్టి విగ్రహం

ఇంద్రకీలాద్రిపై కొండ చెరికలో వెలసిన మల్లన్న దేవునికి పూజలు మొదలై ఐదు వందల యేళ్లయింది. విచిత్రం ఏమిటంటే... 500 సంవత్సరాల క్రితం పుట్టమట్టితో విగ్రహాన్ని తయారు చేశారు. దేవుడికి కోరమీసాలు కూడా పెట్టారు. అది ఇప్పటికీ చెక్కు చెదరకుండా అలాగే ఉంది. ఈ విగ్రహం నాభిలో శివలింగం ఉండటం ప్రత్యేకత. యాదవుల ఆడబిడ్డ గొల్ల కేతమ్మ, లింగ బలిజల ఆడబిడ్డ బలిజ మేడలమ్మను పాణిగ్రహణం చేసుకొని స్వామి ఇక్కడ వెలిసినట్లు నానుడి. అందుకోసమే స్వామి వారికి ఇరుపక్కల గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మల విగ్రహాలు ఏర్పాటు చేశారు.



అమ్మవార్లకు బోనాలు



గంగరేగు చెట్టు వద్ద పూజలు



కోనేటి స్నానం

పట్నాల మల్లన్న

దేవస్థానంలో వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం లింగ బలిజలు అర్చన చేయగా, స్వామి వారికి యాదవ కుల ఆచారం ప్రకారం ఒగ్గు పూజారులు వివిధ రంగుల, రంగాలంకార పట్నాలతో స్వామి వారిని కొలుస్తారు. అనంతరం బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలతో స్వామి వారికి అంగరంగ వైభవంగా కల్యాణం జరుగుతుంది. ఇక్కడికి వచ్చే భక్తులు స్వయంగా నివేదన తయారు చేసి ఒగ్గు పూజారుల ద్వారా పట్నం వేయించడం విశేషం. స్వామి వారికి బోనం చేసే కుండను భద్రంగా ఇంటికి తీసుకెళ్లి దాంట్లో పాలు పితకడం, పాలు కాచడం చేస్తే ఆ కుటుంబంలో ఆయురారోగ్యాలతోపాటు, అష్ట ఐశ్వర్యాలు చేకూరతాయని, పశు సంపద, పాడిపంటలతో ఆ ఇల్లు తులతూగుతుందని విశ్వాసం. అదే విధంగా గంగరేగు చెట్టు, ఒళ్లు బండ ఇక్కడ ప్రత్యేకత. గంగరేగు చెట్టుకు ప్రదక్షిణ చేసి ఒళ్లు బండ వద్ద ప్రణమిల్లి చెట్టు వద్ద పట్నం వేసిన వారి కోరికలు తీరుతాయని నమ్మకం. కోర్కెలు తీరాలని కొబ్బరి కాయల ముడుపులు కట్టడం అనవాయితీ. తడి బట్టలతో దేవాలయం ముందుండే ఒళ్లు బండ వద్ద ఒళ్లుపట్టుకుని, కోడెలు కట్టేస్తామని మొక్కిన వారికి సంతానం కల్గుతుందని నమ్మకం.

స్వామివారి బండారి, గంగిరేగు చెట్టు ఆకు ఎంతో మహిమ గలవని, బండారి నుదుట పెట్టుకొని గంగిరేగు ఆకును ఔషధంగా తీసుకుంటే సర్వరోగాలు తొలగిపోతాయని విశ్వాసం.

- ఈరగాని భిక్షం
సాక్షి, సిద్దిపేట
ఫొటోలు: **కె. సతీష్**

ఇలా చేరుకోవచ్చు

ప్రసిద్ధ కొమురెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో ఉంది. హైదరాబాద్ నుండి రాజీవ్ రహదారి మీదుగా 80 కిలోమీటర్లు, వరంగల్ నుండి జనగామ మీదుగా 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుండి సిద్దిపేట మీదుగా వస్తే 80 కిలో మీటర్ల దూరం ఉంటుంది.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ సర్!! నేను ఓ అబ్బాయిని లవ్ చేశాను. ఒకరంటే ఒకరికి ప్రాణం. అయితే మా విషయం ఇంట్లో తెలిసిపోయింది. మా పేరెంట్స్ నన్ను జాబ్ మానిపించేశారు. అయితే కష్టపడి ఇంట్లో అందరినీ ఒప్పించుకున్నాను. బట్ తన ఇంట్లో ఒప్పుకోవడం లేదట. అందుకే ‘మనం విడిపోదాం’ అంటున్నాడు. అంతా ఒప్పుకుని మేం కలిసి ఉండాలంటే ఏం చెయ్యాలి సలహా ఇవ్వండి ప్లీజ్!!


- లతిక

ఉద్యోగం పోయింది!
అబ్బాయి రాలేదు!!
ప్రేమ ఉంది!
ప్రేమికుడు జంప్!!
భ్రమ ఉంది!
జీవితం లేదు!!

‘సార్ ఏంటి సార్ మాకీ తంటా..?

ఒక్క ముక్క అర్థం కావడంలేదు సార్!!’

ఎందుకు అర్థం కావడంలేదు నీలాంబరీ! వెరీ సింపుల్!!



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

‘అరటిపండు లా సింపుల్ కాదు.. ఆపిల్ మీద డింపుల్ కాదు..

ఏదో తేడా కొట్టేసింది సార్!!’

తేడా కొట్టింది నాకు కాదు! ఈ యూత్‌కి!! అమ్మానాన్నలను ఒప్పించుకోవాలి కానీ, ఏంటీ బాధలు? ప్రేమలో పడేదాకా ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. హార్ట్... ఫుల్ చార్జ్‌లో ఉంటుంది. ఆ తరువాత హార్ట్ బ్లాక్ అయ్యి మైండ్ డిశ్చార్జ్ అయిపోతుంది.

‘సార్ మీకో దండం పెడతా.. విషయం తెలుగులో చెబితేనే అరటిపండు ఇస్తా!!’

అబ్బాయి... కుదరడం లేదు, ఇంట్లో ఒప్పుకోవడం లేదు... అని ఎక్స్‌క్యూజ్‌లు ఇస్తున్నాడు. ఒట్టి పిరికోడు. అలాంటి పిరికోణ్ని పెళ్లి చేసుకొనే కంటే సింపుల్‌గా ఉండటం చాలా బెటర్!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సెల్ఫ్ చెక్

డ్రా చేసిన డబ్బు చేతికి రాకపోతే..?



ఇప్పుడు బ్యాంకు లావాదేవీలు చాలా సులభమయ్యాయి. ఖాతా తెరవడంతో బాటే బ్యాంక్ ఏటిఎం కార్డ్ వస్తోంది. అయితే దీని వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం మన పని గోవిందా! ఏటిఎం కార్డ్ వాడకంలో అప్రమత్తంగా ఉంటున్నారా?

1. బ్యాంక్ ప్రతి 3 లేదా 6 నెలలకోసారి పంపే స్టేట్‌మెంట్‌ను పరిశీలించి, తేడా ఉంటే వివరణ కోరతారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
2. మీ తదనంతరం మీ ఖాతాలో ఉన్న మొత్తం ఎవరికి చెందాలో వారి వివరాలను (నామినీ) తప్పనిసరిగా ఇస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
3. పిన్ నెంబర్‌ను వరసగా మూడుసార్లు తప్పుగా కొడితే కార్డ్ బ్లాక్ అవుతుంది. కాబట్టి జాగ్రత్తగా వ్యవహరిస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
4. ఏటిఎం పిన్‌నెంబర్‌ను 2–3 నెలలకోసారి మార్చడం మంచిదని తెలుసు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
5. నగదు విత్‌డ్రా చేయడానికి ఏటిఎం కార్డ్‌ను ఇతరులకు ఇవ్వడం మంచిది కాదని తెలుసు.
   ఎ. కాదు ☐
   బి. అవును ☐
6. తప్పనిసరి పరిస్థితుల్లో అలా చేయవలసి వస్తే మినీ స్టేట్‌మెంట్‌ను చెక్ చేసుకోవడం, వెంటనే ఏటిఎం పిన్ నంబర్‌ను మార్చడం మంచిదని తెలుసు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
7. ఏటిఎం కార్డ్ పోయినట్లయితే ఆ విషయాన్ని వెంటనే బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లి కార్డును బ్లాక్ చేయిస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
8. పిన్ నెంబర్‌ను కొన్ని కొండగుర్తుల సాయంతో గుర్తుంచుకోవడం మినహా కార్డ్ మీద రాయడం సురక్షితం కాదు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
9. ఒక్కొక్కసారి విత్‌డ్రా చేయబోయిన మొత్తం చేతికి అందకుండానే ఖాతా నుంచి నగదు నిల్వ తగ్గిపోయినట్లుగా చూపిస్తుంటుంది. ఇటువంటప్పుడు మన నగదును బ్యాంకు నుంచి రాబట్టుకోవాలంటే ఆ స్లిప్‌ను జాగ్రత్త చేయడం తప్పనిసరి అని మీకు తెలుసు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
10. మీకు లాటరీ వచ్చింది అంటూ ఫోన్ చేసి ఏటిఎం కార్డ్ మీద ఉండే సివివి నంబరు అడిగి మోసాలకు పాల్పడుతుంటారు. కాబట్టి ఎవరికీ సివివి నంబరు చెప్పకూడదని మీకు తెలుసు.
    ఎ. కాదు ☐ బి. అవును ☐

పై వాటిలో కనీసం ఏడింటికైనా ‘బి’లు వచ్చినట్లయితే మీకు ఏటిఎం కార్డ్ వాడకంపై తగినంత అవగాహన ఉందని చెప్పవచ్చు. 5 లోపుగా వస్తే మీరు ఏటిఎం కార్డ్ వాడకంలో మరిన్ని జాగ్రత్తలు తెలుసుకోవడం మంచిది.

కాసుకో సుడోకు

5					2			8
	8	3	1			9		4
9			8			1	5	
			9				8	3
	6	9	7	4	8	5	2	
8	1				6			
	9	2			4			6
6		4			9	2	1	
1			6					5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	6	3	8	1	2	7	4	9
7	2	1	9	3	4	6	8	5
9	4	8	5	6	7	3	2	1
2	1	7	4	9	6	8	5	3
3	9	5	2	8	1	4	6	7
4	8	6	3	7	5	9	1	2
8	5	2	7	4	9	1	3	6
1	7	4	6	2	3	5	9	8
6	3	9	1	5	8	2	7	4



అప్పుడు మా ఆవిడ చంపేస్తుంది!

“నేను నిర్మాతగా వ్యవహరించే సినిమాల చిత్రీకరణలకు అస్సలు వెళ్లను. నేనొక్క రోజు సెట్‌కు వెళ్లినా ఆ సినిమా సుకుమారే డైరెక్ట్ చేశాడంటారు. పైగా, నాకో విజన్ ఉంటుంది. ఆయా దర్శకులకు వేరే విజన్ ఉంటుంది. నేనేదో ఉచిత సలహా ఇచ్చి, వాళ్ల కష్టాన్ని తక్కువ చేయడం ఎందుకు? అందుకే, ‘కుమారి 21ఎఫ్’ సెట్‌కి గానీ, ఈ ‘దర్శకుడు’ సెట్‌కి గానీ వెళ్లలేదు” అన్నారు సుకుమార్. అశోక్, ఈషా జంటగా హరిప్రసాద్ జక్కా దర్శకత్వంలో బీఎన్‌సీఎస్‌పీ విజయ్‌కుమార్, థామస్‌రెడ్డి ఆదూరి, రవిచంద్ర సత్తిలతో కలసి ఆయన నిర్మించిన ‘దర్శకుడు’ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా సుకుమార్ చెప్పిన విశేషాలు...

● సుకుమార్

‘దర్శకుడు’ ఎలా ఉన్నాడు?

ఓ ప్రేక్షకుడిగా చూశా. చాలా బాగున్నాడు. సినిమా చూసినప్పుడు కొన్నిసార్లు మనకు రిజల్ట్ తెలుస్తుంది. లేదంటే ఇంత కాన్ఫిడెంట్‌గా చెప్పలేం! అందమైన ప్రేమ కథా చిత్రమిది. నా తరహా సినిమా కాదు.

తెరపై దర్శకుణ్ణి చూసినప్పుడు మీకు మీరు గుర్తొచ్చారా?

లేదు. నా కథ కాదిది. అందులో నా పాత్ర ఏం లేదు. సెట్‌లో కాస్ట్యూమ్ డిజైనర్‌తో ప్రేమలో పడ్డ దర్శకుడి కథ. (నవ్వుతూ...) నేనలా చేస్తే మా ఆవిడ చంపేస్తుంది కాబట్టి... నాకలాంటి ఎక్స్‌పీరియన్స్ లేదు.

హీరోగా చేసిన మీ అన్న కొడుకు అశోక్ బాడీ లాంగ్వేజ్ మీలాగే ఉందట?

ఏదైనా పాత్రలో నటించేటప్పుడు అలాంటి వ్యక్తులను అబ్జర్వ్ చేస్తారు కదా. అందులోనూ దర్శకుడి పాత్ర. తనకు ఎక్కువ తెలిసిన దర్శకుణ్ణి, కళ్ల ముందున్నది నేనే. కొన్నిసార్లు నాకు కోపం వచ్చినప్పుడు చేతిలో ఉన్నది విసిరేస్తా. అటువంటి సీన్స్‌లో ‘చిన్నాన్న అయితే ఎలా చేస్తాడు?’ అని ఊహించుకుని చేశాడేమో! నిజం చెప్పాలంటే... సీరియస్ ఎమోషనల్ సీన్స్‌లో అనుభవమున్న నటుడిలా అశోక్ బాగా చేశాడు.

మీ లైఫ్‌లోంచి ఓ సీన్ కాపీ చేశానని హరిప్రసాద్ అన్నారు. ట్రైలర్‌లోని ఆ సీన్ చూసి మీ వైఫ్ ఏమన్నారు?

(నవ్వుతూ...) ‘నా సీన్ కాపీ కొట్టేశావ్’ అని తిట్టింది. ఫస్ట్‌లో తనకు సినిమాల గురించి ఏం తెలీదు. ఆమెది హైదరాబాద్. ఎక్కువ హిందీ సినిమాలు చూసేది. నా సిన్మాలు చూడలేదు. ‘డైరెక్షన్ అంటే నువ్వేం చేస్తావ్’ అనడిగింది. తన డౌట్ ఏంటంటే... ‘డ్యాన్స్ మాస్టర్ డ్యాన్స్ చేస్తాడు, ఆర్టిస్ట్ యాక్ట్ చేస్తాడు, ఇలా అందరూ అన్నీ చేస్తే నువ్వేం చేస్తావ్?’ అంది. ఆర్టిస్టులకు ఎలా చేయాలో చెబుతానన్నా. ‘అల్లు అర్జున్‌కు చెబుతావా నువ్వు? బన్నీ ఆ మాత్రం చేయలేడా? నువ్వు చెప్పేదేంటి!’ అంది. కొన్నాళ్లు తనది ఇన్నోసెన్సా? మరొకటా? అర్థం కాలేదు. సెట్‌లో కూడా అప్పుడప్పుడూ అందరూ తమ తమ పనులు చేసేస్తుంటే... ‘ఇక్కడ నా జాబ్ ఏంటి?’ అనే భయం వేస్తుంది. వాళ్లు సరిగ్గా చేసినా, ఏదొకటి మార్పులు చెబుతాం. చివరకు, ఎడిటింగ్‌లో వాళ్లు చేసిందే పెట్టుకుంటాం.

మామూలుగా ఎప్పుడైనా మీ వైఫ్ మిమ్మల్ని తిట్టిన, కోప్పడిన సందర్భాలున్నాయా?

ఫ్యామిలీకి ఎక్కువ టైమ్ కేటాయించలేదని ఫీలవుతుంటుంది. ఇంటికి వెళ్లినప్పుడు అబ్బాయి ఏం చేశాడో చూడమని మా ఆవిడ చూపిస్తుంది. ఆనందపడతా. కానీ, నా సినిమా హిట్టయితే ఉన్నంత ఆనందం ఉండదేమోననే డౌట్. ఒక్కోసారి పర్సనల్ లైఫ్‌ను నెగ్లెక్ట్ చేస్తాం.

లాజిక్స్‌తో సినిమా తీసే మీరు ఎప్పుడో 1985లోకి వెళ్లి పల్లెటూరి నేపథ్యంలో ‘రంగస్థలం’ తీస్తున్నారేంటి?

ఎప్పట్నుంచో పల్లెటూరి నేపథ్యంలో ఓ సినిమా చేయాలనుంది. రామ్‌చరణ్ ‘రంగస్థలం’తో అది కుదిరింది. కథ ప్రకారమే 1985 నేపథ్యం ఎంచుకున్నా. ప్రయోగమేమీ కాదు, మంచి కమర్షియల్ సినిమా. 85లోకి వెళ్లి తీస్తేనే కథ వర్కౌట్ అవుతుంది. అప్పుడు సెల్‌ఫోన్స్ లేవు కదా. అలాంటి లాజిక్స్ కొన్ని ఉన్నాయి. పాపికొండల్లో సెల్ సిగ్నల్స్, పొల్యూషన్ లేని చోట చిత్రీకరించాం. మీరు నమ్మరు నాకు కొన్ని హెల్త్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. అక్కడ ఉన్నప్పుడు ఏం లేవు. ఆరోగ్యంగా ఉన్నా. ఇక్కడికి రాగానే మళ్లీ మొదలు.

మీరు మ్యాథ్స్ లెక్చరర్ కదా! మీ దగ్గర్నుంచి సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ ఆశించొచ్చా?

సైన్స్ ఫిక్షన్ చేయాలంటే ఇక్కడి మార్కెట్ చాలదు. హిందీలో చేయాలి. అలాంటి కాన్సెప్ట్స్ నా దగ్గర కొన్ని ఉన్నాయి. కానీ, అవి వర్కౌట్ అవ్వాలంటే చాలా కుదరాలి. భారీ బడ్జెట్‌తో తీసేంత లిబర్టీ రావాలంటే కంటిన్యూస్ సక్సెస్‌లు ఉండాలి.

పూరి జగన్నాథ్ డ్రగ్స్ ఇష్యూ వార్తలు విన్నప్పుడు ఏమనిపిస్తుంది?

ఆయనకు ఇంకో మంచి కథ దొరికిందనిపిస్తుంది. ఆయన చాలా స్ట్రాంగ్. పూరీతో మాట్లాడితే... ఆయన మనసెంత అందమైనదో తెలుస్తుంది. ఐ లవ్ హిమ్. ఆయన్ను కలవాలని ఓ రోజు ఇంటి వరకు వెళ్లా. లేరన్నారని వచ్చేశా. వెంటనే కాల్ చేశా. ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. ‘దర్శకుడు’లోనూ అంతే. అతని లైఫ్‌లో ప్రేమ, దర్శకత్వం రెండూ ఉంటాయి. కానీ, వాడు దర్శకత్వానికి ఇచ్చినంత ఇంపార్టెన్స్ ప్రేమకు ఇవ్వడు. ఉదాహరణకు... మా ఆవిడతో షాపింగ్‌కు వెళ్లినప్పుడు తను రెండు డ్రస్సులు చూపిస్తే.. ‘బాగున్నాయి, రెండూ తీసుకో’ అన్నా. అలాంటి నేను ఓసారి తమన్నా కాస్ట్యూమ్ బాగోలేదని రెండు గంటలు ‘100% లవ్’ షూటింగ్ ఆపేశా. కాస్ట్యూమ్స్ తెప్పించి వెతుకుతుంటే, వెనుక మా ఆవిడ ఉంది. ‘హీరోయిన్ కోసం ఇంత టైమ్ కేటాయించావ్. నాకోసం లేదు’ అని అలిగింది. ఆమెను బుజ్జగించడానికి కొంచెం టైమ్ పట్టింది (నవ్వుతూ).

‘దర్శకుడు’ సినిమా ట్రైలర్‌లో ‘దర్శకత్వమంటే 20 శాతం క్రియేటివిటీ, 80 శాతం మేనేజ్‌మెంట్’ డైలాగ్‌పై మీ ఫీలింగ్?

కథ రాసేంత వరకు మన చేతిలో ఉంటుంది. తర్వాత ఒప్పించడానికి కొందర్ని మేనేజ్ చేయాలి. అలాగని, వాళ్లేం తప్పు చేయడం లేదు. నేను, వాళ్లూ అందరికీ నచ్చాలనే క్రమంలో క్లాష్ తప్పదు. తర్వాత సెట్‌కి వెళ్లగానే ఓ ఐదొందల మందిలో ఎవరినీ నొప్పించకుండా, సినిమాను కంప్లీట్ చేయాలి. అప్పుడు.. 20 శాతం క్రియేటివిటీ అనేది 100 శాతం. 80 శాతం మేనేజ్‌మెంట్ అనేది 20 శాతం. 20 శాతం ఎఫర్ట్స్‌తో 80 శాతం మేనేజ్‌మెంట్ చేయాలి. 80 శాతం ఎఫర్ట్స్‌తో 20 శాతం క్రియేటివిటీ చూపాలి.

నెక్స్ట్ ఏంటి? అశోక్‌ను హీరోగా కంటిన్యూ చేస్తారా? దర్శకుణ్ణి చేస్తారా?

చేతిలో ఓ పనుంటే దాంతో ఎలాగైనా బతకొచ్చు. అశోక్ మంచి రైటర్. అయితే... ఈ సిన్మా రిజల్ట్ బట్టి తన ఫ్యూచర్ ఉంటుంది. సూపర్ హిట్టయితే హీరోగా రెండు ఛాన్సులొస్తాయి. లేదంటే... దర్శకుడవుతాడు.

అన్నదాత... సుఖీభవ



● ఆర్. నారాయణమూర్తి

‘‘అందరికీ అన్నం పెట్టే రైతన్నల పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, రైతుల ఆత్మహత్యలను రూపుమాపేలా చర్యలు తీసుకోవాలని మా నూతన చిత్రం ద్వారా చెప్పాలనుకుంటున్నాం’’ అన్నారు ఆర్. నారాయణమూర్తి. స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై ఆయన నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రం‘అన్నదాత సుఖీభవ’. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 4న ఆరంభం కానుంది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయల సమావేశంలో ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ– ‘‘ప్రధాని మోదీగారికి, తెలంగాణ సీయం కేసీఆర్‌గారికి, ఏపీ సీయం నారా చంద్రబాబునాయుడుగారికి నా సినిమా ద్వారా మూడు విజ్ఞప్తులు చేయాలనుకుంటున్నాను. రైతుల ఆత్మహత్యలను జాతీయ విపత్తుగా భావించడంతో పాటు శాస్త్రవేత్త ఎమ్.ఎస్. స్వామినాథన్ సిఫార్సులను పరిశీలించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాం. అలాగే, కేసీఆర్‌గారు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతోపాటు అనేక సౌకర్యాలను కలిపిస్తూ రైతులకు మేలు చేస్తున్నారు. అయితే గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతుల ఆత్మహత్యలు తగ్గడం లేదు. ఈ విషయంపై కేసీఆర్‌గారు తగు చర్యలను తీసుకోవాలని ఈ చిత్రం ద్వారా కోరుతున్నాం. ఏపీ సీయం చంద్రబాబునాయుడుగారు నదుల అనుసంధానంతో రైతులకు మరింత మేలు చేయాలని ఈ చిత్రంతో చెప్పాలనుకుంటున్నాం. అన్నదాతలూ మీరు చనిపోవద్దు. మీరు బతకండి... మమ్మల్ని బతికించండి’’ అన్నారు.

చైతూతో లైలా!?



● నాగచైతన్య

అక్కినేని యువ మన్మథుడు నాగ చైతన్యతో లైలా మరోసారి జోడీ కడుతున్నారని ఫిల్మ్ నగర్ టాక్. లైలా అంటే ఎవరో కొత్తమ్మాయి కాదు. రీసెంట్‌గా అల్లు అర్జున్ ‘డీజే’తో సందడి చేసిన పూజా హెగ్డేనే. నాగ చైతన్య ‘ఒక లైలా కోసం’ సినిమాతోనే పూజ తెలుగు తెరకు పరిచయమయ్యారు. తాజాగా మరోసారి చైతూతో కలసి నటించబోతున్నారట. ‘కార్తికేయ’ ఫేమ్ చందూ మొండేటి దర్శకత్వంలో చైతూ ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. అందులో పూజా హెగ్డేను హీరోయిన్‌గా ఎంపిక చేశారట. ప్రస్తుతం చైతూ నటిస్తున్న ‘యుద్ధం శరణం’ చిత్రీకరణ చివరి దశకు వచ్చేసిందట. ఈ సినిమా పూర్తయిన తర్వాత పెళ్లి కోసమని చైతూ కొన్ని రోజులు సెలవులు తీసుకోనున్నారు. పెళ్లి తర్వాత సెప్టెంబర్‌లో చందూ మొండేటి సినిమా చిత్రీకరణ ప్రారంభిస్తారట.



● పూజా హెగ్డే

టైటిల్ ఒక్కటే... కథలు రెండు!



● మోహన్‌లాల్

...ఆ రెండిటిలోనూ హీరో ఒక్కరే కావడం విశేషమిక్కడ! మలయాళ హీరో మోహన్‌లాల్ ‘విలన్’ టైటిల్‌తో మాతృభాషలో ఓ సినిమా చేస్తున్నారు. అందులో మన తెలుగు నటుడు శ్రీకాంత్, హీరో విశాల్, హీరోయిన్లు రాశీ ఖన్నా, హన్సిక ముఖ్య తారలు. సేమ్ టైటిల్‌కు ముందు ‘ది’ తగిలించి.. ‘ది విలన్’ టైటిల్‌తో కన్నడలో ఓ సినిమా రూపొందుతోంది. ఇందులో శివ రాజ్‌కుమార్, ‘ఈగ’ ఫేమ్ సుదీప్ హీరోలు. అమీ జాక్సన్ హీరోయిన్. ఇప్పుడీ కన్నడ విలన్‌ను తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో తీయాలనుకుంటున్నారు నిర్మాత సీఆర్ మనోహర్. తెలుగులో ‘మహాత్మ, రోగ్’ సినిమాలను నిర్మించిందీయనే. తెలుగు, తమిళ ప్రేక్షకులకు సుదీప్, అమీలు సుపరిచితులే. శివ రాజ్‌కుమార్ గురించి తక్కువమందికి తెలుసు. సో, ఆ పాత్రలో మిగతా భాషల ప్రేక్షకులకు పరిచయమున్న నటుడయితే బాగుంటుందని మోహన్‌లాల్‌ను సంప్రదించారు. కన్నడ వెర్షన్‌లో శివ రాజ్‌కుమార్ చేస్తున్న పాత్రను తెలుగు, తమిళ, మలయాళ వెర్షన్స్‌లో మోహన్‌లాల్ చేస్తారన్న మాట. ప్రస్తుతం హీరో, దర్శక–నిర్మాతల మధ్య డిస్కషన్స్ జరుగుతున్నాయి. ‘ది విలన్’కు మోహన్‌లాల్ ఆల్మోస్ట్ సైన్ చేసినట్టే! ఇంకో విశేషం ఏంటంటే... ఇందులోనూ శ్రీకాంత్ కీలక పాత్ర చేస్తున్నారు. ఆయన కూడా సేమ్ టైటిల్‌తో రూపొందుతోన్న రెండు సినిమాల్లో చేయబోతున్నారన్న మాట!

బంగారం చిన్నోడు.. ఫిదా చిన్నది...

ఏం పిల్లరా... యెల్లట్లేదు మైండ్‌లోంచి. భలే నటించిందిరా! అంటున్నారు ‘ఫిదా’లో సాయి పల్లవిని చూసినోళ్లు. తెలుగు ప్రేక్షకులను అంతగా ఫిదా చేసిన ఈ అమ్మాయి వచ్చే నెల్లో మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. అయితే... స్ట్రయిట్ తెలుగు సినిమాతో కాదు. మలయాళ అనువాదంతో మనల్ని పలకరించనున్నారు. ‘ఓకే బంగారం’ ఫేమ్ దుల్కర్ సల్మాన్, సాయి పల్లవి జంటగా సమీర్ తాహిర్

● దుల్కర్ సల్మాన్ సాయిపల్లవి



దర్శకత్వంలో రూపొందిన మలయాళ సినిమా ‘కలి’ను ప్రముఖ సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ డీవీ కృష్ణస్వామి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు డబ్బింగ్, మిక్సింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల రెండో వారంలో టైటిల్ ప్రకటించి, సెప్టెంబర్‌లో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రానికి మాటలు: భాషా శ్రీ, సాహిత్యం: సురేంద్ర కృష్ణ, సంగీతం: గోపీసుందర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దక్షిణ్ శ్రీనివాస్, సహ–నిర్మాత: వి. చంద్రశేఖర్.

బృందావనంలో కొత్తవాళ్లు!

‘బృందావనమది అందరిది’ చిత్రంతో తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన శ్రీధర్ సీపాన దర్శకుడిగా మారుతున్నారు. అంతా కొత్త నటీనటులతో తీయనున్న ఈ సినిమా గురించి శ్రీధర్ సీపాన మాట్లాడుతూ– ‘‘దర్శకునిగా మారడం ఆనందంగా ఉంది. రచయితగా నన్ను ఆదరించిన ప్రేక్షకులు దర్శకుడిగానూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను. జంధ్యాలగారిలా అందరూ నవ్వుకునే సినిమాలు తీయాలనుకుంటున్నాను. అందుకే కమర్షియల్ కథలు ఉన్నా అవన్నీ పక్కనపెట్టి ఈ వినోదాత్మక కథను ఎంచుకున్నాను. వినోదాత్మకంగా ఉంటూనే మనలోని బంధాలను గుర్తు చేసేలా ఉంటుందీ సిన్మా. కథ, ఫైట్లు, పాటలు ఉండే సాధరణ చిత్రంలా ఉండదు. ఈ సినిమాతో దర్శకుడిగా నాకో మార్క్ తెచ్చుకోవాలనుకుంటున్నాను’’అన్నారు.



● శ్రీధర్ సీపాన

ఆర్కేగౌడ్‌కు స్పీకర్ అభినందన

తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన ప్రతాని రామకృష్ణగౌడ్‌ను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎస్. మధుసూధనాచారి అభినందించారు. ప్రొడ్యూసర్స్ సెక్టార్ ఈసీ మెంబర్‌గా కూడా ఆర్కే గౌడ్ ఎన్నికైయ్యారు. మూడువందల పై చిలుకు ఓట్లు వేసి, గెలిపించిన నిర్మాతలకు ఆర్కే గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడానికి కృషి చేస్తానన్నారు.



● ఆర్కే గౌడ్, మధుసూధనాచారి

శ్రీకరం.. శుభకరం



● ప్రశాంత్, ఐన్‌థ్రిల్లా

నిమ్మని ప్రశాంత్, ఐన్‌థ్రిల్లా చక్రవర్తి జంటగా వాన మామలై కృష్ణదేవ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం ‘శ్రీకరం శుభకరం నారాయణీయం’. ‘‘సంప్రదాయ కుటుంబ యువతి, దీనికి ప్రభావితం అయినటువంటి సామాన్య యువకుని విజయ పరంపర ఈ చిత్ర మూలకథ. మోడర్న్ కల్చర్‌కు అలవాటు పడిన యువతను భారతీయ సనాతన సమాజానికి దూరం కాకుండా, ప్రగతి మార్గంలో ఆధ్యాత్మిక చింతన అలవరచుకునే విధంగా చిత్రాన్ని తీర్చిదిద్దుతాం’’ అన్నారు కృష్ణదేవ్. ఈ సినిమాకు సంగీతం: తారక రామారావు.

10 సాక్షి భవిత
బుధవారం 2-8-2017
స్పర్ధయా వర్ధతే విద్య
విద్య నేటి విద్యలో..
● జనరల్ స్టడీస్: ఇండియన్ జాగ్రఫీ
● ఎస్సెస్సీ సీజీఎల్: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

పరీక్ష తేదీలు

- హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఇంజన్ డివిజన్‌లో డిప్లొమా టెక్నీషియన్ (మెకానికల్) పోస్టులకు రాతపరీక్ష: ఆగస్టు 5
- నాబార్డ్‌లో గ్రేడ్ 'ఎ', గ్రేడ్ 'బి' ఆఫీసర్స్ పోస్టులకు ప్రిలిమ్స్ ఎగ్జామినేషన్: ఆగస్టు 5, 6
- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)- జేహెచ్‌టీ, హెచ్‌టీ, ఎస్‌హెచ్‌టీ, హిందీ ప్రధ్యాపక్ ఎగ్జామ్-2017 (పేపర్-2): ఆగస్టు 6

పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం లక్ష్యాలు?

గ్రూప్స్ ప్రత్యేకం


ఇండియన్ ఎకానమీ

- ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్ర; దేశీయ, విదేశీ పెట్టుబడులు; సాంకేతిక పరిజ్ఞానం మొదలైన వాటి విషయంలో ప్రభుత్వ వైఖరిని సంబంధిత దేశ పారిశ్రామిక విధానంలో వివరిస్తారు.
- ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వనరులను అభిలషణీయంగా ఉపయోగించుకోవాలి. నిర్దేశిత లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. దీనికి సంబంధించి ఉత్పత్తి ప్రక్రియలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్రను పారిశ్రామిక విధానం వివరిస్తుంది.
- స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశానికి సరైన, కచ్చితమైన పారిశ్రామిక విధానం లేదు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం పారిశ్రామిక విధానం ఆవశ్యకతను గుర్తించి 1948, ఏప్రిల్ 6న మొదటి పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించింది.

మొదటి పారిశ్రామిక విధాన తీర్మానం

- ఈ తీర్మానంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పరిధిని స్పష్టంగా పేర్కొంటూ పరిశ్రమలను నాలుగు వర్గాలుగా విభజించారు. ఈ తీర్మానంతో మన దేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకొంది.
- **మొదటి వర్గం (ప్రభుత్వ ఏకస్వామ్యం):** ఈ వర్గంలోని పరిశ్రమలు ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉంటాయి. మూడు రకాల కార్యకలాపాలను నిర్వహించే పరిశ్రమలను ఈ వర్గంలో చేర్చారు. అవి..

1. దేశ రక్షణ, తత్సంబంధ పరిశ్రమలు, ఆయుధ సామగ్రి, ఆయుధాల ఉత్పత్తి, నియంత్రణ.
2. అణుశక్తి ఉత్పత్తి, నియంత్రణ.
3. రైల్వేలు వాటి నిర్వహణ, యాజమాన్యం

రెండో వర్గం (మిశ్రమ రంగం): ఇందులో ఆరు కీలక, మౌలిక పరిశ్రమలను చేర్చారు. అవి..
1. బొగ్గు, 2. ఇనుము, ఉక్కు, 3. విమానాల ఉత్పత్తి, 4. నౌకా నిర్మాణం,
5. టెలిఫోన్, టెలిగ్రాఫ్, వైర్‌లెస్ పరికరాల ఉత్పత్తి, 6. ఖనిజ నూనెలు.

- ఈ తీర్మానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ వర్గంలోని పరిశ్రమల్లో కొత్త వాటిని ప్రైవేటు రంగంలో స్థాపించడానికి వీల్లేదు. ఇకపై వీటిని ప్రభుత్వ రంగంలోనే స్థాపిస్తారు. అప్పటికే ప్రైవేటు రంగంలో ఉన్న వాటిని కొనసాగించవచ్చు. అవసరమనుకుంటే పదేళ్ల తర్వాత నష్టపరిహారం చెల్లించి వాటిలో దేన్నయినా ప్రభుత్వం జాతీయం చేయొచ్చు.

మూడో వర్గం (ప్రభుత్వ నియంత్రణ): ఈ వర్గంలో జాతీయ ప్రాముఖ్యం ఉన్న 18 పరిశ్రమలను చేర్చారు. వీటిని ప్రభుత్వం నిర్వహించనప్పటికీ వీటి నియంత్రణ, అజమాయిషీ ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ నియమ, నిబంధనలకు లోబడి వీటి ఉత్పత్తులు కొనసాగాలి. ఇందులో ఆటోమొబైల్స్, భారీ రసాయనాలు, భారీ యంత్రాలు, యంత్ర పరికరాలు, ఎరువులు, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, పంచదార, కాగితం, సిమెంట్, వస్త్ర, ఊలు మొదలైన పరిశ్రమలను చేర్చారు.

నాలుగో వర్గం (ప్రైవేటు రంగం): పై మూడు వర్గాల్లో లేని పరిశ్రమలను ఇందులో చేర్చారు. వీటిని ప్రైవేటు రంగానికి వదిలేశారు. అయితే వీటిపై ప్రభుత్వం సాధారణ అజమాయిషీ కలిగి ఉంటుంది.

1951-పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం

(పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం)

- మన దేశంలో ప్రైవేటు రంగ పరిశ్రమల అభివృద్ధిని క్రమబద్ధం చేయడం, వాటిని నియంత్రించడం అనే రెండు ప్రధాన ఉద్దేశాలతో 1951, అక్టోబర్‌లో పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని (పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం) పార్లమెంటు చట్టం ద్వారా రూపొందించారు. ఈ చట్టం 1952, మే 8 నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ చట్టం లక్ష్యాలు

1. ప్రణాళికా లక్ష్యాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పారిశ్రామిక పెట్టుబడులు, ఉత్పత్తులు ఉండేలా చూడటం.
2. పెద్ద పరిశ్రమల పోటీ నుంచి చిన్న పరిశ్రమలను రక్షించడం.
3. ఏకస్వామ్యాలను నిరోధించడం.
4. సంతులిత ప్రాంతీయాభివృద్ధి.
5. వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం.
6. దేశీయ మార్కెట్లో సప్లై, డిమాండ్‌ల మధ్య సహ సంబంధాన్ని తీసుకురావడం.
7. సామాజిక మూలధనాన్ని అభిలషణీయంగా ఉపయోగించుకోవడం.

- ఈ చట్టం పరిధిలోకి వచ్చే పరిశ్రమలు ప్రారంభంలో 37 ఉండగా, తర్వాత కాలంలో 70కి పెంచారు. ఇందులోని పరిశ్రమలు రిజిస్టర్ చేసుకొని లైసెన్స్ పొందాలి.
- 1953లో రూ.1 లక్ష కంటే ఎక్కువ పెట్టుబడి కలిగిన పరిశ్రమలను దీని పరిధిలోకి తెచ్చారు. అయితే లైసెన్సింగ్ అథారిటీపై పరిపాలన పరమైన భారం, ఒత్తిడి మూలంగా 1956లో ఈ నిర్ణయాన్ని ఉపసంహరించారు.
- 1956లో విద్యుత్‌ను ఉపయోగించి, 50 మంది శ్రామికులతో ఉత్పత్తిని చేపట్టే పరిశ్రమలు (లేదా) విద్యుత్‌ను వాడకుండా 100 మంది శ్రామికులతో ఉత్పత్తిని నిర్వహించే పరిశ్రమలను ఈ చట్టం పరిధిలోకి చేర్చారు.
- ఈ చట్టం పరిధిలోకి వచ్చే పరిశ్రమల పెట్టుబడి పరిమితిని 1960లో రూ.10 లక్షలకు పెంచారు. ఈ పరిమితిని 1963లో రూ.25 లక్షలకు పెంచారు. 1970లో రూ. కోటికి పెంచారు. 1978లో రూ.3 కోట్లకు పెంచారు. ఆ తర్వాత పెట్టుబడి పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు.
- 1988-89లో ప్రభుత్వం లైసెన్సింగ్ విధానంలో విప్లవాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. దీని ప్రకారం అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో రూ.15 కోట్లు, వెనుకబడిన ప్రాంతాల్లో రూ.50 కోట్లకు పైబడిన పెట్టుబడి గల పరిశ్రమలు మాత్రమే లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. లిబరలైజేషన్ పాలసీ (సరళీకృత విధానం)లో భాగంగా లైసెన్స్‌ల రద్దు వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది.

రెండో పారిశ్రామిక విధాన తీర్మానం-1956

- 1956, ఏప్రిల్ 30న భారత ప్రభుత్వం రెండో పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించింది. 1956 నాటికి మన దేశంలో అనేక రాజకీయ, ఆర్థిక మార్పులు సంభవించాయి.
- 1956 నాటికి మొదటి పంచవర్ష ప్రణాళికను పూర్తి చేసుకోవడం, రెండో ప్రణాళికలో భారీ, మౌలిక పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం, సమ సమాజ స్థాపనను లక్ష్యంగా నిర్ణయించుకోవడం మొదలైనవి 1956 పారిశ్రామిక విధాన తీర్మాన ప్రకటనకు కారణమయ్యాయి.

మూడు జాబితాలు:

- 1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో పరిశ్రమలను ఎ, బి, సి అనే మూడు జాబితాలుగా వర్గీకరించారు.
- **జాబితా-ఎ:** ఇందులో 17 పరిశ్రమలను చేర్చారు. దేశ రక్షణ, తత్సంబంధ పరిశ్రమలు దీనిలో ఉన్నాయి. వీటిలో ఆయుధాలు, అణుశక్తి, విమాన రవాణా, రైల్వే రవాణా పరిశ్రమలు ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉంటాయి. మిగతా 13 పరిశ్రమలను ఈ తీర్మానం తర్వాత నుంచి ప్రభుత్వమే స్థాపిస్తుంది. అప్పటికే ప్రైవేటు రంగంలో ఉన్నవి కొనసాగవచ్చు. అవసరమైతే వీటిని ప్రైవేటు రంగంలో కూడా నెలకొల్పే అవకాశం కల్పించారు. ఈ తీర్మానంలో పరిశ్రమలను జాతీయం చేసే ప్రతిపాదన లేదు.
- **జాబితా-బి:** అన్ని రకాల ఖనిజాలు, లోహాలు, యంత్ర పనిముట్లు, మిశ్రమ లోహాలు, ఎరువులు, రబ్బరు, బొగ్గు తదితర 12 పరిశ్రమలను ఇందులో చేర్చారు. ప్రభుత్వం నూతన సంస్థలను స్థాపించి తన భాగస్వామ్యాన్ని పెంచుకోవచ్చు. అయితే ప్రైవేటు రంగం కొత్త సంస్థలను స్థాపించడానికి, ఉన్న వాటిని విస్తృతం చేసుకోవడానికి ఏ ఆటంకం ఉండదు.
- **జాబితా-సి:** ఎ, బి జాబితాల్లో లేని పరిశ్రమలను ఇందులో చేర్చారు. ఈ జాబితాలోని పరిశ్రమల అభివృద్ధి ప్రైవేటు రంగం చొరవపై ఆధారపడి ఉంటుంది. పారిశ్రామికీకరణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ జాబితాలోని పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించడమే కాకుండా నియంత్రిస్తుంది.
- 1970, 1973, 1975ల్లో పారిశ్రామిక విధాన తీర్మానాలను ప్రకటించినా, వాటికి 1956 తీర్మానమే ప్రాతిపదికగా నిలిచింది. ఈ తీర్మానాల్లో మౌలిక మార్పులు లేకుండా కేవలం కుటీర, చిన్నతరహా పరిశ్రమల నిర్వచనాల్లో, లైసెన్సింగ్ విధానంలో, విదేశీ మూలధనం విషయంలో స్వల్ప మార్పులు చేశారు.

జనతా ప్రభుత్వ పారిశ్రామిక విధానం-1977

- 1977లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం, తన శైలిలో 1977 డిసెంబర్ 23న నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. గాంధేయ విధానానికి అనుగుణంగా దీన్ని రూపొందించారు.
- చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి ఇందులో అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

నూతన పారిశ్రామిక విధానం-1991

- 1980 నుంచి మొదలైన సరళీకృత విధానం, నిర్ణయాలకు అనుగుణంగా దీన్ని రూపొందించారు.
- పి.వి.నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా 1991, జూలై 24న దీన్ని ప్రకటించారు.
- ప్రపంచ మార్కెట్‌తో భారత ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేసి, విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర సామగ్రి దిగుమతులను పెంచి, వేగవంతమైన అభివృద్ధిని సాధించడం ఈ తీర్మానం ముఖ్య ఉద్దేశం.
- సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టారు.
- ఈ పారిశ్రామిక విధాన తీర్మానంలో లైసెన్సింగ్ విధానంలోని నిబంధనలను గణనీయంగా సడలించారు.

1991 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రధాన లక్ష్యాలు

- సాధించిన ఆర్థిక ప్రగతి ఫలాలను ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ఉపయోగించడం.
- ఆర్థిక ప్రగతికి ఆటంకం కలిగించే అంశాలను సరిచేయడం.
- ఉత్పత్తి, ఉద్యోగితల్లో సుస్థిర వృద్ధిని నిలుపుకోవడం.
- అంతర్జాతీయంగా ఎదురయ్యే పోటీని తట్టుకోవడం.


అక్కెనపల్లి మీనయ్య
ఎకనామిక్స్ (హెచ్‌వోడీ)- రిటైర్డ్
నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
నల్లగొండ

కాంపిటీటివ్ కౌన్సెలింగ్

పోటీ పరీక్షల్లో కెమిస్ట్రీ ప్రాధాన్యం ఎంత మేరకు ఉంటుంది? ఏయే పాఠ్యాంశాలు ముఖ్యమైనవి?

– కె.ఉమాశంకర్, హైదరాబాద్.

సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, పంచాయతీ కార్యదర్శి, పోలీస్ కానిస్టేబుల్ తదితర పరీక్షల్లో జనరల్ సైన్స్ విభాగంలో రసాయన శాస్త్రం ఒక ముఖ్య విభాగం. గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, ఇతర నియామక సంస్థలు నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే రసాయనశాస్త్రం నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రశ్నలు వస్తున్నట్లు గమనించవచ్చు. వివిధ రకాల పాలిమర్లు, పర్యావరణ రసాయనశాస్త్రం, ఆమ్లాలు-క్షారాలు, లోహశాస్త్రం, వివిధ మూలకాల ఉపయోగాలు, హానికర ప్రభావాలు, కేంద్రక రసాయన శాస్త్రం మొదలైన అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి.



- పరమాణు నిర్మాణం, ఆవర్తన పట్టిక, రసాయనశాస్త్రం, వివిధ రసాయన పదార్థాల ఫార్ములాలు- వాటి ఉపయోగాలు, ఆర్గానిక్ కెమిస్ట్రీ లాంటి అంశాలను తరచు చదువుతుండాలి. ఈ పాఠ్యాంశాల బేసిక్ కాన్సెప్ట్‌ల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. ప్రిపరేషన్‌కు ఎనిమిది నుంచి పదో తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను ఉపయోగించుకోవాలి.
- సమకాలీనంగా రసాయన శాస్త్రం-అనువర్తనాలపై అవగాహన పెంపొందించుకోవాలి. హైస్కూల్ స్థాయి పాఠ్యపుస్తకాలతోపాటు పత్రికల్లో వచ్చే విషయ సంబంధిత వ్యాసాలు, సమకాలీన అంశాలకు సంబంధించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని చదివితే రసాయన శాస్త్రంలోని ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించవచ్చు.

AGRICULTURE SECTOR IN INDIA

Our Agriculture Sector is better understood when we go with the detailed study of the following aspects such as...



- Importance of Agriculture Sector in Indian Economy... in terms of income, employment, infrastructure support, exports, food security, rural development, self sufficiency etc.,
- Agricultural Productivity
- Land Reforms
- Green Revolution
- Agricultural Marketing, Pricing
- Agricultural Credit facilities, Debt Burden
- Agricultural Insurance
- Agriculture Labour issues
- Agriculture Technology
- WTO and Agriculture
- Agriculture and Environment
- Agriculture and Institutional Mechanism, various schemes in India

1. What is the Minimum Support Price announced for Paddy for 2017-18?

Ans: Paddy Common variety Rs.1550/- and Paddy Grade A Rs.1590/-

2. By which year is the present Govt. of India planning to double the income of the farmers?

Ans : 2022

3. According to Radha Mohan Singh, the Indian Agriculture Minister, what is the level of decline in consumption of Chemical Fertilizers during 2016-17?

Ans : The consumption dropped by 8-10% during 2016-17 as compared with 2015-16.

4. What is the target for the distribution of Soil Health Cards to the farmers?

Ans : 12 crore SHCs (Soil Health Cards)

5. Who is the Chairman of NDDB (National Dairy Development Board)?

Ans: Dilip Rath

6. "Committed to Quality" is the motto of which institution?

Ans: NDDB

7. What is e-NAM?

Ans : The National Agriculture Market scheme (e-NAM) was launched on 14.04.2016. The scheme envisages initiation of e-marketing platform at national level and will support creation of infrastructure to enable e-marketing in 585 regulated markets across the country by March 2018.

8. What is MIDH ?

Ans : Mission for Integrated Development of Horticulture (MIDH). A centrally sponsored scheme, is being implemented. 2014-15 onwards, for the holistic growth of the horticulture sector covering fruits, vegetables, root and tuber crops, mushrooms, spices, flowers, aromatic plants, coconut, cashew, cocoa and bamboo. The mission subsumes National Horticulture Mission (NHM), Horticulture Mission for North East & Himalayan States (HMNEH), National Horticulture Board (NHB), Coconut Development Board (CDB) and Central Institute for Horticulture (CIH), Nagaland. All States and UTs are covered under MIDH.

Competitive Guidance
Economy

9. What is the percentage of population that is dependent on Agriculture in India?

Ans : Agriculture is the primary source of livelihood for about 58 per cent of India's population.

10. What is the area of Agriculture in India?


Ans : At 157.35 million hectares, India holds the 2nd largest agricultural land in the world. With 20 agri-climatic regions, all 15 major climates of the world exist in India. The country also possesses 46 of the 60 soil types in the world.

11. What is the level of Agricultural production in our country?

Ans : In FY2016, total food grain production in India was recorded at 253.16 million tonnes, which increased to 273.83 million tonnes in FY17. In 1952-53 the total food grain production was around 59.2 MT. India is the largest producer of spices, pulses, milk, tea, cashew & jute; & the 2nd largest producer of wheat, rice, fruits & vegetables, sugarcane, cotton & oilseeds.

12. What is the level of mechanisation in Indian agriculture sector?

Ans : India is one of the largest manufacturers of farm equipment such as tractors, harvesters, tillers. India accounts for nearly one-third of the overall tractor production, globally, with the tractor production in the country estimated to increase from 0.57 million units in FY16 & reach to 16 million units by 2030.


బి.శ్రీనివాసరావు,
లెక్చరర్ (ఎకనామిక్స్),
పి.ఆర్.గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ,
కాకినాడ.

నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్?

1. 2017 జూలైలో నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా బాధ్యతలు స్వీకరించిందెవరు?
   1) అచల్ కుమార్ జ్యోతి
   2) హెచ్.సి.బ్రహ్మ
   3) ఓం ప్రకాష్ రావత్
   4) సుభాష్ గార్గ్
2. ఐక్యరాజ్యసమితి ప్రజాసేవ పురస్కారం అందుకున్న రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) పశ్చిమ బెంగాల్
   3) పంజాబ్ 4) హరియాణా
3. చైనా తన తొలి విదేశీ సైనిక కేంద్రాన్ని ఏ దేశంలో ఏర్పాటు చేస్తోంది?
   1) ఎరిత్రియా 2) కొమొరోస్
   3) లెసోథో 4) జిబౌతి
4. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే దేశాల జాబితాలో భారత్‌కు ఎన్నో స్థానం దక్కింది?
   1) 122 2) 143 3) 116 4) 133
5. 2017 ఏప్రిల్‌లో బర్మింగ్‌హామ్ (బ్రిటన్)లో 'ఏషియన్ బిజినెస్ ఉమన్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని అందుకున్న భారత సంతతి మహిళ?
   1) సుధా నారాయణమూర్తి
   2) ప్రీతీ పటేల్ 3) ఆశా ఖేమ్కా
   4) అనూజా రవీంద్ర ధీర్
6. 2017-18 ఆర్థిక సంవత్సరానికి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్)కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వారు?
   1) రిషద్ ప్రేమ్‌జీ 2) రమణ్ రాయ్
   3) ఎ.ఎం.నాయక్ 4) ఎస్.డి.శిబులాల్
7. సార్క్ సెక్రటరీ జనరల్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
   1) అంజెద్ హుస్సేన్ బి సియాల్
   2) షాహిద్ అబ్బాసీ
   3) అబ్దుల్ బాసిత్
   4) తెహ్‌మినా జంజువా
8. 2017 మార్చిలో ఇండియన్ ఓషియన్ రిమ్ అసోసియేషన్ సదస్సును ఏ నగరంలో నిర్వహించారు?
   1) న్యూఢిల్లీ 2) కొలంబో
   3) ఢాకా 4) జకార్తా
9. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
   1) నజ్మా హెప్తుల్లా 2) సునయన సింగ్
   3) వీకే సారస్వత్ 4) అమితాబ్ కాంత్
10. 2017, మేలో ఐక్యరాజ్యసమితి ఆవాసం (యూఎన్ హేబిటేట్) 26వ పాలకమండలి సమావేశం ఎక్కడ జరిగింది?



   1) ఇస్తాంబుల్, టర్కీ
   2) నైరోబి, కెన్యా
   3) వాంకోవర్, కెనడా
   4) బొగోటా, కొలంబియా
11. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి?
   1) నరేంద్రసింగ్ తోమర్
   2) పియూష్ గోయల్
   3) బీరేంద్ర సింగ్
   4) థావర్ చంద్ గెహ్లాట్
12. 2017 ఏప్రిల్‌లో జరిగిన మహిళల ప్రపంచ హాకీ లీగ్ రౌండ్-2 టోర్నమెంట్లో విజేతగా నిలిచిన జట్టు?
   1) చిలీ 2) భారత్ 3) బెలారస్ 4) ఉరుగ్వే
13. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ప్రస్తుత చైర్మన్?
   1) యోగేశ్ అగర్వాల్
   2) రామ్‌సేవక్ శర్మ
   3) హేమంత్ కాంట్రాక్టర్
   4) అజయ్ త్యాగి
14. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గ్యుటెరస్ ఇటీవల ఎవరిని శాంతిదూత పురస్కారంతో సత్కరించారు?
   1) నదియా మురాద్
   2) ఆంగ్‌సాన్ సూచీ
   3) కాంషిటా కార్పియో మొరేల్స్
   4) మలాలా యూసఫ్ జాయ్
15. 'మాతోశ్రీ' పుస్తక రచయిత్రి?
   1) వసుంధర రాజే
   2) మమతా బెనర్జీ
   3) సుమిత్రా మహాజన్
   4) ఉమాభారతి
16. జాతీయ ఉత్తమ చలనచిత్రంగా ఎంపికైన 'కాసవ్' ఏ భాషా చిత్రం?
   1) హిందీ 2) మరాఠీ
   3) మలయాళం 4) గుజరాతీ
17. ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ కమిటీకి నేతృత్వం వహించిందెవరు?
   1) ఎన్.కె.సింగ్ 2) పనగారియా
   3) అరవింద్ సుబ్రమణ్యన్
   4) శక్తికాంత దాస్

కాంపిటీటివ్ గైడెన్స్
కరెంట్ అఫైర్స్

18. 2017 జూన్‌లో ఇంగ్లండ్‌లో నిర్వహించిన చాంపియన్స్ ట్రోఫీకి అంబాసిడర్‌గా వ్యవహరించిన భారత క్రికెటర్?
   1) వీరేంద్ర సెహ్వాగ్ 2) హర్భజన్ సింగ్
   3) గౌతమ్ గంభీర్ 4) విరాట్ కోహ్లీ
19. భారత్‌కు చెందిన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌బీసీసీ) ఏ దేశ సుప్రీంకోర్టు భవనాన్ని నిర్మించనుంది?
   1) కెన్యా 2) బంగ్లాదేశ్
   3) మారిషస్ 4) వియత్నాం
20. ఇటీవల భారత్‌లో పర్యటించిన బిద్యా దేవి భండారీ ఏ దేశాధ్యక్షురాలు?
   1) భూటాన్ 2) నేపాల్
   3) కాంబోడియా 4) మయన్మార్
21. 2017 మేలో ఉడ్రో విల్సన్ అవార్డ్ ఫర్ గ్లోబల్ కార్పొరేట్ సిటిజన్‌షిప్ అవార్డును అందుకున్న భారత మహిళ?
   1) చందా కొచ్చర్ 2) అరుంధతీ భట్టాచార్య
   3) శిఖా శర్మ 4) కిరణ్ మజుందార్ షా
22. 2017, మే 14,15 తేదీల్లో బెల్ట్ అండ్ రోడ్ ఫోరం సదస్సు ఎక్కడ జరిగింది?
   1) షాంఘై 2) బీజింగ్
   3) హాంగ్‌కాంగ్ 4) మకావు
23. 2017, మే 30న మరణించిన సినీ ప్రముఖుడు దాసరి నారాయణరావు కేంద్రంలో ఏ శాఖ సహాయమంత్రిగా పనిచేశారు?
   1) క్రీడా శాఖ 2) పట్టణాభివృద్ధి శాఖ
   3) బొగ్గు శాఖ 4) సమాచార,ప్రసార శాఖ
24. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'సంపద' అనే వ్యవసాయ సంబంధిత పథకాన్ని 2017, మే 26న ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
   1) గుజరాత్ 2) ఒడిశా
   3) ఉత్తర ప్రదేశ్ 4) అసోం

సమాధానాలు

1) 1	2) 2	3) 4	4) 3	5) 3
6) 2	7) 1	8) 4	9) 3	10) 2
11) 4	12) 2	13) 3	14) 4	15) 3
16) 2	17) 1	18) 2	19) 3	20) 2
21) 1	22) 2	23) 3	24) 4	


ఎన్.విజయేందర్‌రెడ్డి
జనరల్ అవేర్‌నెస్
సీనియర్ ఫ్యాకల్టీ

ఎన్ఐఈఎల్ఐటీలో 340 ఖాళీలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎన్ఐఈఎల్ఐటీ)లో 340 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువరించింది. ఎన్ఐఈఎల్ఐటీ.. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ పరిధిలోని అటానమస్ సైంటిఫిక్ సొసైటీ.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** సైంటిస్ట్ 'బి'-81(అన్‌రిజర్వుడ్-42, ఓబీసీ-21, ఎస్సీ-12, ఎస్టీ-6); సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్ 'ఎ'-259(అన్‌రిజర్వుడ్-133, ఓబీసీ-69, ఎస్సీ-38, ఎస్టీ-19).
- **వేతనం:** సైంటిస్ట్ 'బి' పోస్టులకు రూ.56,100-రూ.1,77,500; సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్ 'ఎ' పోస్టులకు రూ.35,400-రూ.1,12,400.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్/ఎంఎస్సీ/ఎంఎస్/ఎంసీఏ, నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **వయోపరిమితి:** 2017 ఆగస్ట్ 28 నాటికి 30 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** సైంటిస్ట్ 'బి' పోస్టులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ; సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్ 'ఎ' పోస్టులకు రాతపరీక్ష.
- **పరీక్ష విధానం:** ఆబ్జెక్టివ్ విధానంలో 120 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 60 ప్రశ్నలు కంప్యూటర్ సైన్స్, మిగిలిన 60 ప్రశ్నలు జనరిక్ ఏరియా(లాజికల్, అనలిటికల్ రీజనింగ్ కేపబిలిటీస్, క్వాంటిటేటివ్ అండ్ క్వాలిటేటివ్ ఎబిలిటీస్, జనరల్ అవేర్‌నెస్, ఆప్టిట్యూడ్) విభాగాలకు సంబంధించి ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు. అలాగే ప్రతి తప్పు సమాధానానికి 0.25 నెగిటివ్ మార్కు ఉంటుంది.
- **పరీక్ష, ఇంటర్వ్యూ కేంద్రాలు:** తెలుగు రాష్ట్రాలకు రాతపరీక్ష కేంద్రం హైదరాబాద్. ఇంటర్వ్యూలు(సంబంధిత అభ్యర్థులకు) ఢిల్లీలో నిర్వహిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు; జనరల్, మిగిలిన అభ్యర్థులకు రూ.800.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్ట్ 28, 2017.
- **వెబ్‌సైట్:** www.nielit.gov.in


రాజ్యసభ సెక్రెటేరియట్‌లో 115 ఖాళీలు



రాజ్యసభ సెక్రెటేరియట్‌లో 115 ఖాళీల భర్తీకి పార్లమెంట్ ఆఫ్ ఇండియా- రిక్రూట్‌మెంట్ సెల్ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** పార్లమెంటరీ ఇంటర్‌ప్రెటర్(ఇంగ్లిష్/హిందీ-1 + ఒడియా-1)-2; అసిస్టెంట్ లెజిస్లేటివ్/కమిటీ/ప్రొటోకాల్/ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్-20; స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్)-11; సెక్యూరిటీ అసిస్టెంట్ గ్రేడ్(2)-21; సెక్రెటేరియట్ అసిస్టెంట్(ఇంగ్లిష్-30 + హిందీ-7 + ఉర్దూ-2)-39; ట్రాన్స్‌లేటర్-19; ప్రూఫ్ రీడర్-3.
- **వేతనం:** పార్లమెంటరీ ఇంటర్‌ప్రెటర్ పోస్టులకు రూ.15,600-రూ.39,100; అసిస్టెంట్ లెజిస్లేటివ్/కమిటీ/ప్రొటోకాల్/ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్), సెక్యూరిటీ అసిస్టెంట్ గ్రేడ్(2), ట్రాన్స్‌లేటర్, ప్రూఫ్ రీడర్ పోస్టులకు రూ.9,300-రూ.34,800; మిగిలిన పోస్టులకు రూ.5,200-రూ.20,200.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి మాస్టర్స్ డిగ్రీ/డిగ్రీ/డిప్లొమా/పీజీ డిప్లొమా. దీంతోపాటు నిబంధనల మేర కంప్యూటర్ కోర్సు సర్టిఫికెట్, ఉద్యోగానుభవం, టైపింగ్ తదితరం ఉండాలి.
- **వయోపరిమితి:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి పార్లమెంటరీ ఇంటర్‌ప్రెటర్, ట్రాన్స్‌లేటర్, ప్రూఫ్ రీడర్ పోస్టులకు 18-35 ఏళ్ల లోపు, మిగిలిన పోస్టులకు 18-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** పోస్టులను అనుసరించి ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ...
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ కేంద్రాలు:** తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్ట్ 18, 2017.
- **వెబ్‌సైట్:** http://rajyasabha.nic.in , ttp://parliamentofindia.nic.in

జాబ్ పాయింట్



విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో 42 ఖాళీలు



కేరళలోని తిరువనంతపురంలో ఉన్న విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్.. 42 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** ఫార్మసిస్ట్ 'ఎ'-1; రేడియోగ్రాఫర్ 'ఎ'-1; హిందీ టైపిస్ట్-1; టెక్నీషియన్ 'బి'-31(ఫిట్టర్-13 + ఎలక్ట్రానిక్ మెకానిక్-6 + ఎలక్ట్రోప్లేటర్-2 + ఫొటోగ్రఫీ-2 + ఎలక్ట్రీషియన్-2 + ప్లంబర్-2 + కెమికల్ ఆపరేటర్-2 + ఎంఆర్ అండ్ ఏసీ-1 + వెల్డర్-1); డ్రాట్స్‌మ్యాన్'బి'(మెకానికల్)-2; ఫైర్‌మ్యాన్ 'ఎ'-1; కుక్-5.
- **వేతనం:** ఫార్మసిస్ట్ 'ఎ' పోస్టులకు రూ.32,000; రేడియోగ్రాఫర్ 'ఎ' పోస్టులకు రూ.28,000; హిందీ టైపిస్ట్ పోస్టులకు రూ.27,900; ఫైర్‌మ్యాన్ 'ఎ', కుక్ పోస్టులకు రూ.22,000; మిగిలిన పోస్టులకు రూ.24,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి పదోతరగతి/ఇంటర్మీడియెట్ తత్సమాన విద్యార్హత+ సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ/ఎన్‌టీసీ/ఎన్ఏసీ ఉత్తీర్ణత /డిప్లొమా/డిగ్రీ+టైపింగ్. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం తదితరం ఉండాలి.
- **నోట్:** ఫైర్‌మ్యాన్ 'ఎ' పోస్టులకు నిబంధనల ప్రకారం శారీరక ప్రమాణాలు(ఫిజికల్ ఫిట్నెస్) ఉండాలి. అలాగే ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్(దేహ దారుఢ్య పరీక్ష) ఉత్తీర్ణత పొందాలి.
- **వయోపరిమితి:** ఫైర్‌మ్యాన్ 'ఎ' పోస్టులకు 25 ఏళ్లు, హిందీ టైపిస్ట్ పోస్టులకు 26 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేర వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/ఎక్స్-సర్వీస్‌మెన్/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక విధానం:** పోస్టులను అనుసరించి రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్ట్ 7, 2017.
- **వెబ్‌సైట్:** www.vssc.gov.in

ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌లో 54 ఖాళీలు



ఇండియన్ ఆర్మీ.. 43వ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ కోర్స్-ఏప్రిల్ 2018కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. ఈ కోర్సుకు నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ), సైనిక యుద్ధ శిబిరాల (వార్డ్స్ ఆఫ్ బ్యాటిల్ క్యాజువాలిటీస్)కు చెందిన పురుషులు, అవివాహ యువతులు మాత్రమే అర్హులు.

- **కోర్సు పేరు:** ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 43వ కోర్స్-ఏప్రిల్ 2018.
- **ఖాళీలు:** 54(పురుషులు-50; మహిళలు-4).
- **అర్హతలు:** ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ అభ్యర్థులకు... 50శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ. ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే నిర్దేశిత మార్కుల శాతం తప్పనిసరి. అలాగే ఎన్‌సీసీ సీనియర్ డివిజన్/వింగ్‌లో రెండేళ్ల పాటు సర్వ్ చేసిన అనుభవం ఉండాలి. దీంతోపాటు ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ పరీక్షలో కనీసం 'బి' గ్రేడ్ పొంది ఉండాలి.
- **వార్డ్ ఆఫ్ బ్యాటిల్ క్యాజువాలిటీస్ అభ్యర్థులకు...** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే సంబంధిత బ్యాటిల్ ఆఫ్ క్యాజువాలిటీ గుర్తింపు పత్రాలు తప్పనిసరి.
- **వయోపరిమితి:** 19-25 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఫిజికల్ స్టాండర్డ్స్(శారీరక ప్రమాణాలు):** పురుషులు 157.5 సెం.మీ ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఉండాలి. మహిళలు 152 సెం.మీ ఎత్తు, 42 కేజీల బరువు ఉండాలి. అలాగే పరుగుపందెం, పుష్‌అప్స్, సిట్‌అప్స్ తదితర వాటిని పూర్తి చేయగలగాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్.
- **దరఖాస్తు విధానం:** ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వార్డ్స్ ఆఫ్ బ్యాటిల్ ఆఫ్ క్యాజువాలిటీస్ అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు జతచేసి కవరులో ఉంచి 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రిక్రూటింగ్/ఆర్‌టీజీ-ఏ, ఎన్‌సీసీ ఎంట్రీ, వెస్ట్ బ్లాక్-3, ఆర్.కె.పురం, న్యూఢిల్లీ-110066' చిరునామాకు గడువులోగా చేరేలా పోస్టులో పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్ట్ 23, 2017.
- **దరఖాస్తు హార్డ్‌కాపీలు(వార్డ్స్ ఆఫ్ బ్యాటిల్ క్యాజువాలిటీస్ అభ్యర్థుల) చేరడానికి చివరి తేదీ:** ఆగస్ట్ 29, 2017.
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

ఐటీబీపీఎఫ్‌లో కానిస్టేబుల్(ట్రేడ్స్‌మెన్) 303 ఖాళీలు



ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీఎఫ్)లో 303 కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మెన్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది.

- **పోస్టు పేరు:** కానిస్టేబుల్(ట్రేడ్స్‌మెన్)
- **మొత్తం పోస్టులు:** 303
- **విభాగాల వారీ ఖాళీలు:** టైలర్-19(పురుషులు-16 + మహిళలు-3); గార్డెనర్-38(పురుషులు-32 + మహిళలు-6); కాబ్లర్-27(పురుషులు-23 + మహిళలు-4); వాటర్ క్యారియర్-95(పురుషులు-81 + మహిళలు-14); సఫాయి కర్మచారి-33(పురుషులు-28 + మహిళలు-5), కుక్-55(పురుషులు-47 + మహిళలు-8); వాషర్‌మ్యాన్-25(పురుషులు-21 + మహిళలు-4); బార్బర్-11(పురుషులు-9 + మహిళలు-2).
- **వేతనం:** రూ.21,700-రూ.69,100 + ఇతర అలవెన్సులు.
- **అర్హతలు:** టైలర్, గార్డెనర్, కాబ్లర్ పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో రెండేళ్ల ఉద్యోగానుభవం, ఐటీఐ ట్రేడ్ సర్టిఫికెట్. మిగిలిన విభాగాల పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణత చాలు.
- **వయోపరిమితి:** 2017 సెప్టెంబర్ 7 నాటికి టైలర్, గార్డెనర్, కాబ్లర్ పోస్టులకు 18-23 ఏళ్లలోపు, మిగిలిన పోస్టులకు 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. మొదటి దశ(ఫేజ్-1)లో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ), ట్రేడ్ టెస్ట్; రెండో దశ(ఫేజ్-2)లో రాతపరీక్ష ఉంటుంది. మూడో దశలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.
- **ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ):** పరుగుపందెం- 1.6 కి.మీ దూరాన్ని పురుషులు 7 నిమిషాల 30 సెకన్లలోపు, 800 మీటర్ల దూరాన్ని మహిళలు 4 నిమిషాల 45 సెకన్లలోపు చేరుకోవాలి; లాంగ్ జంప్-పురుషులు 11 అడుగులు, మహిళలు 9 అడుగుల దూరాన్ని మూడు ప్రయత్నాల్లోపు అధిగమించగలగాలి; హై జంప్-పురుషులు మూడున్నర అడుగుల ఎత్తును, మహిళలు 3 అడుగుల ఎత్తును మూడు ప్రయత్నాల్లోపు ఎగరగలగాలి.
- **ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ):** ఇందులో అభ్యర్థుల శారీరక ప్రమాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు(ఫిజికల్ స్టాండర్డ్స్):** టైలర్, గార్డెనర్, కాబ్లర్ విభాగాల అభ్యర్థులకు.. ఎత్తు-పురుషులు 167.5 సెం.మీ, మహిళలు 157 సెం.మీ; ఛాతీ-పురుషులు 80(సాధారణం)-85(వ్యాకోచించినపుడు).
- **వాటర్ క్యారియర్, సఫాయి కర్మచారి, కుక్, వాషర్‌మ్యాన్, బార్బర్ విభాగం పోస్టుల అభ్యర్థులకు...** ఎత్తు-పురుషులు 170 సెం.మీ, మహిళలు 157 సెం.మీ; ఛాతీ-పురుషులు 80(సాధారణం)-85(వ్యాకోచించినపుడు). అలాగే ఎత్తు, వయసుకు తగిన బరువు(అభ్యర్థులందరికీ) ఉండాలి.
- **గమనిక:** షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీ అభ్యర్థులకు (పురుషులు/మహిళలు) శారీరక ప్రమాణాల్లో నిబంధనల మేర సడలింపు ఉంటుంది.
- **మెడికల్ స్టాండర్డ్స్:** అభ్యర్థులందరికీ నిబంధనల మేరకు తగినంత దృష్టి సామర్థ్యం తప్పనిసరి. అలాగే టాటూ(పచ్చబొట్లు) ఉండకూడదు.
- **ట్రేడ్ టెస్ట్:** సంబంధిత విభాగాలను అనుసరించి 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి గంట.
- **రాతపరీక్ష:** ఫేజ్-1(పీఈటీ, పీఎస్‌టీ, ట్రేడ్ టెస్ట్) ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రెండో దశలో రాతపరీక్ష ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ విధానంలో 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం మార్కులు 50. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేస్తారు.
- **డాక్యుమెంట్ వెరిఫికేషన్:** రాతపరీక్ష మెరిట్ జాబితాలోని అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలు పరిశీలిస్తారు. అనంతరం వారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి ఉద్యోగానికి ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100(జనరల్/ఓబీసీ); ఎస్సీ, ఎస్టీ, మహిళలు, ఎక్స్-సర్వీస్‌మెన్ కేటగిరీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్ట్ 8, 2017.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 7, 2017.
- **వెబ్‌సైట్:** www.recruitment.itbpolice.nic.in , itbpolice.nic.in

ఢిల్లీ యూనివర్సిటీలో 128 ఖాళీలు

ఢిల్లీ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని రాంజాస్ కాలేజీలో 128 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **విభాగాల వారీ ఖాళీలు:** బోటనీ-10, కెమిస్ట్రీ-20, కామర్స్-13, ఎకనామిక్స్-5, ఇంగ్లిష్-8, హిందీ-3, హిస్టరీ-7, మ్యాథమెటిక్స్-11, ఫిలాసఫీ-1, ఫిజిక్స్-24, పొలిటికల్ సైన్స్-7, సంస్కృతం-3, స్టాటిస్టిక్స్-5, జువాలజీ-11.
- **వేతనం:** రూ.15,600-రూ.39,100.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి 55శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ. దీంతోపాటు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) ఉత్తీర్ణత + నిబంధనల మేర ఇతర అర్హతలు. యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నుంచి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ పొందిన అభ్యర్థులకు నెట్ అర్హత నుంచి మినహాయింపు ఉంది.
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500(అన్‌రిజర్వుడ్/ఓబీసీ); ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్ట్ 19, 2017.
- **వెబ్‌సైట్:** www.du.ac.in , ramjascollege.edu

నేవీలో ఎస్ఎస్‌సీ, పీసీ ఆఫీసర్లు



ఇండియన్ నేవీలోని ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్/హైడ్రో కేడర్), టెక్నికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్/నేవల్ ఆర్కిటెక్చర్)లో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఆఫీసర్స్, నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టర్ కేడర్(ఎన్ఏఐసీ)లో పర్మనెంట్ కమిషన్(పీసీ) ఆఫీసర్స్‌గా చేరేందుకు తగిన అర్హతలున్న అవివాహితులైన యువతీయువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. ఇందులో టెక్నికల్ బ్రాంచ్‌లోని నేవల్ ఆర్కిటెక్చర్ విభాగానికి మాత్రమే మహిళలు అర్హులు.

- **వేతనం:** ఉద్యోగంలో చేరాక మొదట సబ్ లెఫ్టినెంట్ హోదా(ఎస్ఎల్‌టీ)లో రూ.56,100-1,10,700.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి 60శాతం అగ్రిగేట్ మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. ఫైనల్ ఇయర్ చదువుతున్న వారూ అర్హులే.
- **వయోపరిమితి:** 1993 జూలై 2 - జనవరి 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.
- **మెడికల్ స్టాండర్డ్స్:** ఎత్తు-పురుషులు 157 సెం.మీ, మహిళలు 152 సెం.మీ కనీస ఎత్తు కలిగి ఉండాలి. అలాగే ఎత్తుకు తగిన బరువు ఉండాలి. దీంతోపాటు నేవీ నిబంధనల మేరకు తగినంత దృష్టి సామర్థ్యం తప్పనిసరి. టాటూ(పచ్చబొట్లు) ఉండకూడదు.
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ. ఇందులో ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశ(స్టేజ్-1)లో ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్‌సెప్షన్ అండ్ డిస్కషన్ టెస్ట్ ఉంటాయి. వీటిలో క్వాలిఫై అయిన అభ్యర్థులకు రెండో దశ(స్టేజ్-2)లో సైకలాజికల్ టెస్టింగ్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. ఎస్ఎస్‌బీ రికమెండ్ చేసిన, మెడికల్‌గా ఫిట్‌గా ఉన్న అభ్యర్థుల్లో నుంచి ఆఫీసర్ పోస్టులకు(ఖాళీలను బట్టి) ఎంపికచేస్తారు.
- **ట్రైనింగ్(శిక్షణ):** ఎంపికైన అభ్యర్థులకు కేరళలోని ఎజిమలలో ఉన్న ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.
- **ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ వేదికలు:** బెంగళూరు, భోపాల్, కోయంబత్తూర్, విశాఖపట్నం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్ట్ 5, 2017.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్ట్ 25, 2017.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఎయిమ్స్-రాయ్‌పూర్‌లో 22 ఆఫీసర్లు

ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో వేర్వేరు విభాగాల్లోని 22 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** టెక్నికల్ ఆఫీసర్ ఆప్తాల్మాలజీ(రిఫ్రాక్షనిస్ట్)-4; మెటర్నిటీ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్-1; సైకియాట్రిక్ సోషల్ వర్కర్-3; జూనియర్ రిసెప్షన్ ఆఫీసర్-2; ఎలక్ట్రోకార్డియోగ్రాఫ్ టెక్నికల్ అసిస్టెంట్-1; హెల్త్ ఎడ్యుకేటర్(సోషల్ సైకాలజిస్ట్)-1; టెక్నికల్ ఆఫీసర్ (డెంటల్)/డెంటల్ టెక్నీషియన్-2; ఆడియోలజిస్ట్-1; రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ గ్రేడ్(1)-7.
- **వేతనం:** రూ.9,300-రూ.34,800.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి ఇంటర్మీడియెట్/డిగ్రీ/డిప్లొమా/ఎంఏ/ఎంఎస్సీ. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం తదితరం.
- **వయోపరిమితి:** 2017 ఆగస్ట్ 31 నాటికి సైకియాట్రిక్ సోషల్ వర్కర్ పోస్టులకు 18-35 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్ ఆప్తాల్మాలజీ (రిఫ్రాక్షనిస్ట్), ఎలక్ట్రోకార్డియోగ్రాఫ్ టెక్నికల్ అసిస్టెంట్, ఆడియోలజిస్ట్ పోస్టులకు 21-30 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 21-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000(జనరల్/ఓబీసీ/ఎక్స్-సర్వీస్‌మెన్); ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్‌లో పార్ట్-1 కింద ఆయా పోస్టులకు సంబంధించిన సబ్జెక్టు నుంచి 70 ప్రశ్నలు 70 మార్కులకు ఉంటాయి. పార్ట్-2లో జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ జనరల్ అవేర్ నెస్, ఇంగ్లిష్, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల్లో ఒక్కో దాని నుంచి 10 చొప్పున మొత్తం 30 ప్రశ్నలు 30 మార్కులకు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 చొప్పున నెగిటివ్ మార్కు ఉంటుంది. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్ట్ 31, 2017.
- **వెబ్‌సైట్:** www.aiimsraipur.edu.inz

సాక్షి బిజినెస్
బుధవారం 2-8-2017
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
60 ▲	38 ▲
32,575	10,115

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,359	▲	11
డోజోన్స్	21,974	▲	83
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,424	▲	52
డాక్స్	12,251	▲	133
షాంఘై	3,292	▲	19
నికాయ్	19,986	▲	61

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.28	64.96
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	83.37	86.23
€	యూరో	ఎస్‌బీఐ	74.51	77.14
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.22	59.24
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.62	52.46
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.53	48.03
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.51	18.39
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.88	18.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.75	10.95

నేడు ఆర్‌బీఐ పాలసీ ప్రకటన

రెపో రేటు తగ్గింపును సూచిస్తున్న గణాంకాలు



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) రెండు రోజుల సమావేశం గవర్నర్ ఉర్జిత్ పటేల్ నేతృత్వంలో మంగళవారమిక్కడ ప్రారంభమైంది. బ్యాంకులకు తానిచ్చే రుణ రేటు (రెపో– ప్రస్తుతం 6.25 శాతంగా ఉంది)పై బుధవారం కీలక నిర్ణయాన్ని ఎంపీసీ ప్రకటించనుంది. ఇటు ప్రభుత్వ వర్గాల నుంచీ, అటు పారిశ్రామిక ప్రతినిధుల నుంచీ రెపో రేటు తగ్గింపునకు డిమాండ్ పెద్ద ఎత్తున వస్తోంది. వరుసగా ఎనిమిది త్రైమాసిక సమీక్షల్లో 'ద్రవ్యోల్బణం' భయాల కారణంగా యథాతథ రేటు పరిస్థితిని కొనసాగిస్తూ వస్తున్న ఆర్‌బీఐ, ఈ దఫా అరశాతం వరకూ రేటు కోత నిర్ణయం తీసుకోవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఇందుకు గణాంకాలూ సానుకూలంగా ఉన్నాయి. ఆయా అంశాలు చూస్తే...

- రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 1.54 శాతానికి చేరింది. ఇది రికార్డు కనిష్ట స్థాయి కావడం గమనార్హం.
- పారిశ్రామిక ఉత్పత్తి భారీగా పతనమయింది. 2017 మే నెలలో వృద్ధి రేటు కేవలం 1.7 శాతంగా నమోదయ్యింది. 2016 ఇదే నెలలో ఈ రేటు 8 శాతం. వృద్ధి పెరగాలంటే పరిశ్రమలకు నిధులు అందుబాటులోకి రావాలి. వడ్డీ రేట్ల పెంపు దీనికి తోడ్పాటునిస్తుంది.
- 8 పరిశ్రమల కీలక గ్రూప్ వృద్ధి రేటు జూన్‌లో పేలవ పనితనాన్ని ప్రదర్శించింది. కేవలం 0.4% వృద్ధి (2016 జూన్ ఉత్పత్తితో పోల్చి– అప్పట్లో వృద్ధి 7%) నమోదయ్యింది. ఈ ఏడాది మే నెలలో ఈ గ్రూప్ వృద్ధి రేటు 4.1%.
- నికాయ్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూలైలో 47.9 పాయింట్ల క్షీణతకు పడిపోయింది. జూన్‌లో ఈ రేటు 50.9.

నీతి ఆయోగ్‌కు పనగడియా బై.. బై!!



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ పదవి నుంచి వైదొలగనున్నట్లు అరవింద్ పనగడియా ప్రకటించారు. ఆగస్ట్ 31న బాధ్యతల నుంచి తప్పుకొని తిరిగి కొలంబియా యూనివర్సిటీకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఇండో–అమెరికన్ అయిన అరవింద్ పనగడియా 2015 జనవరిలో నీతి ఆయోగ్ తొలి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తర్వాత భారత్‌లో ఒక ఉన్నత స్థాయి పదవిని వదులుకొని మళ్లీ టీచింగ్ ప్రొఫెషన్‌కు వెళుతున్న ఆర్థిక వేత్త పనగడియానే. కొలంబియా యూనివర్సిటీలో ఇండియన్ పొలిటికల్ ఎకానమీ ప్రొఫెసర్ అయిన ఈయనకు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా నిర్ణీత పదవీ కాలం అంటూ ఏమీ లేదు. 'యూనివర్సిటీ వారు నాకు పొడిగింపు ఇవ్వలేదు. అందుకే ఆగస్ట్ 31న నీతి ఆయోగ్‌ను వదిలి వెళ్తున్నా. ఈ విషయాన్ని రెండు నెలల ముందే ప్రధాని మోదీకి తెలియజేశాను' అని పనగడియా తెలిపారు.

గ్లాండ్ ఫార్మా డీల్‌కు బ్రేక్!

- అభ్యంతరం తెలిపిన కేబినెట్ కమిటీ
- నిలిచిపోయిన రూ.8,800 కోట్ల డీల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ గ్లాండ్ ఫార్మాలో మెజారిటీ వాటా కొనుగోలుకు ముందుకొచ్చిన చైనా ఫార్మా దిగ్గజం షాంఘై ఫోసన్ ఫార్మాస్యూటికల్ గ్రూప్‌నకు చుక్కెదురైంది. గ్లాండ్ ఫార్మాలో 86 శాతం వాటాను రూ.8,800 కోట్లకు దక్కించుకునేందుకు షాంఘై ఫోసన్ ఆఫర్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల సమావేశమైన కేబినెట్ ఎకనమిక్ అఫైర్స్ కమిటీ ఈ డీల్‌పై పలు అభ్యంతరాలను లేవనెత్తింది. గ్లాండ్ ఫార్మా అభివృద్ధి చేసిన అత్యాధునిక ఇంజెక్టబుల్ సాంకేతిక పరిజ్ఞానం మరో దేశం చేతుల్లోకి వెళ్తోందని కేబినెట్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం నడుస్తున్న తరుణంలో తాజా పరిణామం చోటు చేసుకోవటం గమనార్హం. ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు షాంఘై ఫోసన్ డీల్‌కు ఏప్రిల్‌లో అంగీకారం తెలుపుతూ కేబినెట్ కమిటీ అనుమతి కోసం ప్రతిపాదించింది. కేబినెట్ కమిటీ మాత్రం అభ్యంతరాలు లేవనెత్తింది. డీల్ కుదిరితే గ్లాండ్‌లో 100 శాతం వాటాను ఇతర షేర్‌హోల్డర్ల నుంచి దక్కించుకోవడానికి ఫోసన్‌కు వీలుకలుగుతుంది. అలాగే చైనా కంపెనీకి భారత్‌లో ఇదే అతిపెద్ద ఒప్పందం కానుంది. కాగా ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని గ్లాండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రవి పెన్మత్స ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రవి పెన్మత్స, అమెరికాకు చెందిన ప్రైవేటు ఈక్విటీ కంపెనీ కేకేఆర్‌కు గ్లాండ్‌లో 95 శాతం వాటా ఉంది.

పేటీఎం నుంచి మెసేజింగ్ సేవలు!!



న్యూఢిల్లీ: వాట్సాప్‌కు పేటీఎం పోటీగా రాబోతోందా? ఇది మెసేజింగ్ సర్వీసులను ప్రారంభించటానికి సర్వం సిద్ధం చేసుకుంటోందా? అవుననే అంటున్నాయి విశ్వసనీయ వర్గాలు. పేటీఎం ఈ నెలాఖరు నాటికి మెసేజింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురానుందని తెలుస్తోంది. పేటీఎం తన ప్లాట్‌ఫామ్‌కు కొత్త ఫీచర్‌ను జోడించనుందని, దీని ద్వారా యూజర్లు చాట్ చేసుకోవచ్చని, అలాగే ఆడియో, వీడియో, ఫోటోలను షేర్ చేసుకోవచ్చని ఈ వ్యవహారంతో సంబంధమున్న కొందరు తెలియజేశారు. అయితే దీనిపై స్పందించడానికి పేటీఎం అధికార ప్రతినిధి నిరాకరించారు. కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తే పేటీఎం యూజర్ల సంఖ్య మరింత పెరుగుతుందని వీరు ధీమా వ్యక్తంచేశారు. వాట్సాప్ డిజిటల్ పేమెంట్స్ విభాగంలోకి అడుగుపెట్టాలని భావిస్తోన్న తరుణంలో పేటీఎం మెసేజింగ్ సేవలను అందించడానికి ప్రయత్నించడం ఆసక్తికరమైన పరిణామం. కాగా భారత్‌లో వాట్సాప్‌కు 2017 ఫిబ్రవరి నాటికి 20 కోట్లకుపైగా మంత్లీ యాక్టివ్ యూజర్లు ఉంటే.. పేటీఎంకు 23 కోట్లకుపైగా యూజర్లున్నారు.

బుక్‌మైషో చేతికి ఎన్‌ఫ్యూజన్

bookmyshow
nFUSION

న్యూఢిల్లీ: వీడియో–ఆన్–డిమాండ్ ప్లాట్‌ఫామ్ నిర్వహిస్తున్న ఎన్‌ఫ్యూజన్‌ను కొనుగోలు చేసినట్లు ఆన్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ కంపెనీ బుక్‌మైషో వెల్లడించింది. పూర్తిగా నగదుతో ఈ లావాదేవీ జరిగినప్పటికీ, ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందీ బుక్‌మైషో వెల్లడించలేదు. ఎన్‌ఫ్యూజన్ టెక్నాలజీని ఉపయోగించుకుని, తమ ఆన్‌లైన్ ఆడియో ఎంటర్‌టైన్‌మెంట్ విభాగం జ్యాక్‌బాక్స్ ద్వారా ఆడియో ఎంటర్‌టైన్‌మెంట్‌ను విస్తృతం చేస్తామని బుక్‌మైషో డైరెక్టర్ పరీక్షిత్ దర్ చెప్పారు. సోహిబ్ జీఎం ఖాన్, శివగురునాథన్, ప్రభాకర్‌రెడ్డిలు 2009లో ప్రారంభించిన ఎన్‌ఫ్యూజన్...ఆన్‌లైన్ ద్వారా వీడియోలు స్ట్రీమ్ చేసుకునే సేవల్ని అందిస్తోంది.

జూలై.. కారు రయ్!

వాహన విక్రయాల్లో రెండంకెల వృద్ధి ● మారుతీ అమ్మకాలు 22% జూమ్ ● వాణిజ్య, టూవీలర్ విభాగాల్లోనూ ఇదే జోరు



న్యూఢిల్లీ: దేశీ ప్యాసెంజర్ వాహన విక్రయాల్లో జూలై నెలలో బలమైన వృద్ధి నమోదయ్యింది. దీనికి జీఎస్‌టీ అమలు, ధరల తగ్గింపు, సానుకూల రుతుపవనాలు వంటి పలు అంశాలు కారణంగా నిలిచాయి. మారుతీ సుజుకీ ఇండియా, టాటా మోటార్స్, మహీంద్రా, ఫోర్డ్ ఇండియా, హోండా కార్స్ ఇండియా వంటి కంపెనీల వాహన అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదయింది. జీఎస్‌టీ అమలు తర్వాత కస్టమర్ల కొనుగోలు సెంటిమెంట్ మెరుగుపడిందని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ (ప్యాసెంజర్ వెహికల్స్ విభాగం) మాయంక్ పరీఖ్ తెలిపారు. జీఎస్‌టీ వల్ల రానున్న కాలంలో స్వల్పకాలిక ఒడిదుడుకులు ఉండొచ్చని, ఇన్‌పుట్ వ్యయాలు పెరగొచ్చని ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ అనురాగ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయితే జీఎస్‌టీ ధరల తగ్గింపు, పండుగ సీజన్, తక్కువ వడ్డీ రేట్లు, సానుకూల రుతుపవనాల వంటివి పరిశ్రమకు సానుకూల అంశాలని తెలిపారు. హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో యూచిరో యుయినో కూడా ఇదే అంశాన్ని వ్యక్తీకరించారు. జీఎస్‌టీని విజయవంతంగా అమలు చేయడం, రుతుపవనాలు, అందుబాటు వడ్డీ రేట్ల వల్ల బలమైన విక్రయాల వృద్ధి సాధించామని మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) ప్రెసిడెంట్ (ఆటోమోటివ్ విభాగం) రాజన్ వడేరా తెలిపారు. జీఎస్‌టీ ధరల తగ్గింపు, సానుకూల రుతు పవనాల వల్ల కస్టమర్ల కొనుగోలు సెంటిమెంట్ మెరుగుపడిందని హ్యుందాయ్ మోటార్ ఇండియా డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) రాకేశ్ శ్రీవాత్సవ అభిప్రాయపడ్డారు. వాహన కంపెనీల దేశీ విక్రయాలను పరిశీలిస్తే..

- ✦ మారుతీ సుజుకీ విక్రయాల్లో 22.4 శాతం వృద్ధి కనిపించింది. ఇవి 1,25,778 యూనిట్ల నుంచి 1,54,001 యూనిట్లకు ఎగశాయి.
- ✦ టాటా మోటార్స్ వాహన అమ్మకాలు 10 శాతం వృద్ధితో 13,547 యూనిట్ల నుంచి 14,933 యూనిట్లకు పెరిగాయి.
- ✦ ఫోర్డ్ ఇండియా విక్రయాలు 19 శాతం ఎగశాయి. ఇవి 7,076 యూనిట్ల నుంచి 8,418 యూనిట్లకు చేరాయి.
- ✦ మహీంద్రా అమ్మకాలు 35,305 యూనిట్ల నుంచి 39,762 యూనిట్లకు పెరిగాయి. అంటే 13 శాతం వృద్ధి నమోదయ్యింది.
- ✦ హోండా కార్స్ ఇండియా విక్రయాలు 22 శాతం వృద్ధితో 14,033 యూనిట్ల నుంచి 17,085 యూనిట్లకు పెరిగాయి.
- ✦ హ్యుందాయ్ మోటార్ ఇండియా అమ్మకాలు 4 శాతం పెరిగాయి. 41,201 యూనిట్ల నుంచి 43,007 యూనిట్లకు ఎగిశాయి.

వాణిజ్య వాహన విక్రయాల్లో 15 శాతం వృద్ధి

- ✦ టాటా మోటార్స్ దేశీ వాణిజ్య వాహన అమ్మకాలు 15 శాతం వృద్ధితో 27,842 యూనిట్లకు పెరిగాయి.
- ✦ అశోక్ లేల్యాండ్ మొత్తం విక్రయాలు 14 శాతం వృద్ధి చెందాయి. ఇవి 10,492 యూనిట్ల నుంచి 11,981 యూనిట్లకు పెరిగాయి.

టూవీలర్ విభాగంలోనూ జోష్

- ✦ హీరో మోటొకార్ప్ విక్రయాలు 17 శాతం వృద్ధితో 5,32,113 యూనిట్ల నుంచి 6,23,269 యూనిట్లకు చేరాయి.
- ✦ హోండా మోటార్‌సైకిల్ మొత్తం విక్రయాలు 20% పెరిగాయి. ఇవి 4,53,884 యూనిట్ల నుంచి 5,44,508 యూనిట్లకు ఎగశాయి.
- ✦ టీవీఎస్ మోటార్ మొత్తం అమ్మకాలు 9 శాతం వృద్ధితో 2,48,002 యూనిట్ల నుంచి 2,71,171 యూనిట్లకు పెరిగాయి.
- ✦ రాయల్ ఎన్‌ఫీల్డ్ మొత్తం విక్రయాలు 21 శాతం వృద్ధి చెందాయి. ఇవి 53,378 యూనిట్ల నుంచి 64,459 యూనిట్లకు ఎగిశాయి.

వాహన కంపెనీల జూలై నెల దేశీ విక్రయాలు

కంపెనీ	2017	2016	వృ/క్షీ
మారుతీ సుజుకీ	1,54,001	1,25,778	22
టాటా మోటార్స్	14,933	13,547	10
ఫోర్డ్ ఇండియా	8,418	7,076	19
మహీంద్రా	39,762	35,305	13
హోండా కార్స్	17,085	14,033	22
హ్యుందాయ్ మోటార్	43,007	41,201	4

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభం రూ.624 కోట్లు

జూన్ క్వార్టర్లో 44 శాతం క్షీణత



న్యూఢిల్లీ: జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు జూన్ త్రైమాసికంలో వ్యయాల సెగ తగిలింది. కన్సాలిడేటెడ్ లాభం ఏకంగా 44 శాతం క్షీణించింది. రూ.624 కోట్ల లాభాన్ని కంపెనీ నమోదు చేయగా, అంతకుముందు ఏడాది ఇదే కాలంలో వచ్చిన లాభం రూ.1,120 కోట్లుగా ఉంది. స్టీల్ ఉత్పత్తి ఫ్లాట్‌గా ఉండడంతోపాటు, ఐరన్ ఓర్, విద్యుత్ రూపేణా ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోవడం లాభాలు తగ్గడానికి దారితీశాయి. ఆదాయం మాత్రం 24 శాతం వృద్ధితో రూ.15,977 కోట్లు నమోదైంది. వ్యయాలు 33 శాతం పెరిగి రూ.15,124 కోట్లకు చేరడం గమనార్హం. స్టీల్ ఉత్పత్తి కేవలం ఒక శాతమే పెరిగి 3.91 మిలియన్ టన్నులుగా ఉంటే, స్టీల్ అమ్మకాలు మాత్రం 5 శాతం వృద్ధి చెంది 3.51 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. జీఎస్టీకి మారే దశలో సరుకుల నిల్వలు తగ్గించుకోవడం వల్ల పరిశ్రమ వ్యాప్తంగా దేశీయ అమ్మకాలపై ప్రభావం ఉందని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జేఎండీ శేషగిరిరావు తెలిపారు. ఉత్పత్తుల్లో వైవిధ్యంపై తమ దృష్టి కొనసాగుతుందని, విలువ జోడించిన ఉత్పత్తుల విక్రయాలు ఏటేటా 12 శాతం వృద్ధి చెందుతున్నట్టు ఆయన చెప్పారు. ఎగుమతులు జూన్ త్రైమాసికంలో 26 శాతం పెరిగినట్టు తెలిపారు. డోల్వి, విజయ్‌నగర్ యూనిట్ల విస్తరణ కోసం ఏటా రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టే ప్రణాళికతో ఉన్నట్టు చెప్పారు. సొంతంగా 5 మిలియన్ టన్నుల ఉత్పత్తిని పెంచుకోవడంతోపాటు, కంపెనీల కొనుగోళ్ల అవకాశాలతోనూ వృద్ధి చెందాలనుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో స్టాక్ ధర 0.70 శాతం పెరిగి రూ.222.95 వద్ద క్లోజయింది.

ఫ్లిప్‌కార్ట్‌లో ఈబే ఇండియా విలీనం పూర్తి



న్యూఢిల్లీ: దేశీయ ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో ఈబే ఇండియా కార్యకలాపాల విలీనం పూర్తయినట్టు కంపెనీ ప్రకటించింది. ఇక నుంచి 'ఈబే డాట్ ఇన్' ఫ్లిప్‌కార్టు గ్రూపు కంపెనీగా స్వతంత్రంగా కొనసాగుతుందని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. వాస్తవానికి ఈ ఒప్పందం ఈ ఏడాది ఏప్రిల్‌లో కుదిరింది. ఫ్లిప్‌కార్ట్‌లో ఈబే 500 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయడంతోపాటు 'ఈబే డాట్ ఇన్'ను ఫ్లిప్‌కార్ట్‌కు విక్రయించేందుకు కూడా ఒప్పందం చేసుకుంది. అలాగే, అంతర్జాతీయ లావాదేవీల విషయంలో రెండు సంస్థలు సహకరించుకోనున్నాయి. ఈబేలో లభించే ప్రపంచ వ్యాప్త ఉత్పత్తులు ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లకు అందుబాటులోకి వస్తాయని, అదే సమయంలో ఈబే కస్టమర్లు ఫ్లిప్‌కార్ట్ విక్రేతల నుంచి భారతీయ వస్తువుల కొనుగోలుకు వీలు పడుతుందని ఫ్లిప్‌కార్ట్ తన ప్రకటనలో తెలిపింది. ఒక విధంగా ఫ్లిప్‌కార్ట్ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన విక్రయదారులు తమ ఉత్పత్తులను ఈబే ద్వారా అంతర్జాతీయంగా ఆఫర్ చేసే అవకాశం అందిరానుంది. మరో ప్రత్యర్థి స్నాప్‌డీల్‌ను కూడా ఫ్లిప్‌కార్ట్ కొనుగోలు చేయాలనుకోగా... ఆఫర్, షరతులు నచ్చక స్నాప్‌డీల్ చర్చల నుంచి వైదొలగడం విదితమే.

ఫ్లిప్‌కార్ట్‌లో ఇన్ఫినిక్స్ స్మార్ట్ ఫోన్లు

ఫ్లిప్‌కార్ట్‌తో చైనాకు చెందిన మొబైల్ ఉత్పత్తుల కంపెనీ ట్రాన్సిషన్ హోల్డింగ్స్ చేతులు కలిపింది. నోట్ 4, హాట్ 4 ప్రో మోడళ్లను 'ఇన్ఫినిక్స్' బ్రాండ్ కింద ఫ్లిప్‌కార్ట్ వేదికగా భారత్‌లో విక్రయించనుంది. ఇన్ఫినిక్స్ నోట్ 4 మోడల్ ధర రూ.8,999, హాట్ 4 ప్రో మోడల్ ధరను రూ.7,499గా ఖరారు చేసింది.

పెట్రోల్ బంకుల్లో బ్యాంకింగ్ సేవలు

హెచ్‌పీసీఎల్‌తో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ జట్టు



న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తాజాగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ కస్టమర్లు హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకుల్లో కొత్తగా ఖాతాను ప్రారంభించొచ్చు. అలాగే క్యాష్ విత్‌డ్రా చేసుకోవచ్చు. కస్టమర్ల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, వారికి ఉపయోగకరమైన సేవలను అందించడం సహా దేశంలో డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తెలిపింది. ''దాదాపు 14,000కు పైగా ఉన్న హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకులన్నీ ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌కు బ్యాంకింగ్ పాయింట్లుగా వ్యవహరిస్తాయి. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ కస్టమర్లు వీటి వద్ద ఖాతాను ప్రారంభించటం, నగదు డిపాజిట్, విత్‌డ్రాయెల్స్, మనీ ట్రాన్స్‌ఫర్ వంటి బ్యాంకింగ్ సేవలను పొందొచ్చు'' అని అలాగే బ్యాంక్ కస్టమర్లు వారి హ్యాండ్‌సెట్స్ సాయంతో డిజిటల్ పేమెంట్స్ ద్వారా హెచ్‌పీసీఎల్ స్టేషన్లలో ఫ్యూయెల్‌ను కొనుగోలు చేయవచ్చని తెలిపింది.

వెనెజులా...! ఎందుకిలా?

పరిస్థితులకు భిన్నంగా మార్కెట్ల ర్యాలీ

- 2016లో ద్రవ్యోల్బణం 254%; ఇంకా పెరిగే చాన్స్
- అయినా 1,100 శాతం పెరిగిన స్టాక్ మార్కెట్లు
- తాజాగా ఆ దేశాధ్యక్షుడిపై అమెరికా ఆంక్షలు
- ఆ వార్త వెలువడ్డాక మరో 3 శాతం ఎగసిన మార్కెట్లు
- తలపండిన విశ్లేషకులకూ ఇవి 'షాక్' మార్కెట్లే!



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ బలం స్టాక్ మార్కెట్లలో ప్రతిఫలిస్తుంది. వృద్ధి బలంగా ఉంటే, స్టాక్ మార్కెట్లు ర్యాలీ చేస్తుంటాయి. బలహీనంగా ఉంటే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. కానీ, వెనెజులా స్టాక్ మార్కెట్లు ఇందుకు భిన్నం!. అవి పెరగాలనుకుంటే పెరుగుతాయి. తగ్గాలనుకుంటే తగ్గుతాయి. 2016లో ఆ దేశ ద్రవ్యోల్బణం 254.9 శాతం. కానీ, స్టాక్ మార్కెట్లు గత ఏడాది కాలంలో ఏకంగా 1,100 శాతం లాభపడ్డాయి. తాజాగా గత సోమవారం అమెరికా ఆ దేశంపై ఆంక్షలు విధించింది. దీన్ని మార్కెట్లు పాజిటివ్‌గా తీసుకున్నాయో లేక పట్టించుకోలేదో గానీ, అదే రోజు స్టాక్ మార్కెట్లు 3 శాతం లాభపడ్డాయి. ఎందుకిలా...? విశ్లేషకులకు సైతం వెనెజులా స్టాక్ మార్కెట్లు ఓ పజిల్‌లా మారాయంటే ఆశ్చర్యం లేదు.

ఆర్థిక ఇబ్బందులు

వెనెజులాలో షామ్ ఎన్నికల (నామమాత్రపు) నిర్వహణకు వ్యతిరేకంగా ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోపై అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో వెనెజులా ఒంటరిగా మారిపోయింది. కానీ, ఈక్విటీ బెంచ్‌మార్క్ 3,603 పాయింట్లు లాభపడి (3 శాతం) 1,39,399 పాయింట్ల వద్ద క్లోజవడం విశేషం. వెనెజులా ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆదాయ వనరు చమురే. అయితే, ఆ దేశానికి వ్యతిరేకంగా ఆర్థిక ఆంక్షల విషయంలో అంతర్జాతీయంగా ఏకాభిప్రాయం కుదిరితే వెనెజులాకు మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు విశ్లేషకులు. ఎందుకంటే ఆ దేశం ఇప్పటికే ఆర్థికంగా సతమతం అవుతోంది. 2016లో జీడీపీ 18 శాతం తగ్గిపోయింది. 2015లో 6.2 శాతం, 2014లో 3.9 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది 7.4 శాతం, వచ్చే ఏడాది 4.1 శాతం ప్రతికూల వృద్ధి నమోదవుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. అంతర్జాతీయంగా చమురు ధరల పతనం, అంతర్గత సంఘర్షణలు, అసంబద్ధ విధానాలు ఇవన్నీ సమస్యలకు మూలాలు. అయినా సరే అక్కడి స్టాక్ మార్కెట్లు ర్యాలీ చేస్తూనే ఉన్నాయి. ఇక, ద్రవ్యోల్బణం కూడా మూడంకెల స్థాయిలో కొనసాగుతోంది. 1998–2008 సంవత్సరాల మధ్య 20.5 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం 2016 నాటికి ఏకంగా 254.9 శాతానికి చేరింది. ఈ ఏడాది 720.5 శాతం ఉంటుందని, 2018లో 2,068 శాతం, 2022 నాటికి 4,684 శాతానికి పెరిగిపోతుందని ఐఎంఎఫ్ అంచనా వేస్తోంది. దీంతో వెనెజులా మరో జింబాబ్వేగా మారే అవకాశం లేకపోలేదంటున్నారు. ఒక దశలో జింబాబ్వే ద్రవ్యోల్బణం 231,150,889 శాతాన్ని కూడా తాకింది.

భారత కంపెనీలపై ప్రభావం!

ఒకప్పటితో పోలిస్తే ఇరుగు పొరుగు దేశాలతో వెనెజులా వాణిజ్య సంబంధాలు ప్రస్తుతం చాలా పరిమిత స్థాయికి చేరాయి. ఈ ప్రాంతంలోని ఇతర దేశాలు అగ్రరాజ్యం అమెరికాతో ఆర్థిక సంబంధాలు కొనసాగిస్తున్నాయి. మన భారత ఫార్మా కంపెనీలైన డాక్టర్ రెడ్డీస్, గ్లెన్‌మార్క్ ఫార్మా వంటివి వెనెజులా మార్కెట్లలో కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో వాటి వ్యాపారంపై ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదంటున్నారు విశ్లేషకులు.

ప్రభుత్వ బ్యాంకులకు రూ.1.9 లక్షల కోట్లు కావాలి

- 2019 మార్చి నాటికి దీన్ని సమకూర్చాల్సిందే...
- బ్యాంకుల మూలధన అవసరాలపై ఎస్ అండ్ పీ అంచనా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) బ్యాంకులకు 2019 మార్చి నాటికి రూ.1.9 లక్షల కోట్ల (29.6 బిలియన్ డాలర్లు) తాజా మూలధనం అవసరమవుతుందని గ్లోబల్ రేటింగ్ సంస్థ– ఎస్ అండ్ పీ అంచనావేసింది. లేదంటే నిరర్థక ఆస్తులకు (ఎన్‌పీఏ) కేటాయింపులు కష్టతరం అవుతాయని తన తాజా నివేదికలో వివరించింది. మూలధన అవసరాలకు సంబంధించి అంతర్జాతీయ బాసెల్–3 ప్రమాణాల అమలుకూ తాజా మూలధనం అవసరమని విశ్లేషించింది. సంస్థ క్రెడిట్ అనలిస్ట్ గీతా చౌ రూపొందించిన నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- తాజా మూలధనం కల్పించలేని పక్షంలో బలహీనంగా ఉన్న లాభదాయకత... బ్యాంకులపై ఒత్తిళ్లను పెంచుతుంది.
- ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ మూలధన అవసరాలను నెరవేర్చుకోడానికి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించుకోవాల్సి ఉంటుంది.
- ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్ల నుంచి నిధులు సమీకరించటంలో భారత ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రధానంగా 3 సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకటి ఈక్విటీ విలువలు కనిష్ట స్థాయిలో ఉండటం కాగా రెండోది ఎక్కువ సంఖ్యలో బ్యాంకులుండటం. నియమ నిబంధనల చట్రం మూడవది. అదే సమయంలో అడిషనల్ టైర్–1 క్యాపిటల్ ఇన్‌స్ట్రుమెంట్ల జారీ ద్వారా నిధుల సమీకరణ కూడా వాటికి కష్టం కావచ్చు. ఈ ఇన్‌స్ట్రుమెంట్లపై డిఫాల్ట్ రిస్క్ అధికంగా ఉండటమే దీనికి కారణం.
- ప్రభుత్వ రంగ బ్యాంకులకు మద్దతు విషయంలో ప్రభుత్వ నిబద్ధత సుస్పష్టంగా కనబడుతోంది.
- దేశంలో పటిష్ట బ్యాంకింగ్‌కు సానుకూల వాతావరణం కనబడుతోంది. బలహీన ప్రభుత్వ రంగ బ్యాంకులు క్రమంగా తమ మార్కెట్ షేర్‌ను లాభదాయక ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు అలాగే నాన్–బ్యాంక్ ఫైనాన్స్ సంస్థలకు కోల్పోయే వీలుంది.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్,వ్యాపారస్తులు)
రూ.4,700 (కనిష్టం)
రూ.4,980 (గరిష్టం)



మిర్చి (వరంగల్, తేజ)
రూ.1,800 (కనిష్టం)
రూ.5,600 (గరిష్టం)



పసుపు (నిజామాబాద్, కొమ్ము)
రూ.4,706 (కనిష్టం)
రూ.6,067 (గరిష్టం)
(20న ముగింపు)



ఉల్లి (కర్నూలు)
రూ.260 (కనిష్టం)
రూ.840 (గరిష్టం)
(20న ముగింపు)




చక్కెర (చెన్నై)
రూ.4,050



బియ్యం (కరీంనగర్)
రూ.3,800
(హెచ్ఎంటీ)



కందిపప్పు (చెన్నై)
రూ.6,000



సుబాబులు (కృష్ణా)
రూ.4,400
(ప్రభుత్వ మార్కెట్ మద్దతు ధర) (టన్నుకు)



ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
రూ.7,376



నిఫ్టీ కొత్త రికార్డు

- మరికాస్త దూరంలో సెన్సెక్స్
- ఆర్‌బీఐ పాలసీవైపు చూపు



ముంబై: ఒకవైపు కార్పొరేట్ ఫలితాలు ప్రోత్సాహాన్ని అందిస్తుండగా, మరోవైపు ఆటోమొబైల్ అమ్మకాలు మెరుగ్గా వున్నట్లు గణాంకాలు వెలువడటంతో వరుసగా రెండోరోజు మంగళవారం స్టాక్ మార్కెట్‌లో కొత్త రికార్డులు నెలకొన్నాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ జూలై 27 నాటి 10,115 పాయింట్ల గరిష్టస్థాయిని దాటి...10,128.60 పాయింట్ల చరిత్రాత్మక గరిష్టస్థాయిని చేరి రికార్డు సృష్టించింది. చివరకు 37.55 పాయింట్ల లాభంతో 10,114.65 పాయింట్ల వద్ద ముగిసింది. ఇది నిఫ్టీకి రికార్డు ముగింపు. బీఎస్ఈ సెన్సెక్స్ ఇంట్రాడేలో 32,632 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగిన తర్వాత..చివరకు 60 పాయింట్ల లాభం 32,575 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో జూలై 27నాటి 32,672 పాయింట్ల స్థాయిని సెన్సెక్స్ ఇంకా అధిగమించనప్పటికీ, ఈ స్థాయి వద్ద సూచీ ముగియడం ఇదే ప్రధమం. రిజర్వు బ్యాంక్ పాలసీ నిర్ణయం బుధవారం వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు జాగురూకత వహించడంతో మార్కెట్ లాభాలు పరిమితంగా వున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ఆటోమొబైల్ కంపెనీల జూలై నెల అమ్మకాలు మార్కెట్ అంచనాల్ని మించడం, కొన్ని బ్లూచిప్ ఫలితాలు ప్రోత్సాహకరంగా వుండటంతో సూచీలు పెరిగాయని ఆయన వివరించారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,199
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	25,776
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	3,41,280
ఎఫ్ఐఐ	-946
డీఐఐ	1,391

ఆటో కంపెనీల జోరు...

జూలై అమ్మకాల గణాంకాలతో ఆటోమొబైల్ షేర్లు జోరుగా పెరిగాయి. 21 శాతం అమ్మకాలు పెంచుకున్న మారుతి సుజుకి 1.35 శాతం పెరిగి రికార్డు గరిష్టస్థాయి రూ. 7,855 వద్ద ముగిసింది. నిఫ్టీలో భాగమైన ఐషర్ మోటార్స్ 4 శాతంపైగా పెరిగి కొత్త రికార్డుస్థాయి రూ. 31,505 వద్ద క్లోజయ్యింది. మహింద్రా, హీరో మోటో కార్ప్‌లు 1–2 శాతం మధ్య ఎగిసాయి. ఇతర రంగాల షేర్లలో విప్రో, హెచ్‌యూఎల్, డాక్టర్ రెడ్డీస్ లాబ్, కోల్ ఇండియాలు 1–2 శాతం మధ్య ర్యాలీ సాగించాయి. మరోవైపు ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ, కొటక్ బ్యాంక్, అంబూజా సిమెంట్ షేర్లు 1–2 శాతం మధ్య క్షీణించాయి.

అశోక్ లేలాండ్.. 'ఫ్యూచర్స్' సిగ్నల్స్!



ఈ రోజు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో (ఎఫ్అండ్ ఓ) ఏ షేర్లయితే బెటర్? ఆ 'ఫ్యూచర్ సిగ్నల్స్' 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం...

అశోక్ లేలాండ్

ఆటోమొబైల్ కంపెనీల జూలై అమ్మకాల గణాంకాలు వెలువడిన నేపథ్యంలో మంగళవారం పలు ఆటో షేర్లతో పాటు అశోక్ లేలాండ్ సైతం పెరిగింది. ఈ షేరు 1.3% పెరిగి రెండు దశాబ్దాల గరిష్టస్థాయి రూ. 111 వద్ద ముగిసింది. ఈ సందర్భంగా అశోక్ లేలాండ్ ఫ్యూచర్ కాంట్రాక్టులో 31 లక్షల షేర్లు (6.75 శాతం) తాజాగా యాడ్ అయ్యాయి. దాంతో ఫ్యూచర్ మొత్తం ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) 5.02 కోట్లకు చేరింది. అయితే స్పాట్, ఫ్యూచర్ ధరల మధ్య ప్రీమియంలో పెద్దగా మార్పేదీ లేదు. ఇక ఆప్షన్ విభాగంలో రూ. 110 స్ట్రయిక్ వద్ద కాల్ కవరింగ్, పుట్ రైటింగ్ జరిగాయి. కాల్ ఆప్షన్ నుంచి 3.99 షేర్లు కట్‌కాగా, బిల్డప్ 27.44 లక్షలకు తగ్గింది. పుట్ ఆప్షన్‌లో 5.11 లక్షల షేర్లు యాడ్‌కాగా, ఈ బిల్డప్ 12.88 లక్షలకు పెరిగింది. మరోవైపు రూ. 115 స్ట్రయిక్ వద్ద పెద్ద ఎత్తున కాల్ రైటింగ్ జరగడంతో 12.18 లక్షల షేర్లు యాడ్ అయ్యాయి. ఇక్కడ కాల్ బిల్డప్ 40.60 లక్షల షేర్లకు చేరింది. రూ. 105 స్ట్రయిక్ వద్ద పుట్ రైటింగ్ ఫలితంగా 5.11 లక్షల షేర్లు యాడ్ అయ్యాయి. ఇక్కడ 19.39 షేర్ల బిల్డప్ వుంది. సమీప భవిష్యత్తులో షేరు స్వల్ప కదలికలకు పరిమితం కావొచ్చని ఫ్యూచర్ కాంట్రాక్టులో పొజిషన్లు సూచిస్తుండగా, రూ. 110పైన అశోక్ లేలాండ్ స్థిరపడితే..నెమ్మదిగా రూ. 115 స్థాయిని చేరవచ్చని, రూ. 110 స్థాయిని కోల్పోతే క్రమేపీ బలహీనపడవచ్చని ఆప్షన్ డేటా వెల్లడిస్తున్నది.

→ పీఎన్‌బీ ఎఫ్ అండ్ ఓ డేటా ఏం చెబుతోంది?
ఈ వివరాలు W . లో W C

జూలైలో తయారీ రంగం క్షీణత: నికాయ్

ఈ ఏడాది ఇదే తొలిసారి

NIKKEI

న్యూఢిల్లీ: భారత్‌లో తయారీ రంగం ఉత్పత్తి జులైలో అసలు వృద్ధి నమోదుచేసుకోకపోగా, క్షీణతలోకి జారింది. నికాయ్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూలైలో 47.9 పాయింట్లకు పడిపోయింది. జూన్‌లో ఈ రేటు 50.9. పీఎంఐ ప్రకారం, సూచీ 50 పాయింట్ల ఎగువ ఉంటే వృద్ధి ధోరణిగా ఆలోపు క్షీణతగా భావించడం జరుగుతుంది. 2009 తరువాత, 47.9 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పతనం ఇదే తొలిసారికాగా, 2017లో 50 పాయింట్లలోపుకు సూచీ దిగడం ఇదే మొదటిసారి. దేశంలో వ్యాపార క్షీణతకు ఇది అద్దం పడుతోంది.

బడ్జెట్ లక్ష్యంలో 81 శాతానికి ద్రవ్యలోటు!

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18) బడ్జెట్ లక్ష్యంలో ద్రవ్యోలోటు జూన్ త్రైమాసికానికే 81 శాతానికి చేరింది. వివరాల్లోకి వెళితే, 2017–18 ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ ఆదాయం–వ్యయాలకు మధ్య వ్యత్యాసం– ద్రవ్యలోటు లక్ష్యం రూ.5,46,532 కోట్లు. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనాలో 3.2 శాతం. అయితే ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ముగిసే నాటికే (జూన్) ద్రవ్యలోటు రూ.4.42 లక్షల కోట్లకు చేరింది. అంటే 2017–18 బడ్జెట్ అంచనాల్లో ఇది 80.8%.

హైదరాబాద్‌లో క్లిక్2క్లినిక్ వైద్య సేవలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటి వద్దకే వైద్య సేవలందిస్తున్న క్లిక్2క్లినిక్ హెల్త్‌కేర్ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. ఇప్పటికే ఈ కంపెనీ బెంగళూరుతోపాటు కౌలాలంపూర్, బ్యాంకాక్ తదితర నగరాల్లో విస్తరించింది. శిక్షణ పొందిన నర్సులు, ఫిజియోథెరపిస్టులు, డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తారు. రక్త నమూనాల సేకరణ, మందులను ఇంటికి తెచ్చివ్వడం వంటివీ చేస్తారు. క్లినికోపీడియా యాప్ ద్వారా ఈ కంపెనీ సేవలు పొందవచ్చు. సర్వీసును బట్టి చార్జీ చేస్తారు. రోగులతో ప్రతిరోజు వైద్యులు ఫోన్‌లో మాట్లాడతారు. సీనియర్ వైద్యులు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తారని కంపెనీ వ్యవస్థాపకులు పున్నం సుజీత్ రెడ్డి మంగళవారమిక్కడ తెలిపారు. హైదరాబాద్‌లో 2,000 మంది వైద్యులు, 1,800 నర్సులు, 1,200 మంది ఫిజియోథెరపిస్టులు, 2,000 పైచిలుకు మందుల దుకాణాలను ఈ యాప్‌కు అనుసంధానించామని సహ వ్యవస్థాపకులు మురళి భరద్వాజ్ వెల్లడించారు.



మీడియాతో మాట్లాడుతున్న మురళి భరద్వాజ్. పక్కన సుజీత్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు


నేటి నుంచి హింద్ కాపర్ ఓఎఫ్ఎస్



న్యూఢిల్లీ: హిందుస్తాన్ కాపర్‌లో 4 శాతం వాటా విక్రయం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) బుధవారం ప్రారంభం కానుంది. ఈ ఓఎఫ్ఎస్ ద్వారా షేరుకు రూ. 64,75 ధరతో 3.70 కోట్ల షేర్లను ప్రభుత్వం విక్రయిస్తుంది. ఇష్యూ ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయితే అంతేమొత్తం షేర్లను అదనంగా విక్రయించే ఆప్షన్‌తో ఈ ఓఎఫ్ఎస్‌ను జారీచేస్తున్నారు. 4 శాతం వాటా విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 240 కోట్లు సమకూరుతాయి. అదనంగా మరో 3.70 కోట్ల షేర్లను విక్రయిస్తే ప్రభుత్వానికి మొత్తం రూ. 480 కోట్లు లభిస్తాయి. రెండురోజులపాటు అమల్లో వుండే ఈ ఓఎఫ్ఎస్‌లో ఆగస్టు 2న సంస్థాగత ఇన్వెస్టర్లు, ఆగస్టు 3న రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్ చేసుకోవొచ్చు. హింద్ కాపర్ షేరు మంగళవారం బీఎస్ఈలో రూ. 70,65 వద్ద ముగిసింది. ఈ ధరతో పోలిస్తే 8.35 శాతం డిస్కౌంట్‌తో ఓఎఫ్ఎస్‌కు ధరను నిర్ణయించారు.

ఎస్‌బీఐ వడ్డీ మార్జిన్ 0.14 శాతం పెరగొచ్చు

మోర్గాన్‌స్టాన్లీ




ముంబై: సేవింగ్ అకౌంట్ డిపాజిట్‌పై వడ్డీరేటు తగ్గింపు వల్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 14 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) మేర పెరిగే అవకాశం కనబడుతోందని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణా సంస్థ– మోర్గాన్ స్టాన్లీ మంగళవారం తన తాజా నివేదికలో అంచనావేసింది. ఇతర బ్యాంకులూ ఎస్‌బీఐ బాటను అనుసరించే అవకాశం ఉందనీ, దీనివల్ల నికర వడ్డీ మార్జిన్లు 0.05 శాతం నుంచి 0.15 శాతం శ్రేణిలో పెరిగే వీలుందని నివేదిక విశ్లేషించింది. ఆరేళ్లలో మొట్టమొదటిసారి తన పొదుపు ఖాతాలపై లభించే వడ్డీరేటును ఎస్‌బీఐ అరశాతం తగ్గించింది. దీనితో ఈ రేటు 3.5 శాతానికి తగ్గింది.

డీసీఐకి ముంబై పోర్టు నిర్వహణ పనులు

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ): దశాబ్దకాలం తరువాత ముంబై పోర్టు ట్రస్ట్ (ఎంబీపీటీ) నిర్వహణ కాంట్రాక్టును డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) దక్కించుకున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలియజేవారు. అంతర్జాతీయ కంపెనీలతో పోటీపడి రూ.83.99 కోట్లకు 'మెయింటెనెన్స్ డ్రెడ్జింగ్' వర్క్‌ను డీసీఐ చేజిక్కించుకున్నట్లు తెలిపారు. దీని ప్రకారం 11 మిలియన్ క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. మూడేళ్ల పాటు ముంబై పోర్టు పరిసరాల్లో డ్రెడ్జింగ్ చేయాల్సి ఉంటుందని, త్వరలోనే ఎంబీపీటీ వర్క్ ఆర్డరును ఇస్తుందని తెలిపారు.

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఫలితాలు భేష్



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ స్టాండలోన్ ఫలితాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. జూన్ త్రైమాసికంలో లాభం 14 శాతం పెరిగి రూ.2,052 కోట్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,801 కోట్లు. ఆదాయం సైతం రూ.6,119 కోట్ల నుంచి రూ.7,181 కోట్లకు వృద్ధి చెందింది. విద్యుత్ పంపిణీ విభాగం ద్వారా వచ్చిన ఆదాయం రూ.6,930 కోట్లు. ఇది అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 16 శాతం అధికం.

నేటి బోర్డు మీటింగ్స్

- బాటా ఇండియా
- క్యాపిటల్ ఫస్ట్
- ఎడిల్‌వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్
- ఇమామి
- హెచ్ఈజీ
- లుపిన్
- మహీంద్రా హాలిడేస్
- రిలయన్స్ ఇన్‌ఫ్రా
- వోకార్డ్ ఫార్మా
- వోల్టాస్
- యూకో బ్యాంక్
- త్రిభువన్‌దాస్ భీమ్‌జీ ఝవేరి

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	28,645	▼	45
బంగారం (99.5, 10గ్రా)	28,495	▼	45
వెండి (కిలో)	38,260	▼	95
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	27,360	▲	10
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	29,310	▲	110
బంగారం (22 క్యారెట్లు)	27,410	▲	110
వెండి(కిలో)	38,925	▲	185
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	29,600	▲	50
బంగారం (22 క్యారెట్లు)	27,470	▲	10
వెండి(కిలో)	39,700	▲	200
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	29,300	▲	100
బంగారం (22 క్యారెట్లు)	27,400	▲	100
వెండి(కిలో)	39,900		0
విజయవాడ (శుక్రవారం ధరలు)			
బంగారం (24 క్యారెట్లు)	29,650		
బంగారం (22 క్యారెట్లు)	27,700		
వెండి(కిలో)	39,300		
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	29,650	▲	50
బంగారం (22 క్యారెట్లు)	27,420	▲	40
వెండి(కిలో)	39,500	▼	200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	48.60 (రాత్రి 11.30కు)	$50.17 (సోమవారం ముగింపు)
బ్రెంట్	51.30 (రాత్రి 11.30కు)	$52.72 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 02-8-2017

విశాఖ	318-00
చిత్తూరు	365-00
వరంగల్	312-00
ముంబై	360-00
చెన్నై	372-00
విజయవాడ	308-00
గోదావరి	308-00
నమక్కల్	360-00
1-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	310-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.70
బెంగళూరు	360-00
ఢిల్లీ	297-00
కోల్‌కతా	338-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1737.75	1733.2
ADANI PORT	404	395.9
AMBUJA CEME	260.8	263.15
ASIAN PAINT	1148.2	1161.7
AXIS BANK L	516.55	519.8
BAJAJ AUTO	2823.4	2808.55
[illegible]		

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
3M INDIA LI	13354.2	13378.25
63 MOONS TE	63.1	64.25
8K MILES SO	542.7	544.3
AARTI DRUGS	560.95	565.85
AARTI INDUS	954.7	972.05
AARVEE DEN.	61.85	62.3
ABAN OFFSHO	185.2	184.5
ABBOTT INDI	4392.2	4444.85
[illegible]		
BAYER CROPS	4688.5	4694.8
BEML LIMITE	1717	1726.15
BERGER PAIN	248.75	247.8
BF INVESTME	174.55	173.8
BF UTILITIE	381.45	380.55
BGR ENERGY	147.7	150.25
BHAGERIA IN	285.2	284
BHANSALI EN	73	73.35
BHARAT BIJL	1292.15	1303.75
BHARAT FIN	851.8	844.8
BHARAT FORG	1150.1	1148.7
[illegible]		
DHUNSERI TE	297.2	290.15
DIC INDIA L	537.25	536.1
DILIP BUILD	527.8	502.45
DISH TV IND	81	83.3
DOLLAR INDU	2121.15	2098.1
DOLPHIN OFF	94	95.45
DONEAR IND.	63.65	64.95
DR. LAL PAT	824.1	834
DWARIKESH S	527.35	510.45
DYNAMATIC T	2367.9	2396.95
DYNEMIC PRO	129.95	131.7

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]		
GUJ. APOLLO	183.8	182.7
GUJARAT ALK	402.3	399.7
GUJARAT AMB	116.35	119.65
GUJARAT FLU	765.75	777.55
GUJARAT GAS	759	758.75
GUJARAT MIN	143.3	142.3
GUJARAT PIP	146.75	147.1
GUJARAT STA	190	194.75
GULF OIL LU	811.35	818
GULSHAN POL	96.5	96.75
HARITA SEAT	801.35	803.15
[illegible]		

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]		
JET FREIGHT	81.9	78
JET KNITWEA	68	68.5
JHS SVEND.	68.3	65.05
JIND POL IN	66.1	66.7
JINDAL DRIL	170.1	165.45
JINDAL PHOT	70.95	71.85
JINDAL POLY	390.65	378
JINDAL SAW	105.5	102.7
JINDAL STAI	88.75	88.4
JINDAL STAI	164.35	162.85
JINDAL STEE	155.05	153.4
[illegible]		

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MAJESCO LIM	369.1	372.3
MAN INDUSTR	93.95	93.1
MAN INFRA L	65.75	64.95
MANAKSIA LT	77.05	77.8
MANAPPURAM	105.8	106.75
MANG.CHEM.F	68.2	68.1
MANGALAM CE	376.45	377.15
MANGALAM DR	159.7	160.15
MANPASAND B	803.05	799.4
MARATHON NX	323.55	324.85
MASTEK LTD	301.45	302.25
[illegible]		
PC JEWELLER	251.75	255.1
PDS MULTINA	252.95	251.7
PEARL GLOBA	162.75	163.1
PENNAR ENG	119.1	119.8
PERSISTENT	644	646.6
PFIZER LTD	1795.9	1782.6
PG ELECTROP	342.2	345.35
PHILIPS CAR	586.8	583.35
PHOENIX LAM	212.55	217.85
PI INDUSTRI	763.2	765.75
PINCON SPIR	71.85	70.6
[illegible]		

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]		
SEAMEC LIMI	173.45	172.65
SELAN EXPLO	165.45	165.45
SEQUENT SCI	118.95	122.5
SESHASAYEE	721.45	739.45
SHAKTI PUMP	497.95	483.45
SHANKARA BL	1007.65	1027.75
SHANTHI GEA	142.2	145.15
SHARDA CROP	465.1	473.4
SHARDA MOTO	2750.85	2641.95
SHEELA FOAM	1305.65	1339.45
SHEMAROO EN	354.35	363.6
[illegible]		
THE INDIAN	127.1	124.65
THE MANDHAN	153.55	154.85
THE P K TEA	152.55	150.4
THE PHOENIX	485.85	487.4
THE RAMCO C	687	678.7
THE RUBY MI	380.3	369.3
THE STATE T	176	178.4
THE TINPLAT	135	138.6
THEJO ENGIN	336	320
THEMIS MEDI	515.55	518.9
THERMAX LTD	876.65	870.25
[illegible]		

V W Y Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]		

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]		

బీఎస్ఈలో ఎస్, టీ, టీఎస్ గ్రూప్ షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]		



కోటితలంబ్రాల పంటలో ఆకుమడిని కట్టలుగా కడుతున్న హనుమంతుడి వేషధారి

రాములోరి తలంబ్రాలకు 'హనుమంతుడి' నాట్లు

గోకవరం (జగ్గంపేట): భద్రాద్రి రాముని కల్యాణంలో వినియోగించే కోటి తలంబ్రాల కోసం కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో మంగళవారం వరినాట్లు వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా హనుమంతుడి వేషంలోని ఓ రామభక్తుడు శ్రీరామ నామం జపిస్తూ ఆకుమడి కట్టలు కట్టి నాట్లు వేశారు. అంతకు ముందు పంట పొలంలో హనుమాన్ ఆవాహన పూజ, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేసి కోటి తలంబ్రాల పంటలోకి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. హనుమాన్ చాలీసాను పఠించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే భావంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

దేశభక్తికి నిర్వచనం పింగళి వెంకయ్య

పింగళి జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళి

సాక్షి, అమరావతి: దేశ జాతీయ జెండాను చూస్తే దాని రూపశిల్పి పింగళి వెంకయ్య గుర్తుకొస్తారని మంగళవారం ఓ ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. బుధవారం పింగళి జయంతి సందర్భంగా చంద్రబాబు నివాళులర్పించారు. దేశభక్తుడనే మాటకు పింగళి నిజమైన నిర్వచనమని కొనియాడారు. పింగళి వెంకయ్య ఆంధ్రప్రదేశ్‌కే కాక, దేశానికే ముద్దుబిడ్డ అని, తుదిశ్వాస విడిచేదాకా ఆయన విలువలకు నిబద్ధుడై, నిజాయితీగా జీవించారని తెలిపారు. పింగళి మహాత్మా గాంధీజీ అభిమానం పొంది ఆయన సూచనలతో జాతీయ జెండాకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు.

గిరిజన గ్రామాల్లో మంచినీటి పథకాలకు నిధులు

సాక్షి, అమరావతి: గిరిజన గ్రామాల్లో మంచినీటి పథకాల ఏర్పాటు కోసం పంచాయతీరాజ్ శాఖ రూ. 105 కోట్లు మంజూరు చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లోని 699 గిరిజన గ్రామాల్లో మంచి నీటి వసతి కల్పించేందుకు గిరిజన సబ్‌ప్లాన్ నుంచి నిధులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బడ్జెట్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధికి కేటాయించిన నిధుల నుంచి ఈ డబ్బులు మంజూరు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంధన పొదుపు జాతీయ సమన్వయకర్తగా చంద్రశేఖర్ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఇంధన పొదుపు సంస్థ సీఈవో ఎ. చంద్రశేఖర్‌రెడ్డికి జాతీయ గుర్తింపు లభించింది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ఏర్పాటు చేసిన జాతీయ మీడియా కమిటీకి ఆయనను ప్రధాన సమన్వయ కర్తగా నియమించారు. ఎల్‌ఈడీ బల్బుల వినియోగంపై ఈ కమిటీ దేశంలో విస్తృత ప్రచారం చేస్తుంది. ఈ కమిటీకి బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భక్షే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈఈఎస్ఎల్ ఎండీ సౌరభ్‌కుమార్ వైస్ చైర్మన్‌గా, బీఈఈ కార్యదర్శి పంకజ్ కుమార్, మహారాష్ట్ర, పంజాబ్, కేరళ, అస్సాం రాష్ట్రాల ఇంధనపొదుపు సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇంధన పొదుపుపై ఈ కమిటీ అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు చేపడుతుంది.

రిజర్వేషన్లపై పవన్‌కు అవగాహన లేదు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన విమర్శ

గుంటూరు ఎడ్యుకేషన్: బీసీ రిజర్వేషన్ల గురించి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విమర్శించారు. గుంటూరులోని చుట్టుగుంటలో మంగళవారం జరిగిన బీసీ సంఘాల సమావేశంలో కేసన మాట్లాడుతూ.. కాపులను బీసీల్లో చేర్చుతామని 2014 టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన సీఎం చంద్రబాబునాయుడు దాన్ని జీవో ద్వారా కాకుండా కమిషన్ నివేదిక ద్వారా అమలు పరుస్తామని ప్రకటించారని తెలిపారు. గత ప్రభుత్వాలు ఇదే విధంగా నిర్ణయాలు తీసుకొని జీవోలు జారీ చేసినప్పుడు బీసీలు ఐక్యంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఈ విషయమై న్యాయస్థానాల వరకు వెళ్లిన విషయాన్ని పవన్ తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ మాట్లాడుతూ.. కాపులను బీసీల్లో చేర్చే అసంబద్ధమైన డిమాండ్‌ను బలపర్చడం ద్వారా పవన్ తన రాజకీయ అజ్ఞానంతో పాటు తన సామాజిక స్వభావాన్ని బహిర్గతం చేసుకున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈడే మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు పిన్నెబోయిన సుబ్బారావు, నగర అధ్యక్షుడు విన్నకోట వెంకటేశ్వర్లు, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏడుకొండలు, శాలి వాహన సంఘ జిల్లా అధ్యక్షుడు రాజవరపు ఏడుకొండలు, వడ్డెర కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

పనితీరు పేరుతో పదవీ విరమణా?

ఈ ఆలోచనను విరమించుకోవాలి: యూటీఎఫ్

సాక్షి, అమరావతి: పనితీరు పేరుతో ఉద్యోగులను పదవీ విరమణ చేయించే ఆలోచనను విరమించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫండమెంటల్, పెన్షన్ రూల్స్ సవరణకు ప్రతిపాదనలు ఎవరికోసం చేశారో స్పష్టం చేయాలన్నారు. దీనిపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. పదవీవిరమణ వయస్సును 60 ఏళ్లకు పెంచామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ధ్వజమెత్తారు. ఇదిలా ఉండగా మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3వ తేదీన అన్ని మున్సిపల్, కార్పొరేషన్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు వెల్లడించారు.

నావల్లే హైదరాబాద్‌కు ఐఎస్‌బీ

- ఈ–ప్రగతి శిక్షణ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- నల్సార్ యూనివర్సిటీని కూడా నేనే తెచ్చా
- టెక్నాలజీతో రేషన్, పింఛన్లు, స్కాలర్‌షిప్పుల్లో ఆదా చేశా
- గతంలో అధికార యంత్రాంగం మౌస్‌లు అంటే ఎలుకలు, విండోస్ అంటే కిటికీల కోసం వెతికేవాళ్లు: లోకేశ్



ఇ-ప్రగతి అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) తన వల్లే హైదరాబాద్‌కు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉండగా చెన్నై లేదా పుణెలో ఈ సంస్థ క్యాంపస్‌ను పెట్టాలనుకున్నారని, కానీ తాను చొరవ తీసుకుని హైదరాబాద్‌లో నెలకొల్పేలా చేశానన్నారు. నల్సార్ యూనివర్సిటీని కూడా తానే హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించానని చెప్పారు. ఈ–ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఐఎస్‌బీ సౌజన్యంతో అధికారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని చంద్రబాబు శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రారంభించి మాట్లాడారు. శిక్షణకు 33 శాఖల నుంచి నలుగురిని ఎంపిక చేశామని, ఆరు నెలలపాటు ఐఎస్‌బీ ప్రొఫెసర్లు వివిధ అంశాల్లో వారికి శిక్షణ ఇస్తారని సీఎం తెలిపారు. నాయకత్వ లక్షణాలు ఉన్న వారిని ఈ శిక్షణకు ఎంపిక చేశామని, ఐఎస్‌బీకి ఈ కార్యక్రమం ఒక పరీక్షని చెప్పారు. మూడేళ్ల నుంచి రాష్ట్రంలో టెక్నాలజీకి పెద్దపీట వేసి పనిచేస్తున్నామన్నారు. ఎక్కడ పిడుగు పడుతుందో 45 నిమిషాల ముందే కనిపెట్టి చెబుతున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ–సేవను అభివృద్ధి చేశానని, ఆ తర్వాత ప్రభుత్వాలు మీ–సేవగా మార్చి అప్పటి సేవలనే కొనసాగించాయన్నారు. తన వద్ద పనిచేసిన ఐఏఎస్ అధికారులు కేంద్ర ప్రభుత్వంలో, అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత స్థానాలకు వెళ్లారని తెలిపారు. ఎల్‌ఈడీ బల్బుల ద్వారా దేశంలో రూ.40 వేల కోట్లను ఆదా చేశారని, ఆ కార్యక్రమాన్ని మొదట ఏపీలోనే ప్రారంభించామన్నారు. టెక్నాలజీతో మూడేళ్లలో ప్రజాపంపిణీలో 15 శాతం, పెన్షన్లలో ఆరు శాతం, స్కాలర్‌షిప్‌ల్లో 25 శాతం సొమ్మును ఆదా చేశామని తెలిపారు.

మౌస్‌లు, విండోస్‌ల గురించి తెలిసింది మా నాన్న హయాంలోనే: లోకేశ్

ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ యంత్రాంగం.. మౌస్‌లు ఎన్ని ఉన్నాయంటే సచివాలయంలో వెతికి ఎలుకలు లేవని చెప్పేవారని, విండోస్‌లు ఎన్ని ఉన్నాయంటే కిటికీలు లెక్కపెట్టేవారని చెప్పారు. తన తండ్రి హయాంలో ఐటీని అభివృద్ధి చేశాక మౌస్ అంటే కంప్యూటర్ మౌస్‌లని, విండోస్ అంటే ఆపరేటింగ్ సిస్టమ్స్ అని తెలుసుకుని వాటిని ఉపయోగించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాత్సవ, ఫ్యూచర్ వరల్డ్ సీఈవో జాకబ్‌సన్, ప్రభుత్వ ఐటీ సలహాదారు జె. సత్యనారాయణ, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీలో నా మనుమడు నన్ను మించిపోయాడు..


టెక్నాలజీలో తన కంటె తన మనుమడు ముందున్నాడని, రెండేళ్ల వయసులోనే సెల్‌ఫోన్‌ను ఆపరేట్ చేస్తున్నాడని సీఎం చంద్రబాబు చెప్పారు.మీడియా ఎప్పుడూ వ్యతిరేక వార్తల కోసం చూస్తుందని, అవి లేకపోతే వారికి పాఠకులు, వీక్షకులు ఉండరని వ్యాఖ్యానించారు. ఇటీవల రెండు మూడు వ్యతిరేక వార్తలు చూశానని, అవేవీ నిజం కాదన్నారు. మూడేళ్లుగా ఉద్యోగులు, అధికారుల ద్వారానే ముందుకెళుతున్నానన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో రైతుకు భరోసా

వ్యవసాయ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్



అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో.. రైతులకు భరోసా కల్పించేందుకు ప్రత్యామ్నాయ పంటలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ హరి జవహర్‌లాల్ చెప్పారు. మంగళవారం అనంతపురం జిల్లా రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఖరీఫ్ పంటల సాగుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వ్యవసాయ శాఖ జేడీఏలు, పలువురు శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ.. వర్షాభావం వల్ల చాలా జిల్లాల్లో పంటలు సాగులోకి రాలేదన్నారు. 13 జిల్లాల పరిధిలో సాధారణ సాగు లక్ష్యం 42 లక్షల హెక్టార్లు కాగా.. ప్రస్తుతానికి 14.07 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయని చెప్పారు. రాయలసీమలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా నేలలు, అక్కడి వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. వారంలోగా అన్ని జిల్లాల్లో ప్రత్యామ్నాయ విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఆర్'ఢీ'ఎస్

- కర్ణాటక వైపు పూడికతీతపై కర్నూలు రైతుల ఆగ్రహం
- ఆనకట్ట వద్ద 200 మంది అన్నదాతల ఆందోళన
- పూడికతీతకు అనుమతి ఎలా ఇచ్చారంటూ ఏఈతో వాగ్వాదం
- ఆంధ్ర ప్రాంతం వైపు కూడా పనులు చేపట్టాలని విన్నపం

కోసిగి: రాజోలి బండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) పూడికతీత పనులు వివాదాస్పదమయ్యాయి. ఆనకట్ట వద్ద కర్ణాటక ప్రాంతం వైపు స్లూయిస్ సమీపంలో పూడికతీత పనులు చేపట్టడంపై కర్నూలు జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సుమారు 200 మంది అన్నదాతలు ఆనకట్ట వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. అక్కడే పనులు చేయిస్తున్న సుంకేశ్వరి డ్యామ్ ఏఈ శ్రీనివాసరెడ్డి రైతులతో మాట్లాడారు. కర్ణాటక, తెలంగాణ స్లూయిస్ వద్ద 200 మీటర్లు పొడవు, 35 మీటర్లు వెడల్పుతో పూడికతీత పనులు చేపట్టడాన్ని అన్నదాతలు తప్పుబట్టారు. పూడిక మట్టిని ఆనకట్టపై రెండు అడుగులు ఎత్తులో వేస్తే దిగువకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. దిగువ రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఏఈతో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రాంపురం మురళీరెడ్డి, బెట్టన గౌడులు వాగ్వాదానికి దిగారు. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద కర్ణాటక ప్రాంతం వైపు పూడికతీత పనులు చేపట్టాలని.. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్ర సీఈలు ఏసీ రూమ్‌లలో కూర్చొని ఆమోదం తెలిపితే సరిపోతుందా? అని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రాత్రికి రాత్రే పూడికతీత పనులు ఎలా చేపడతారని నిలదీశారు. దిగువ రైతుల అభిప్రాయం తీసుకోకుండా ఏక పక్ష నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ఆంధ్ర ప్రాంత అధికారులు.. తెలంగాణ ప్రభుత్వానికి అమ్ముడుబోయారని ఆరోపించారు. అధికారులు ఆంధ్ర ప్రాంతం వైపు కూడా పూడిక తీసి సమన్యాయం చేయాలని.. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏఈ హామీ ఇవ్వడంతో రైతులు వెనుతిరిగారు. అనంతరం ఇరిగేషన్ ఎస్‌ఈ చంద్రశేఖర్.. ఆర్డీఎస్ ఆనకట్ట వద్దకు చేరుకుని పూడికతీత పనులను పరిశీలించి వెళ్లారు.

ఆంధ్ర రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం..

ఆర్డీఎస్ పూడికతీత పనులతో ఆంధ్ర ప్రాంత రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఆనకట్ట దిగువ ప్రాంత రైతులు వర్షాలు లేక కరువుతో అల్లాడిపోతున్నారని చెప్పారు. సాగునీరు కాదు కదా, కనీసం తాగునీళ్లు కూడా దొరకని పరిస్థితి దాపురించిందన్నారు. ఆర్డీఎస్ నీటివాటాలో ఆది నుంచి అన్యాయం జరుగుతోందన్నారు. మూడేళ్ల క్రితమే ఆర్డీఎస్ కుడి కాలువ ఏర్పాటుకు ఆమోదం వచ్చినా.. ఏపీ ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఇంతవరకు సర్వే పనులు కూడా మొదలు కాలేదని తెలిపారు. ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి ఉంటే పూడికతీత పనుల్లో సమన్యాయం పాటించాలని చెప్పారు.

ఆర్టీసీని నష్టాల ఊబిలోకి నెట్టారు

- సీఎం చంద్రబాబుకు బుద్ధి చెబుదాం
- వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి

కడప కార్పొరేషన్: ఆర్టీసీని నష్టాల ఊబిలోకి నెట్టిన సీఎం చంద్రబాబుకు నంద్యాల ఉపఎన్నికలో తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వైఎస్సార్ జిల్లా కడపలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీకి రాయితీలు ఇవ్వాలని జీవోలు జారీ చేయడం తప్ప ఒక్క పైసా కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. గన్నవరం వద్ద ఆర్టీసీకి చెందిన 28 ఎకరాల స్థలాన్ని ఉచితంగా హెచ్‌సీఎల్‌కు అప్పగించడం దారుణమని పేర్కొన్నారు. ఆర్టీసీలో రోజురోజుకూ బస్సులు తగ్గిస్తున్నారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 12.5 శాతం ట్యాక్స్‌ను 7 శాతానికి తగ్గించారని, ఆర్టీసీ రాయితీలకు సంబంధించి 100 శాతం నగదు చెల్లించారని గుర్తు చేశారు. తొమ్మిది వేల మంది క్యాజువల్ కార్మికులను రెగ్యులర్ చేశారని, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టారని చెప్పారు. తండ్రి బాటలోనే ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా నడుస్తున్నారని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నంద్యాల డిపోలోని ఆర్టీసీ కార్మికులు ఈ విషయాలను గమనించి నంద్యాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలోయూనియన్ రీజనల్ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల్లో గజరాజుల బీభత్సం

వైఎస్సార్ జిల్లాలో అరటి, బొప్పాయి చెట్లు ధ్వంసం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటిచెట్లు

గాదెల(ఓబులవారిపల్లె): వైఎస్సార్ జిల్లా ఓబులవారిపల్లె మండలంలోని అటవీ శివారు గ్రామం గాదెల ఎస్టీ కాలనీ సమీపంలో పండ్ల తోటలపై మంగళవారం తెల్లవారుజామున ఏనుగుల మంద దాడి చేసింది. గ్రామస్థుడు విసనగిరి చంద్రశేఖర్‌కు చెందిన 400 అరటి చెట్లు, వంద బొప్పాయి చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చిన గెలలతో ఉన్న అరటి చెట్లను తొక్కిపడేశాయి. తోటలోని డ్రిప్ పరికరాలను పూర్తిగా ధ్వంసం చేశాయి. దీంతో రైతు చంద్రశేఖర్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. గాదెల అటవీ ప్రాంతంలో నుంచి వంకదారి గుండా సుమారు 16 ఏనుగులు పంట పొలాల్లోకి వచ్చాయని స్థానిక రైతులు తెలిపారు. వాటి రాకను గమనించిన స్థానికులు, చుట్టుపక్కల ఉన్న రైతులు డప్పులు వాయిస్తూ పెద్దపెద్ద శబ్దాలు చేయడంతో ఏనుగులు అడవిలోకి వెళ్లిపోయాయి. గాదెల అటవీశాఖ అధికారి కేశవరెడ్డి తన సిబ్బందితో కలిసి వచ్చి ధ్వంసమైన అరటి తోటను పరిశీలించారు. అడవి నుంచి తరచుగా ఏనుగులు పండ్ల తోటల్లోకి వచ్చి, విధ్వంసం సృష్టిస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ బిల్లు పెట్టాలి

కేంద్రానికి దళిత క్రైస్తవుల హక్కుల సమితి డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రెసిడెన్షియల్ యాక్ట్–1950ను సవరించి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిల భారత దళిత క్రైస్తవుల హక్కుల సమితి డిమాండ్ చేసింది. సంఘం జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దళిత క్రైస్తవుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. క్రైస్తవుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఇంకా ఎందుకు అమలు చేయలేదని సీఎం చంద్రబాబునాయుడును ప్రశ్నించారు.

అయ్యో.. తుంగభద్ర

- తుంగభద్ర జలాశయంలో నానాటికీ తగ్గిపోతున్న వరద జలాలు
- 64 ఏళ్ల చరిత్రలో గతేడాది అత్యల్పంగా 91 టీఎంసీలే లభ్యత
- మూడేళ్లుగా ఇదే దుస్థితి.. ఈ ఏడాది మరింత దయనీయం
- సీమలో సాగునీటి మాట దేవుడెరుగు.. తాగునీటికే తీవ్ర ఇబ్బందులు

సాక్షి, అమరావతి: తుంగభద్ర నదిలో నీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది. ఇది రాయలసీమ ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది. సీమ సాగు, తాగునీటి అవసరాలు తీర్చేది సింహభాగం తుంగభద్రే. గత మూడేళ్లుగా తుంగభద్ర జలాశయంలో నీటి లభ్యత తగ్గిపోవడంతో సాగునీటి మాట దేవుడెరుగు.. గుక్కెడు తాగునీళ్లకోసం రాయలసీమ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. హెచ్చెల్సీ(ఎగువ కాలువ), ఎల్లెల్సీ(దిగువ కాలువ), కేసీ(కడప–కర్నూలు) కెనాల్ ఆయకట్టుకు నీళ్లందక బంజరుగా మారింది. 1953లో తుంగభద్ర నదిపై హొస్పేటకు సమీపంలో 133 టీఎంసీల సామర్థ్యంతో తుంగభద్ర జలాశయాన్ని నిర్మించారు. అక్కడ 230 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని లెక్కగట్టిన బచావత్ ట్రిబ్యునల్.. కర్ణాటకకు 151.49 టీఎంసీలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 78.51 టీఎంసీలు(ఆంధ్రప్రదేశ్‌కు 71.6, తెలంగాణకు 6.91) కేటాయించింది. తుంగభద్ర హెచ్చెల్సీ కింద అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో 1,90,035, ఎల్లెల్సీ కింద కర్నూలు జిల్లాలో 1,57,062, కేసీ కెనాల్ కింద కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల్లో 2,65,668, ఆర్డీఎస్(రాజోలిబండ డైవర్షన్ స్కీం) కింద మరో 40,000 వెరసి 6.52 లక్షల ఎకరాల ఆయకట్టు విస్తరించింది. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల ప్రజల దాహార్తి తీర్చేదీ తుంగభద్ర జలాలే. పూడిక పేరుకు పోవడంతో తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలకు తగ్గింది. ఈ నేపథ్యంలో నీటి లభ్యత తగ్గిపోతోందనే సాకు చూపి, దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు నీటిని కేటాయిస్తూ వస్తోంది.

ఆగస్టు 15లోగా నిండితేనే..

తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతంలో నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల జూన్ నెలాఖరు నుంచే వర్షాలు ప్రారంభమవుతాయి. వరద జలాలతో ఎగువన ప్రాజెక్టులతోపాటు దిగువనున్న తుంగభద్ర జలాశయం ఆగస్టు 15 నాటికే పూర్తిస్థాయిలో నిండిపోతుంది. అప్పుడే నీటిలభ్యత బచావత్ ట్రిబ్యునల్ లెక్కగట్టిన మేరకు అందుబాటులోకి వస్తుంది. కానీ గతేడాది తుంగభద్ర జలాశయం 64 ఏళ్ల చరిత్రలో నీటి లభ్యత అత్యల్పంగా 91.335 టీఎంసీలకు పడిపోయింది. దాంతో గతేడాది తాగునీటి అవసరాలకు సరిపడా జలాలు దొరకని దుస్థితి నెలకొంది. గత మూడేళ్లుగా ఇదే దుస్థితి. తుంగభద్ర జలాశయం నిండితే గేట్లెత్తి దిగువకు విడుదల చేసే జలాలు.. ఆర్డీఎస్ ఆనకట్ట, సుంకేశుల బ్యారేజీ మీదుగా శ్రీశైలం జలాశయానికి చేరుతాయి. గత మూడేళ్లలో ఒక్క టీఎంసీ తుంగభద్ర జలాలూ శ్రీశైలానికి చేరలేదు. సుంకేశుల వద్ద నీటిలభ్యత తగ్గిపోవడంతో కేసీ కెనాల్‌కు ఆయకట్టులో సాగు విస్తీర్ణం కుంచించుకుపోయింది.

గత పదేళ్లలో తుంగభద్ర జలాశయానికి వచ్చిన జలాలు

సంవత్సరం	వచ్చిన జలాలు (టీఎంసీల్లో)
2008-09	302.779
2009-10	377.803
2010-11	351.061
2011-12	293.105
2012-13	169.207
2013-14	413.130
2014-15	363.750
2015-16	125.988
2016-17	91.335
2017-18	39.86 (ఆగస్టు 1 వరకూ)



అక్రమ ప్రాజెక్టుల వల్లే!

కర్ణాటక ప్రభుత్వం తుంగపై అప్పర్ తుంగ, భద్రపై అప్పర్ భద్ర ప్రాజెక్టుల్ని నిర్మించింది. వాటికి అనుబంధంగా భారీఎత్తున ఎత్తిపోతల పథకాల్ని ఇటీవలే పూర్తి చేసింది. ఇదే రీతిలో సింగటలూరు ఎత్తిపోతలనూ చేపట్టింది. ఎగువన నదిపై వందలాది చెక్‌డ్యామ్‌లను నిర్మించింది. వరద నీటిని కర్ణాటక సర్కారు తోడేస్తుండటంతో తుంగభద్ర జలాశయానికి చేరట్లేదు. దీనివల్లే నీటిలభ్యత తగ్గిందని జలవనరులశాఖ ఉన్నతాధికారి ఒకరు విశ్లేషించారు. ఈ ఏడాది తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతంలో భారీవర్షాలు కురిసినా.. అప్పర్‌తుంగ, భద్ర ప్రాజెక్టులు నిండినా తుంగభద్ర జలాశయానికి జలాలు చేరకపోవడాన్ని ఆయన ఉదహరించారు. తుంగభద్ర పరీవాహకంలో ఆగస్టు నెలాఖరు వరకే నైరుతి రుతుపవనాల ప్రభావం ఉంటుంది. సెప్టెంబర్‌లో డ్రైస్పెల్(వర్షపాత విరామం) ఏర్పడుతుంది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే ఆగస్టు 15లోగా జలాశయం నిండితేనే రాయలసీమలో సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదు. కానీ ఈ ఏడాది గతేడాదికన్నా నీటి లభ్యత తక్కువగా ఉంటుందని తుంగభద్ర బోర్డు విశ్లేషించింది.

గత పదేళ్లలో ఆగస్టు 1 నాటికి తుంగభద్ర జలాశయంలో నిల్వ

సంవత్సరం	నీటి నిల్వ (టీఎంసీల్లో)
2007	104.14
2008	53.08
2009	103.35
2010	60.14
2011	97.93
2012	34.68
2013	93.92
2014	92.45
2015	63.93
2016	40.79
2017	39.42



మహిళల సూపర్ లీగ్‌కు హర్మన్‌ప్రీత్ దూరం

భారత మహిళల క్రికెట్ స్టార్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఇంగ్లండ్‌లో జరిగే టి20 సూపర్ లీగ్‌కు దూరం కానుంది. ఇటీవలి ప్రపంచకప్‌లో తన అద్భుత బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్న హర్మన్‌ప్రీత్ ప్రస్తుతం భుజం నొప్పితో బాధపడుతోంది. దీంతో నెల రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో సర్రే స్టార్స్ జట్టు తరఫున ఆడలేకపోతోంది. 'ప్రపంచకప్ చివరి దశలో నొప్పితోనే ఆడాను. తాజాగా ఎడమ భుజంలో చీలిక ఏర్పడడంతో మహిళల సూపర్ లీగ్‌లో ఆడలేకపోతున్నాను' అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. గత డిసెంబర్‌లో ఆస్ట్రేలియాలో జరిగిన మహిళల టి20 బిగ్‌బాష్ లీగ్‌లోనూ ఆడిన ఆమె అక్కడా విశేషంగా రాణించి అత్యధిక పరుగులు చేసిన రెండో క్రికెటర్‌గా నిలిచింది.



హైదరాబాద్‌లో టి20, వైజాగ్‌లో వన్డే



నాలుగు నెలల్లో స్వదేశంలో 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు ● షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ

కోల్‌కతా: సొంతగడ్డపై కొత్త సీజన్‌లో భారత క్రికెట్ జట్టు ఫుల్ బిజీ బిజీ! ప్రస్తుతం కొనసాగుతున్న శ్రీలంక పర్యటన ముగిసిన వెంటనే సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు భారత్‌లో విరామం లేకుండా క్రికెట్ హోరెత్తించనుంది. ఈ నాలుగు నెలల కాలంలో భారత్‌లో ఏకంగా 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. ముందుగా ఆస్ట్రేలియా, ఆ తర్వాత న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల సిరీస్‌లలో పాల్గొనేందుకు మన వద్దకు రానుండగా... ఆ తర్వాత వన్డేలు, టి20లతో పాటు టెస్టులు ఆడేందుకు శ్రీలంక ఇక్కడ అడుగు పెడుతుంది. దీనికి సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను మంగళవారం బీసీసీఐ టూర్స్ అండ్ ఫిక్చర్స్ కమిటీ ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఒక టి20 మ్యాచ్‌కు హైదరాబాద్ నగరం వేదిక కానుండగా... భారత్, శ్రీలంక మధ్య వన్డే మ్యాచ్‌కు విశాఖపట్నం ఆతిథ్యం ఇస్తుంది. కొత్తగా నిర్మించిన బర్సపర (గువాహటి), తిరువనంతపురం స్టేడియాలకు కూడా ఒక్కో మ్యాచ్‌ను కేటాయించారు. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన తేదీలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దేశ వ్యాప్తంగా వేర్వేరు నగరాల్లో మ్యాచ్‌లు ఉన్నాయని... స్థానిక పండుగలు, సెలవు దినాలువంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని తర్వాత తేదీలు ఖరారు చేస్తామని బోర్డు తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి వెల్లడించారు.

రంజీ ట్రోఫీ ఫార్మాట్‌లో మార్పులు

భారత దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీ నిర్వహణకు సంబంధించి బీసీసీఐ కొన్ని కీలక మార్పులు చేసింది. సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని సాంకేతిక కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది నిర్వహించిన తటస్థ వేదికల పద్ధతిపై తీవ్ర విమర్శలు రావడంతో దానికి స్వస్తి చెప్పారు. గతంలోలాగే కొన్ని హోం మ్యాచ్‌లు, కొన్ని బయటి మ్యాచ్‌ల పద్ధతితో టోర్నీని నిర్వహిస్తారు. అయితే నాకౌట్ మ్యాచ్‌లు మాత్రం తటస్థ వేదికల్లోనే జరుగుతాయి. అక్టోబర్ 6న రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు 28 జట్లతో మూడు గ్రూప్‌లలో మ్యాచ్‌లు నిర్వహించారు. ఈసారి దీనిని మారుస్తూ మొత్తం జట్లను నాలుగు గ్రూప్‌లు ఎ, బి, సి, డి లుగా విభజిస్తున్నారు. ఒక్కో గ్రూప్‌లో 7 జట్లు ఉండగా, ప్రతీ జట్టు లీగ్ దశలో ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. ప్రతీ గ్రూప్‌లో టాప్-2 టీమ్‌లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ ఫార్మాట్ వల్ల రంజీ ట్రోఫీ మొత్తం మ్యాచ్‌ల సంఖ్య తగ్గనుంది. మరోవైపు ఈ సారి కూడా దులీప్ ట్రోఫీ మ్యాచ్‌ను గులాబీ బంతితోనే నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది.

షెడ్యూల్ వివరాలు

ఆస్ట్రేలియా (సెప్టెంబర్ 11-అక్టోబర్ 11): చెన్నై, బెంగళూరు, నాగపూర్, ఇండోర్, కోల్‌కతా (5 వన్డేలు), హైదరాబాద్, రాంచీ, బర్సపర (3 టి20లు).

న్యూజిలాండ్ (అక్టోబర్ 22-నవంబర్ 7): పుణే, ముంబై, కాన్పూర్ (3 వన్డేలు), న్యూఢిల్లీ, కటక్, రాజ్‌కోట్ (3 టి20లు).

శ్రీలంక (నవంబర్ 15- డిసెంబర్ 24): కోల్‌కతా, నాగపూర్, న్యూఢిల్లీ (3 టెస్టులు), ధర్మశాల, మొహాలి, వైజాగ్ (3 వన్డేలు), తిరువనంతపురం, ఇండోర్, ముంబై (3 టి20లు)



రాహుల్‌ను పట్టేసిన యూపీ యోధ ఆటగాళ్లు

టైటాన్స్‌కు మళ్లీ నిరాశ

సొంతగడ్డపై వరుసగా మూడో ఓటమి

సాక్షి, హైదరాబాద్: తెలుగు టైటాన్స్ ఈ సీజన్‌లో మళ్లీ నిరాశపరిచింది. సొంత ప్రేక్షకుల మధ్య వరుసగా మూడోసారీ ఓడింది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాహుల్ సేన 18-31 స్కోరు తేడాతో కొత్త జట్టు యూపీ యోధ చేతిలో కంగుతింది. తొలి అర్ధభాగంలో ఇరు జట్ల ఆటగాళ్లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. దీంతో 11-12తో టైటాన్స్ ఒక్క పాయింట్ తేడాతో వెనుకబడింది. కానీ ద్వితీయార్ధంలో పేలవమైన ఆటతీరుతో మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ జరిగే కొద్దీ ప్రత్యర్థి జోరు పెరిగింది. టైటాన్స్ మాత్రం చేష్టలుడిగింది. తెలుగు టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి 7 పాయింట్లతో రాణించగా, వికాస్, విశాల్ చెరో 3, రాకేశ్ 2 పాయింట్లు చేశారు. యూపీ ఆటగాళ్లు సమష్టిగా కదంతొక్కారు. నితిన్ తోమర్ (6) సహా... రిషాంక్ దేవాడిగా, నితీశ్ కుమార్ చెరో 5 పాయింట్లు సాధించారు. మహేశ్ గౌడ్ (4), సురీందర్ సింగ్ (3), రాజేశ్ నర్వాల్ (2), జీవ కుమార్ (2) రాణించారు. మరో మ్యాచ్‌లో కొత్త జట్టు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 26-20తో దబాంగ్ ఢిల్లీ జట్టుపై విజయం సాధించింది.

నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో హర్యానా స్టీలర్స్ (రాత్రి గం. 8.00 నుంచి); బెంగాల్ వారియర్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి గం. 9.00 నుంచి) తలపడతాయి. మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

రవీంద్ర జడేజా టాప్ ర్యాంక్ పదిలం

దుబాయ్: భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా అంతర్జాతీయ క్రికెట్ మండలి టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మంగళవారం వెల్లడించిన ఈ జాబితాలో శ్రీలంక స్పిన్నర్ రంగన హెరాత్‌ను వెనక్కి నెట్టి అశ్విన్ తిరిగి రెండో స్థానానికి చేరాడు. హెరాత్ మూడో స్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్స్ జాబితాలో జడేజా, అశ్విన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. షకీబ్ టాప్‌లో ఉన్నాడు. బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ కోహ్లి తన ఐదో స్థానాన్ని నిలబెట్టుకోగా, పుజారా నాలుగో స్థానం.. ధావన్ 39 నుంచి 21వ స్థానానికి ఎగబాకాడు.

బ'ధీర'కు సాయం కరవు!

బధిరుల ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన షేక్ జాఫ్రీన్

- కర్నూలు నుంచి ఒలింపిక్స్ వరకు ఎదిగిన వైనం
- పట్టించుకోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: ఆ అమ్మాయి బధిరురాలు. అయితేనేం... ఆమె పట్టుదల ముందు టెన్నిస్ ఆట కూడా చిన్నదిగా మారిపోయింది. కఠోర శ్రమతో ఆమె బధిరుల టెన్నిస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. గత నాలుగేళ్లలో అంతర్జాతీయ స్థాయిలో అనేక విజయాలు సాధించిన ఈ అమ్మాయి తాజాగా ఒలింపిక్ పతకంతో సత్తా చాటింది. టర్కీలో జరిగిన బధిరుల (డెఫ్) ఒలింపిక్స్‌లో ఆమె మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది. ఆ అమ్మాయి పేరు షేక్ జాఫ్రీన్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు ఆమె స్వస్థలం. ఆటలో ఎదిగేందుకు ఆర్థికపరంగా ఎన్నో కష్టాలు అనుభవించిన జాఫ్రీన్... ఇప్పుడు ఒలింపిక్ పతకం తర్వాతనైనా తనను గుర్తించాలని కోరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తోంది.

నిలకడగా రాణింపు...

జాఫ్రీన్ తండ్రి షేక్ జాకీర్ తన కూతురికి టెన్నిస్‌పై ఉన్న ఆసక్తిని చూసి ప్రోత్సహించారు. బధిరురాలే అయినా ఆమెను ఎక్కడా నిరుత్సాహ పరచకుండా తగిన శిక్షణ ఇప్పించేందుకు సిద్ధమయ్యారు. కర్నూలులో ప్రాథమిక శిక్షణ అనంతరం మెరుగైన సౌకర్యాల కోసం ఆమె హైదరాబాద్‌కు వచ్చింది. ఆర్థిక పరిస్థితి గొప్పగా లేకపోయినా పెద్ద మొత్తంలో అందు కోసం ఆయన ఖర్చు చేశారు. జాతీయ స్థాయిలో రాణించిన అనంతరం 2013 డెఫ్ ఒలింపిక్స్ (బల్గేరియా)లో ఐదో స్థానంలో నిలవడంతో జాఫ్రీన్‌కు గుర్తింపు లభించింది. దాంతో టాప్ క్రీడాకారిణి సానియా మీర్జా తన సొంత అకాడమీలో ఆమెకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీనిని ఉపయోగించుకున్న జాఫ్రీన్... ఆ తర్వాత నేషనల్, ఆసియా-పసిఫిక్, వరల్డ్ డెఫ్ గేమ్స్‌లలో వరుస విజయాలు సాధించింది. అయితే కూతురికి అత్యుత్తమ శిక్షణ ఇప్పించే క్రమంలో జాకీర్ సొంత ఇల్లు, ఆస్తులు, బంగారం కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. కొన్నాళ్ల క్రితం ఒలింపిక్స్ సన్నాహాల కోసం ఆయన రూ. 7 లక్షలతో చైనాలోని షాంఘైలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. తల్లిదండ్రుల కష్టాన్ని వృథా పోనివ్వని జాఫ్రీన్...



ఇప్పుడు డెఫ్ ఒలింపిక్స్‌లో పతకంతో తన ఘనతను ప్రదర్శించింది. జాఫ్రీన్ ప్రస్తుతం కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో మూడో సంవత్సరం డిగ్రీ చదువుతోంది. వివిధ అంతర్జాతీయ టోర్నీలలో విజేతలుగా నిలుస్తున్న క్రీడాకారులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నజరానాలు అందించింది. అదే కోవలో తనను కూడా ఆదుకోవాలని ఆమె ఆశిస్తోంది.




"నా కుమార్తెకు శిక్షణ ఇప్పించేందుకు ఆస్తులు అమ్ముకున్నా. ఆర్థికపరంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటికి ఎదురీది ఒలింపిక్స్‌లో పతకం సాధించే వరకు ఆగలేదు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మాకు ఏ రకంగానూ సహాయం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం నా కుమార్తెకు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. ఇక ముందు మరింత మెరుగైన శిక్షణా సౌకర్యాలు కల్పిస్తే 2021లో జరిగే ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించే సామర్థ్యం జాఫ్రీన్‌కు ఉంది."
– షేక్ జాకీర్, జాఫ్రీన్ తండ్రి

విజేతలకు విమానాశ్రయంలో చేదు అనుభవం

ఆహ్వానించడానికి రాని 'సాయ్' అధికారులు

టర్కీలో బధిరుల ఒలింపిక్స్‌లో పాల్గొని మంగళవారం ఢిల్లీ విమానాశ్రయం చేరుకున్న విజేతలకు చేదు అనుభవం ఎదురైంది. తమను ఆహ్వానించడానికి కేంద్ర క్రీడల మంత్రి గానీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) అధికారులు గానీ ఎవరూ విమానాశ్రయానికి రాకపోవడంపై వారు తీవ్ర నిరాశ చెందారు. ఇతర క్రీడల్లో విజేతలైన క్రీడాకారులను ఆహ్వానించడానికి క్యూ కట్టే మంత్రులు, అధికారులు ఇప్పుడు ఎక్కడని వారు ప్రశ్నించారు. విమానాశ్రయంలోనే వారు తమ నిరసనను ప్రదర్శించారు. అధికారులు వచ్చే వరకు అక్కడి నుంచి కదలమని పట్టు పట్టారు. దాంతో 'సాయ్' ప్రతినిధులు వెంటనే విమానాశ్రయానికి చేరుకొని క్రీడాకారులకు నచ్చ చెప్పారు. కేంద్ర క్రీడల మంత్రి విజయ్ గోయల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటం వల్ల రాలేకపోయారని, ఆయనతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియానికి తీసుకెళ్లి వసతి కల్పించారు. టర్కీలోని సామ్‌సన్‌లో ఆదివారం ముగిసిన డెఫ్ ఒలింపిక్స్‌లో భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలు (మొత్తం 5) సాధించింది. మరో వైపు పారాలింపిక్స్ విజేతలకు ఇచ్చినట్లుగానే తమకు కూడా రూ. 75 లక్షల నగదు ప్రోత్సాహకం ఇవ్వాలని కూడా బధిర క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

కశ్యప్ శుభారంభం



ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, ప్రణయ్, సిరిల్ వర్మ, సౌరభ్ వర్మ శుభారంభం చేయగా... రెండో సీడ్ అజయ్ జయరామ్ పరాజయం చవిచూశాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో కశ్యప్ కేవలం 22 నిమిషాల్లో 21-5, 21-10తో రుంబాకా (ఇండోనేసియా)ను చిత్తుగా ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో ప్రణయ్ 21-14, 21-16తో రుస్తావితో (ఇండోనేసియా)పై, సౌరభ్ వర్మ 21-17, 21-15తో నాథన్ (ఆస్ట్రేలియా)పై, సిరిల్ వర్మ 21-13, 21-12తో రియాంతో సుబగ్జా (ఇండోనేసియా)పై గెలిచారు. అజయ్ జయరామ్ 19-21, 13-21తో చియా హుంగ్ లూ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు.

సిరాజ్‌కు మూడు వికెట్లు




ప్రిటోరియా: ముక్కోణపు సిరీస్‌లో భారత్ 'ఎ' జట్టు రెండో విజయాన్ని సాధించింది. అఫ్ఘానిస్తాన్ 'ఎ'తో జరిగిన వన్డేలో భారత్ 'ఎ' 113 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా భారత్ 'ఎ'.. మనీష్ పాండే (86 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్), రిషభ్ పంత్ (59 బంతుల్లో 60; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో చెలరేగడంతో 50 ఓవర్లలో 5 వికెట్లకు 322 పరుగుల భారీ స్కోరు సాధించింది. చివర్లో కృనాల్ పాండ్యా (27 బంతుల్లో 48; 7 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఆటతో విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత అఫ్ఘానిస్తాన్ 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ (3/49) అఫ్ఘానిస్తాన్‌ను కట్టడి చేశాడు. విజయ్ శంకర్, సిద్ధార్థ్ కౌల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

37 ఏళ్ల అనుభవం పనికొస్తుంది!

కోచ్‌గా కొత్తగా చేయాల్సిందేమీ లేదు

- ఆడే వాతావరణం కల్పిస్తే చాలు
- రవిశాస్త్రి వ్యాఖ్యలు

కొలంబో: భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ ఎంపిక విషయంలో ఇటీవలి కాలంలో ఎంతో చర్చ జరిగింది. విభేదాలు, వివాదాలు అన్నీ వార్తల్లో నిలిచాయి. ఇలాంటి స్థితిలో రవిశాస్త్రి ఆ బాధ్యతలు చేపట్టారు. అయితే భారత క్రికెట్ జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు ప్రత్యేకంగా ఉన్న సమయంలో శాస్త్రి బాధ్యతలు ఏమిటనేది అస్పష్టం. దీనికి ఆయన తనదైన రీతిలో సమాధానం ఇచ్చారు. 'నేను సహాయక సిబ్బంది మొత్తానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాను. మన జట్టు సభ్యులు మనసులో ఎలాంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా మైదానంలోకి వెళ్లి స్వేచ్ఛగా, భయం లేకుండా, సానుకూల దృక్పథంతో తమ ఆటను ప్రదర్శించేలా సిద్ధం చేయడమే నా పని. అదో రకమైన కళ. అది నాకు తెలుసు కాబట్టే ఈ పదవిలో ఉన్నాను' అని ఆయన జవాబిచ్చారు. తాను గతంలో టీమ్ డైరెక్టర్‌గా ఎక్కడ పనిని ముగించానో, ప్రస్తుతం అక్కడి నుంచే దానిని కొనసాగిస్తున్నానని రవిశాస్త్రి వ్యాఖ్యానించారు. 'నేను అదనపు బాధ్యతలతో ఇక్కడికి రాలేదని నా అభిప్రాయం. జట్టు కూడా అదే కాబట్టి మరో ఆలోచన లేకుండా అలా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోతే సరి. అంతా అలవోకగా సాగిపోతుంది. కొత్తగా నేను చేయాల్సిందేమీ లేదు. ఆట ఆడమని చెప్పి నేను పక్కకు తప్పుకుంటే సరిపోతుంది' అని శాస్త్రి అన్నారు. కుంబ్లే కోచ్‌గా ఉన్న సమయంలో తమపై అజమాయిషీ చలాయించారని, ఒక రకంగా నియంతలా వ్యవహరించారని కూడా ఆటగాళ్లు ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. మరి ఇలాంటి అంశాలను చక్కబెట్టడంలో శాస్త్రి శైలి ఏమిటనే దానికి కూడా ఆయన పంచ్ డైలాగ్ చెప్పారు. 'నేను 37 ఏళ్లుగా క్రికెట్‌లో కొనసాగుతున్నాను. ఆటగాడిగా, కామెంటేటర్‌గా అనుభవం ఉంది. కాబట్టి ఆటగాళ్లతో ఎలా వ్యవహరించాలో నాకు బాగా తెలుసు. ఇన్నేళ్ల పాటు నిరంతరాయంగా క్రికెట్‌తో అనుబంధం ఉంది. అందువల్ల ఈతరం క్రికెటర్లను కూడా అర్థం చేసుకోగలను. అసలు ఈ దశలో వారికి కోచింగే అవసరం లేదు. చక్కటి వాతావరణం కల్పించి వారు ఆడేలా ప్రోత్సహిస్తే చాలు' అని రవిశాస్త్రి స్పష్టం చేశారు.



ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ శర్మకు కోచ్ రవిశాస్త్రి సూచనలు

వారు కూడా సాధించలేనిది...

భారత క్రికెట్‌లో గొప్ప పేరున్న అనేక మంది క్రికెటర్లకు కూడా సాధ్యం కాని ఘనతను ప్రస్తుత జట్టు సాధించిందని రవిశాస్త్రి ప్రశంసలు కురిపించారు. 'ఉదాహరణకు శ్రీలంక గడ్డపై 20 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ గెలవడం అలాంటిదే. ఎంతో మంది క్రికెటర్లు 20 ఏళ్ల పాటు భారత్‌కు ఆడారు. అనేక సార్లు లంకలో పర్యటించారు కానీ సిరీస్ గెలవలేకపోయారు. గత జట్లకు సాధ్యం కాని విధంగా ఈ కుర్రాళ్లు వన్డే సిరీస్ కూడా గెలిచారు' అని ఆయన అన్నారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లలో సిరీస్‌ల గురించి ఇప్పుడే ఆలోచించడం లేదని, దానిని కూడా సవాల్‌గా భావించి గెలవగల సామర్థ్యం ఈ జట్టుకు ఉందని శాస్త్రి చెప్పారు. నాయకుడిగా ఇప్పటికే అనేక విజయాలు సాధించిన కోహ్లి, భారత అత్యుత్తమ కెప్టెన్‌గా ఎదిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

హరికృష్ణకు మరో విజయం



న్యూఢిల్లీ: బీల్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ మూడో విజయాన్ని సాధించాడు. పనోమరియోవ్ (ఉక్రెయిన్)తో మంగళవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో నల్లపావులతో ఆడిన హరికృష్ణ 58 ఎత్తుల్లో గెలుపొందాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత హరికృష్ణ 5.5 పాయింట్లతో హూ ఇఫాన్ (చైనా)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. బుధవారం జరిగే చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో ఎటెన్ని బాక్రోట్ (ఫ్రాన్స్)తో హరికృష్ణ తలపడతాడు.

ప్రోత్సాహానికి చాలా సంతోషం!

మిథాలీ రాజ్ వ్యాఖ్య ● కారు బహుమతిగా అందుకున్న కెప్టెన్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ కప్‌లో ఫైనల్ చేరిన అనంతరం అన్ని వైపుల నుంచి తమకు అందుకున్న ప్రోత్సాహకాలపై భారత జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ సంతోషం వ్యక్తం చేసింది. ఈ విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కూడా ముందుకు రావడం మంచి పరిణామమని ఆమె చెప్పింది. భారత క్రికెట్ జూనియర్ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వి.చాముండేశ్వరీనాథ్, మిథాలీ రాజ్‌కు మంగళవారం ప్రత్యేకంగా బీఎండబ్ల్యూ 320డి సిరీస్ కారును బహుమతిగా అందజేశారు. వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా నిలిచినందుకు ఆమెకు ఈ కానుక ఇస్తున్నట్లు చాముండి చెప్పారు. మిథాలీ కెరీర్ ఆరంభంలో కూడా ఆయన ఇదే తరహాలో కారును బహుమతిగా ఇచ్చి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మిథాలీ మాట్లాడుతూ 'ఆటగాళ్లకు ఈ తరహా ప్రోత్సాహకాలు ఉత్ప్రేరకంగా పని చేస్తాయి. క్రీడాకారులకు చాముండి ఇస్తున్న మద్దతు అమూల్యం. గతంలో కూడా అనేక సార్లు ఆయన గిఫ్ట్‌గా ఇచ్చిన బ్యాట్‌లతో భారీగా పరుగులు సాధించాను' అని గుర్తు చేసుకుంది. మరోవైపు మ్యాక్సీ విజన్ సంస్థ జీవితకాలం మిథాలీ కుటుంబానికి ఉచిత చికిత్స అందించేందుకు సిద్ధమైంది. ఈ కార్యక్రమంలో మ్యాక్సీ సంస్థ ప్రతినిధి డాక్టర్ వెల్లా, బయోలాజికల్ ఇవాన్స్ ఎండీ మహిమా దత్తా తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్ట్‌పై ‘ఫత్వా’!

- డార్క్‌నెట్‌పై వార్త రాసిన ఆంగ్ల పత్రిక విలేకరి
- అతడిని అంతం చేసేందుకు బిట్‌కాయిన్ల ఆఫర్
- సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన విలేకరి



సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ కేసు దర్యాప్తు చేస్తున్న తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్‌కు డ్రగ్ మాఫియా నుంచి వచ్చిన బెదిరింపు కాల్స్ వ్యవహారం ఓ కొలిక్కి రాకముందే... మాదకద్రవ్యాల వ్యాపారంపై కథనం రాసిన ఓ విలేకరికి హెచ్చరికలు అందాయి. దీనిపై ఆ విలేకరి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదైంది.

అంతం చేస్తే రూ.7.2 లక్షలు..!

డ్రగ్ కేసు దర్యాప్తు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనేక మంది మాదకద్రవ్య విక్రేతల్ని అరెస్టు చేశారు. వీరిలో అత్యధికులు ఇంటర్‌నెట్‌లో అథోజగత్తుగా పరిగణించే డార్క్ నెట్ ద్వారా ఆర్డర్ చేసి, విదేశాల నుంచి డ్రగ్స్ ఖరీదు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో ఓ ఆంగ్ల పత్రిక విలేకరి డార్క్‌నెట్‌లో డ్రగ్స్ దందాపై కథనం రాశారు. అందులో మ్యాడ్లీబూటెడ్ ఐడీతో ఉన్న వ్యక్తి భారీగా డ్రగ్స్ క్రయవిక్రయాలు సాగిస్తున్నాడని పేర్కొంటూ ఆయన రాసిన కథనం ్పత్రికలో విలేకరి పేరుతో సహా ప్రచురితమైంది. ఈ కథనాన్ని చూసిన డ్రగ్ పెడ్లర్ ఫేస్‌బుక్ ద్వారా జర్నలిస్ట్, ఆయన కుటుంబ వివరాలు సేకరించాడు. వీటిని పొందుపరుస్తూ ఇంటర్‌నెట్‌లో ‘ఫత్వా’జారీ చేశాడు. జర్నలిస్ట్‌ను అంతం చేస్తే 4 బిట్‌కాయిన్లు (రూ.7.2 లక్షలు), కుటుంబ సభ్యుల్ని చంపితే ఆరు బిట్‌కాయిన్లు (రూ.10.8 లక్షలు) నజరానాగా ఇస్తానంటూ వారి ఫొటోలతో సహా ఓ పోస్టర్ రూపొందించి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు.

ప్రొఫెసర్ పీఎం భార్గవ కన్నుమూత

- తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఎనలేని సేవలు
- భార్గవ మృతికి శాస్త్రవేత్తలు, ప్రముఖుల సంతాపం
- రేపు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు



సాక్షి, హైదరాబాద్: ప్రఖ్యాత శాస్త్రవేత్త, సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవ (89) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. వయోభారం, తీవ్ర అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం 5.45 గంటలకు ఉప్పల్ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన కొడుకు మోహిత్ భార్గవ కెనడాలో ఉంటున్నారు. కూతురు వినీత గుంటూరులో ఒక స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్నారు. కొడుకు మోహిత్ వచ్చిన తర్వాత 3న జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో భార్గవ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు శాస్త్రవేత్తలు, ప్రముఖులు సంతాపం తెలిపారు. సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, మాజీ డైరెక్టర్లు మోహన్‌రావు, లాల్జీసింగ్, సీనియర్ సైంటిస్టులు శివాజీ, జ్యోత్స్న ధావన్, ఇమ్రాన్ సిద్ధిఖీ ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



పీఎం భార్గవ మృతదేహం

‘హెడిల్‌బర్గర్’ వ్యవస్థాపకుల్లో ఒకరు..

1928 ఫిబ్రవరి 22న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో భార్గవ జన్మించారు. ఆయన తండ్రి రామచంద్ర భార్గవ, తల్లి గాయత్రీ భార్గవ. వారాణాసి బీసెంట్ థియోసాఫికల్ స్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించిన భార్గవ.. లక్నో విశ్వవిద్యాలయం నుంచి 1946లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ పట్టా పొందారు. 21వ ఏటనే సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అంశంపై పీహెచ్‌డీ పరిశోధన చేశారు. 1950 నుంచి 1953 వరకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో, అదే సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగంలో లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. 1953 నుంచి 1956 వరకు అమెరికాలోని విస్కాన్సన్ వర్సిటీలో పని చేశారు. అక్కడే హెడిల్‌బర్గర్ లాబొరేటరీ వ్యవస్థాపకుల్లో ఒకరుగా నిలిచారు.

జ్యోతిష్య శాస్త్రం కోర్సుపై సుప్రీంకు

ఆధునిక జీవశాస్త్రానికి ఆర్కిటెక్ట్‌గా ప్రశంసలందుకున్న భార్గవ.. సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా 13 ఏళ్ల పాటు విశేష సేవలందించారు. 2006లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం 220 విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్య శాస్త్రాన్ని కోర్సుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేసినప్పుడు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, సైన్స్ టెంపర్ పెంచేందుకు 500లకు పైగా వ్యాసాలు రాశారు. నేషనల్ నాలెడ్జ్ సెంటర్ వైస్ చైర్మెన్‌గా పని చేశారు.

చేప మందుకు వ్యతిరేకంగా..

హైదరాబాద్‌లో బత్తిన సోదరులు పంపిణీ చేసే చేప మందు శాస్త్రీయతను సవాల్ చేస్తూ 2008 నుంచి జన విజ్ఞాన వేదిక చేపట్టిన అన్ని ఆందోళన కార్యక్రమాల్లో భార్గవ పాల్గొన్నారు. హైకోర్టుకు వెళ్లారు. చివరకు దాన్ని చేప మందుగా పరిగణించరాదని, చేప ప్రసాదంగానే భావించాలని కోర్టు పేర్కొంది. చేప మందే కాకుండా హోమియో వైద్యమూ మూఢ నమ్మకమేనని భార్గవ కొట్టిపారేశారు. శాస్త్రవేత్తగా ఆయన కృషికి 1986లో ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది. కానీ గతేడాది దేశవ్యాప్తంగా రచయితలు, మేధావి వర్గంపై జరిగిన దాడులు, అసహనానికి వ్యతిరేకంగా అవార్డు తిరిగిచ్చేశారు.

భార్గవ మృతికి వైఎస్ జగన్ సంతాపం



సాక్షి, హైదరాబాద్: సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ మాజీ అధిపతి, ప్రముఖ శాస్త్రవేత్త పి.ఎం. భార్గవ మృతికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సంతాపాన్ని తెలియజేశారు. విజ్ఞానశాస్త్ర రంగంలో భార్గవ చేసిన సేవలను వైఎస్ జగన్ కొనియాడుతూ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సకాలంలో వినియోగ పత్రాలు సమర్పించాలి

అధికారులకు సీఎస్ దినేశ్‌కుమార్ ఆదేశం



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేశ్ కుమార్ ఆదేశించారు. వీటికి సంబంధించిన వినియోగ పత్రాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి సమర్పించాలని ఆయన ఆదేశించారు. కేంద్ర నిధుల వినియోగంపై సీఎస్ మంగళవారం తాత్కాలిక సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌ను ముందుగా ప్రవేశపెట్టనున్నందున ఇప్పటి నుంచే అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎస్ సూచించారు. జాతీయ స్థాయి సంస్థల ఏర్పాటుకు సంబంధించి భూ కేటాయింపుల విషయంలో ఎలాంటి జాప్యం చేయడానికి వీల్లేదన్నారు. 2016–17లో వివిధ పథకాలకు సంబంధించి కేంద్రం నుంచి రూ.10,400 కోట్లు వచ్చాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 15 వేల కోట్లు వచ్చేలా పనిచేయాలని అధికారులకు సూచించారు.

6 నుంచి ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ ఐసెట్–2017 తుదివిడత కౌన్సెలింగ్ ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు కన్వీనర్ జీఎస్ పండాదాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన సీట్ల కేటాయింపు చేస్తామని తెలిపారు. ఇదివరకు ధ్రువపత్రాల పరిశీలనకు రాలేకపోయిన వారు ఈసారి కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. ఎంబీఏలో యూనివర్సిటీ కాలేజీల్లో 670 సీట్లు, ప్రయివేటు కాలేజీల్లో 9,532 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎంసీఏలో వర్సిటీ కాలేజీల్లో 387 సీట్లు, ప్రయివేటు కాలేజీల్లో 2,697 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

పనితీరే వేతనాల పెంపునకు ప్రాతిపదిక

పశు సంవర్ధకశాఖలో కాంట్రాక్ట్ సిబ్బందికి వర్తింపు

సాక్షి, అమరావతి: వేతనాలు, ప్రోత్సాహకాల చెల్లింపునకు పనితీరే ప్రాతిపదికని స్పష్టంచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పశుసంవర్ధక శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న బహుళ ప్రయోజన డైరీ విస్తరణ సహాయకులకు (ఎంపీడీఈఏలు) ఈ విధానాన్ని వర్తింపజేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. పశు సంవర్ధకశాఖలో 500 మంది ఎంపీడీఈఏలను నియమించేందుకు ప్రభుత్వం అనుమతిస్తే 417 మందిని ఏడాది కిందట నెలకు 8 వేల రూపాయల వేతనంపై నియమించారు. గత నెల 31తో వీరి పదవీకాలం ముగిసింది. వీరిని కొనసాగించాలని, వేతనాలను పెంచాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాశారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం ప్రస్తుతం పనిచేస్తున్న 417 మంది ఎంపీడీఈఏల సర్వీసును కొనసాగించేందుకు, వేతనాన్ని రూ.12 వేలకు పెంచేందుకు పశుసంవర్ధకశాఖకు అనుమతిచ్చింది. అయితే కనీస వేతనాల చట్టం ప్రకారం వీరికి నెలకు రు.15 వేల వరకూ వేతనాన్ని ఇవ్వాల్సి ఉంది. ఆ విషయాన్ని చెప్పకుండా పనితీరు బాగున్న వారికి ప్రోత్సాహక చెల్లింపులు చేయాలంటూ షరతు విధించింది. దీని ప్రకారం పనితీరులో 80 శాతానికి పైగా మార్కులు సంపాదించిన వారికి రూ.మూడు వేలు, 60 నుంచి 80 శాతం వచ్చిన వారికి వెయ్యి రూపాయలు, ఆలోపు మార్కులు వచ్చిన వారికి ఎటువంటి చెల్లింపులు లేకుండా చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

తనపై కాల్పుల స్కెచ్ విక్రమ్‌దే..!



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్ నివాసంలో శుక్రవారం జరిగిన కాల్పుల కేసు కొలిక్కి వచ్చింది. ఈ ‘ఆపరేషన్’కు పథకరచన చేసింది విక్రమ్‌గౌడేనని దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందని తెలిసింది. విక్రమ్‌కు సన్నిహితంగా ఉండే నందు అనే వ్యక్తి ఈ పథకం అమలులో సూత్రధారిగా వ్యవహరించినట్టు వెల్లడైందని సమాచారం. పథకాన్ని మొత్తం ఐదుగురు నిందితులు అమలు చేయగా.. మంగళవారం నాటికి పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న వారి కోసం మధ్యప్రదేశ్‌లో ముమ్మరంగా గాలిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ కేసులో బాధితుడిగా ఉన్న విక్రమ్‌గౌడ్‌ను నిందితుడిగా మార్చడానికి, కేసులో సెక్షన్లు మార్పిడి చేసేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందుల వల్లే

తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విక్రమ్‌గౌడ్ అనేక చోట్ల అప్పులు చేశారు. ఇటీవల కాలంలో ఈయనకు రుణం ఇచ్చిన ఫైనాన్సియర్ల నుంచి తిరిగి చెల్లించాలంటూ ఒత్తిడి పెరిగింది. మరోవైపు విక్రమ్‌ను ఆయన కుటుంబం కూడా దూరంగా ఉంచుతుండటంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో ఏదైనా పథకం వేయడం ద్వారా అటు కుటుంబానికి దగ్గర కావడం, ఇటు ఫైనాన్షియర్ల ఒత్తిడి తగ్గించుకోవడం చేయాలని విక్రమ్ భావించారు. దీన్ని అమలులో పెట్టే బాధ్యతల్ని తనతో సన్నిహితంగా ఉండే నందు అనే వ్యక్తికి అప్పగించారు. విక్రమ్‌కు ఎలాంటి ప్రాణహానీ లేకుండా కాల్పులు జరిపి వెళితే ఒక్కొక్కరికీ రూ.50 వేలు చెల్లించేలా అనంతపురానికి చెందిన ముఠాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ముఠా మధ్యప్రదేశ్‌కు చెందిన వారిని రంగంలోకి దింపింది. నందు సమకూర్చిన వాహనంపై నిందితులు విక్రమ్ ఇంటి దగ్గరకు వెళ్లారు. ఒకరు బయటే వేచి ఉండగా.. మరొకరు ఇంట్లోకి వెళ్లి మొదట ఒక రౌండ్ కాల్చాడు. విక్రమ్ చెప్పడంతోనే రెండో రౌండ్ సైతం కాల్చి పారిపోయారు.

కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జిగా కుంతియా



సాక్షి, హైదరాబాద్, న్యూఢిల్లీ: కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర కుంతియా నియామకమయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రస్తుతం తెలంగాణ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న దిగ్విజయ్‌సింగ్‌ను తొలగించి.. రెండో ఇన్‌చార్జిగా ఉన్న కుంతియాకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేదీ మంగళవారం ప్రకటించారు. రెండో ఇన్‌చార్జిగా కర్ణాటకకు చెందిన సీనియర్ నేత సతీశ్ జర్కిహోలిని నియమించినట్లు వెల్లడించారు.

కేశవరెడ్డి బాధితుల ర్యాలీ, రాస్తారోకో

- ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి
- లేకుంటే ఉప ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా ప్రచారం
- వైఎస్సార్‌సీపీ నేతలు బొత్స, అంబటి, గంగులను కలిసిన బాధితులు



నంద్యాలలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న కేశవరెడ్డి బాధితులు

నంద్యాల: ఒకసారి డిపాజిట్ చెల్లిస్తే ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఎలాంటి అదనపు ఫీజు లేకుండా విద్యనందిస్తామని మూడేళ్ల క్రితం డబ్బు వసూలు చేసి చేతులెత్తేసిన కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి ఆస్తులను వేలం వేసైనా తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేశవరెడ్డి బాధితుల సంక్షేమ సంఘం, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి సంజీవనగర్ గేటు మీదుగా శ్రీనివాస సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేశారు. ‘కేశవరెడ్డి ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి, ప్రభుత్వం మెతక వైఖరి విడనాడాలి’ అంటూ పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు సోమన్న, చిట్టిబాబు, ప్రసాదు మాట్లాడుతూ.. 10,996 మంది నుంచి రూ. 286 కోట్లు డిపాజిట్ చేయించుకున్న కేశవరెడ్డి ఇప్పుడు చేతులెత్తేయడంతో తాము అన్యాయానికి గురి అయ్యామని చెప్పారు. బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకపోతే ఈ ఉప ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి టీడీపీకి ఓటు వేయవద్దని ప్రచారం చేస్తామని హెచ్చరించారు. మంత్రి ఆదినారాయణరెడ్డి వియ్యంకుడైన కేశవరెడ్డిని కాపాడుకునేందుకు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని సీపీఎం నాయకులు మస్తాన్, ప్రభాకర్‌రెడ్డి, సద్దాం ఉసేన్, లక్ష్మణ్ విమర్శించారు. కేశవరెడ్డి బాధితుల డబ్బంతా మంత్రి ఆది ఖాతాలో వేశారని, ఆ డబ్బును చంద్రబాబు వెంటనే తెప్పించి బాధితులకు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకులను కలిసిన బాధితులు

కేశవరెడ్డి బాధితులు మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని, అండగా నిలవాలని కోరారు. దీనిపై వారు స్పందిస్తూ కేశవరెడ్డి బాధితులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈనెల 3వ తేదీన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలకు వస్తున్నారని, ఆ రోజున వస్తే జగన్‌తో మాట్లాడించి ఆయన దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేయించేలా కృషి చేస్తామని చెప్పారు.

ఆయేషా కేసులో అసలు దోషులను బయటపెట్టాలి

- ఆయేషా తల్లితో పాటు పలువురి డిమాండ్
- ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం



విలేకరులతో మాట్లాడుతున్న ఆయేషా తల్లి షంషాద్ బేగం, తదితరులు

హైదరాబాద్: తన కుమార్తె హత్య కేసులో సత్యంబాబు నిర్దోషి అని తెలిసిన తర్వాత అతని తల్లికన్నా ఎక్కువగా తామే సంతోషించామని ఆయేషా మీరా తల్లి షంషాద్ బేగం అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయేషా కేసులో మళ్లా విచారణ కోరుతూ హైకోర్టులో పిల్ వేసిన ప్రొఫెసర్ రమా మెల్కొటే, సీనియర్ జర్నలిస్టు సజయ, ప్రగతిశీల మహిళా సంఘం నేత సంధ్యతో కలసి మాట్లాడారు. దోషులు ఎవరో ప్రపంచానికి తెలుసని, ఇప్పటికే కేసు విషయమై ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర హోంమంత్రి, ముఖ్యమంత్రికి లేఖ రాశానని షంషాద్ బేగం తెలిపారు. తాను కూడా రీపిటిషన్ వేశానని అది త్వరలోనే విచారణకు వస్తుందని తెలిపారు. కోర్టులో వాజ్యం వేసిన ప్రొఫెసర్ రమా మేల్కొటే, సీనియర్ జర్నలిస్టు సజయ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య మాట్లాడుతూ ఆయేషా హత్య కేసులో అసలు దోషులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సత్యంబాబు నిర్దోషని హైకోర్టు తీర్పు ఇచ్చి అసలైన దోషులను పట్టుకోవాలని అపెక్స్ కమిటీకి ఆదేశించినా ఇప్పటివరకు కేసులో పురోగతి లేకపోవడం వెనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎవరిని కాపాడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయేషా తండ్రి మహ్మద్ పాషా, న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఎంసెట్ తుది విడత కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మా కోర్సుల ప్రవేశానికి సంబంధించి ఏపీ ఎంసెట్–2017 తుది విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అడ్మిషన్ల కమిటీ కన్వీనర్ జీఎస్ పండాదాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 5, 6 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చని, 8వ తేదీన సీట్లు కేటాయించనున్నామని తెలిపారు. ఇదివరకు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాలేకపోయిన వారు కూడా ఈ రెండురోజుల వెబ్‌కౌన్సెలింగ్‌కు వచ్చి ధ్రువపత్రాల పరిశీలన అనంతరం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని పేర్కొన్నారు. వర్సిటీ కాలేజీల్లో 483, ప్రయివేటు కాలేజీల్లో 31,362 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా ఖాళీల సమాచారాన్ని కాలేజీల వారీగా ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్లో (హెచ్‌టీటీపీఎస్://ఏపీఈఏఎంసీఈటీ.ఎన్ఐసీ.ఐఎన్) పొందుపరిచినట్లు తెలిపారు.

బైపీసీ స్ట్రీమ్‌కు 8 నుంచి తొలివిడత కౌన్సెలింగ్

ఎంసెట్–2017 బైపీసీ స్ట్రీమ్ అభ్యర్థులకు ఈ నెల 8వ తేదీ నుంచి తొలివిడత కౌన్సెలింగ్ ప్రారంభంకానుందని పండాదాస్ వివరించారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా ఆయన జారీచేశారు.

బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ తేదీలు

ధ్రువపత్రాల పరిశీలన: ఆగస్టు 8 నుంచి 10 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు: ఆగస్టు 8 నుంచి 10 వరకు
సీట్ల కేటాయింపు: ఆగస్టు 11, **హెల్ప్‌లైన్ కేంద్రాలు:** 22
ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్‌లో అర్హులైన అభ్యర్థులు: 67,085

ర్యాంకుల వారీగా ధ్రువపత్రాల పరిశీలనకు వేర్వేరు తేదీల జాబితాలను వెబ్‌సైట్లో (హెచ్‌టీటీపీఎస్://ఏపీఈఏఎంసీఈటీబీ.ఎన్ఐసీ.ఐఎన్) పొందుపరిచినట్లు కన్వీనర్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు.

పండిట్, పీఈటీ పదోన్నతులకు ఆదేశం

ఆ తర్వాత బదిలీల కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: పండిట్, పీఈటీ అప్‌గ్రేడ్ పోస్టులకు ప్రమోషన్లు అమలు జరగని జిల్లాల్లో (తూర్పుగోదావరి మినహాయించి అన్ని జిల్లాల్లో) వెంటనే ప్రమోషన్లు ఇచ్చి ఆపై బదిలీలకు రీ కౌన్సెలింగ్ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె.సంధ్యారాణి ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అప్‌గ్రేడ్ అయిన పండిట్ పోస్టులు 1450, పీఈటీ పోస్టులు 1200 ఉన్నాయి. వీటిలో కొన్ని జిల్లాల్లో ప్రమోషన్లు ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, న్యాయ వివాదాలతో కొన్ని జిల్లాల్లో అప్‌గ్రేడ్ పోస్టుల్లోకి ప్రమోషన్లు ఇవ్వలేదు. ఈ పోస్టులను డీఈవో పూల్‌లో ఉంచారు. ఈ పోస్టుల్లోకి పదోన్నతులు కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులివ్వడంతో పాఠశాల విద్యాశాఖ తాజా పదోన్నతుల ప్రక్రియకు ఆదేశాలిచ్చినట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

కేసును ఉపసంహరించుకోవాలని ఎందుకు నిర్ణయం తీసుకున్నారు?

- పీపీని ఆదేశించే అధికారం మీకు ఎక్కడుందో చెప్పండి
- ఏపీ సర్కారుకు హైకోర్టు ఆదేశం.. విచారణ రేపటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రకాశం జిల్లా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిపై నమోదైన క్రిమినల్ కేసును ఉపసంహరించుకోవాలని ఎందుకు నిర్ణయం తీసుకున్నారో తెలపాలని ఉమ్మడి హైకోర్టు మంగళవారం ఏపీ సర్కారును ఆదేశించింది. అలాగే కేసు ఉపసంహరణ విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)కు ఆదేశాలు జారీ చేసే అధికారం ఎక్కడుందో తెలపాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. అశోక్‌రెడ్డిపై నమోదైన కేసు ఉపసంహరణకోసం మే నెలలో జారీచేసిన జీవో 379ని కొట్టేసి.. క్రిమినల్ కేసులో విచారణను కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఎక్స్‌సర్వీస్‌మెన్ షేక్ మస్తాన్‌వలీ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేయడం తెలిసిందే. ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం దీనిపై విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. ధర్నా నిర్వహించి పోలీసు జీపును తగులబెట్టినందుకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిపై 2014లో గిద్దలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఇటీవల ఆయన ప్రతిపక్ష పార్టీ నుంచి అధికార టీడీపీకి వెళ్లారని, ఈ నేపథ్యంలో ఆయనపై నమోదైన కేసును ఉపసంహరించుకోవాలని గిద్దలూరు అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)ని ఆదేశిస్తూ ప్రభుత్వం ఈ ఏడాది మేలో జీవో 379 జారీ చేసిందని తెలిపారు. కేసు ఉపసంహరణ విషయంలో పీపీ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలేతప్ప ప్రభుత్వ ఆదేశాల మేరకు కాదన్నారు. ఈ సమయంలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కృష్ణప్రకాశ్ స్పందిస్తూ.. ఈ నెల 8న కిందికోర్టులో అశోక్‌రెడ్డిపై నమోదైన కేసు విచారణకు రానున్నదన్నారు. ఆయన కొంత పరుషంగా జవాబివ్వడంతో ధర్మాసనం ఆగ్రహం వెలిబుచ్చింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిపై కేసును ఉపసంహరించుకోవాలని ఎందుకు నిర్ణయం తీసుకున్నారో తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

స్పెషల్ పోలీసులకు ‘అదనపు’ కష్టాలు

- సిబ్బంది కొరతతో అదనపు విధుల కేటాయింపు
- అత్యవసర విధులతో విశ్రాంతి కరువు
- ఏపీఎస్‌పీ బెటాలియన్ సిబ్బంది దయనీయ స్థితి
- నెలల తరబడి ఇంటిముఖం చూడని దుస్థితి



ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్(ఏపీఎస్‌పీ) సిబ్బంది పనిభారంతో సతమతమవుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా వారిపై పనిఒత్తిడి పెరుగుతోంది. సెలవులు కూడా ఇవ్వకపోవడంతో నెలల తరబడి ఇంటిముఖం చూడక నరకయాతన పడుతున్నారు. పదోన్నతుల విషయంలోనూ తమకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా కడప, కర్నూలు, నెల్లూరు జిల్లా వెంకటగిరి, గుంటూరు జిల్లా మంగళగిరి, తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, విజయనగరంలో ఏపీఎస్‌పీ బెటాలియన్‌లు ఉన్నాయి. ఒక్కో బెటాలియన్‌లోనూ 1800 మంది పోలీస్ సిబ్బంది ఉండాలి. వాస్తవానికి 450 నుంచి 700 మంది మాత్రమే ఉన్నారు. ప్రతి బెటాలియన్ పరిధిలో ఉండే ఒక్కో కంపెనీకి 120 నుంచి 150 మంది ఉండాలి.. కానీ 80 మందితో సర్దుకుపోవాల్సిన దుస్థితి దాపురించింది. సచివాలయం, అసెంబ్లీ, స్పీకర్ కార్యాలయం, ముఖ్యమంత్రి ఇల్లు.. తదితరవాటికి గార్డు డ్యూటీలను ఏపీఎస్‌పీ బెటాలియన్ సిబ్బందికి అప్పగిస్తున్నారు. సిబ్బంది కొరతతో విశ్రాంతి లేకుండానే వీళ్లు అదనపు డ్యూటీలతో అవస్థలు పడాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. ఒక రోజు విధులు, మరో రోజు విరామం ఇస్తున్నట్టు అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి నెలల తరబడి ఇంటి ముఖం చూడని పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విజయనగరం బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌కు రాజధాని అమరావతిలో గార్డు డ్యూటీ పడితే ఒక రోజు సెలవు ఇచ్చినా అది ప్రయాణానికే సరిపోవడంతో ఇంటికెళ్లే పరిస్థితి లేదు. అత్యవసర విధుల పేరుతో విశ్రాంతిలేకుండా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. చిన్నపాటి లోపం జరిగినా క్రమశిక్షణ చర్యలు (పనిష్మెంట్) తీవ్రంగా ఉంటున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి సమస్యలతో ఏపీఎస్‌పీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

సెలవు కావాలంటే సాకు చెప్పాల్సి వస్తోంది..

విశ్రాంతి లేకుండా విధులు నిర్వర్తిస్తున్న తమకు అన్నింటా అన్యాయం జరుగుతోందని ఏపీఎస్‌పీ కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీసం సెలవు కూడా ఇవ్వకపోవడంతో ఇంట్లోవాళ్లకు అనారోగ్యం చేసిందనో, అత్యవసర పనులు ఉన్నాయనో సాకు చెప్పుకుని అనుమతికోరాల్సి వస్తోందని చెబుతున్నారు. సివిల్, ఏఆర్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను చేపడుతున్న ప్రభుత్వం ఏపీఎస్‌పీ బెటాలియన్‌లలో ఉద్యోగాల భర్తీ చేయడంలేదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఉద్యోగ విరమణ దశలో ఒక పదోన్నతితో సరి

ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా 1984లో చేరిన వ్యక్తికి ఈ ఏడాది హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి లభించింది. అంటే 33 ఏళ్లపాటు సర్వీసు అందించిన ఆయనకు రిటైర్మెంట్ దగ్గరపడుతుండగా పదోన్నతి దక్కింది. ఇలా అనేక మంది పదోన్నతులు లేక దిగువస్థాయి కేడర్‌తోనే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఏపీఎస్‌పీలో ఐదేళ్లు విధులు పూర్తిచేసుకున్న వారు సివిల్ పోలీసుగా వెళ్లే అవకాశం కల్పించాలని, పదోన్నతుల విషయంలోనూ, విధుల కేటాయింపులోను సివిల్ పోలీసుల తరహాలో చూడాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.